

'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 191

బుధవారం 1-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



దీప్తి ఆల్‌రౌండ్ షో

శ్రీలంకపై భారత్ ఘనవిజయం. వన్డే వరల్డ్‌కప్‌లో శుభారంభం -స్పోర్ట్స్‌లో



మహిళల్లోనే మహాశక్తి

స్త్రీలు అనుకుంటే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోగలరన్న నటి పూజా హెగ్డే -15లో



ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్తాన్‌పై భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన తిలక్‌వర్మ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తిలక్‌కు శాలువా కప్పి సీఎం సత్కరించగా.. తిలక్ సీఎంకు తన బ్యాట్‌ను అందించారు. దీంతో రేవంత్ సరదాగా బ్యాటింగ్ చేశారు.

ఆయకట్టు ఆయువు కట్

ఆల్మట్టి ఎత్తు పెంపుతో ఎడారిగా మారనున్న శ్రీశైలం, సాగర్ ఆయకట్టు

- ఆల్మట్టి డ్యాంలో 524.256 మీటర్ల ఎత్తువరకు నీటిని నిల్వ చేసే పనులను వేగిరం చేసిన కర్ణాటక
- పునరావాసం, భూసేకరణకు రూ.70 వేల కోట్లు మంజూరు
- 129.72 నుంచి 279.72 టీఎంసీలకు పెరగనున్న డ్యాం నిల్వ సామర్థ్యం
- అదనంగా 5,30,475 హెక్టార్లకు నీటిని అందించేలా కాలువల వ్యవస్థను పూర్తి చేసిన కర్ణాటక
- డ్యాంలోకి వచ్చిన నీటిని వచ్చినట్టుగా తరలించేందుకు ఏర్పాట్లు
- ఫలితంగా వర్షాభావ సంవత్సరాల్లో శ్రీశైలానికి చుక్క నీరూ వచ్చే అవకాశం లేదంటున్న నిపుణులు
- శ్రీశైలం, నాగార్జునసాగర్‌లపై ఆధారపడ్డ ప్రాజెక్టుల ఆయకట్టు ఎడారే.. రాష్ట్రంలో తాగునీటికీ ఇక్కట్లే
- ఆల్మట్టిలో నీటి నిల్వ ఎత్తు పెంపు అంశం సుప్రీం ముంగిట



సాక్షి, హైదరాబాద్: ఆల్మట్టి డ్యాం వేదికగా కృష్ణా జలాలపై కర్ణాటకానికి తెరలేచింది. డ్యాం ఎత్తుపెంచి నీటి నిల్వ సామర్థ్యాన్ని 129.72 నుంచి ఏకంగా 279.72 టీఎంసీలకు పెంచే పనులను ఆ రాష్ట్రం వేగవంతం చేసింది. దీనివల్ల శ్రీశైలంపై ఆధారపడ్డ కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి, ఎస్‌ఎల్‌బీసీ, అచ్చంపేట తదితర ప్రాజెక్టులతోపాటు నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల కింద ఆయకట్టు ఎడారిగా మారుతుందని సాగునీటిరంగ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తాగునీటికీ ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఆల్మట్టి డ్యాం ఎత్తును 519.6 నుంచి 524.256 మీటర్లకు పెంచడానికి కర్ణాటక కేబినెట్ సెప్టెంబర్ 17న గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముంపునకు గురయ్యే 20 గ్రామాలు, బాగల్‌కోట మునిసిపాలిటీలో 11 వార్డుల ప్రజలకు పునరావాసం కల్పించ డానికి ఆమోదం తెలిపింది. దీనికోసం 75,663 ఎకరాల భూమిని సేకరించడానికి రూ.70 వేల కోట్లను మంజూరు చేయడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మాగాణి భూములకు ఎకరానికి రూ.40 లక్షలు, మెట్ట భూమి ఎకరానికి రూ.30 లక్షల పరిహారం ఇవ్వడానికి అనుమతి ఇచ్చింది. తద్వారా డ్యాం నిల్వ సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న 129.72 నుంచి 279.72 టీఎంసీలకు పెంచనుంది. అదనంగా 5,30,475 హెక్టార్లకు నీటిని అందించడానికి వీలుగా కాలువల వ్యవస్థను ఇప్పటికే పూర్తి చేసింది. తద్వారా డ్యాంలోకి వచ్చిన నీటిని వచ్చినట్టుగా ఆయకట్టుకు తరలించడానికి కర్ణాటక సర్కార్ ప్రణాళికలు రచించింది.

మనకు తాగునీటికీ ఇబ్బందులే...

కర్ణాటక సర్కారు చర్యతో వర్షాభావ పరిస్థితులు ఉత్పన్నమయ్యే సంవత్సరాల్లో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలను దాటి కృష్ణా నది నుంచి ఒక్క నీటి చుక్క కూడా శ్రీశైలానికి వచ్చే అవకాశం ఉండదని మిగతా 8వ పేజీలో ▶

చేయూత ఇవ్వండి

ధాన్యం కొనుగోలు కోటాను పెంచి, డెలివరీ నిబంధనలు సడలించండి



- అదనపు గోదాములు, రైళ్ల సదుపాయం కల్పించండి
- కేంద్రాన్ని కోరిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలుకు సిద్ధమని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రికార్డుస్థాయిలో అత్యధికంగా 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధమవుతున్నట్లు పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు కేంద్రం తక్షణమే కొనుగోలు కోటాను పెంచి, డెలివరీ నిబంధనలు సడలించి అదనపు గోదాములు, రైళ్ల సదుపాయం కల్పించాలని కోరారు. 'ఇప్పటివరకు ఏ రాష్ట్రం కూడా ఒకే సీజన్‌లో ఈస్థాయిలో వరి మిగతా 8వ పేజీలో ▶

గ్యారంటీలకు టాటా

లంకెబిందెల వేటలో ముఖ్యమంత్రి

- బాండ్ పేపర్లు రాసిచ్చి రేవంత్, భట్టి మోసం చేశారు
- ధ్వజమెత్తిన హరీశ్‌రావు
- సిద్దిపేటలో కాంగ్రెస్ బాకీకార్డుల విడుదల కార్యక్రమం

8 లో



బాకీ కార్డు ప్రదర్శిస్తున్న హరీశ్‌రావు

న్యూస్‌రీల్

మీరు చేసిన బాకీకే మేం వడ్డీలు కడుతున్నాం



బీఆర్‌ఎస్ అడ్డగోలుగా చేసిన బాకీలకు వడ్డీలను కాంగ్రెస్ ప్రభుత్వమే కడుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. బాకీలు, బకాయిల గురించి మాట్లాడితే కేసీఆరే తొలి ముద్దాయి అన్నారు.

- వివరాలు 8లో▶

సొంత ఇల్లులా తెలంగాణ



చిన్నప్పుడు 20 ఏళ్లు మాత్రమే పంజాబ్‌లో ఉన్నానని, గత 40 ఏళ్లలో కనీసం 40 రోజులు కూడా అక్కడ లేనని, అంతగా తెలుగు రాష్ట్రాల ప్రజలతో అనుబంధం ఏర్పడిందని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. రిటైర్మెంట్ తర్వాత కూడా ఇక్కడే స్థిరపడతానన్నారు.

- వివరాలు 17లో▶

సాక్షి పాఠకులకు విజ్ఞప్తి

'సాక్షి'కి మద్దతుగా నిలుస్తూ వస్తోన్న పాఠకులకు ధన్యవాదాలు. ఉత్పత్తి మరియు పంపిణీ వ్యయాలు పెరిగిన కారణంగా 01-10-2025 (బుధవారం) నుండి మామూలు రోజులలో రూ. 6.50 మరియు ఆదివారం సంచిక రూ. 8.00 గా వెలను సవరిస్తున్నాము.

– సాక్షి యాజమాన్యం

పల్లెల్లో 'స్థానిక' సందడి

షెడ్యూల్ విడుదలతో మొదలైన హడావుడి



- భవిష్యత్ కార్యాచరణపై నేతలు, కార్యకర్తల దృష్టి
- టికెట్ల కోసం ముమ్మర యత్నాలు.. ఓటర్లకు చేరువయ్యేందుకు ప్రణాళిక
- ప్రచారం నిర్వహణకూ ఏర్పాట్లు
- నెల రోజుల పాటు కొనసాగనున్న ఎన్నికల ప్రక్రియ... అభ్యర్థుల ఖర్చు తడిసిమోపెడవుతుందనే అంచనాలు
- కోడ్ అమలుపై అధికారుల ఫోకస్

సాక్షి, హైదరాబాద్: స్థానిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవడంతో పల్లెల్లో హడావుడి మొదలైంది. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న వారు.. భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే టికెట్ ప్రయత్నాలు మొదలు పెట్టిన అన్ని పార్టీల నేతలు, మరోవైపు తాము పోటీ చేయాలనుకునే స్థానాల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఆర్థిక వనరులను, మందీ మార్బలాన్ని సమకూర్చుకునే పనిలో పడ్డారు. మండల, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీలకు ఐదు దశల్లో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. కాగా అక్టోబర్ 9న తొలిదశ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీతో మొదలై, నవంబర్ 11న ఫలితాల వెల్లడితో ఈ ప్రక్రియ ముగియనుండడంతో.. దాదాపు నెల రోజులు అభ్యర్థులకు ఖర్చుల మోత మోగిపోతుందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. దసరా, ఆ తర్వాత దీపావళి పండుగల మధ్యలో ఎన్నికలు జరగనుండటంతో గ్రామాల్లో విందు భోజనాలు, మందు పార్టీల జోరుతో ఎన్నికల హడావుడి పతాక స్థాయికి చేరడం ఖాయమని అంటున్నారు.

తొలుత జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు

ముందుగా రాజకీయ పార్టీల గుర్తులపై రెండు దశల్లో జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు జరగనుండడంతో.. ఆయా సీట్లలో మిగతా 2వ పేజీలో ▶

ఓటర్లు లేకున్నా కోటా!

- అక్కడ ఎన్నిక జరిగే అవకాశమే లేదు...
- మరికొన్ని చోట్ల ఒక్కరిద్దరే ఓటర్లు... వారి ఎన్నిక ఏకగ్రీవమే
- రిజర్వేషన్లలో చిత్ర విచిత్రాలు..

2 లో





మళ్లీ ట్రంప్ టారిఫ్ బాంబు

- కలపపై 10 శాతం, ఫర్నిచర్, కిచెన్ కేబినెట్లపై 25% చొప్పున సుంకాలు
- ఈ నెల 14 నుంచే అమల్లోకి..
- ఈ నిర్ణయంతో అమెరికా నిర్మాణ రంగంపై మరింత భారం!

6 లో



ఆశావహులు ఖర్చులు పెట్టుకొని

ఆగం కావొద్దు

- స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- హైకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉండగా షెడ్యూల్ ఎలా ప్రకటిస్తారు?
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

2 లో

ఇదంజగత్



ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరనే ఎజెండా ఉంటే సరిపోతుందనుకుంటా!




రన్నరప్ బోపన్న–యుజికి జోడీ

కెరీర్‌లో 27వ డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్నకు నిరాశ ఎదురైంది. టోక్యోలో మంగళవారం ముగిసిన జపాన్ ఓపెన్ ఏటీపీ-500 టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-టకెరు యుజికి (జపాన్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. హ్యూగో నిస్ (మొనాకో)-ఎడువార్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటతో జరిగిన డబుల్స్ ఫైనల్లో బోపన్న-యుజికి ద్వయం 5-7, 5-7తో పోరాడి ఓడిపోయింది. 92 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-యుజికి ఆరు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌లను ఒకసారి బ్రేక్ చేశారు. రన్నరప్ బోపన్న-యుజికి జంటకు 72,940 డాలర్ల (రూ. 64 లక్షల 79 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 300 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. విజేతగా నిలిచిన హ్యూగో నిస్-వాసెలిన్ ఖాతాలో 1,36,760 డాలర్ల (రూ. 1 కోటీ 21 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు చేరాయి. 45 ఏళ్ల బోపన్న తన డబుల్స్ కెరీర్‌లో 64 టోర్నీల్లో ఫైనల్‌కు చేరాడు. 26 టోర్నీల్లో విజేతగా, 38 టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు.

ప్రదానం చేయలేదని.. ఎప్పటికీ పంపరా?

ఏసీసీ చీఫ్ నఖ్వీ ట్రోఫీ డ్రామాపై బీసీసీఐ ఆక్షేపణ ● ఏజీఎంలో తీవ్రస్థాయిలో అభ్యంతరం


రాజీవ్ శుక్లా


నఖ్వీ

దుబాయ్: ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) అధ్యక్షుడి వ్యవహార శైలిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మండిపడింది. మంగళవారం ఇక్కడ ఏసీసీ సర్వసభ్య సమావేశం (ఏజీఎం) జరిగింది. ఇందులో భారత బోర్డు తరఫున సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, మాజీ కోశాధికారి ఆశిష్ షెలార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అధ్యక్షుడు కూడా అయిన ఏసీసీ చీఫ్ మోసిన్ నఖ్వీ విపరీత ధోరణిపై బీసీసీఐ ప్రతినిధులిద్దరు ఆక్షేపించారు. నఖ్వీ పాక్ ప్రభుత్వంలో మంత్రి కూడా కావడంతో టీమిండియా అతని చేతుల మీదుగా జరగాల్సిన ట్రోఫీ ప్రదానోత్సవాన్ని సున్నితంగా తిరస్కరించింది. ఆదివారం రాత్రి తను ప్రదానం చేయలేదన్న అక్కసుతో నఖ్వీ తర్వాత కూడా విజేత భారత జట్టుకు పంపకుండా ఏసీసీ కార్యాలయంలోనే అట్టిపెట్టాడు. దీంతో 'కప్' లేకుండానే భారత క్రికెట్ జట్టు సభ్యులు స్వదేశానికి వచ్చారు. మంగళవారం జరిగిన ఏజీఎంలో నఖ్వీ కొనసాగిస్తున్న 'ట్రోఫీ డ్రామా'పై శుక్లా, షెలార్ తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇది ఏసీసీ ట్రోఫీ. ఒక వ్యక్తికి సంబంధించినది కాదు. వ్యక్తిగతంగా ఎవరికి చెందదు. టోర్నీలో గెలిచిన విజేత జట్టుకే అప్పగించాలి' అని రాజీవ్ శుక్లా గట్టిగానే స్పష్టం చేశారని బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. ఏజీఎంలో ఇంత జరుగుతున్నా... భారత్ నుంచి తీవ్రస్థాయిలో అభ్యంతరం వెల్లువెత్తుతున్నా... ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నఖ్వీ మాత్రం ఇంకా తన మొండి పట్టు వీడటం లేదు. ట్రోఫీని ఇచ్చేందుకు సమావేశంలో అంగీకరించలేదని తెలిసింది. ట్రోఫీ గురించి ఏజీఎంలో చర్చించాల్సిన అవసరం లేదని, మరో సమావేశంలో మాట్లాడుకుందామని నఖ్వీ దాటవేశారు. ఏసీసీ ఎజెండాలోని వైస్ చైర్మన్ ఎన్నిక వరకే ఈ మీటింగ్‌ను పరిమితం చేయాలని చూశారు. అంతేకాదు. వెస్టిండీస్‌పై నేపాల్ సంచలన విజయం పట్ల నేపాల్ జట్టును అభినందించారు. నేపాల్ ఆసియా జట్టు కావొచ్చు. కానీ ఆ ద్వైపాక్షిక సిరీస్ ఏసీసీకి సంబంధించిన టోర్నీ కానేకాదు. అయినా నేపాల్‌ను ప్రశంసించిన నఖ్వీ... ఏసీసీ సొంత టోర్నీ అయిన ఆసియా కప్ గెలిచిన భారత్‌ను మాటమాత్రంగానైనా అభినందించకుండా తన కుటిల బుద్ధిని చాటుకున్నారు. మొత్తానికి ఆసియా కప్ ట్రోఫీ మాత్రం ఇంకా ఏసీసీ కార్యాలయంలోనే ఉంది.

దీప్తి ఆల్‌రౌండ్ షో

భారత మహిళల శుభారంభం

- శ్రీలంకపై 59 పరుగులతో జయభేరి
- రాణించిన హర్లీన్, అమన్‌జోత్
- ఈనెల 5న పాకిస్తాన్‌తో టీమిండియా పోరు
- మహిళల వన్డే ప్రపంచకప్

గువాహటి: సొంతగడ్డపై అట్టహాసంగా ఆరంభమైన వన్డే ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. బ్యాటింగ్‌లో అర్ధసెంచరీ సాధించిన దీప్తి శర్మ బౌలింగ్‌లో కీలక వికెట్లతో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచింది. దీంతో మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 59 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్... వర్షం వల్ల కుదించిన 47 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ (53 బంతుల్లో 53; 3 ఫోర్లు), అమన్‌జోత్ కౌర్ (56 బంతుల్లో 57; 5 ఫోర్లు, 1 సిక్స్), రాణించారు. లంక బౌలర్లలో ఇనోక రణవీర 4 వికెట్లు, ప్రబోధని 2 వికెట్లు తీశారు. అనంతరం దిగిన శ్రీలంక 45.4 ఓవర్లలో 211 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ చమరి ఆటపట్టు (47 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుగ్గా ఆడింది. దీప్తి (3/54) సహా భారత బౌలర్లు స్నేహ్ రాణా (2/32), ఆంధ్రప్రదేశ్ అమ్మాయి శ్రీచరణి (2/37), క్రాంతి (1/41), అమన్‌జోత్ (1/37), ప్రతిక (1/6) సమష్టిగా ప్రత్యర్థి బ్యాటర్ల భరతం పట్టారు.



అమన్‌జోత్‌తో నడిపించి... బౌలింగ్‌తో గెలిపించి...

భారత వెటరన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షోకు శ్రీలంక కుదేలైంది. ప్రతీక (37; 3 ఫోర్లు, 1 సిక్స్), హర్లీన్ డియోల్ (64 బంతుల్లో 48; 6 ఫోర్లు) మెరుగ్గా ఆడినప్పటికీ మరోవైపు కీలక స్టార్లు స్మృతి మంధాన (8), హర్మన్‌ప్రీత్ (21), జెమీమా (0), రిచా ఘోష్ (2) విఫలమవడంతో 124/6 స్కోరు వద్ద భారత్ పనైపోయిందనిపించింది. ఈ దశలో దీప్తి, అమన్‌జోత్‌తో కలిసి భారత్‌ను నడిపించింది. లంక అమ్మాయిల చెత్త ఫీల్డింగ్‌తో అమన్‌జోత్ మూడుసార్లు 18, 37, 50 పరుగుల వ్యక్తిగత స్కోర్ల వద్ద అవుటయ్యే ప్రమాదం నుంచి బయటపడింది. ఇద్దరు అర్ధసెంచరీ పూర్తి చేసుకొని జట్టును ఒడ్డుకు చేర్చారు. ఏడో వికెట్‌కు 99 బంతుల్లో 103 పరుగులు జోడించాక ముందుగా అమన్‌జోత్, అనంతరం దీప్తి అవుటయ్యారు. ఆఖర్లో స్నేహ్ రాణా (15 బంతుల్లో 28 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించింది. తర్వాత కష్టమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయి ఓటమిని ఆహ్వానించింది. ఓపెనర్, కెప్టెన్ చమరి ఆటపట్టు, వన్‌డౌన్ బ్యాటర్ హర్షిత (29; 3 ఫోర్లు), మిడిలార్డర్‌లో నీలాక్షిక సిల్వా (29 బంతుల్లో 35; 4 ఫోర్లు; 1 సిక్స్) మెరుగ్గా ఆడారంతే! మిగతా బ్యాటర్లను భారత బౌలింగ్ దళం క్రీజులో నిలువనీయలేదు.

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X న్యూజిలాండ్
వేదిక: ఇండోర్
మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

భారత మహిళల ఇన్నింగ్స్: ప్రతిక రావల్ (సి) విష్మి (బి) **ఇనొక 37**; స్మృతి మంధాన (సి) విష్మి (బి) **ప్రబోధని 8**; హర్లీన్ డియోల్ (సి) దిల్హారి (బి) **ఇనొక 48**; హర్మన్‌ప్రీత్ కౌర్ (సి) సంజీవని (బి) **ఇనొక 21**; జెమీమా రోడ్రిగ్స్ (బి) ఇనొక **0**; **దీప్తి శర్మ** (సి) సుగంధిక (బి) అచిని 53; **రిచా ఘోష్** (సి) ప్రబోధని (బి) చమరి 2; **అమన్‌జోత్** (సి) విష్మి (బి) ప్రబోధని 57; **స్నేహ్ రాణా** (నాటౌట్) 28; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (47 ఓవర్లలో 8 వికెట్లకు) 269. వికెట్ల పతనం: 1-14, 2-81, 3-120, 4-120, 5-121, 6-124, 7-227, 8-269.
బౌలింగ్: అచిని కులసూర్య 8-0-42-1, ఉదేశిక ప్రబోధని 10-1-55-2, సుగంధిక 9-0-46-0, కవిశా దిల్హారి 8-0-51-0, ఇనొక రణవీర 9-0-46-4, చమరి 3-0-24-1.
శ్రీలంక మహిళల ఇన్నింగ్స్: హాసిని (బి) క్రాంతి గౌడ్ 14; చమరి (బి) దీప్తి శర్మ 43; హర్షిత (ఎల్బీడబ్ల్యూ) (బి) శ్రీచరణి 29; విష్మి గుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) అమన్‌జోత్ 11; కవిశా (సి) రిచా ఘోష్ (బి) దీప్తి 15; నీలాక్షిక (బి) స్నేహ్ రాణా 35; అనుష్క (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 6; సుగంధిక (బి) స్నేహ్ రాణా 10; అచిని (సి) స్మృతి (బి) శ్రీచరణి 17; ప్రబోధని (నాటౌట్) 14; ఇనొక రణవీర (ఎల్బీడబ్ల్యూ) (బి) ప్రతిక రావల్ 3; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (45.4 ఓవర్లలో ఆలౌట్) 211. వికెట్ల పతనం: 1-30, 2-82, 3-103, 4-105, 5-130, 6-140, 7-173, 8-184, 9-199, 10-211.
బౌలింగ్: క్రాంతి గౌడ్ 9-0-41-1, అమన్‌జోత్ 6-0-37-1, స్నేహ్ రాణా 10-0-32-2, దీప్తి శర్మ 10-1-54-3, శ్రీచరణి 8-0-37-2, ప్రతిక 2.4-0-6-1.

తిలక్ వర్మకు సీఎం అభినందన



సాక్షి, హైదరాబాద్: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో భారత జట్టు విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించిన హైదరాబాద్ యువ క్రికెటర్ తిలక్ వర్మను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా సత్కరించారు. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో తిలక్ వర్మ మర్యాదపూర్వకంగా కలిశాడు. పాకిస్తాన్‌తో ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో తిలక్ వర్మ అజేయ అర్ధ సెంచరీ సాధించి భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఈ సందర్భంగా తిలక్ వర్మ సీఎం రేవంత్ రెడ్డికి క్రికెట్ బ్యాట్‌ను, జెర్సీని అందజేశాడు. తిలక్ ఇచ్చిన బ్యాట్‌తో రేవంత్ రెడ్డి క్రికెట్ షాట్ కొడుతున్న ఫోజు పెట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) చైర్మన్ శివసేనారెడ్డి, 'శాట్స్' ఎండీ సోనీ బాలాదేవి, సీఎం ముఖ్యకార్యదర్శి శ్రీనివాస్ రాజు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆశలు వమ్ము చేయకూడదని...

శేరిలింగంపల్లి: పాకిస్తాన్‌తో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో ఎంతో ఒత్తిడి ఉన్నా... ప్రత్యర్థి ఆటగాళ్లు ఎంత రెచ్చగొట్టినా... ఎక్కడా సంయమనం కోల్పోలేదని... వారికి తన బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చానని తిలక్ వర్మ వ్యాఖ్యానించాడు. చిన్ననాటి నుంచి తాను ప్రాక్టీస్ చేసిన శేరిలింగంపల్లిలోని లేగలా క్రికెట్ అకాడమీకి మంగళవారం తిలక్ వచ్చాడు. ఈ సందర్భంగా తన కోచ్ సలామ్ బాయష్, అకాడమీ ఎండీ పృథ్వీ రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. 'కోట్లాది మంది భారతీయుల ఆశలను వమ్ము చేయకూడదనుకున్నాను. చివర్లో ఒత్తిడి వచ్చినా... దేశం కోసం ఆడాలి, గెలిపించాలన్న లక్ష్యంతో ఓపికగా ఆడాను. హెడ్ కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఎంతో ప్రోత్సహించారు. నేనీ స్థాయికి చేరుకోవడం వెనుక కోచ్ సలామ్, పృథ్వీ పాత్ర ఎంతో ఉంది. ఈ ఇద్దరినీ ఎప్పటికి మర్చిపోలేను. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలి. ఈ విషయంలో కోహ్లి, రోహిత్ శర్మలు ఆదర్శం' అని తిలక్ తెలిపాడు.

జాతీయ క్రీడా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, న్యూఢిల్లీ: క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, శిక్షకులు, సంస్థలను గౌరవించేందుకు ఉద్దేశించిన జాతీయ క్రీడా పురస్కారాలు–2025 కోసం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఏటా ఇచ్చే ఈ అవార్డుల కోసం అర్హులైన వారు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరింది. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు అక్టోబర్ 28వ తేదీ. క్రీడారంగంలో వివిధ విభాగాల్లో విశేష సేవలందించిన వారికి మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు, అర్జున అవార్డు, అర్జున అవార్డు (జీవితకాల సాఫల్యం), ద్రోణాచార్య అవార్డు, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ (ఆర్‌కేపీపీ) పురస్కారాలను అందజేస్తారు. క్రీడాకారులు, కోచ్‌లు, సంస్థలు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ప్రత్యేక పోర్టల్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. అవార్డుల మార్గదర్శకాలు, ఇతర వివరాల కోసం మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ www.dbtyas-sports.gov.in ను చూడాలని కోరింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా


● సమంత

జ్ఞాపకాలను మోయడం ఆపేశాను


"నా ఇరవయ్యేళ్ల వయసులో విశ్రాంతి లేకుండా గందరగోళంలో గడిపాను... గుర్తింపు కోసం ఆరాటపడ్డాను. నా ఫీలింగ్స్ ఏవీ పైకి కనిపించకుండా ఉండేందుకు కష్టపడ్డాను. ఈ క్రమంలో నన్ను నేను ఎంత కోల్పోయానో నాకు మాత్రమే తెలుసు. ఆ సమయంలో ప్రేమ గురించి నాకెవరూ చెప్పలేదు. కానీ నిజమైన ప్రేమ మనలోనే దాగి ఉంటుందని, మనల్ని మనం ప్రేమించుకోవడమే నిజమైన ప్రేమ అని ఆ తర్వాత అర్థం చేసుకున్నాను'' అని పేర్కొన్నారు సమంత. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన ఆలోచనలను, అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తన ఫ్యాన్స్‌తో షేర్ చేసుకుంటుంటారు సమంత. తన మేకప్‌మేన్‌తో ఓ సుదీర్ఘమైన చర్చ జరగిందని, ఈ చర్చలో ఎన్నో అంశాలను మాట్లాడుకున్నామని పేర్కొని, వాటిలోని కొన్ని అంశాలను ప్రస్తావిస్తూ, ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేశారు సమంత. ''ముప్పైఏళ్ల తర్వాత మీరు ప్రపంచాన్ని చూసే తీరు మారిపోతుంది. మీ అందంలో మార్పులొస్తాయి. ఇప్పుడు నేను ముప్పై ఏళ్లలో ఉన్నాను. ప్రతి దాని వెంట పరుగులు పెట్టడం ఆపేసి, జీవితాన్ని ఆస్వాదిస్తున్నాను. గతంలో నేను చేసిన తప్పుల తాలూకు జ్ఞాపకాలను మోయడం ఆపేశా. పబ్లిక్‌లో ఒకలా... ఒంటరిగా ఉన్నప్పుడు మరోలా... ఇలా రెండు రకాలుగా ఉండటం మానేశాను. ఎందుకంటే మీరు మీలా ఉన్నప్పుడే హ్యాపీగా... స్వేచ్ఛగా జీవించగలరు'' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు సమంత.

కెమెరా కాలింగ్


● మమ్ముట్టి

మలయాళ స్టార్ మమ్ముట్టి కొంత గ్యాప్ తర్వాత తిరిగి సినిమా సెట్స్‌లోకి అడుగు పెడుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో మమ్ముట్టి తీవ్ర అస్వస్థతకు గురయ్యారనే వార్తలు తెరపైకి వచ్చాయి. కానీ మమ్ముట్టి ఆరోగ్య సమస్య స్వల్పమైనదేనని, ప్రస్తుతం ఆయన పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని దర్శకుడు మహేశ్ నారాయణన్ పేర్కొన్నారు. మమ్ముట్టి, మోహన్‌లాల్ ప్రధాన పాత్రధారులుగా ఫాహద్ ఫాజిల్, కుంచాకో బోబన్ కీలక పాత్రల్లో నటిస్తున్న మలయాళ చిత్రం 'పేట్రియాట్'. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో మమ్ముట్టి అస్వస్థతకు గురయ్యారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ నేడు హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని తెలిసింది. ''జీవితంలో నాకు ఎంతో ఇష్టమైన పనిని (సినిమా షూటింగ్‌ని ఉద్దేశించి) తిరిగి ప్రారంభిస్తున్నాను. నా ఆబ్సెన్స్‌లో నా గురించి తెలుసుకోవాలనుకున్న అందరికీ థ్యాంక్స్ చెప్పడానికి మాటలు సరిపోవు. ది కెమెరా ఈజ్ కాలింగ్'' అంటూ 'ఎక్స్'లో పేర్కొన్నారు మమ్ముట్టి. అలాగే ఈ విషయంపై మహేశ్ నారాయణన్ మాట్లాడుతూ– ''మమ్ముట్టిగారు తిరిగి సినిమా సెట్స్‌లోకి వస్తున్నందుకు థ్రిల్లింగ్‌గా ఉంది. రాబోయే షూటింగ్ షెడ్యూల్‌లో మమ్ముట్టి, మోహన్‌లాల్ కాంబినేషన్‌లోని సన్నివేశాలను చిత్రీకరిస్తాం. ఇన్ని రోజులు మమ్ముట్టిగారు సెట్స్‌కు రాకపోవడం వల్ల నష్టం వాటిల్లకుండా ఆయన లేని సీన్స్ చిత్రీకరించాం'' అని పేర్కొన్నారు.

నవంబరులో కొదమసింహం


● చిరంజీవి

చిరంజీవి కెరీర్‌లోని సూపర్ హిట్ చిత్రాల్లో 'కొదమసింహం' ఒకటి. కె. మురళీ మోహనరావు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రాధ, సోనమ్, వాణీ విశ్వనాథ్ హీరోయిన్లుగా, మోహన్‌బాబు విలన్ పాత్ర పోషించారు. కె. నాగేశ్వర రావు నిర్మించిన ఈ చిత్రం 1990 ఆగస్టు 9న విడుదలై, ఘన విజయాన్ని సాధించింది. ముప్పైఐదేళ్ల తర్వాత ఈ సినిమాని నవంబరు 21న రీ రిలీజ్ చేయనున్నట్లు రమా ఫిలింస్ అధినేత కైకాల నాగేశ్వరరావు తెలిపారు. ''చిరంజీవి కౌబాయ్‌గా నటించి, ప్రేక్షకుల్ని అలరించిన చిత్రం 'కొదమసింహం'. రాజ్–కోటి సంగీతం, మోహన్‌బాబు వినోదం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రాన్ని 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సరికొత్తగా నవంబరు 21న రీ రిలీజ్ చేయబోతున్నాం'' అని కైకాల నాగేశ్వర రావు చెప్పారు.

అసురుల గురువు శుక్రాచార్యుడు


● అక్షయ్ ఖన్నా

'హనుమాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో రూపొందుతోన్న తాజా చిత్రం 'మహాకాళి'. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో రూపొందిన తొలి చిత్రం 'హనుమాన్' (2024) పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ యూనివర్స్‌లో రూపొందుతోన్న ద్వితీయ చిత్రం 'మహాకాళి'. ప్రశాంత్ వర్మ క్రియేటర్, షో రన్నర్‌గా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అసురుల గురువు శుక్రాచార్యుడి పాత్రను బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా పోషిస్తున్నారు. ఈ క్యారెక్టర్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''ఛావా' వంటి సూపర్ హిట్ మూవీలో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించి, ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు అక్షయ్ ఖన్నా. తెలుగులో ఆయనకి 'మహాకాళి' తొలి చిత్రం. దేవతలు–దానవులు... ఇద్దరి భవితవ్యాన్ని మలిచిన శుక్రాచార్యుడిగా అద్భుతమైన పాత్ర పోషిస్తున్నారు అక్షయ్. 'మహాకాళి' షూటింగ్ 50 శాతం పూర్తయింది. డిసెంబరుకి మొత్తం పూర్తవుతుంది. ఇతర నటీనటులు, సినిమా విడుదల తేదీ వివరాలను త్వరలో ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.


● దీపికా పదుకోన్

యాక్షన్... థ్రిల్


● విష్ణు విశాల్

విష్ణు విశాల్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'ఆర్యన్'. సెల్వ రాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రలు పోషించారు. ప్రవీణ్ .కె దర్శకత్వం వహించారు. విష్ణు విశాల్ స్టూడియోస్‌పై శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 31న తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని మంగళవారం రిలీజ్ చేశారు. ''ఒక యునిక్ ఇన్వెస్టిగేటివ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఆర్యన్'. 'రాట్ససన్' వంటి విజయవంతమైన సినిమా తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీసాఫీసర్ పాత్ర పోషించారు. మా మూవీ ప్రేక్షకులను డార్క్ అండ్ ఇంటెన్స్ వరల్డ్‌లోకి తీసుకెళుతుంది. తనదైన శైలిలో విభిన్నమైన పాత్రతో విష్ణు విశాల్ ఆకట్టుకుంటారు'' అని యూనిట్ పేర్కొంది. సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి ఇతర పాత్రల్లో నటించిన ఈ సినిమాకి కెమెరా: హరీష్ కన్నన్, సంగీతం: జిబ్రాన్.

ఏడడుగులు వేసిన చిన్నారి పెళ్లికూతురు


● మిలింద్ చాంద్వానీ, అవికా గోర్

'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ ఫేమ్ అవికా గోర్ ఇప్పుడు నిజ జీవితంలో పెళ్లి పీటలెక్కారు. సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త మిలింద్ చాంద్వానీతో ఆమె ఏడడుగులు వేశారు. 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ ద్వారా గుర్తింపు సొంతం చేసుకున్న అవికా గోర్ ఆ తర్వాత హీరోయిన్‌గా మారారు. తెలుగుతో పాటు కన్నడ, హిందీలో పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లలో నటించారు. గత ఆరేళ్లుగా ప్రేమలో ఉన్న మిలింద్, అవికా గోర్ జూన్‌లో నిశ్చితార్థం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రేమికులు మంగళవారం వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

పరాక్... వింటేజ్ స్టైల్!


● శ్రీ మురళి

శ్రీ మురళి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పరాక్'. హాలేష్ కోగుండి దర్శకత్వంలో బ్రాండ్ స్టూడియోస్ ఈ సినిమాను నిర్మిస్తోంది. బెంగళూరులోని బండి మహాకాళి ఆలయంలో మంగళవారం ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ఈ వేడుకకు చన్నగిరి ఎమ్మెల్యే శివగంగ బసవరాజు ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ మురళి మాట్లాడుతూ– ''పరాక్' ఒక వింటేజ్ స్టైల్ సినిమా'' అని అన్నారు. ఈ సినిమాకు సంగీతం: చరణ్‌రాజ్, కెమెరా: సందీప్ వల్లూరి.

వివాదాలు సృష్టించవద్దు! - ఫరా ఖాన్


● ఫరా ఖాన్

దర్శకురాలు ఫరా ఖాన్, హీరోయిన్ దీపికా పదుకోన్‌ల మధ్య అభిప్రాయభేదాలొచ్చాయని, అందుకే ఇన్‌స్టాలో వీరిద్దరూ ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకున్నారన్నది బాలీవుడ్ టాక్. దీపిక కెరీర్‌లోని రెండు బ్లాక్‌బస్టర్ చిత్రాలు 'ఓం శాంతి ఓం' (2007), 'హ్యాపీ న్యూ ఇయర్' (2014)లో షారుక్ ఖాన్ హీరోగా నటించగా, ఫరా ఖాన్ దర్శకత్వం వహించారు. ఇలా దీపిక–ఫరాల మధ్య మంచి అనుబంధం ఉంది. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూ సందర్భంగా సినిమాల్లో హీరోయిన్స్ 8 గంటలే పని చేయాలన్నట్లుగా, 'ఎయిట్ అవర్స్ షిఫ్ట్' కాన్సెప్ట్ గురించి దీపిక మాట్లాడారు. ఈ కాన్సెప్ట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల ఓ షోలో పాల్గొన్న ఫరా ఈ 'ఎయిట్ అవర్స్ షిఫ్ట్' గురించి కాస్త వ్యంగ్యంగా మాట్లాడారు. దీంతో దీపికను ఉద్దేశించే ఫరా ఖాన్ అలా మాట్లాడారని, అందుకే వీరిద్దరూ ఒకరినొకరు ఇన్‌స్టాలో అన్‌ఫాలో అయ్యారని ప్రచారమవుతోంది. ఈ ప్రచారంపై ఫరా స్పందించారు. ''హ్యాపీ న్యూ ఇయర్' సినిమా షూటింగ్ సమయంలోనే నేను, దీపిక ఇన్‌స్టాలో కాకుండా డైరెక్ట్ మెసేజ్ లేదా ఫోన్ కాల్స్ ద్వారా మాట్లాడాలనుకున్నాం. అప్పుడే మేం ఒకరినొకరం అన్‌ఫాలో అయ్యాం. కొన్ని వెబ్ పోర్టల్స్ కొత్త వివాదాలు సృష్టిస్తున్నారు'' అంటూ తన ఇన్‌స్టా స్టోరీలో ఫరా షేర్ చేశారు. ఈ స్టోరీకి ఓ నమస్కారం ఎమోజీతో దీపిక స్పందించారు.

పల్లెటూరి నేపథ్యంలో...


● స్వప్న, రామసత్యనారాయణ

తిలక్ రాజ్, తుంగ జంటగా నటించిన చిత్రం 'తాళికట్టు శుభవేళ'. వి. జగన్నాథ రావ్ దర్శకత్వంలో బి. అరుణ్ కౌశిక్ నిర్మించిన ఈ సినిమాలో దేవరాజ్ ముఖ్యపాత్ర పోషించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకు నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, తుమ్మలపల్లి ఆంజనేయులు గుప్త, తల్లాడ సాయికృష్ణ, స్వప్న చౌదరి హాజరై, 'తాళికట్టు శుభవేళ' వీడియో సాంగ్స్, ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం రామసత్యనారాయణ మాట్లాడుతూ– ''కొత్త తరానికి విలువలు నేర్పే మంచి కుటుంబ కథగా ఈ చిత్రం నిలిచిపోతుందని నమ్ముతున్నాను'' అని చెప్పారు. ''పల్లెటూరి నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. గ్రామీణ శైలిని ప్రతిబింబించే కథతో, వినోదం, భావోద్వేగాన్ని కలగలిపి రూపొందించాం'' అన్నారు వి. జగన్నాథ రావ్.


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 191

బుధవారం 1-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పసిడి @ రూ. 1.2 లక్షలు

పండుగ జోరుతో జీవితకాల గరిష్టానికి చేరిన బంగారం -16లో



2,746 పాయింట్లు డౌన్

సెన్సెక్స్ 97 పాయింట్లు, నిఫ్టీ 24 పాయింట్లు డౌన్ -16లో



ఎన్నూర్ ప్లాంట్‌లో ప్రమాదం

చెన్నై శివారులోని ఎన్నూర్ థర్మల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో తొమ్మిది మంది ఉత్తరాది కార్మికులు మరణించారు.

- వివరాలు 6లో▶



ట్రంప్ శాంతి మంత్రం

కల్లోలిత గాజాలో శాంతిని నెలకొల్పడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలకమైన ప్రతిపాదన చేశారు.

- వివరాలు 6లో▶



47 లక్షల పేర్లు తొలగింపు

బిహార్ ఓటర్ల తుది జాబితా విడుదలైంది. ముసాయిదాలో 7.89 కోట్లమంది ఉండగా, తుది జాబితాలో 7.42 కోట్ల మందికి తగ్గారు.

- వివరాలు 6లో▶



సోనమ్‌ను వేటాడుతున్నారు

లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కోసం పోరాడుతున్న తన భర్తను కేంద్రం వేటాడుతోందని ఆయన సతీమణి గీతాంజలి ఆంగ్మో ఆరోపించారు.

- వివరాలు 6లో▶

ఆన్‌లైన్ ఆచార్య!

సబ్జెక్టు ఏదైనా సెర్చ్ ఇంజిన్‌కే ప్రాధాన్యం

- విద్యార్థుల్లో మారుతున్న ట్రెండ్
- పాఠాలు, కంటెంట్ కోసం 'యాప్'లను ఆశ్రయిస్తున్న వైనం
- స్కూలు స్థాయి నుంచి ఉన్నత విద్య వరకూ ఇదే తీరు
- విషయం సులభంగా మెదడు పొరల్లోకి చేరుతోందంటున్న శాస్త్రవేత్తలు



సాక్షి, హైదరాబాద్: గత దశాబ్ద కాలంగా విద్యార్థుల పంథా మారుతోంది. విద్యాబుద్ధులు నేర్పే గురువు స్థానాన్ని ఆన్‌లైన్ యాప్‌లతో భర్తీ చేసుకుంటున్నారు. కాలేజీ స్థాయిలో పాఠాలు వినడమూ కష్టమవుతోంది. ముఖ్యంగా కోవిడ్ తర్వాత పిల్లలు ఆన్‌లైన్ పాఠాలకు అలవాటు పడ్డారు. అకడమిక్ పాఠమైనా, మరో ఇతర అంశమైనా సెర్చ్ ఇంజిన్‌కే ప్రాధాన్యమిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకూ ఇదే ట్రెండ్ కొనసాగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే యాప్‌లు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. విస్తృతమైన సమాచారం (కంటెంట్)తో ఇవి విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. విద్యార్థులు ఐఐటీ ముంబై, మద్రాస్ సంస్థలు ఇటీవల జరిపిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. కాలేజీలో మాస్టార్ పేరు తెలియని వాళ్ళు కూడా, ఆన్‌లైన్ యాప్‌ల పేర్లు ఇట్టే చెప్పేస్తున్నారనేది పరిశోధన సారాంశం. పాఠశాల విద్యలో నూటికి 68 మంది, ఉన్నత విద్యలో 83 మంది ఆన్‌లైన్ ద్వారా నేర్చుకోవడానికే మొగ్గుచూపుతున్నారు. మ్యాథ్స్‌లో మూల్యాంకనలకు, ఫిజిక్స్‌లో మ్యాగ్నటిక్ డైమెన్షన్స్, కెమిస్ట్రీలో కెమికల్ రియాక్షన్స్, బోటనీలో బయలాజికల్ క్లాసిఫికేషన్‌కు ఆన్‌లైన్ శోధనే బెస్ట్ అంటున్నారు. అధ్యాపకుడు చెప్పే దానికన్నా మెరుగైన సబ్జెక్ట్ నాలెడ్జ్ అందుతోందని చెబుతున్నారు.

ఆన్‌లైన్‌తో దీర్ఘకాలిక జ్ఞాపకశక్తి

మెదడులో ముఖ్య భాగం న్యూరాన్ వ్యవస్థ. జ్ఞాపకశక్తికి ఇది కీలకం. ఈ వ్యవస్థ ఇప్పుడు ఆన్‌లైన్ చదువుకు అలవాటు పడుతోందని పరిశోధనల్లో తేలింది. ఆన్‌లైన్‌లో చదవడం వల్ల హిప్పో కాంపస్ (జ్ఞాపకశక్తిని నిల్వ చేయడం)కు సంబంధించి మెరుగైన ఫలితాలు ఇస్తోందని కెనడా యూనివర్సిటీ శాస్త్రవేత్త జాన్ విలియం ఇటీవల వెల్లడించారు. స్కూల్ లేదా కాలేజీలో చదివిన విషయం మెదడులో తాత్కాలిక జ్ఞాపక శక్తిగా ఉంటోందని, ఆన్‌లైన్ ద్వారా చదివేటప్పుడు మెదడులోని న్యూరాన్ వ్యవస్థ తేలికగా దీన్ని దీర్ఘకాలిక జ్ఞాపక శక్తిగా మారుస్తోందని ఆయన పరిశోధనలో తేలింది. క్లాస్ రూంలో పాఠం వినేప్పుడు సిగ్నల్ వ్యవస్థ అయిన మెదడు రసాయన చర్య కారణంగా కొంత ఒత్తిడి గురవుతోందని, అయితే ఆన్‌లైన్‌లో ఏకాగ్రత వల్ల

మిగతా 14వ పేజీలో ▶

న్యూస్‌రీల్

భారీ రైల్ ఓవర్ రైల్ వంతెన



హైదరాబాద్–విజయవాడ గ్రాండ్ ట్రంక్ రూట్‌లో ఉన్న డోర్నకల్ జంక్షన్ వద్ద భారీ రైల్ ఓవర్ రైల్ (రైలు మార్గాన్ని క్రాస్ చేసే రైలు మార్గపు వంతెన–ఆర్‌ఓఆర్) వంతెనకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దాదాపు రూ.320 కోట్ల వ్యయంతో ఏకంగా పదిన్నర కిలోమీటర్ల నిడివితో దీన్ని నిర్మిస్తారు.

- వివరాలు 8లో▶

సమస్యలు పరిష్కరిస్తా... సమ్మె చేయొద్దు



రేషన్ డీలర్ల పెండింగ్ సమస్యలను పరిశీలించి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హామీ ఇచ్చారు. పండుగ సమయంలో రేషన్ పంపిణీ సజావుగా సాగేలా డీలర్లు సహకరించాలన్నారు.

- వివరాలు 8లో▶

హత్యలు తగ్గాయి.. కిడ్నాప్‌లు పెరిగాయి..

దేశవ్యాప్తంగా 7.2 శాతం మేర పెరిగిన నేరాలు

- మహిళలపై 0.7 శాతం, చిన్నారులపై 9.2 శాతం నేరాల పెరుగుదల
- 31.2 శాతం పెరిగిన సైబర్ నేరాలు
- 2023లో మొత్తం 18,236 సైబర్ కేసుల నమోదు
- వెల్లడించిన ఎన్‌సీఆర్‌బీ 2023 నివేదిక



14లో

సైబర్ నేరాల్లో రెండో స్థానంలో తెలంగాణ

- కర్ణాటక తర్వాత మన రాష్ట్రంలోనే అత్యధిక కేసులు
- తెలంగాణ వ్యాప్తంగా స్వల్పంగా పెరిగిన హత్య కేసులు

14లో

కుటుంబ సమస్యలే.. ఉరితాళ్లు



- 32 శాతం ఆత్మహత్యలు కుటుంబ సమస్యల వల్లే
- బాధితుల్లో సుమారు 73 శాతం మంది పురుషులే
- ఆత్మహత్యలపై ఎన్‌సీఆర్‌బీ నివేదిక విడుదల

14లో

చేనును మేసిన కంచె

- భక్షకులుగా మారుతున్న చెరువుల రక్షకులు.. అక్రమార్కులకు చట్ట విరుద్ధంగా ఎన్‌ఓసీలు
- ఆనక రికార్డులు దొరక్కుండా ధ్వంసం చేస్తున్న తీరు.. నీటిపారుదల శాఖ అధికారుల అతి తెలివి

- వివరాలు 17లో

కక్ష సాధించాలంటే.. నన్నేమైనా చేసుకోండి

- నా వాళ్లను వదిలేయండి
- సీఎం స్టాలిన్‌ను ఉద్దేశించి టీవీకే అధ్యక్షుడు విజయ్
- వీడియో విడుదల..

- వివరాలు 14లో

రిజర్వేషన్లలో చిత్ర విచిత్రాలు

ఓటర్లు లేకున్నా...ఆయా కేటగిరీలకు రిజర్వేషన్ | దీంతో అక్కడ ఎన్నిక జరిగే అవకాశమే లేదు.. | మరికొన్ని చోట్ల ఒక్కరిద్దరే ఓటర్లు...వారి ఎన్నిక ఏకగ్రీవమే

సాక్షి నెట్‌వర్క్

రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్ల కారణంగా చిత్ర విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని చోట్ల పంచాయతీలు ఏకగ్రీవమయ్యే పరిస్థితి ఉండగా, మరికొన్ని చోట్ల ఆయా పంచాయతీలకు రిజర్వేషన్ కేటగిరీలో అభ్యర్థులే దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా కొన్ని పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నికలు జరిగే పరిస్థితి లేదు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 2011 జనాభా లెక్కల ఆధారంగా చేయగా, 2024లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను ప్రాతిపదికన తీసుకొని బీసీ రిజర్వేషన్లు ఖరారు చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది.

ఆ 11 గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థుల్లేరు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 11 గ్రామాల్లో సర్పంచ్‌గా పోటీ చేసేందుకు అభ్యర్థులు లేరు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని జైత్రాంతండా, బాండావత్‌తండా, గోన్యతండా, బాలాజీనగర్‌తండా, మాన్‌తండా, నూనావత్‌తండాలో సర్పంచ్ స్థానాలు బీసీలకు రిజర్వు కాగా, అక్కడ బీసీ ఓటర్లే లేరు. అడవిదేవులపల్లి మండలంలోని చాంప్లాతండా బీసీ జనరల్‌కు రిజర్వు కాగా, అక్కడ ఒక్క బీసీ కూడా లేరు. మాడుగులపల్లి మండలంలోని అభంగాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానం ఎస్టీకి రిజర్వ్ అయింది. గ్రామంలో 881 మంది ఓట్లు ఉండగా, అందులో ఎస్టీ వారు ఒక్కరు కూడా లేరు. అనుముల మండలం పేరూర్ సర్పంచ్ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వు అయ్యింది. అక్కడ 792 మంది ఓటర్లలో ఒకే ఒక్క ఎస్టీ పురుషుడు ఓటరుగా ఉన్నాడు. తిరుమలగిరి(సాగర్)మండలంలో చింతలపాలెం గ్రామపంచాయతీ ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయ్యింది. అయితే అక్కడ ఎస్టీలు ఒక్కరూ లేరు. నేరేడుగొమ్ము మండలంలో బచ్చాపురం సర్పంచ్ బీసీకి రిజర్వ్ అయ్యింది. అక్కడ బీసీలే లేరు.

- వరంగల్ జిల్లా సంగెం మండల పరిధిలోని ఆశాలపల్లి పంచాయతీ ఎస్సీ మహిళకు రిజర్వు అయ్యింది. అక్కడ వంగరి మల్లమ్మ ఒక్కరే ఎస్సీ ఓటరు. దీంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవమే. ఇదే మండల పరిధిలోని వంజరపల్లి పంచాయతీ ఎస్టీ జనరల్‌కు రిజర్వు కాగా, ఇక్కడ ఎస్టీ ఓటర్లే లేరు.
- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం శంకరాయపల్లి తండా సర్పంచ్ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వ్ కాగా, ఇక్కడ ఒక్క ఎస్టీ ఓటరు కూడా లేరు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని కల్ములోనిపల్లి, కుమ్మరోనిపల్లి, వంగురోనిపల్లి, ప్రశాంత్‌నగర్ సర్పంచ్ స్థానాలు ఎస్టీ మహిళకు రిజర్వ్ అయ్యాయి. కానీ ఈ గ్రామాల్లో ఎస్టీలే లేరు. గత ఎన్నికల్లో కూడా ఈ గ్రామసర్పంచ్ స్థానాలు ఎస్టీ రిజర్వ్‌డ్ కాగా.. ఆ వర్గానికి చెందిన వారు లేరు. అయితే వార్డు స్థానాలకు కూడా పోటీ చేయకుండా ప్రజలు బహిష్కరించడంతో ఎన్నికలు జరగలేదు.

లాటరీలో ఒక రిజర్వేషన్.. గెజిట్‌లో మరో రిజర్వేషన్



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామపంచాయతీ లాటరీ పద్ధతిలో జనరల్‌కు ఎంపికైంది. కానీ, జిల్లా కలెక్టర్ విడుదల చేసిన రిజర్వేషన్ గెజిట్‌లో మాత్రం జనరల్ మహిళగా నమోదు చేశారు. ఈ విషయం స్టేట్ ఎలక్షన్ కమిషన్ వరకు వెళ్లగా, సరిదిద్ది మరో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్టు తెలిసింది.

చంద్రమ్మ కుటుంబానికే 'చంద్రకల్'

వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని చంద్రకల్ ఎంపీటీసీ పరిధిలో చంద్రకల్, కుప్పగిరి గ్రామాలున్నాయి. ఈ ఎంపీటీసీ స్థానం ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయ్యింది. ఈ రెండు గ్రామాల పరిధిలో 4030 ఓటర్లు ఉన్నారు. అందులో చంద్రకల్ గ్రామానికి చెందిన, చంద్రమ్మ, ఆమె కొడుకు, కోడలు, కూతురు మాత్రమే ఎస్టీలు. దీంతో ఈ ఎంపీటీసీ పదవి ఆ కుటుంబానికే ఏకగ్రీవం కానుంది.



ఖమ్మం జిల్లా చింతకాని మండలం రాఘవాపురం సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయ్యింది. ఈ గ్రామంలో కాంపల్లి కోటమ్మ ఒక్కరే ఎస్సీ మహిళ. దీంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశముంది. కూసుమంచి మండలం ధర్మాతండా జీపీ బీసీ జనరల్‌కు రిజర్వ్ కాగా అక్కడ కుమ్మరికుంట్ల నాగరాజు– శ్రావణి ఇద్దరే ఓటర్లు. వీరిది పక్కనున్న కేశ్వాపురం కాగా, ధర్మాతండాలో కోళ్ల ఫారం పెట్టుకుని ఓటు హక్కు పొందారు. మంగలి తండా బీసీ మహిళకు రిజర్వ్ కాగా తండా యువకుడు అనిత అనే బీసీ యువతిని వివాహం చేసుకోగా ఆమెకు ఓటు వచ్చింది. దీంతో అనిత

దంపతుల్లో ఒకరిని వరించనున్న సర్పంచ్ పదవి

ఏకగ్రీవం అయ్యే అవకాశముంది. ఇదే మండలం లాల్ సింగ్ తండా బీసీ మహిళకు రిజర్వ్ కాగా అక్కడ ఒకే బీసీ కుటుంబం ఉండగా అత్తాకోడళ్లలో ఒకరికి సర్పంచ్ పదవి దక్కనుంది. అజ్మీరా హీరామాన్ తండాలోనూ బీసీ మహిళకు రిజర్వ్ కాగా ఒక్కటే బీసీ కుటుంబం ఉంది. అక్కడ ఏకగ్రీవం ఖాయం కానుంది. ఏన్కూరు మండలం నూకాలంపాడు గ్రామ పంచాయతీ ఎస్టీ మహిళకు రిజర్వు అయ్యింది. అయితే ఇక్కడ ఎస్టీ ఓటర్లే లేరు. పెనుబల్లి మండలం గౌరారం పంచాయతీ సర్పంచ్ పదవి ఎస్టీకి రిజర్వు అయ్యింది. ఇక్కడ ఇద్దరు ఓటర్లు ఉన్నారు. వారిలో ఒకరు సర్పంచ్ అవుతారు. రఘునాథపాలెం మండలంలోని ఎస్.వీ.బంజర, రాములుతండాలో బీసీలే లేకున్నా ఎస్.వీ.బంజర బీసీ మహిళకు, రాములుతండా సర్పంచ్ పదవి బీసీ జనరల్‌కు రిజర్వ్ అయ్యింది. కారేపల్లి మండలం కొత్తకమలాపురం గ్రామపంచాయతీ ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయ్యింది. ఇక్కడ వట్టం ఉమారాణి, సులోచన మాత్రమే పోటీకి అర్హులుగా తేలారు. గత ఎన్నికల్లో సర్పంచ్‌గా వట్టం ఉమారాణిని గెలిచింది. ఈసారి కూడా వీరిద్దరే పోటీ పడనున్నారు.

అక్కడ ఆ ఓటర్లు లేక...

- నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం పెర్కపల్లె పంచాయతీ ఎస్సీలకు రిజర్వు అయ్యింది. ఇక్కడ ఎస్సీ ఓటర్లే లేరు. కుభీర్ మండల పరిధిలోని ఫకీర్‌నాయక్‌తండా, దావూజీ నాయక్ తండాలో గిరిజనులే ఓటర్లు ఉన్నారు. ఈ పంచాయతీలు బీసీలకు రిజర్వు అయ్యాయి. పెంబి మండలం వేణునగర్‌లో కూడా ఎస్టీలే ఎక్కువ ఇది కూడా బీసీ జనరల్‌కు రిజర్వు అయ్యింది. 2019లో వేమనపల్లి మండలం రాజారం గ్రామం ఎస్సీ రిజర్వు కాగా, అక్కడ ఎస్సీలు ఎవరూ లేక ఎన్నిక జరగలేదు. తాజాగా ఎస్సీలకే కేటాయించారు. సారంగపూర్ మండలం హనుమాన్ తండా, పెండల్‌దరి గ్రామంలో బీసీ ఓటర్లు లేరు. ఈ గ్రామాలన్నీ బీసీలకు రిజర్వు అయ్యాయి.
- కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం తుమ్మలగూడలో ఎస్సీలే ఉండగా, ఈ గ్రామం బీసీ జనరల్ రిజర్వు అయ్యింది.
- ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం సావర్గం, పీచర, ఆరేపల్లి గ్రామాలు బీసీలకు రిజర్వు కాగా, ఇక్కడ బీసీ ఓటర్లే లేరు.
- మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం ఏజెన్సీ గ్రామం. ఈ పంచాయతీ ఎస్టీలకు రిజర్వు కాగా, ఇక్కడ ఎస్టీ ఓటర్లే లేరు. గిరిజన జనాభా లేక 40ఏళ్లుగా సర్పంచ్ ఎన్నిక జరగడం లేదు.

3 గ్రామాలకు ఎంపీపీ..

పట్టణీకరణతో పటాన్‌చెరు మండలంలోని కొన్ని గ్రామాలు మున్సిపాలిటీలుగా, మరికొన్ని గ్రామాలు సమీప మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. దీంతో ఈ మండలంలో ప్రస్తుతం భానూరు, క్యాసారం, నందిగామ గ్రామపంచాయతీలే మిగిలాయి. ఈ గ్రామాల నుంచి ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఒక మండల పరిషత్ ఏర్పాటు చేయాలంటే నిబంధనల ప్రకారం కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలి. అయితే ఈ మూడు గ్రామ పంచాయతీలను కలిపి ఐదు ఎంపీటీసీ స్థానాలను చేసి ఎన్నికలకు వెళుతున్నారు.



భానూరు

క్లుప్తంగా...

కాంగ్రెస్‌లో పదవుల పందేరానికి ఎన్నికల బ్రేక్!

- నవంబర్ రెండో వారం వరకు స్థానిక ఎన్నికల కోడ్.. ఆ తర్వాత కూడా వరుసగా ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలతో అధికార కాంగ్రెస్ పార్టీలో పదవుల పందేరానికి బ్రేక్ పడింది. జిల్లానేతలకు ఇచ్చే కార్పొరేషన్ డైరెక్టర్లు, బోర్డు సభ్యుల నియామకాలతో పాటు పార్టీ జిల్లా కమిటీల ఎంపిక కూడా ఇప్పట్లో ఇప్పట్లో లేనట్టేనన్న చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నవంబర్ రెండో వారం వరకు కోడ్ అమల్లో ఉండనుండగా, ఆలోపే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తరుముకు రానుంది. ఉప ఎన్నిక ముగిసిన అనంతరం మున్సిపాలిటీ ఎన్నికలు వస్తాయనే అంచనాలున్నాయి. ఈ ఎన్నికలు పూర్తయ్యేసరికి అటూ ఇటుగా 2025 సంవత్సరం ముగిసిపోతుంది. వెంటనే జీహెచ్‌ఎంసీ ఎన్నికల హడావుడి ప్రారంభం అయ్యే అవకాశాలున్నాయి. ఇలా వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు వరుసగా ఎన్నికలు వస్తాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. అలా ఎన్నికలు పూర్తవుతాయో లేదో.. గతంలో ఇచ్చిన కార్పొరేషన్ చైర్మన్ల పదవీకాలం ముగిసిపోతుంది. ఈ నేపథ్యంలో అప్పటివరకు నామినేటెడ్ పోస్టుల భర్తీ లేనట్టేనని, వారి పదవీకాలం కూడా ముగిసిన తర్వాత ఒకేసారి మార్చిలో పదవుల పందేరం ఉంటుందని గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి. ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న సమయంలో జిల్లా కమిటీలను ప్రకటించడం సరైంది కాదనే అభిప్రాయం కారణంగా వాటి భర్తీ కూడా వాయిదా పడే అవకాశమే ఉందని సమాచారం. స్థానిక ఎన్నికలు వాయిదా పడితే తప్ప ఇప్పట్లో పదవుల పందేరానికి అవకాశం లేదని కాంగ్రెస్ వర్గాలంటున్నాయి.

'జీవో చెల్లదని వారి ఆత్మసాక్షికి తెలియదా?'



సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న ఏ ఒక్క అంశాన్ని కాంగ్రెస్ అమలు చేయడం లేదని, అబద్ధాలతోనే పాలన సాగిస్తోందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం తెలంగాణభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలకు 42% రిజర్వేషన్లపై కూడా మోసం చేస్తోందని, జీవో తెచ్చినట్టే తెచ్చి కోర్టులో కేసులు వేయించారని, కోర్టులో కేసున్నా స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారని ఆరోపించారు. జీవోతోనే పని అయితే అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఎందుకు, బిల్లును గవర్నర్, రాష్ట్రపతి దగ్గరకు ఎందుకు పంపారని ప్రశ్నించారు. ఈ జీవో చెల్లదని వారి ఆత్మసాక్షికి తెలియదా, ఇతర రాష్ట్రాల్లో జీవో ద్వారా రిజర్వేషన్లు పెంచితే కోర్టులు కొట్టేశాయని ప్రభుత్వానికి తెలియదా అని నిలదీశారు. అసెంబ్లీలో బిల్లును ఆమోదించిన తర్వాత ప్రధాని వద్దకు అఖిల పక్షాన్ని ఎందుకు తీసుకెళ్లలేదని శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు రూ.325 కోట్లు విడుదల

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన నిధుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.325 కోట్ల బడ్జెట్‌ను విడుదల చేసింది. ఎన్నికల ఏర్పాట్లకు అయ్యే ఖర్చుల కోసం ప్రభుత్వానికి రూ.450 కోట్లకు పంచాయతీరాజ్‌శాఖ ప్రతిపాదనలు పంపించింది. అయితే ప్రభుత్వం రూ.325 కోట్లు కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులోంచి గ్రామపంచాయతీ ఎన్నికల కోసం రూ.175 కోట్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం రూ.150 కోట్లు వినియోగించాల్సి ఉంది. ఈ నిధులను బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ సంబంధించిన మెటీరియల్, ఎన్నికల సిబ్బంది శిక్షణ కోసం కేటాయించారు. 31 జిల్లాలకు.. వాటి పరిధిలోని పోలింగ్‌కేంద్రాల వారీగా ఈ నిధులు అందజేస్తారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి జెడ్పీ సీఈవోలకు, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక నిధులను డీపీవోల అకౌంట్లో జమ చేయనున్నారు. ఈ మేరకు కలెక్టర్లకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ డా.జి.సృజన సమాచారం పంపించారు.

స్థానిక పోరులోకి పార్టీలు

షెడ్యూల్ విడుదలతో వ్యూహాలకు పదును
- 70–80 శాతం సీట్లు గెలవాలన్న పట్టుదలతో కాంగ్రెస్.. ప్రభుత్వ వైఫల్యాలే బీఆర్‌ఎస్ ప్రచారాస్త్రాలు
- కేంద్ర పథకాలపై బీజేపీ ఆశలు



సాక్షి, హైదరాబాద్: స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటంతో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి. మెజారిటీ స్థానాల్లో గెలిచి సత్తా చాటాలనే లక్ష్యంతో కసరత్తు ముమ్మరం చేశాయి. జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆధిపత్యం సాధించేందుకు అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌తోపాటు సర్వశక్తులూ కూడదీసుకుంటున్నాయి. ఇతర పార్టీలు సైతం ఎన్నికలపై దృష్టి నిలిపాయి.

70–80 శాతం సీట్లు గెలిచేలా..

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎట్టిపరిస్థితుల్లో కనీసం 70 నుంచి 80 శాతం స్థానాలు సాధించి మిగతా పార్టీలపై ఆధిపత్యం సాధించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వ పాలన తీరుపై ప్రజల్లో సానుకూల స్పందన ఉందని, కచ్చితంగా మంచి ఫలితాలు సాధిస్తామని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల పర్యవేక్షణలో పార్టీ ఎమ్మెల్యేలకు గెలుపు బాధ్యతలను అప్పగించనున్నారు. ఈ ఎన్నికల కోసం జిల్లాకు ఒక పరిశీలకుడిని నియమించనున్నారు. ఎన్నికల పర్యవేక్షణ, ప్రచార బాధ్యతలను సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు తీసుకోనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు, పార్టీ బలపరిచేవారిని గెలిపించే పూర్తి బాధ్యతను పార్టీ ఎమ్మెల్యేలపైనే మోపేందుకు అధిష్టానం సిద్ధమైంది. ఈ ఎన్నికల కోసం క్షేత్రస్థాయిలో జిల్లా కమిటీలను వేసి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలైన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు భరోసా, ప్రజలకు సన్నబియ్యం పంపిణీ, సాదా బైనామాలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన తదితరాలను ప్రచారాస్త్రాలుగా చేసుకోనుంది. గత బీఆర్‌ఎస్ పాలన తీరును ఈ ఎన్నికల్లో ఎండగడతామని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. ప్రాంతాన్ని బట్టి స్థానిక అంశాలపై కూడా ప్రధానంగా దృష్టిపెడతామని అంటున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపైనే బీఆర్‌ఎస్ ఫోకస్

గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలను లేవనెత్తి, కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో విఫలమైందని ప్రజలకు చూపించాలని ప్రతిపక్ష బీఆర్‌ఎస్ భావిస్తోంది. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పల్లెల సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటే, కాంగ్రెస్ వాటన్నింటినీ నిర్లక్ష్యం చేసిందని ప్రచారం చేయాలని నిర్ణయించింది. ఈ వ్యూహంతో మంచి ఫలితాలు సాధిస్తామనే విశ్వాసాన్ని ముఖ్యనేతలు వ్యక్తంచేస్తున్నారు. ఏ జిల్లాకు ఆ జిల్లాలోనే ఎన్నికల కసరత్తు చేపట్టేలా టెలి కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. జిల్లాలు, మండలాలు, గ్రామపంచాయతీలవారీగా ఇతర పార్టీల నుంచి వచ్చిన అసంతృప్తులను తమ పార్టీలో చేర్చుకోవటంపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

కేంద్ర పథకాలపైనే ఆశలు

స్థానిక ఎన్నికల్లో బీజేపీ ప్రధానంగా కేంద్ర పథకాలపైనే ఆశలు పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగేందుకు ఈ ఎన్నికలు మంచి అవకాశంగా భావిస్తోంది. అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని నిర్ణయించింది. మండల, అసెంబ్లీ, జిల్లా స్థాయిల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వివిధ కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించింది. గత 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి రూ.12 లక్షల కోట్లు ఇచ్చిందని విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించింది. కేంద్ర పథకాల వల్ల తెలంగాణకు వివిధ రూపాల్లో లభించిన ప్రయోజనాలు, వివిధ శాఖలు, రంగాలకు సంబంధించి అందిన సహాయం గురించి ప్రజలకు వివరించాలని నిర్ణయించింది. ముఖ్య నాయకులు హైదరాబాద్‌కు పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం చేయాలని రాష్ట్ర నాయకత్వం ఆదేశించింది. పాలనలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ విఫలమయ్యాయని బలంగా ప్రచారం చేసేందుకు వ్యూహాలు రచిస్తోంది.

ఆశావహులు ఖర్చులు పెట్టుకొని ఆగం కావొద్దు

- స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- హైకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉండగానే షెడ్యూల్ ఎలా ప్రకటిస్తారు?
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

సాక్షిప్రతినిధి, వరంగల్ : స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ఆశావహులు పండుగ పూట ఖర్చులు పెట్టుకొని ఆగం కావొద్దని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పండుగల సందర్భంలో ప్రజలు ప్రశాంతంగా ఉండడం ప్రభుత్వానికి ఇష్టం లేదని, గ్రామాల్లో గందరగోళం సృష్టించడానికే రిజర్వేషన్లు ప్రకటించిందని చెప్పారు. హైకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉండగానే షెడ్యూల్ ఎలా ప్రకటిస్తారు అని ప్రశ్నించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడారు. ప్రభుత్వ వైఖరి వల్ల ఏర్పడిన గందరగోళంతో పోటీ చేయాలనుకునే ఆశావహులు భార్యల మీద పుస్తెలమ్ముకునేందుకు సిద్ధం అవుతున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల మీద ప్రభుత్వం ఇప్పటికైనా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. బిహార్‌లో 2023లో బీసీ రిజర్వేషన్లు 65 శాతానికి పెంచితే ఆ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు కొట్టి వేసిందని, మహారాష్ట్రలో 2018, 2021లో వికాస్ కిషన్‌రావు గవాలి అనే అతను సుప్రీంకోర్టుకు వెళితే ఐదు జిల్లాల ఎన్నికలను రద్దు చేసిందని గుర్తు చేసిన ఈటల, బీసీ రిజర్వేషన్లకు తామేమీ వ్యతిరేకం కాదన్నారు.

మంత్రుల వ్యాఖ్యలు వింటే నవ్వొస్తుంది

రాష్ట్రంలో ఉన్న ముగ్గురు బీసీ మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలు వింటే నవ్వొస్తుందని ఈటల రాజేందర్ అన్నారు. ఎవరూ కోర్టుకు వెళ్లకండి..సహకరించాలని ఆ మంత్రులు కోరుతున్నారని, మీరు అన్నీ సవ్యంగా చేసిన తర్వాత ఎవరైనా కోర్టుకు వెళితే వచ్చే నష్టం ఏంటని.. కోర్టుకు ఎవరు వెళ్లినా ఇది నిలవదని మీరే అనుమానం వ్యక్తం చేస్తూ షెడ్యూల్ ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు.

42% కోటాపై రాజీ లేదు

- కోర్టు తీర్పు ఎలా ఉన్నా ఆ కోటాతో ముందుకు వెళ్లాల్సిందే..
- కాంగ్రెస్ బీసీ నేతల నిర్ణయం
- మంత్రి పొన్నం నివాసంలో భేటీ



పొన్నం ప్రభాకర్ ఇంట్లో సమావేశమైన మహేశ్‌గౌడ్, సురేఖ, శ్రీహరి, అనిల్, ఐలయ్య, ఆది శ్రీనివాస్, వీహెచ్

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ వర్గాలకు 42% రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో రాజీ పడకూడదని కాంగ్రెస్ బీసీ నేతలు నిర్ణయించారు. హైకోర్టు తీర్పు ఎలా ఉన్నప్పటికీ 42% రిజర్వేషన్లు వెనుకబడిన వర్గాలకు ఇచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించేలా చూడాలని తీర్మానించారు. ఈ నెల 8న బీసీల రిజర్వేషన్లపై హైకోర్టులో కేసు విచారణ జరగనున్న నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర కాంగ్రెస్ బీసీ ముఖ్య నేతలు భేటీ అయ్యారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో జరిగిన ఈ భేటీకి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఈర్ల శంకరయ్య, కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, సీనియర్ నేతలు వి.హన్మంతరావు, కె.కేశవరావు తదితరులు హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. న్యాయపరమైన అంశాల్లో ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై మాట్లాడుకున్నారు. ఈ నెల 8వ తేదీన వస్తుందని భావిస్తున్న హైకోర్టు తీర్పు తమకు సానుకూలంగా రావచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు. తమిళనాడు తరహాలోనే తెలంగాణలోనూ రిజర్వేషన్లు అమలు అవుతాయని ఉద్ఘాటించారు. గవర్నర్లు, రాష్ట్రపతి వద్ద పెండింగ్ బిల్లులు మూడు నెలలకు మించి ఉంటే వాటిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణలోనూ రిజర్వేషన్లకు ఢోకా ఉండదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఒకవేళ కోర్టు తీర్పు వేరే రకంగా వస్తే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక ఎన్నికలను ఎదుర్కోవాలనే నిర్ణయం తీసుకున్నారు.

5వ తేదీ కల్లా జెడ్పీటీసీ అభ్యర్థుల ప్రతిపాదనలు

స్థానిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థుల అన్వేషణ ప్రారంభించింది ఈనెల 5వ తేదీ కల్లా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ తరపున పోటీ చేసే జెడ్పీటీసీ అభ్యర్థులకు సంబంధించిన ప్రతిపాదనలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌కు పంపాలని జిల్లా శాఖలను ఆదేశించింది. మరోవైపు స్థానిక ఎన్నికల సన్నద్ధతపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం రాత్రి మంత్రులతో జూమ్ ద్వారా సమావేశమయ్యారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ముఖ్య నేతలందరితో సంప్రదించిన తర్వాత, ఈ నెల 5 కల్లా ప్రతి జెడ్పీటీసీ స్థానానికి ముగ్గురు చొప్పున అభ్యర్థిత్వాలను రాష్ట్ర పార్టీకి పంపే బాధ్యతలను ఇన్‌చార్జి మంత్రులు తీసుకోవాలని సూచించారు. ఈ ముగ్గురిలో అన్ని రకాలుగా అర్హులైన అభ్యర్థులను పీసీసీ ఎంపిక చేస్తుందని సీఎం చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను ప్రతిపాదించాలని మంత్రులకు సూచించారు.

పల్లెల్లో 'స్థానిక' సందడి

▶ మొదటి పేజీ తరువాయి

పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ తదితర పార్టీల నేతలు, కార్యకర్తలు టికెట్ల కోసం తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆయా స్థానాలకు ముందుగానే రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆ మేరకు ఓటర్లకు చేరవయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. పోటీకి ఎంపిక చేసుకున్న స్థానాల్లో ప్రజలను కలుసుకోవడం, పలానా స్థానం నుంచి పోటీ చేస్తున్నట్టుగా వారికి తెలిసేలా ప్రాథమిక ప్రచార నిర్వహణపై దృష్టి పెడుతున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ టికెట్ల విషయంలో ముందుగా రాజకీయ పార్టీల జిల్లా స్థాయి నాయకత్వాలను ఒప్పించే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికలకు ఎంత మొత్తం ఖర్చు పెట్టాల్సి వస్తుందోనని అంచనాలు వేసుకుంటున్నారు. ఎలాగైనా టికెట్ సాధించి రాజకీయంగా ఎదగాలనే తమ కలను సాకారం చేసుకోవాలని భావిస్తున్నారు. ఇలావుండగా సోమవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో దీని అమలుపై అధికారులు దృష్టి కేంద్రీకరించారు.

రెండు స్థానాలకూ పోటీ చేయొచ్చు!

ఒక అభ్యర్థి జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు రెండింటికీ ఏకకాలంలో పోటీ చేయొచ్చని రాష్ట్ర ఎన్నికల కమిషన్ వర్గాలను బట్టి తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజాపరిషత్ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదై ఉండాలి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకే మండల, జిల్లా పరిషత్ ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులకు అవకాశం ఉంటుంది. నోటిఫికేషన్ జారీ అయ్యాక ఎలాంటి అవకాశం ఉండదు. జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసే వారు ఆ జిల్లాలోని గ్రామీణ ఓటరుగా నమోదై ఉండాలి. జిల్లా ఓటరుకు జిల్లాలోని ఏ జెడ్పీటీసీ స్థానం నుంచి అయినా పోటీ చేసేందుకు అవకాశం ఉంటుంది. అదేవిధంగా ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీచేసే వారు సంబంధిత మండలం ఓటరై ఉండాలి. ఆ ఓటరు ఆ మండలంలోని ఏ ఎంపీటీసీ స్థానం నుంచైనా పోటీ చేసేందుకు (రిజర్వేషన్ స్థానం వర్తింపును బట్టి) అవకాశం ఉంటుంది.

21 ఏళ్లు పూర్తై ఉండాలి

- నామినేషన్ల పరిశీలన తేదీ నాటికి అభ్యర్థి 21 ఏళ్ల వయసు పూర్తిచేసుకుని ఉండాలి
- ఎస్టీలకు రిజర్వ్ చేసిన స్థానాల్లో పోటీ చేయాలంటే.. తెలంగాణకు సంబంధించి షెడ్యూల్డ్ తెగలుగా ప్రకటించిన ఏదేని ఒక కులం, తెగకు (కమ్యూనిటీకి) చెందినవారై ఉండాలి. ఎస్టీలు ఏ వర్గానికి రిజర్వ్ కాని సీటు (జనరల్)కు కూడా పోటీ చేయొచ్చు.
- ఎస్సీలు, బీసీలకు రిజర్వ్ చేసిన స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన షెడ్యూల్డ్ కులాలు లేదా వెనుకబడిన తరగతులుగా ప్రకటించిన ఏదైనా సామాజిక వర్గానికి చెందినవారై ఉండాలి. ఈ వర్గాల వారు కూడా ఏ విధంగానూ రిజర్వ్ కాని స్థానాలకు పోటీ చేయొచ్చు.
- మహిళలకు రిజర్వ్ చేసిన సీట్లలో వారే పోటీ చేయాలి. జనరల్ కేటగిరీ సీటుకు కూడా మహిళలు పోటీ పడొచ్చు.

శిక్ష పడితే అనర్హులు

- క్రిమినల్ కోర్టు ద్వారా శిక్ష పడితే జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానానికి పోటీ చేసేందుకు అనర్హులు. శిక్ష ముగిసిన తేదీనుంచి ఐదేళ్ల పాటు అనర్హత వర్తిస్తుంది.
- 1955 పౌరహక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం శిక్ష పడినవారు కూడా అనర్హులు.
- 2018 తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని 22, 23, 24 సెక్షన్ల ప్రకారం అనర్హులై ఉండకూడదు.
- మతిస్థిమితం లేనివారు, చెవిటి లేదా మూగ వారు అనర్హులు
- దివాలా తీసిన లేదా దివాలా నుంచి వెలుపలికి రాని వ్యక్తిగా కోర్టు నిర్ణయించినవారు లేదా అందుకు (ఇన్‌సాల్‌వెన్సీ) దరఖాస్తు చేసుకున్న వారు అనర్హులు.
- మండల, జిల్లా పరిషత్ లేదా ఏదైనా రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వాల ద్వారా చేపట్టిన ఏదైనా పనికి సంబంధించిన కాంట్రాక్ట్ పొందినవారు, అందులో భాగస్వామ్యం ఉన్నవారు అనర్హులు.
- ఏదైనా పారితోషికం పొందుతూ గ్రామ పంచాయతీ తరపున లేదా దానికి వ్యతిరేకంగా లీగల్ ప్రాక్టీషనర్‌గా పనిచేస్తున్న వారు అనర్హులు.
- 1973 నేర శిక్షా స్మృతి ప్రకారం మేజిస్ట్రేట్‌గా ఆ గ్రామంలోని ఏదైనా ప్రాంతంపై అధికార పరిధి కలిగి ఉన్నవారు అనర్హులు.
- ప్రస్తుతం లేదా గత ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీకి బకాయి పడి, ఆ బకాయి చెల్లించాలని బిల్లు/నోటీస్ ద్వారా తెలియజేసినా నిర్ణీత గడువులోగా బకాయిలు చెల్లించని వారు అనర్హులు.
- గ్రామ సహాయకునిగా (వీఆర్‌ఓ)గా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారి లేదా ఉద్యోగిగా కానీ లేదా స్థానిక సంస్థల్లో, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందుతున్న ఏదైనా సంస్థల్లో ఉద్యోగిగా ఉన్నవారు అనర్హులు. పార్లమెంట్ లేదా అసెంబ్లీ ద్వారా చట్టబద్ధత పొందిన ఏదైనా సంస్థలో కార్యవర్గ సభ్యుడిగా ఉండకూడదు.
- అవినీతికి పాల్పడినందుకు కేంద్రం లేదా ఏదైనా రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు నుంచి తొలగింపబడిన వారు తొలగించిన తేదీ నుంచి అయిదేళ్ల వరకు పోటీకి అనర్హులు.
- గతంలో జరిగిన గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల ఖర్చు వివరాలను సమర్పించనందుకు, సరైన పద్ధతిలో సమర్పించనందుకు ఎన్నికల సంఘం ద్వారా అనర్హులుగా ప్రకటించినవారు పోటీకి అనర్హులు.

బ్యాంకు ఖాతా తెరవాల్సిందే..

ఎన్నికల వ్యయ పర్యవేక్షణకు వీలుగా ఎన్నికల్లో చేసే ఖర్చు వివరాల నిమిత్తం ప్రతీ అభ్యర్థి ప్రత్యేకంగా ఏదో ఒక జాతీయ బ్యాంకులో ఖాతా తెరవాలి. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయడానికి కనీసం ఒకరోజు ముందుగా ఈ ఖాతా తెరిచి ఉండాలి. నామినేషన్ దాఖలు సమయంలో సంబంధిత రిటర్నింగ్ అధికారికి లిఖితపూర్వకంగా ఈ బ్యాంక్ ఖాతా వివరాలు తెలియజేయాలి. ఆ ఖాతానుంచే అభ్యర్థి తన మొత్తం ఎన్నికల వ్యయాన్ని ఖర్చు చేయాలి. అభ్యర్థి తన సొంత నిధులతో పాటు ఎన్నికల కోసం ఇతరుల నుంచి వచ్చే నిధులను కూడా ఈ ఖాతాలోనే జమ చేసి ఖర్చు చేయాల్సి ఉంటుంది. తమ రోజువారీ ప్రచార ఖర్చుకు సంబంధించిన లెక్కలు చూపించాలి. అభ్యర్థుల ఎన్నికల వ్యయ వివరాలను పర్యవేక్షించే బాధ్యతను ఎంపీడీఓలకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) అప్పగించింది.



"సోషలిజం చాలా ఆదర్శవంతమైన రాజ్యం. కానీ మనిషి స్వార్థపరుడిగా ఉన్నంతకాలం దానిని ఎప్పటికీ సాధించలేం."
– అనీ బిసెంట్

సాక్షి
బుధవారం, 1 అక్టోబర్ 2025

పాక్‌పై ట్రంప్ మోజు!

మళ్లీ ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి వైభవం పునరావృతమవుతుందని బహుశా పాకిస్తాన్ ఇన్ని దశాబ్దాల్లో ఎప్పుడూ ఊహించివుండదు. ఆ దేశ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌ను స్వల్ప వ్యవధిలో మూడుసార్లు వైట్‌హౌస్‌కు ఆహ్వానించి గౌరవించటం, నాలుగు రోజుల నాడు మునీర్‌తోపాటు ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సాదరంగా హత్తుకోవటం పాకిస్తాన్ దృష్టిలో చిన్న విషయాలేమీ కాదు. పైగా వారిద్దరికీ ట్రంప్ నుంచి దండిగా ప్రశంసలు దక్కాయి. ఒక పాక్ ప్రధాని అమెరికా అధ్యక్షుణ్ణి కలుసుకుని మాట్లాడటం 2019 తర్వాత ఇదే తొలిసారి. అలాగని పాకిస్తాన్‌ను ఎప్పుడూ పూర్తిగా దూరం పెట్టింది లేదు. ప్రపంచం నలుమూలలా గాలిస్తున్న ఉగ్రవాది బిన్ లాడెన్‌కు పాక్ ఆశ్రయమివ్వటం వంటి ఉదంతాలు అమెరికాకు ఆగ్రహం కలిగించినా, ప్రచ్ఛన్నయుద్ధ కాలం నాటి పాక్ సహకారాన్ని అమెరికా మరువదల్చుకోలేదు. అదే సమయంలో మనం నొచ్చుకోకుండా ఉండేందుకు ఆ దేశాన్ని కాస్త దూరం పెట్టినట్టు కనబడేది. ట్రంప్ తొలిసారి అధికారంలో కొచ్చినప్పుడు పాకిస్తాన్ పేరు చెబితే భగ్గుమనేవారు. అనంతరం వచ్చిన జో బైడెన్ సైతం పాకిస్తాన్‌ను తగినంత దూరంలోనే పెట్టారు. కానీ రెండోసారి అధికారంలో కొచ్చాక ట్రంప్ వైఖరి మారింది. భారత్ తన ఆదేశాలను శిరసా వహించటం లేదన్న అక్కసుతోపాటు స్వప్రయోజనాలపై దృష్టి పడింది. అందుకే పాకిస్తాన్‌కు అతిగా ప్రాధాన్యమిస్తున్నారు. ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

గత కాలపు చెలిమికీ, వర్తమాన సాన్నిహిత్యానికీ చాలా తేడా ఉంది. అప్పట్లో మన దేశం సోవియెట్ యూనియన్‌కు సన్నిహితంగా ఉండటం, తన ఒత్తిళ్లకు లొంగకపోవటం తదితర కారణాలతో ఆసియాలో అమెరికాకు పాకిస్తానే దిక్కయ్యేది. ప్రస్తుత పరిస్థితి వేరు. ట్రంప్‌కు ఇప్పుడు దేశ ప్రయోజనాల కన్నా స్వీయ ప్రయోజనాలే ముఖ్యం. మాజీ అధ్యక్షుడు ఒబామా మాదిరే తనకూ నోబెల్ బహుమతి వచ్చితీరాలని ఆయన పట్టుదలగా ఉన్నారు. భారత్–పాక్ యుద్ధంతో సహా ప్రపంచవ్యాప్తంగా ఏడు ఘర్షణలు ఆపాననీ, అందువల్ల శాంతి బహుమతికి తాను అర్హుడిననీ ఆయన తరచూ చెప్పుకుంటున్నారు. మధ్యమధ్యన మాట మార్చినా భారత్–పాక్‌లు రెండూ చర్చించుకోబట్టే యుద్ధం ఆగిందని ట్రంప్ స్వయంగా మూడు నాలుగు దఫాలు అన్నారు. మునీర్ సైతం ఘర్షణలు నిలపాలన్నది ఇరు దేశాల నిర్ణయమని తెలిపారు. ఇప్పుడు ట్రంప్ అబద్ధానికి పాక్ వంత పాడుతోంది.

ట్రంప్ కోరుకుంటున్నవి ఇంకా చాలా ఉన్నాయి. అందులో ఖనిజాలు ప్రధానమైనవి. పాక్ భూగర్భంలో అపార ఖనిజ సంపద ఉంది. బంగారం, రాగి, మాంగనీస్, క్రోమైట్ వగైరా 92 రకాల ఖనిజాలు అక్కడ లభ్యమవుతాయని చైనా ఖనిజాభివృద్ధి సంస్థ పరిశోధనలు తేల్చిచెప్పాయి. ఇవిగాక ఏఐ, ఎలక్ట్రిక్ కార్లు వగైరాల్లో ఉపయోగపడే కీలక ఖనిజాలున్నాయి. ఇందులో అధికభాగం ఉగ్రవాదుల హవా సాగుతున్న బలూచిస్తాన్, ఖైబర్ ఫక్తున్‌ఖ్వా ప్రాంతాల్లో ఉన్నాయి. అందుకే ఖనిజ సంపద ద్వారా పాక్‌కు సమకూరే ఆదాయం 2 శాతం మించటం లేదు. నిరుడు పాకిస్తాన్ 521 ఉగ్రదాడులు ఎదుర్కొంది. అక్కడ విద్యుత్ కొరత కూడా తీవ్రంగా ఉంది. ఖనిజశుద్ధి పరిశ్రమలు స్థాపిస్తామంటేనే గనులు అప్పజెబుతామని పాక్ ఆశ చూపుతున్నా ఉగ్రవాదం, విద్యుత్ సంక్షోభం కారణాలుగా చూపి ఏ దేశమూ ముందుకు రావటం లేదు. ఇప్పుడు ఆ ఖనిజ సంపదపై ట్రంప్ కన్నుపడింది. ఇదిగాక ట్రంప్ కుటుంబ భాగస్వామ్యం ఉన్న లిబర్టీ ఫైనాన్షియల్ సంస్థ నడిపే క్రిప్టో కరెన్సీ లావాదేవీలకు పాక్ అనుమతులిచ్చింది. ఆ దేశంపై మోజు పెరగటంలో వింతేముంది?

పాకిస్తాన్‌లో ప్రజా ప్రభుత్వం ఉండగా, ట్రంప్ దాన్ని బేఖాతరు చేసి సైనిక దళాల చీఫ్‌కు ప్రాధాన్యమిచ్చి వ్యవహారాలు చక్కబెట్టుకోవటం ఆందోళనకరం. పాక్ సైన్యం అమెరికా ఒత్తిడి పర్యవసానంగా గత రెండు దశాబ్దాల నుంచి ప్రభుత్వంలో ప్రత్యక్ష జోక్యాన్ని తగ్గించుకుంది. తెరవెనక మంత్రాంగానికే పరిమితమైంది. కానీ ట్రంప్ పుణ్యమా అని మళ్లీ సైన్యం ప్రభావం పెరుగుతోంది. ఇది ఆ దేశానికి మాత్రమే కాదు... పొరుగునున్న మనకు కూడా ప్రమాదకరమైన పరిణామం. మన ప్రభుత్వం దీన్ని పరిగణనలోకి తీసుకోక తప్పదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.నవమి ప.2.20 వరకు తదుపరి దశమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ పూర్తి (24 గంటలు) **వర్జ్యం:** ప.1.24 నుండి 3.04 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.31 నుండి 12.21 వరకు, **అమృత ఘడియలు:** రా.11.25 నుండి 1.06 వరకు, **మహర్నవమి.**

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.48
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ టాక్

టెన్షన్ మంచిదే!



ప్రయోగాలు చేస్తూ ఉండండి. ప్రయత్నిస్తూ ఉండండి. సాధనతో ప్రతిదీ సులభం అవుతుంది. ఇక టెన్షన్ అంటారా? ఏదైనా సాధించేందుకు పడేదంతా పాజిటివ్ టెన్షనే! సానుకూలమైన ఒత్తిడి సానుకూలమైన ఫలితాలను ఇస్తుంది.

– శ్రీనివాస్ ఫటక్, యూనిలీవర్ సీఎఫ్‌వో

నడిపే అవకాశం



నేటి కార్యాలయ పని సంస్కృతిలో 'నాయకత్వం' అంటే హోదా కాదు. అధికార శ్రేణిలోని ఒక పైఅంచె కాదు. సరైన అంచనాలకు, అమలు చేసే సామర్థ్యానికి, ఆచరణలోని చొరవకు గుర్తింపుగా దక్కిన బాధ్యత. ముఖ్యంగా అది... టీమ్‌ని నడపటానికి వచ్చిన అవకాశం.

– కిరణ్ బేడీ, భారతదేశ తొలి మహిళా ఐపీఎస్

పనే ప్రతిఫలం



పనే నా జీవితానికి ప్రాణ వాయువు. నేను పని చేయకుండా ఉండలేను. పని నుండి నేను ఏదీ ఆశించను కూడా! ఎందుకంటే, పనిలో నాకు దొరికే ఆనందం పని చెయ్యటం వల్లనే కానీ, ఆ పనితో వచ్చే ప్రతిఫలం వల్ల కాదు. పని లేని రోజున నాలో ఆనందం లేనట్లే!

– రాబర్ట్ రెడ్‌ఫోర్డ్, హాలీవుడ్ దర్శకుడు

అప్పుడు–ఇప్పుడు



ఆటలోకి వచ్చిన కొత్తల్లో జట్టులోని సీనియర్స్‌తో ఎలా మసలుకోవాలా అని నాలో నాకు అనేక సందేహాలు వచ్చేవి. ఇప్పుడు కొత్తగా జట్టులోకి వచ్చిన జూనియర్స్‌ని ఎలా నడిపించాలా అనే ప్రశ్నలు నన్ను వెంటాడుతున్నాయి. తలచుకుంటే నవ్వొస్తుంటుంది.

– స్మృతీ మంధాన, క్రికెటర్

దాచిన నిజం



నాకు ఏదైనా జరిగితే, నా భార్య – నా పిల్లల దగ్గరకు వెళ్లి... "నాన్న వెళ్లిపోయారు" అని చెప్పాల్సిన పరిస్థితి వస్తే ఎలా అనే ఆలోచన నా మనసులోకి ఎందుకు వస్తుందో కానీ వస్తుంటుంది! నా భార్య దగ్గర నేను దాచిపెట్టిన నిజం ఇదొక్కటే!

– ఫ్రాంక్ గ్రిల్లో, అమెరికన్ నటుడు

కోపం ఎందుకు?



ఎవరైనా నా జుట్టును ఆట పట్టిస్తే నేను నవ్వుతాను. ఎవరైనా నన్ను 'నల్ల పిల్లా' అని పిలిస్తే హాయిగా 'ఓయ్' అంటూ పలుకుతాను. వీటిని నేను నా ప్రత్యేకతలుగా, నేను గర్వించవలసిన విషయాలుగా స్వీకరించాను. ఇక నాకు బాధ, కోపం ఎందుకు కలుగుతాయి?

– మసాబా గుప్తా, ఫ్యాషన్ డిజైనర్

చేటు తెచ్చిన అనుభవ రాహిత్యం

విశ్లేషణ



నిరుపమా సుబ్రమణియన్

తమిళనాడులోని కరూర్ పట్టణంలో ఓ కూడలి వద్ద సెప్టెంబర్ 27 రాత్రి సంభవించిన తొక్కిసలాటలో 41 మంది దుర్మరణం చెందారు. ఈ ఘటనలో గాయపడిన జనం పదుల సంఖ్యలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించిన హీరో, 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ అధ్యక్షుడు అయిన విజయ్ ర్యాలీకి 27,000 మందికి పైగా హాజరైనప్పుడు ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆయన రాక ఏడు గంటలు ఆలస్యమై, సభ రాత్రి 7.30 గంటలకు మొదలైంది. అప్పటి వరకు విజయ్ కోసం ఉత్సుకతతో వేచి ఉన్న అభిమానులు ఒక్కసారిగా తోసుకోవడంతో తొక్కిసలాటలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. అక్కడికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న నామక్కల్‌లో సభ ముగించుకుని కరూర్ వచ్చేందుకు విజయ్‌కి అన్ని గంటల సమయం ఎందుకు పట్టిందని కొందరు అంటున్నారు.

పోలీసులు కేటాయించిన స్థలమే!

విజయ్ కరూర్ సభకు ఎంతమంది తరలిరాగలరో అంచనా వేయడంలో పోలీసులు విఫలమయ్యారా... అన్నది సహజంగానే ఇక్కడ తలెత్తే ప్రశ్న. రాజకీయంగా తనను ఎదగనీయకుండా చేసేందుకు పోలీసులు అవరోధాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విజయ్ చేస్తున్న ఆరోపణలతో తమిళనాడు పోలీసులు గత కొద్ది నెలలుగా ఆత్మరక్షణ ధోరణిని అనుసరిస్తున్నారు. కొన్ని వారాల క్రితం తిరుచిరాపల్లిలో విజయ్ రోడ్ షో నిర్వహించినప్పుడు పట్టణంలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. దాంతో సభా నిర్వహణ కోసం కరూర్‌లో విజయ్ ఎంచుకున్న రెండు ప్రదేశాలకు పోలీసులు అనుమతి నిరాకరించారు. అవి జన సమ్మర్దంతో కిటకిటలాడే వాణిజ్య స్థలాలు కావడమే అందుకు కారణం. అందుకే ఆ రెండూ కాకుండా, కొద్ది రోజుల క్రితం అన్నా డి.ఎం.కె నాయకుడు ఎళప్పాడి పళనిస్వామి సభ నిర్వహించిన కరూర్‌లోని మరో ప్రదేశాన్ని పోలీసులు విజయ్ సభకు కేటాయించారు. టీవీకే మొదట ఎంచుకున్న ఆ సభా ప్రాంతాలు రెండింటికీ ఇది కూడా దగ్గరలోదే కావడంతో పార్టీ అందుకు వెంటనే అంగీకరించింది.

ఏర్పాట్లలో తడబడుతున్న టీవీకే

కాగా, తాజా ఘటన రాజకీయంగా, సంస్థాగతంగా టీవీకేకు కొరవడిన సామర్థ్యాన్ని బహిర్గతం చేసింది. పుదుచ్చేరి మాజీ ఎమ్మెల్యే ఎన్. ఆనంద్ ఒక్కరే టీవీకేలో రాజకీయంగా అనుభవం ఉన్న నాయకుడు. ఆయన గతంలో వివిధ కాంగ్రెస్ చీలిక వర్గాలలో పనిచేశారు. ఇటువంటి విషయాల్లో ఏ రాజకీయ పార్టీలోనైనా జిల్లా కార్యదర్శులు ముఖ్యపాత్ర వహిస్తారు. వారు సాధారణంగా అట్టడుగు స్థాయి సంబంధాలు కలిగినవారై ఉంటారు. అయితే టీవీకేలో



కరూర్ ర్యాలీలో జన సందోహం, (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న విజయ్

> ◆ రాజకీయంగా తనను ఎదగనీయకుండా చేసేందుకు అవరోధాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విజయ్ చేస్తున్న ఆరోపణలతో తమిళనాడు పోలీసులు గత కొద్ది నెలలుగా ఆత్మరక్షణ ధోరణిని అనుసరిస్తున్నారు. ఆచి తూచి ఆయనకు సభా స్థలాన్ని కేటాయిస్తున్నారు.

విజయ్ అభిమాన సంఘాలలోని ప్రీతిపాత్రులే ఆ భూమిక నిర్వహిస్తున్నారు. సభలకు తగిన ఏర్పాట్లు చేయడంలో వారు తడబడుతున్నారు. తమ సభలకు సుమారు పది వేల మంది హాజరు కావచ్చని అంచనా వేస్తున్నట్లు వారు పోలీసులకు చెబుతున్న సంఖ్య కూడా తక్కువగానే ఉంటోంది. ఇలాంటి సభలప్పుడు సాధారణంగా పార్టీలు కొద్దిమంది కార్యకర్తలకు డబ్బు పంపిణీ చేసి ఆహారం, నీరు సమకూర్చే ఏర్పాట్లు చేస్తూంటాయి. కాగా, సభలకు హాజరైన జనాన్ని అదుపులో ఉంచి, నియంత్రించవలసిన అవసరాన్ని ఇప్పటికే అనేక తమిళ పార్టీలు గుర్తించాయి కూడా! రాజీవ్ గాంధీ హత్యోదంతంతో తమిళనాడు ఈ చేదు పాఠాన్ని నేర్చుకోవాల్సి వచ్చింది. టీవీకే తన తరహాలో నిర్వహిస్తున్న రోడ్ షోల లాంటివి మాత్రం తమిళనాడు రాజకీయాలకు కొత్త.

అప్పటి 'సినీ–నాయకులు' వేరు!

గతంలో జయలలిత, కరుణానిధి కూడా వాహనాలలో రాష్ట్ర హైవేలలో ప్రయాణించినా ముందుగా నిర్ణయించిన చోట్ల మాత్రమే వారు వాహనాలను ఆపి ప్రసంగించేవారు. కొద్ది వేల మందిని ఉద్దేశించి ప్రసంగించి మరో చోటుకు బయలుదేరేవారు. పైగా, వారు జనాలు వేచి చూసేటట్లు చేసేవారు కాదు. నిర్హేతుకమైన జాప్యాలకు అవకాశమిచ్చేవారు కాదు. మొన్నటి ఘటనలో అంబులెన్సుల రాకకు సంబంధించిన శబ్దాలు వినిపిస్తున్నా విజయ్ తన ప్రసంగాన్ని కొనసాగించడం కూడా ఆయన రాజకీయ అనుభవ రాహిత్యాన్ని సూచించింది. ఏం జరుగుతోందో ఎవరూ ఆయన చెవిన వేసినట్లు లేదు. పరిస్థితి తీవ్రతను గమనించిన వెంటనే ఆయన అక్కడ నుంచి వెళ్లిపోవాల్సి వచ్చింది. తిరుచిరాపల్లిలో ప్రైవేటు విమానం ఎక్కి, రెండు గంటల్లోపల చెన్నైకి చేరుకున్నారు. ఆయనతో పాటే టీవీకే సభ్యులు కూడా సభా ప్రాంగణం నుంచి నిష్క్రమించారు. పోలీసుల ఎఫ్.ఐ.ఆర్‌కు ఎక్కిన కొందరు పరారీలో ఉన్నారు.


"కక్ష ఉంటే నాపై తీర్చుకోండి!"

ఈ అవకాశాన్ని అధికార డి.ఎం.కె పార్టీ సద్వినియోగం చేసుకున్నట్లే కనిపిస్తోంది. కరూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అయిన సెంథిల్ బాలాజీ ఆ సమయంలో నియోజకవర్గంలోనే ఉండడం ఆ పార్టీకి కలిసొచ్చింది. అయితే సెంథిల్ బాలాజీ ఆస్పత్రికి చేరుకోక ముందే, కరూర్ మాజీ ఎమ్మెల్యే అన్నా డి.ఎం.కె నాయకుడు ఎం.ఆర్. విజయ్ భాస్కర్ బాధితులను పరామర్శించటం ప్రారంభించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా శనివారం అర్ధరాత్రికల్లా కరూర్ చేరుకున్నారు. స్టాలిన్ కుమారుడు, ఆయన వారసత్వాన్ని అందుకుంటాడని భావిస్తున్న ఉదయనిధి కూడా ఆదివారం ఉదయానికల్లా కరూర్‌లో వాలారు. అయితే విజయ్‌కి మాత్రం ఈ ఘటనపై క్షమాపణ కోరుతూ బహిరంగ ప్రకటన చేయడానికి 12 గంటలకు పైగా పట్టింది. ఇక, తాజాగా నిన్న (సెప్టెంబరు 30) విడుదల చేసిన ఒక వీడియోలో, ''నా జీవితంలో ఇంతటి బాధాకరమైన రోజు వస్తుందని ఊహించ లేదు'' అని ఆవేదన వ్యక్తం చేశారు. ''ఈ దుర్ఘటన జరగకుండా ఉండాల్సింది. నా గుండె ముక్కలైపోయింది. మాటలు రావటం లేదు. కరూర్ తొక్కిసలాట ఘటనలో నిజానిజాలు త్వరలోనే బయటపడతాయి. నాపై కక్ష ఉంటే తీర్చుకోండి. నా అభిమానులపై కాదు'' అని కూడా విజయ్ ఆ వీడియోలో అన్నారు. వచ్చే ఏడాది (2026) ఎన్నికలకు సమాయత్తమవుతున్న విజయ్‌కి ఈ సంఘటన పెను విఘాతమేనని చెప్పాలి. ఘటనపై ప్రభుత్వం రిటైర్డ్ హైకోర్ట్ జడ్జి నేతృత్వంలో ఏకసభ్య విచారణ సంఘాన్ని నియమించడాన్ని టీవీకే, అన్నా డి.ఎం.కెలు తోసిపుచ్చాయి. సి.బి.ఐతో దర్యాప్తు జరిపించాలని అవి డిమాండ్ చేస్తున్నాయి.

హీరో... నాయకుడిగా మారాలి

ఎం.జి. రామచంద్రన్, జయలలితలు కూడా సినీ రంగం నుంచి వచ్చినవారే అయినా, ఎమ్జీఆర్‌కు ద్రవిడ ఉద్యమ నేపథ్యం ఉంది. జయలలిత చాలా ఆటుపోట్లను తట్టుకుని ఎంజీఆర్ చెంత రాజకీయంగా సుశిక్షితురాలిగా మారారు. తాజా ఘటన నేపథ్యంలో విజయ్ తనను తాను పూర్తిగా మార్చుకోవాల్సి ఉంటుంది. ఆయనకు లక్షల మంది అభిమానులున్నమాట నిజమే. అయితే ప్రజలు ఓటు వేయాలని కోరుకునే రాజకీయ నాయకునిగా ఆయన రూపాంతరం చెందాల్సి ఉంది. ఇక ఆయన రాష్ట్ర వ్యాప్త ప్రచారానికి తిరిగి ఎప్పుడు బయలుదేరుతారన్నది ప్రస్తుతానికి సస్పెన్స్. భవిష్యత్ పరిణామాలు వెండితెరపై కాక, రాజకీయ యవనికపైనే ఆవిష్కృతం కానున్నాయి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్



ఆయన మార్గం నిత్యనూతనం

'నువ్వు ఏం చేయాలి అని సందిగ్ధానికి లోనయినప్పుడు, జీవితంలో నీకు తారసపడ్డ అత్యంత నిరుపేద, నిస్సహాయుడి ముఖాన్ని గుర్తు తెచ్చుకొని, ఇప్పుడు నీవు తలపెట్టిన పని అతనికి ఏవిధంగానైనా సాయపడుతుందా? తన బ్రతుకు తాను బ్రతకడానికీ, తన జీవితం సఫలం చేసుకోవడానికీ నువ్వు చేయబోయే పని అతనికేమైనా ఊతమిస్తుందా అని ఆత్మావలోకన చేసుకో, కర్తవ్యం నీకు బోధపడుతుంద'న్న గొప్ప జీవన సందేశాన్ని ఇచ్చినవారు మహాత్మా గాంధీజీ. గాంధీజీ ప్రత్యేకత ఏమిటంటే... తాను చెప్పిన విషయాన్ని తాను స్వయంగా ఆచరించిన తర్వాతనే చెప్పేవారు. ఇతరులు ఎలాంటి వారైనా, మన పట్ల ఎంతటి ద్వేషభావన కలిగి ఉన్నా... మన ప్రవర్తన ద్వారా ఎదుటివారిలో మానవతను కలిగించేలా నడుచుకోవాలని ఉద్బోధించారు. ఆ ప్రకారమే పాలకులలో పరివర్తన తీసుకురావడానికి 'సత్యాగ్రహం', 'అహింస', 'సత్యం' అనే మూడు ప్రధాన ఆయుధాలను ఉపయోగించుకొని జాతీయోద్యమాన్ని మరో మలుపు తిప్పారు.

అహింసాయుతంగా, మౌనంగా పోలీసులు లాఠీలతో కొడుతున్నా భరిస్తూ తమ నిరసనను తెలియజేసే 'సత్యాగ్రహం' ఆయుధాన్ని గాంధీజీ దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు ప్రయోగించి అనేక విజయాలు సాధించారు. గోపాలకృష్ణ గోఖలే కోరిక మేరకు దేశంలో అప్పటికే కొనసాగుతున్న జాతీయోద్యమంలో పాల్గొనడానికి భారత దేశానికి గాంధీజీ తిరుగు ప్రయాణం అయినప్పుడు దక్షిణాఫ్రికాకు చెందిన సైనికాధికారి జనరల్ 'గిల్బర్ట్ ముర్రే' బ్రిటీష్‌వారిని ఇలా హెచ్చరించాడు: 'గాంధీకి సుఖాపేక్ష లేదు, ధనాపేక్ష లేదు; కామం, మోహం లేవు. తాను ధర్మం అని నమ్మిన దానిని ఆచరించడానికి ఎంత దూరమైనా వెళతాడు. అందువల్ల గాంధీ విషయంలో తగిన జాగ్రత్త వహించాలి. అటువంటి వ్యక్తి దేహంపై మీరు విజయం సాధించవచ్చునేమో గానీ, అతని వ్యక్తిత్వాన్ని జయించడం అసాధ్యం. గాంధీ మీకు ప్రమాదకరమైన చిక్కులు తెచ్చి పెట్టే శత్రువు అవుతాడు'. గిల్బర్ట్ చేసిన ఈ హెచ్చరిక ఎంత నిజమో ఆ తర్వాత కాలంలో భారతదేశంలోని బ్రిటిష్ పాలకులకు అనుభవంలోకి వచ్చింది.

ఒక సందర్భంలో గాంధీ తన 'యంగ్ ఇండియా' పత్రికలో ఇలా రాశారు: ''నా భావాలు మారుతూ ఉంటాయి. సత్యాన్వేషణలో నేను అనేక విశ్వాసాలను వదులుకొన్నాను. కొత్త విశేషాలు తెలుసుకొన్నాను. సత్యమే నా దేవుడు. అందువల్ల 'వెనుక చెప్పిన వాటికి, ఇప్పుడు చెప్పేవాటికి పొంతన లేకుండా ఉన్నదే...' అని నన్ను విమర్శించే బదులు, నేను ఇటీవల చెప్పిన మాటనే గ్రహించమని కోరుతున్నాను' అంటూ వివరణ ఇచ్చారు.

నిరాడంబరతకు చిహ్నంగా నిలిచారు గాంధీజీ. 1921 సెప్టెంబర్ 27న గాంధీజీ ఇతర దుస్తులన్నీ విసర్జించి భారతీయులు ధరించే కొల్లాయిగుడ్డ, ఉత్తరీయానికి తన దుస్తుల్ని పరిమితం చేసుకొన్నారు. బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్‌తో చర్చలు జరపడానికి ఇంగ్లండ్‌కు అదే వేషధారణతో వెళ్లిన గాంధీని బ్రిటీష్ పాలకులు 'హాఫ్ నేకెడ్ ఫకీర్' (అర్ధనగ్న సన్యాసి) అని అవహేళన చేసినప్పుడు గాంధీ చిరునవ్వు నవ్వి 'మీరు చూడాల్సింది నా దుస్తులు కాదు... నేను మోసుకొచ్చిన కోట్లాది భారతీయుల ఆకాంక్ష' అని చెప్పి, వారు సిగ్గుతో తలవంచుకొనేలా చేశారు.

గాంధీజీ ప్రవచించి ఆచరించిన ఉన్నత మార్గాలలో 'అహింసా మార్గం' ఒక్కటే 'ప్రపంచశాంతిని' నెలకొల్పగలదని అన్ని సందర్భాలలో రుజువయ్యింది. గాంధీ బోధనలు, సత్యాన్వేషణకై ఆయన వేసిన మార్గాలు ఎప్పటికీ నిత్యనూతనం!

– డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు
కేంద్ర మాజీ మంత్రి, ఏపీ శాసనమండలి సభ్యులు
(రేపు గాంధీ జయంతి)

ఆకాశంలో... ఆదిదంపతులు



పూర్వం ఒకప్పుడు గ్రీష్మ ఋతువు ఆగమనాన్నిగమనించిన పార్వతి, శివుడిని 'స్వామీ! గ్రీష్మ ఋతువు వచ్చేసింది. వేడి వాతావరణం అంతటా నిండిపోయింది. తలదాచుకుందుకు ఇల్లు లేకుండా వేసవిలో రోజులు ఎలా గడపగలం?' అని అడిగింది. దాక్షాయణి మాటలను విన్న శివుడు 'దేవీ! మొదటి నుండీ మనది వనవాసమే కదా! ఇప్పుడు కొత్తగా ఈ కంగారేమిటి?' అన్నాడు. శంకరుడు అలా మాట్లాడేసరికి సతీదేవి మరేమీ ఎదురు చెప్పలేకపోయింది. గ్రీష్మ ఋతువు ఎలాగో గడిచిపోయింది.

వర్ష ఋతువు వచ్చింది. అన్ని దిక్కులా నల్లని మేఘాలు ఆవరించి అంధకారం అలుముకుంది. పార్వతి పతిని సమీపించి 'మేఘాలు గర్జిస్తున్నాయి. కనులు మిరుమిట్లు గొలుపుతూ మెరుపులు మెరుస్తున్నాయి. ఆకాశం నుండి కురుస్తున్న వర్షధారలు నేలను తాకి శబ్దం చేస్తున్నాయి. నీటితో నిండుతున్న జలాశయాలపై కొంగలు పంక్తులుగా ఎగురుతున్నాయి. రివ్వున వీస్తున్న గాలుల తాకిడికి కదంబ, కేతకి, అర్జున వృక్షాలు పుష్పాలను రాలుస్తున్నాయి. మేఘాల గర్జనకు భీతిల్లిన హంసలు జలాశయాలను వదిలి పోతున్నాయి. ఇటువంటి దుస్సహమైన వాతావరణంలో స్వామివారు కరుణించి ఈ మహత్తరమైన మందరగిరిపై ఒక ఇంటిని నిర్మిస్తే నా దిగులు తీరుతుంది!' అంది. పార్వతి మాటలు విన్న ఫాలలోచనుడు 'పార్వతీ! ఇల్లు నిర్మించుకుంటే బాగానే ఉంటుంది. కాని నా దగ్గర దానికి కావలసినంత ధనం లేదు. వ్యాఘ్రచర్మంతో శరీరాన్ని కప్పుకుని తిరిగేవాడిని నేను. సర్పములే నాకు భూషణములు కదా!' అన్నాడు. 'వేసవికాలంలో చెట్లనీడలలో కాలం గడిచిపోయింది. కానీ ఇప్పుడు, ఈ వర్షాకాలంలో అలా సాధ్యం కాదు కదా మహాదేవా!' అని విన్నవించుకుంది పార్వతి. 'మేఘమండలం పైకి చేరుకుంటే వర్షపు నీరు మీద పడి శరీరం తడిసే సమస్య ఉండదుగా దేవీ!' అన్నాడు శంకరుడు పార్వతి విన్నపానికి సమాధానంగా!

తతో హరస్తద్ఘనఖణ్డమున్నత మారుహ్య తస్థౌ సహ దక్షకన్యయా
తతో భవన్నామ మహేశ్వరస్య జీమూతకేతుస్త్వితి విశ్రుతం దివి॥

అలా చెప్పిన శంకరుడు పార్వతి తోడుగా ఆకాశంలో మేఘమండలాల స్థాయిని దాటి పైకి వెళ్లి అక్కడ ఉండిపోయాడు. అప్పటి నుండి దేవలోకంలో శంకరుడు 'జీమూతకేతు' అనే పేరుతో విశ్రుతుడై నిలిచాడని 'వామన పురాణం'లోని పై శ్లోకం చెప్పింది.

– భట్టు వెంకటరావు

డేటా పాయింట్

టీవీ చూసేస్తున్నారు!

రాత్రి పడుకునేముందు... 15–59 ఏళ్ల వయసు వారిలో, ముఖ్యంగా దేశంలోని పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం మంది టీవీ లేదా వీడియోలు చూస్తున్నారు. ఫోన్లు లేదా సోషల్ మీడియాలో మరికొందరు సమయం గడుపుతున్నారు.



	పురుషులు	స్త్రీలు
టీవీ / వీడియోలు	37%	26%
ఫోన్లు లేదా సోషల్ మీడియా	27%	27%
భోజనం లేదా ఏదైనా తాగడం	9%	8%
క్లీనింగ్	1%	16%
పిల్లల విషయాలు	2%	5%


ఆధారం: టైమ్ యూజ్ సర్వే 2024

కనకదుర్గమ్మ జనులను కాచుగాత!

విజయవాటిక యందు విజయదుర్గ
నామమున నున్న జగదంబ కోమలాంగి
సిరులు కురిపించు, భగవతి
సింధుతనయ!
కనకదుర్గమ్మ జనులను కాచుగాత!!

హస్తముల పుష్పశరమును, అంకుశమ్ము,
నెన్నుదుట కాంతి జిమ్మెడి నేత్రమొకటి,
విశ్వజనని లలితగా వెలసినట్టి
కనకదుర్గమ్మ జనులను కాచుగాత!!

అష్టభుజములు ధరియించి దుష్టులైన
రక్కసుల గర్వమణచిన రౌద్రమూర్తి!
సర్వమంగళదాయిని జగము లేలు
కనకదుర్గమ్మ జనులను కాచుగాత!!



అక్షమాల అలరుచుండ హస్తమందు
పుస్తకమును దాల్చి వేరొక హస్తమందు,
కమలమందున కూర్చున్న కల్పవల్లి!
కనకదుర్గమ్మ జనులను కాచుగాత !!

పాయసాన్నంబు నిండిన పాత్రతోడ
'అన్నపూర్ణ'వై కృపగాంచు కన్నతల్లి!
భక్తులకు వరము లొసంగు భాగ్యరాశి
కనకదుర్గమ్మ జనులను కాచుగాత !!

– డా॥ జంధ్యాల పరదేశి బాబు,
విశ్రాంత తెలుగు ఆచార్యులు ।
91219 85294


విశాల్ దసరా కలక్షన్ లో
ప్రధాన ఆకర్షణగా నిలిచిన
నటి & మిస్ వరల్డ్
మనూషి ఛిల్లర్.
కుర్తా 3 పీస్ సెట్ ₹1399
VISHAL MEGA MART
5% ఎక్కువగా అదనపు క్యాష్‌బాక్#
SBI card
+
లేడీస్ కుర్తా ₹599+ 3 కొనండి ₹300 తగ్గింపు పొందండి
మహిళల టీ-షర్ట్ ₹199 3 కొనండి ₹100 తగ్గింపు పొందండి
మహిళల జీన్స్ ₹699 2 కొనండి ₹200 తగ్గింపు పొందండి
పురుషుల టీ-షర్ట్ ₹199 3 కొనండి 1 ఉచితంగా పొందండి
పురుషుల జీన్స్ ₹799 2 కొనండి ₹200 తగ్గింపు పొందండి

అతిపెద్ద యుద్ధం ఆపేశా!

- అసిమ్ మునీర్ పాకిస్తాన్‌లో అత్యంత ముఖ్యమైన వ్యక్తి
- ఆయన ప్రశంసలను గొప్ప గౌరవంగా భావిస్తున్నా: ట్రంప్

వాషింగ్టన్: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్, పాకిస్తాన్‌ల మధ్య జరిగిన ఘర్షణ పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వాదన నుంచి వెనక్కి తగ్గడం లేదు. ఆ రెండు దేశాల నడుమ అతిపెద్ద యుద్ధాన్ని తానే ఆపేశానని మరోసారి తేల్చిచెప్పారు. రెండు అణ్వస్త్ర దేశాలను కాల్పుల విరమణకు ఒప్పించానని చెప్పారు. మంగళవారం మిలటరీ కమాండర్ల సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. యుద్ధాన్ని ఆపడం ద్వారా లక్షలాది మంది ప్రాణాలను కాపాడారంటూ పాకిస్తాన్ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ తనను ప్రశంసించడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. అసిమ్ మునీర్ మాట్లాడిన విధానం తనకు ఎంతగానో నచ్చిందని అన్నారు. అసిమ్ మునీర్ పాకిస్తాన్‌లో అత్యంత ముఖ్యమైన వ్యక్తి అని ట్రంప్ తేల్చిచెప్పారు. తాను రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ తొమ్మిది నెలల్లో ప్రపంచవ్యాప్తంగా ఏడు యుద్ధాలు ఆపేశానని పేర్కొన్నారు. ఇందులో ముఖ్యంగా భారత్–పాక్‌ల యుద్ధమే ఉందన్నారు. భారత్, పాక్ ఘర్షణలో ఏడు యుద్ధ విమానాలు నేలకూలాయని వెల్లడించారు. అయితే, అవి ఏ దేశానికి చెందినవన్న సంగతి బయటపెట్టలేదు. మరోవైపు ఆపరేషన్ సిందూర్‌కు విరామం ఇవ్వడం వెనుక అమెరికా ప్రమేయం లేదని, పాకిస్తాన్ సైన్యం కాళ్లబేరానికి వచ్చి వేడుకోవడం వల్లే వైమానిక దాడులు నిలిపివేశామని భారత ప్రభుత్వం ఇప్పటికే పలు సందర్భాల్లో స్పష్టంచేసిన సంగతి తెలిసిందే.

మళ్లీ ట్రంప్ టారిఫ్ బాంబు

- కలపపై 10 శాతం, ఫర్నిచర్‌పై 25 శాతం సుంకాలు
- ఈ నెల 14 నుంచే అమల్లోకి...

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశీ ఉత్పత్తులపై టారిఫ్‌ల మోత మోగిస్తూనే ఉన్నారు. ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా లెక్కచేయకుండా ముందుకెళ్తున్నారు. విదేశాల నుంచి దిగుమతి అయ్యే కలప(టింబర్)పై 10 శాతం, ఫర్నిచర్‌తోపాటు కిచెన్ కేబినెట్లపై 25 శాతం సుంకాలు విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సుంకాలు ఈ నెల 14వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ట్రంప్ ఆదేశాల పట్ల అమెరికాలో భవన నిర్మాణ రంగంపై మరింత భారం పడడం ఖాయమని నిపుణులు తేల్చిచెబుతున్నారు. ఇళ్ల నిర్మాణం ఖరీదైన వ్యవహారంగా మారుతుందని అంటున్నారు. అమెరికాలో నిర్మాణ వ్యయం ఇప్పటికే విపరీతంగా పెరిగిపోయింది.

స్థానిక పరిశ్రమల కోసమే

అమెరికా జాతీయ భద్రతను దృష్టిలో పెట్టుకోవడంతోపాటు స్థానిక కలప పరిశ్రమలను ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే విదేశీ కలప, ఫర్నిచర్‌పై సుంకాలు విధించినట్లు ట్రంప్ స్పష్టం చేశారు. స్థానిక పరిశ్రమలకు ఊతం ఇస్తే కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతుందని, తద్వారా తమ యువతకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దిగుమతులు తగ్గించుకోవడంతోపాటు అమెరికా నుంచి కలప, ఫర్నిచర్ ఎగుమతులు పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. తమ అవసరాలకు సరిపోయే చెట్లు, కలప అమెరికాలో ఉన్నాయని స్పష్టంచేశారు. అమెరికాకు ప్రధానంగా పొరుగుదేశం కెనడా నుంచి కలప దిగుమతి అవుతుంది. ట్రంప్ తాజా నిర్ణయంతో కెనడాకు నష్టం వాటిల్లే పరిస్థితి కనిపిస్తోంది.

- 'సర్' ఎఫెక్ట్

47 లక్షల పేర్లు తొలగింపు

- బిహార్ ఓటరు తుది జాబితా విడుదల చేసిన ఈసీ
- 7.89 కోట్ల నుంచి 7.42 కోట్లకు తగ్గిన రాష్ట్ర ఓటర్లు
- రాజధాని పట్నాలో కొత్తగా 1.63 లక్షల మంది



పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మంగళవారం ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. ముసాయిదా జాబితాలో 7.89 కోట్ల మంది ఓటర్లుండగా, తుది జాబితాలో ఓటర్ల సంఖ్య 7.42 కోట్లకు తగ్గింది. అంటే, ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ముగిశాక 47 లక్షల మంది పేర్లు తొలగింపునకు గురయ్యాయి. ఎస్ఐఆర్‌లో భాగంగా ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాపై అందిన అభ్యంతరాలు, దరఖాస్తులను ఇందులో పరిగణనలోకి తీసుకున్నామని ఈసీ తెలిపింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టిన అనంతరం తుది ఓటరు జాబితాను 30.09.2025న విడుదల చేసినట్లు బిహార్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఫేస్‌బుక్ పేజీలో ప్రకటించారు. voters. eci. gov. in అనే లింకుపై క్లిక్ చేయడం ద్వారా ఓటర్లు జాబితాలో తమ పేర్లను చూసుకోవచ్చని పేర్కొన్నారు. జూన్ 24వ తేదీన విడుదల చేసిన రాష్ట్ర జాబితాలో 7.90 కోట్ల ఓటర్లున్నారు. పేర్కొన్న చిరునామాలో లేకపోవడం, వేరే చోటుకు వెళ్లిపోవడం, మృతి చెందడం వంటి కారణాలతో 65 లక్షల మందిని తొలగించాక ఆగస్టు ఒకటో తేదీన విడుదల చేసిన ముసాయిదాలో 7.24 కోట్లకు తగ్గాయి. తుది జాబితాలో 21.53 లక్షల ఓటర్ల పేర్లను కొత్తగా చేర్చి, 3.66 లక్షల పేర్లను తొలగించారు. దీంతో, సెప్టెంబర్ 30న విడుదల చేసిన ఫైనల్ లిస్టులో ఓటర్ల సంఖ్య 7.42 కోట్లుగా ఉంది. అయితే, తమ పరిధిలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముసాయిదా జాబితాతో పోలిస్తే 1.63 లక్షల మంది ఓటర్లు కొత్తగా చేరారని, మొత్తం ఓటర్ల సంఖ్య 48.15 లక్షలకు చేరుకుందని పట్నా జిల్లా యంత్రాంగం వెల్లడించింది. పట్నా జిల్లాలో 22.75 లక్షల మంది మహిళా ఓటర్లున్నట్లు వివరించింది. అత్యధికంగా దిఘా నియోజకవర్గంలో 4.56 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపింది.

వివాదాస్పదంగా ఎస్ఐఆర్

బిహార్‌లో దాదాపు 22 ఏళ్ల తర్వాత చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేయడం తెల్సిందే. ఓటరు జాబితాను అధికార ఎన్డీయేకు అనుకూలంగా మార్చుకునేందుకే ఈసీతో కలిసి బీజేపీ ఈ విధానాన్ని తీసుకువచ్చిందని సుప్రీంకోర్టుకు సైతం వెళ్లాయి. ఓట్ చోరీ జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కలిసి రాష్ట్రంలో ఓటర్ అధికార్ యాత్రను సైతం చేపట్టారు. అధికార పక్షం, ఈసీ మాత్రం ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించాయి.

ఓటరు జాబితా ఖరారు కావడంతో ఎన్నికల నిర్వహణకు ఈసీ సమాయత్త మవుతోంది. ఇందులో భాగంగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, కమిషనర్లు ఎస్ ఎస్ సంధు, వినీత్ జోషిలతో కలిసి అక్టోబర్ 4, 5వ తేదీల్లోపట్నా వెళ్లి ఎన్నికల సన్నద్ధతను సమీక్షించనున్నారు. పౌరసంఘాలు, రాజకీయ పార్టీల నేతలు, అధికారులతో సమావే శమవనున్నారు. అంతకుముందు ఎన్నికల పరిశీలకులతో 3న సమావేశం ఏర్పాటు చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీల ను 6, 7వ తేదీల్లో ఎన్నికల సంఘం త్వరలోనే ప్రకటించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

4న పట్నాకు ఈసీ

ట్రంప్ శాంతి మంత్రం

గాజాలో యుద్ధం ముగించడానికి '20 సూత్రాల శాంతి ప్రణాళిక'

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రతిపాదన
- ఆయుధాలు వదిలేసి లొంగిపోవాలని హమాస్‌కు షరతు
- ట్రంప్, టోనీ బ్లెయిర్ నేతృత్వంలో గాజా పునర్నిర్మాణం



నెతన్యాహుతో ట్రంప్ కరచాలనం

వాషింగ్టన్: కల్లోలిత గాజాలో సంక్షోభానికి, విధ్వంసానికి తెరదించి, శాంతిని నెలకొల్పడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలకమైన ప్రతిపాదన చేశారు. '20 సూత్రాల శాంతి ప్రణాళిక'ను తెరపైకి తెచ్చారు. సోమవారం వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సమావేశమయ్యారు. గాజా పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధాన్ని ముగించడమే ధ్యేయంగా ట్రంప్ ప్లాన్‌ను వైట్‌హౌస్ విడుదల చేసింది. ఈ ప్రణాళిక తమకు ఆమోదయోగ్యమేనని నెతన్యాహు ప్రకటించారు. ట్రంప్ ప్రయత్నాలకు మద్దతు ఇస్తున్నామని చెప్పారు. ఇక హమాస్ సైతం అంగీకరిస్తే గాజాలో యుద్ధం వెంటనే ఆగిపోతుందని ట్రంప్ స్పష్టంచేశారు. హమాస్ స్పందన కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. అంతా అనుకున్నట్లుగా జరిగితే పాలస్తీనాను స్వతంత్ర దేశంగా అధికారికంగా గుర్తించే అవకాశం లేకపోలేదని అమెరికా అధ్యక్షుడు సంకేతాలిచ్చారు. శాంతి ప్రతిపాదనపై 3 నుంచి 4 రోజుల్లోగా స్పందించాలని హమాస్‌కు డెడ్‌లైన్ విధించారు. లేకపోతే 'విషాదకరమైన ముగింపు' ఉంటుందని తేల్చిచెప్పారు.

స్వాగతించిన ఇస్లామిక్ దేశాలు

గాజా విషయంలో ట్రంప్ ప్లాన్‌ను ఈజిప్టు, జోర్డాన్, ఇండోనేషియా, పాకిస్తాన్, తుర్కియే, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) తదితర ఇస్లామిక్ దేశాలు స్వాగతించారు. ఈమేరకు మంగళవారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. గాజాలో శాంతి కోసం అమెరికాతో కలిసి పనిచేస్తామని ప్రకటించాయి. చైనా, రష్యా, భారత్‌తోపాటు పలు యూరప్ దేశాలు సైతం స్వాగతించాయి.

ప్రధాని నరేంద్ర మోదీ హర్షం

ట్రంప్ 20 సూత్రాల శాంతి ప్రణాళిక పట్ల భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. పాలస్తీనాతోపాటు ఇజ్రాయెల్ ప్రజల భద్రత, అభివృద్ధికి, శాశ్వత శాంతికి ఒక మార్గం ఏర్పడినట్లేనని, మొత్తం పశ్చిమాసియాకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు.

హమాస్‌కు మరణ శాసనమే!

గాజాలో శాంతి సాధన దిశగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన ప్రణాళికపై చర్చ మొదలైంది. దీనికి ఇజ్రాయెల్ వెంటనే అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు హమాస్ మాత్రం వేచిచూసే ధోరణితో ముందుకెళ్తోంది. ట్రంప్ ప్లాన్‌ను క్షుణ్నంగా అధ్యయనం చేయాల్సి ఉందని, ఇప్పుడే ఏమీ చెప్పలేమని అంటోంది. నిజానికి ట్రంప్ ప్లాన్ హమాస్‌కు మరణ శాసనమేనని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు.

ప్రణాళికలో కీలక అంశాలు

- ట్రంప్ ప్లాన్‌ను ఇజ్రాయెల్, హమాస్ అంగీకరిస్తే గాజాలో దాడులు వెంటనే ఆగిపోతాయి. తమ చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీలందరినీ 72 గంటల్లోగా హమాస్ మిలిటెంట్లు విడుదల చేయాలి. ఒకవేళ బందీల్లో ఎవరైనా మృతిచెంది ఉంటే వారి మృతదేహాలను ఇజ్రాయెల్‌కు అప్పగించాలి.
- బందీలకు విముక్తి లభించిన తర్వాత ఇజ్రాయెల్ జైళ్లలో జీవిత ఖైదు అనుభవిస్తున్న 250 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ ప్రభుత్వం విడుదల చేయాలి. 2023 అక్టోబర్ 7 తర్వాత ఇజ్రాయెల్ సైన్యం బంధించిన 1,700 మంది పాలస్తీనా పౌరులను సైతం విడుదల చేయాలి. గాజా నుంచి ఒక బందీ విడుదలైతే, అందుకు ప్రతిగా 15 మంది పాలస్తీనా పౌరులను ఇజ్రాయెల్ విడుదల చేయాల్సి ఉంటుంది.
- ట్రంప్ ప్రతిపాదనకు ఆమోదం లభించగానే ఇజ్రాయెల్ సేనలు దాడులు ఆపేసి గాజా నుంచి వెనక్కి వెళ్లిపోతాయి. గాజాలో ఇజ్రాయెల్ దళాలు ఖాళీ చేసిన స్థానంలోకి ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్(ఐఎస్ఎఫ్) చేరుతుంది. పాలస్తీనా ప్రజలకు భద్రత కల్పిస్తుంది, పాలస్తీనా పోలీసులకు శిక్షణ ఇస్తుంది.
- బందీలు క్షేమంగా ఇజ్రాయెల్‌కు చేరుకున్న తర్వాత హమాస్ మిలిటెంట్లు ఆయుధాలు విడిచిపెట్టి లొంగిపోవాలి. వారికి క్షమాభిక్ష ప్రసాదిస్తారు. ఒకవేళ మిలిటెంట్లు గాజాను వదిలేసి ఎక్కడికైనా వెళ్లిపోవాలని భావిస్తే అందుకు వారికి సహకారం లభిస్తుంది. అభ్యంతరం లేకపోతే గాజాలోనే ఉండిపోవచ్చు.
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్, బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ నేతృత్వంలోని 'బోర్డ్ ఆఫ్ పీస్' గాజాలో పరిపాలన, పునర్నిర్మాణాన్ని పర్యవేక్షిస్తుంది. గాజాను ఒక రియల్ ఎస్టేట్ వెంచర్‌గా అభివృద్ధి చేస్తారు.
- పునర్నిర్మాణం తర్వాత గాజా పరిపాలన బాధ్యతలను పాలస్తీనియన్ అథారిటీకి అప్పగిస్తారు. ఈలోగా పాలస్తీనియన్ అథారిటీలో సంస్కరణలు చేపట్టాల్సి ఉంటుంది.

నేడు ఆర్ఎస్ఎస్ శత వసంతాల వేడుక

ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవం, జాతీయవాద భావజాల వ్యాప్తి లక్ష్యంగా వందేళ్ల క్రితం ఆవిర్భవించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలు అక్టోబర్ 1న ఢిల్లీలో ఘనంగా జరగనున్నాయి. ఈ చరిత్రాత్మక వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఢిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాని పాల్గొని, ఆర్ఎస్ఎస్ వందేళ్ల ప్రస్థానానికి గుర్తుగా తపాలా బిళ్ల, నాణేన్ని విడుదల చేస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగిస్తారు. బ్రిటిష్ పాలనలో దేశ ప్రజల్లో జాతీయ భావాలను, క్రమశిక్షణను పెంపొందించే లక్ష్యంతో డాక్టర్ కేశవ్ బలిరాం హెడ్గేవార్ 1925లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారు.

సోనమ్‌ను వేటాడుతున్నారు

- అందులో భాగమే దేశద్రోహ ఆరోపణలు
- వాంగ్‌చుక్ దేశద్రోహి అయితే అవార్డులు ఎందుకిచ్చారు?
- ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా?
- సోనమ్ వాంగ్‌చుక్ సతీమణి గీతాంజలి ఆంగ్మో సవాల్



గీతాంజలి ఆంగ్మో

న్యూఢిల్లీ: కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కోసం పోరాటం చేస్తున్న తన భర్తను కేంద్ర ప్రభుత్వం వేటాడుతోందని, అందులో భాగంగానే ఆయనపై దేశద్రోహ చట్టం (ఎన్ఎస్ఏ) కింద తప్పుడు కేసులు పెట్టారని ఆయన సతీమణి గీతాంజలి ఆంగ్మో ఆరోపించారు. సోనమ్ వాంగ్‌చుక్‌పై నమోదుచేసిన కేసులపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని ప్రభుత్వ అధికారులకు సవాల్ చేశారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'వాంగ్‌చుక్‌తో ఇప్పటివరకు నన్ను మాట్లాడనివ్వలేదు. ఆయనపై మోపిన అభియోగాలకు సంబంధించిన పత్రాలు కూడా అధికారులు నాకు ఇవ్వలేదు. నన్ను కూడా దాదాపు గృహనిర్బంధంలో పెట్టినట్లుగా పరిస్థితులు కల్పించారు. వాంగ్‌చుక్‌పై ఎన్ఎస్ఏ ప్రయోగించాల్సిన అవసరం లేదు. అధికారులు ఒకేవైపు మాట్లాడుతున్నారు. ఒకరకంగా ఆయనను వేటాడుతున్నారు. ఆయన దేశద్రోహి అయితే భారత ప్రభుత్వం ఆయనకు ఎందుకు అనేక అవార్డులు ఇచ్చింది? లడక్‌కు రాష్ట్రహోదా ఇవ్వాలని, దానిని రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని సోనమ్ వాంగ్‌చుక్ నేతృత్వంలో జరుగుతున్న ఉద్యమాన్ని బలహీనపర్చేందుకే ఇదంతా చేస్తున్నారు'అని గీతాంజలి ఆరోపించారు. లద్దాఖ్‌కు రాష్ట్రహోదా కోసం ఈ నెల 24న లేహ్‌లో నిర్వహించిన నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారి నలుగురు వ్యక్తులు చనిపోయిన విషయం తెలిసిందే. ఉద్యమకారులను వాంగ్‌చుక్ రెచ్చగొట్టడం వల్లే ఈ ఘటన జరిగిందని ఆరోపిస్తూ పోలీసులు ఆయనను అరెస్టు చేసి రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైల్లో నిర్బంధించారు.

వాంగ్‌చుక్ చుట్టూ కుట్ర

సోనమ్‌వాంగ్‌చుక్ కార్యకలాపాలపై ప్రజల్లో అనుమానాలు రేకెత్తేలా పనిగట్టుకొని కొందరు ప్రచారం చేస్తున్నారని గీతాంజలి ఆరోపించారు. 'మా సంస్థ హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ లెర్నింగ్ (హెచ్ఐఏఎల్)కు సంబంధించిన అన్ని పత్రాలను సీబీఐ, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అందించాం. అయినా ఆయన కార్యకలాపాలపై అనుమానాలు రేకెత్తించేలా ప్రచారం జరుగుతోంది. వాంగ్‌చుక్‌కు మెగసెసె అవార్డు రావటంపై కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆ అవార్డును తీసుకోవటం తప్పు అన్నట్లుగా ఎందుకు మాట్లాడుతున్నారు? దాదాపు 60 మంది భారతీయులకు మెగసెసె వచ్చింది. వారిలో 20 మందికి భారత ప్రభుత్వం పద్మ అవార్డులు కూడా ఇచ్చింది. అంటే భారత ప్రభుత్వం దేశద్రోహులకు పద్మ అవార్డులు ఇచ్చిందా?'అని నిలదీశారు. లద్దాఖ్‌లో పాకిస్తాన్ జాతీయులు ప్రవేశించటం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమేనని స్పష్టం చేశారు. 'లద్దాఖ్‌లో పాకిస్తానీలు ఉన్నట్లు వాళ్లు (అధికారులు) గుర్తిస్తే.. పొరుగు దేశం వాళ్లను మనదేశంలోకి అక్రమంగా ఎందుకు రానిచ్చారు. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సింది వాంగ్‌చుక్ కాదు. కేంద్ర హోంశాఖ. 24న హింస జరుగుతున్నప్పుడు వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్షలో ఉన్నారు. అక్కడ ఏం జరుగుతుందో కూడా ఆయనకు తెలియదు. ఆ ఘటనకు లద్దాఖ్ అధికార యంత్రాంగం బాధ్యత వహించాలి'అని స్పష్టంచేశారు. గత ఏడేళ్లలో వాంగ్‌చుక్ పరిశోధనల వల్ల ప్రజలకు ఎంతో మేలు జరిగిందని గీతాంజలి తెలిపారు. 'హెచ్ఐఏఎల్ పరిశోధనల ద్వారా ఆవిష్కరించిన సౌరశక్తితో వెచ్చగా ఉండే భవనాలు, ఐస్ స్తూపం ప్రాజెక్టులకు కేంద్రం అవార్డులు కూడా ఇచ్చింది. గత ఏడేళ్లలో 1,80,000 చదరపు అడుగుల సోలార్ హీటెడ్ భవనాలు నిర్మించారు. వాటివల్ల నెలకు 4,000 టన్నుల కార్బన్ ఆదా అవుతోంది. ఈ సాంకేతికత ప్రపంచంలో ఎక్కడా లేదు. ఇలాంటి పనులను మెచ్చుకోకపోతే దేశం విశ్వగురు ఎలా అవుతుంది?'అని ప్రశ్నించారు.

బీజేపీ సీనియర్ నేత వీకే మల్హోత్రా కన్నుమూత



న్యూఢిల్లీ: బీజేపీ కురువృద్ధ నేత విజయ్ కుమార్ మల్హోత్రా(93) కన్నుమూశారు. వయోసంబంధ రుగ్మతలతో గత కొద్ది రోజులుగా ఎయిమ్స్‌లో ఆయన చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం ఆయన కన్నుమూశారు. మల్హోత్రా మృతదేహాన్ని ఆయన అధికార నివాసానికి తరలించారు. ప్రధాని మోదీ వెళ్లి నివాళులర్పించారు. మల్హోత్రా మృతి పట్ల రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఢిల్లీ బీజేపీకి మొట్టమొదటి అధ్యక్షుడిగా పనిచేసిన మల్హోత్రా, ఢిల్లీ నుంచి ఐదు పర్యాయాలు ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999 లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణ ఢిల్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న మన్మోహన్ సింగ్‌ను ఓడించారు. 2004లో మన్మోహన్ ప్రధాని కావడం తెల్సిందే.

పీఓకేలో సడలని ఉద్రిక్తతలు

ముజఫరాబాద్: పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ప్రజల ఆందోళనలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ప్రాథమిక హక్కుల సాధన కోసం ప్రజలు పోరుబాట పట్టారు. సోమవారం భద్రతా దళాల కాల్పుల్లో ఇద్దరు సామాన్య పౌరులు మరణించిన సంగతి తెలిసిందే. ఆందోళన కార్యక్రమాలను అణచివే యడానికి ప్రభుత్వం భారీగా భద్రతా దళాలను రంగంలోకి దించింది. పీఓకేలోని ముజఫరాబాద్, రావల్‌కోట్, హజీరా, అబ్బా స్పూర్, ధైగాలా, పనియోలా, తరార్‌ఖేల్ తదితర పట్టణాల్లో నిరసనలు కార్యక్రమాలు మొదలయ్యాయి.



ఎన్నూర్ థర్మల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

- కూలిన నిర్మాణంలో ఉన్న వలయాకృతి
- 9 మంది ఉత్తరాది కార్మికులు మృతి
- 15 మందికి గాయాలు

సాక్షి, చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నై శివారులోని ఎన్నూర్ థర్మల్ ప్లాంట్‌లో మంగళవారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. వలయం ఆకారంలో జరుగుతున్న నిర్మాణంలోని ఓ భాగం కూలిపోయింది. ఈ ఘటనలో తొమ్మిది మంది ఉత్తరాది కార్మికులు మరణించారు. తిరువళ్లూరు జిల్లా మీంజూరు ఊరనంపేడు గ్రామంలోని వాయలూరు వద్ద ఎన్నూర్ థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ రూ.7 వేల కోట్లతో 1,320 మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా రెండు యూనిట్లు నిర్మిస్తున్నారు. ఇందులో నాలుగో యూనిట్ వద్ద వలయం ఆకారంలో నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. 50 మందికి పైగా కార్మికులు పనుల్లో నిమగ్నమయ్యారు. 30 అడుగుల ఎత్తులో నిర్మాణంలో ఉన్న ఓ భాగం మంగళవారం కుప్పకూలింది. పైభాగంలో ఉన్న కొందరు కిందపడిపోయారు. అప్పటికే కింద ఉన్న మరికొందరు శిథిలాల్లో చిక్కుకున్నారు. ఘటనా స్థలంలోనే నలుగురు కార్మికులు మరణించారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మరో ఐదుగురు మృతిచెందారు. పదిహేను మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో పది మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరణించిన, గాయపడిన కార్మికులంతా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారే. వీరికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పోలీసులు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చెన్నై స్టాన్లీ జీహెచ్ మార్చురీకి తరలించారు.

గాజాపై ఆగని ఇజ్రాయెల్ దాడులు

- మరో 31 మంది పాలస్తీనియన్లు మృతి
- ట్రంప్ శాంతి ప్రతిపాదనపై అనుమానాలు

గాజా సిటీ: గాజా వ్యాప్తంగా మంగళవారం కూడా ఇజ్రాయెల్ దాడులు కొనసాగాయి. వైమానిక దాడులు, కాల్పుల ఘటనల్లో 31 మంది పాలస్తీనియన్లు చనిపోయినట్లు వివిధ ఆస్పత్రులు తెలిపాయి. నెట్‌జరిమ్ కారిడార్ వద్ద ఏర్పాటైన ఆహార పంపిణీ కేంద్రం వద్దకు చేరిన వారిపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన కాల్పుల్లో 17 మంది చనిపోగా 33 మంది గాయపడినట్లు అల్ ఔదా ఆస్పత్రి తెలిపింది. నుసెయిరత్ శరణార్థి శిబిరంలోని ఓ టెంటుపై జరిగిన మరో దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. మువాసిలో శరణార్థులుండే రెండు టెంట్లపై ఇజ్రాయెల్ బాంబులు వేసింది. ఒక ఘటనలో నలుగురు మహిళలు, చిన్నారి సహా ఏడుగురు, మరో ఘటనలో..ఏడు నెలల గర్భవతి, చిన్నారి సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అయితే, గడిచిన 24 గంటల వ్యవధిలో గాజాలో 160కి పైగా హమాస్ లక్ష్యాలపై దాడులు జరిపి పలువురు మిలిటెంట్లను చంపామని, ఆయుధాల గిడ్డంగుల్ని, నిఘా పోస్టులను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. ఈ పరిణామం...గాజాలో రెండేళ్లుగా సాగుతున్న యుద్ధానికి ముగింపు పలుకుతామంటూ సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సమక్షంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన శాంతి ప్రతిపాదనపై పాలస్తీనా ప్రజల్లో అనుమానాలు రేపుతోంది. 'ఇది శాంతి ప్రణాళిక కాదు..లొంగుబాటు ప్రణాళిక. మమ్మల్ని మళ్లీ వలస పాలనలోకి నెట్టే ప్రయత్నం'అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇండోనేసియాలో కూలిన స్కూలు భవనం

- ముగ్గురు మృతి, 77 మందికి గాయాలు
- శిథిలాల కింద 38 మంది విద్యార్థులు
- వారిని కాపాడేందుకు ఆక్సిజన్‌ను, నీళ్లను పంపిస్తున్న యంత్రాంగం
- శరవేగంగా కొనసాగుతున్న రక్షణ, సహాయక చర్యలు

సిడోఅర్జో: ఇండోనేసియాలోని తూర్పుజావా ప్రావిన్స్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సిడోఅర్జో పట్టణంలోని అల్ ఖొజిని ఇస్లామిక్ బోర్డింగ్ స్కూలు భవనం మంగళవారం మధ్యాహ్నం కుప్పకూలింది. ఘటనలో ముగ్గురు చనిపోగా 99 మంది ప్రాణాలతో బయటపడ్డారు. క్షతగాత్రుల్లో 77 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరో 38 మంది జాడ తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం అధికారులు ఆక్సిజన్, మంచినీరును లోపలికి పంపిస్తున్నారు. మరో వైపు, సహాయక చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. మధ్యాహ్న ప్రార్థనల సమయంలో ఘటన చోటుచేసుకుందని చెబుతున్నారు. ఘటన జరిగిన 8 గంటల తర్వాత గాయపడిన 8 మంది విద్యార్థులను శిథిలాల నుంచి బయటకు తీసుకువచ్చారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని చెబుతున్నారు. విద్యార్థులంతా 12–18 ఏళ్ల లోపు వారే. బరువైన కాంక్రీట్ స్లాబులు, ఇతర శిథిలాలతోపాటు భవనంలో కదలికల కారణంగా రక్షణ చర్యలకు విఘాతం కలుగుతోంది. భారీ యంత్ర సామగ్రి అందుబాటులో ఉన్నప్పటికీ మరింత ప్రమాదం జరుగుతుందనే భయంతో ఉపయోగించలేకపోతున్నామని రక్షణ చర్యలకు సారథ్యం వహిస్తున్న నసంగ్ సిగిట్ తెలిపారు.

అప్పట్లో మమ్మల్ని అమెరికాయే అడ్డుకుంది

- ముంబై పేలుళ్లకు ప్రతీకారం తీర్చుకోనివ్వలేదు
- మాజీ హోం మంత్రి చిదంబరం వ్యాఖ్య

న్యూఢిల్లీ: 2008లో ముంబైలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకోకుండా యూపీఏ ప్రభుత్వంపై అంతర్జాతీయంగా తీవ్ర ఒత్తిళ్లు వచ్చాయని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ హోం మంత్రి పి.చిదంబరం తెలిపారు. ముఖ్యంగా అమెరికా ప్రభావం, విదేశాంగ శాఖ విధానం వల్లే మిన్నకుండిపోవాల్సి వచ్చిందన్నారు. ప్రతీకారం తీర్చుకోవాలని తనకు లోలోపల ఉన్నప్పటికీ ప్రభుత్వం సైనికపరమైన ప్రతిచర్యకు విముఖంగా ఉందని ఓ వార్తా చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. దాదాపు 175 మంది ప్రాణాలను బలి తీసుకున్న కొద్ది రోజులకే హోం మంత్రిగా తాను బాధ్యతలు తీసుకున్నానన్నారు. యుద్ధానికి దిగవద్దంటూ ప్రపంచ దేశాల నేతలు ప్రభుత్వంపై ఒత్తిళ్లు తెచ్చారన్నారు. 'అప్పటి అమెరికా విదేశాంగ మంత్రి కండోలిజా రైస్ నేను బాధ్యతలు తీసుకున్న రెండు మూడు రోజుల్లోనే ఢిల్లీకి వచ్చారు. ప్రధాని మన్మోహన్ సింగ్‌ని, నన్ను కూడా కలిశారు. 'దయచేసి రియాక్షన్ తీసుకోకండి'అని ఆమె కోరారు. ఇందుకు సంబంధించిన నిర్ణయాన్ని తీసుకోవాల్సింది ప్రభుత్వమేనని ఆమెకు చెప్పాను. పాక్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని బలంగా అనిపిస్తున్నా ఆ విషయం ఆమెకు తెలియపర్చలేదు. బదులు తీర్చుకునే విషయమై ప్రధానితోపాటు సంబంధిత వర్గాలతో సంప్రదించా'అని చిదంబరం వెల్లడించారు.

అడ్డుకున్నది ఎవరు?

కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం వ్యాఖ్యలపై బీజేపీ ఘాటుగా స్పందించింది. విదేశాల ఒత్తిళ్ల వల్లే ముంబై దాడుల విషయంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించిన విషయం అందరికీ తెల్సిందేనని పేర్కొంది. అయితే, పాక్‌పై ప్రతిచర్యలు తీసుకోకుండా అడ్డుకున్నది సోనియా గాంధీనా లేక ప్రధాని మన్మోహన్ సింగా అని ప్రశ్నించింది.

విద్యార్థులకు డిజిటల్ లిటరసీ ముఖ్యం

- చదువులో రాణిస్తున్న గృహిణులు, ఖైదీలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి
- అంబేడ్కర్ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- బంగారు పతకాలు అందుకున్న ఇద్దరు ఖైదీలు


గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న గవర్నర్. చిత్రంలో ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్ (హైదరాబాద్): విద్యాభ్యాసం, అవకాశాలను అందిపుచ్చుకోవడంలో నేటి మహిళలు, జైళ్లలో ఉంటున్న ఖైదీలు సైతం ముందుండటం గొప్ప విషయమని గవర్నర్, వర్సిటీ చాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. వీరిని యువత స్ఫూర్తిగా తీసుకుని గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మంగళవారం జరిగిన డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 26వ స్నాతకోత్సవంలో గవర్నర్ మాట్లాడారు. ప్రతిభ గల విద్యార్థులకు అనేక అవకాశాలు ఉన్నాయని, చదువుతోపాటు పరిశ్రమకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం, డిజిటల్ లిటరసీ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ఉద్యోగం చేస్తూ చదువుకోవడం, గృహిణులు, సీనియర్ సిటిజన్లు, వికలాంగులు, పేద విద్యార్థులు, ఖైదీలకు అంబేద్కర్ వర్సిటీ ఓ గొప్ప అవకాశం కల్పిస్తోందని చెప్పారు. ఈ రోజు ఈ ప్రాంగణంలో ఉన్న విద్యార్థులతోపాటు ఖైదీలు కూడా పట్టభద్రులు కావడం సంతోషంగా ఉందని, ఇది వారిలో పరివర్తనకు నాంది కానుందని పేర్కొన్నారు.

కీలక శక్తిగా దూర, డిజిటల్ విద్య

ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమా కాంజీలాల్ మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం కీలక భూమిక పోషిస్తోందన్నారు. దేశ విద్యావ్యవస్థను రూపొందించడంలో దూర, డిజిటల్ విద్య కీలక శక్తిగా మారాయన్నారు. అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిధిలోని రిటైలర్స్ అసోసియేషన్, స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో 'ఉపకారవేతనంతో కూడిన అప్రెంటిష్ ప్రోగ్రామ్' కోసం ఎంఓయూ కుదుర్చుకున్నామన్నారు. డిగ్రీ పూర్తిచేయని పోలీస్ సిబ్బంది ఉద్యోగంలో ఉండగానే తమ డిగ్రీ కోర్సులు పూర్తి చేసేందుకు వీలు కల్పిస్తూ ప్రత్యేకంగా కోర్సును డిజైన్ చేశామని వెల్లడించారు.

గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్

తెలుగు సాహిత్యానికి చేసిన సేవలకు గాను ప్రఖ్యాత గేయ రచయిత, కవి గోరటి వెంకన్నకు, శాంతి విద్యా ప్రచారకులు, పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంపొందించి, నేరాలు తగ్గించడానికి కృషి చేసిన రచయిత ప్రేమ్ రావత్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గౌరవ డాక్టరేట్లు అందించారు. మొత్తం 203 మంది ఖైదీలు డిగ్రీ పూర్తి చేసుకున్నారని, వీరిలో ఇద్దరు ఖైదీలకు గోల్డ్ మెడల్స్ దక్కాయని వీసీ చెప్పారు

మెడికల్ పీజీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

- ఇన్‌సర్వీస్, నాన్‌సర్వీస్ అభ్యర్థుల రిజిస్ట్రేషన్‌కు ఆన్‌లైన్ ద్వారా అవకాశం
- తెలంగాణలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారికి మాత్రమే స్టేట్ కోటాలో సీట్లు

సాక్షి, హైదరాబాద్: మెడికల్ పీజీ, డిప్లొమా కోర్సుల్లో 2025–26 విద్యా సంవత్సరం కింద ప్రవేశాల కోసం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (కేఎన్ఆర్‌యూహెచ్ఎస్) మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని పీజీ మెడికల్ కళాశాలల్లో ప్రవేశానికి కన్వీనర్ కోటా కింద అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. నీట్ పీజీ–2025లో అర్హత సాధించిన ఇన్‌సర్వీస్ (ప్రభుత్వ వైద్యులుగా ఉన్న వారు), నాన్ సర్వీస్ అభ్యర్థులు ఈ మేరకు బుధవారం ఉదయం 8 గంటల నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. కాగా తెలంగాణలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం నుంచి ఫైనల్ ఇయర్ వరకు చదివిన వారితోపాటు, పునర్విభజన చట్టానికి లోబడి విజయవాడ సిద్ధార్థ కళాశాలలో ఎంబీబీఎస్ చదివిన తెలంగాణ స్థానికత గలవారు మాత్రమే కన్వీనర్ కోటాలో తెలంగాణలోని మెడికల్ పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు అర్హులు. తెలంగాణలో లోకల్ విద్యార్థులు అయ్యి, ఇంటర్ వరకు రాష్ట్రంలోనే చదివినా, ఎంబీబీఎస్ కోర్సును ఇతర రాష్ట్రాలు, దేశాల్లో పూర్తి చేస్తే తెలంగాణ స్టేట్ కోటాలో సీట్లు పొందేందుకు అనర్హులు. అయితే సీట్ల కేటాయింపులు రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు, మార్గదర్శకాలకు కట్టుబడి ఉంటాయని యూనివర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. కాగా 2024–25 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మొత్తం 2,548 సీట్లు ఉండగా, ఈ సంవత్సరం కొన్ని కళాశాలల్లో సీట్ల సంఖ్య పెరిగినట్టు సమాచారం. యూనివర్సిటీ విడుదల చేసే తుది మ్యాట్రిక్స్ ప్రకారం మొత్తం అందుబాటులో ఉన్న సీట్లలో 50 శాతం సీట్లు ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ) కింద కేటాయిస్తారు. మిగతా 50 శాతం సీట్లు రాష్ట్ర కోటాలో తెలంగాణ విద్యార్థులకు లభిస్తాయి. పూర్తి వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంటాయని రిజిస్ట్రార్ తెలిపారు.

తెలంగాణ విద్యావిధానంపై ఉప కమిటీల ఏర్పాటు

ఐఏఎస్ అధికారులు కన్వీనర్‌గా గ్రూప్‌లు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యా విధానం అధ్యయన ప్రక్రియలో మరో అడుగుపడింది. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ మంగళవారం ఆన్‌లైన్‌లో భేటీ అయింది. పలు అంశాల్లో విద్యా విధానం ఎలా ఉండాలనే దిశగా కమిటీ సభ్యులు తమ అభిప్రాయాలు తెలిపారు. అయితే, లోతైన అధ్యయనం అవసరమని భావించి సబ్ కమిటీలను ఏర్పాటు చేశారు. వీటిల్లో వివిధ స్వచ్ఛంద సంస్థలకు చోటు కల్పించారు. మొత్తం 11 గ్రూపులుగా విభజించి, ఒక్కో గ్రూపునకు ఐఏఎస్ అధికారిని కన్వీనర్‌గా, పలు విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లను కో–కన్వీనర్లుగా నియమించారు. ఈ ఉప కమిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఎన్‌జీవోలు సభ్యులుగా ఉంటారు. వీళ్లంతా ఆయా విభాగాల్లో పరిశీలన చేసి, ప్రధాన కమిటీకి నివేదిక ఇస్తారు. ఈ నెలాఖరులోగా తెలంగాణ విద్యా విధానంపై కేశవరావు కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. కొత్తగా ఏర్పాటు చేసిన గ్రూపుల్లో విద్యారంగానికి కావాల్సిన మౌలిక వసతులు, టెక్నాలజీ, డిజిటల్ విధానం, బోధన ప్రణాళిక, సంస్కృతి, విలువలు, భాష, గవర్నెన్స్, ఫైనాన్సింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై ఉప కమిటీలను ఏర్పాటు చేశారు.

గ్యారంటీలకు టాటా

లంకె బిందెల వేటలో రేవంత్‌రెడ్డి

సిద్దిపేటలో కాంగ్రెస్ బాకీ కార్డుల విడుదల సందర్భంగా మాజీమంత్రి హరీశ్‌రావు



సాక్షి, సిద్దిపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వంద రోజుల్లోనే గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. 700 రోజులైన అమలు చేయడం లేదని, గ్యారంటీలకు టాటా చెప్పి.. లంకె బిందెల వేటలో సీఎం పడ్డారని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. మొదటి కేబినెట్ లోనే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తెస్తామని.. 30 కేబినెట్ సమావేశాలైన ఊసే లేదన్నారు. మంగళవారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ బాకీ కార్డులను హరీశ్‌రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను గ్యారంటీల అమలుపై నిలదీయాలన్నారు. కాంగ్రెస్ భరోసా కార్డు..ఇప్పుడు బాకీ కార్డు అయ్యిందని చెప్పారు.

గజినీకాంత్ అయ్యారు: ఎన్నికల ముందు రజినీకాంత్.. ఎన్నికల తర్వాత రేవంత్‌రెడ్డి గజినీకాంత్ అయ్యారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో గ్యారంటీలను అమలు చేస్తామని బాండ్ పేపర్లను రేవంత్‌రెడ్డి, భట్టి పేర్లతో రాసి ఇచ్చి బాండ్ పేపర్ల ఇజ్జత్ తీశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు గురించి ఎవరైనా అడుగుతారేమో అని రాహుల్‌గాంధీ తెలంగాణ మొహం చూడటం లేదని ఆరోపించారు. మంత్రులకు దమ్ముంటే పోలీసులు లేకుండా ప్రజల్లో తిరగాలన్నారు. కేసీఆర్ తొమ్మిదేళ్లలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ.20 వేల కోట్లు చెల్లించగా, రేవంత్ రెండేళ్లలో ఒక్క రూపాయి చెల్లించలేదన్నారు.

మీరు చేసిన బాకీకే మేం వడ్డీలు కడుతున్నాం

బాకీల గురించి మాట్లాడితే ప్రథమ ముద్దాయి కేసీఆరే

టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రాన్ని చూపించి బీఆర్ఎస్ అడ్డగోలుగా చేసిన బాకీలకు వడ్డీలను కాంగ్రెస్ ప్రభుత్వమే కడుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. బాకీలు, బకాయిల గురించి మాట్లాడితే మాజీ ముఖ్యమంత్రి కేసీఆరే ప్రథమ ముద్దాయి అవుతాడని, ఇప్పుడు ఆ పార్టీ నేతలు బకాయి కార్డు పేరుతో ప్రచారం చేస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఎద్దేవా చేశారు. మంగళవారం గాంధీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు మెట్టు సాయికుమార్, నూతి శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ బకాయి కార్డు వ్యవహారం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ చేసినన్ని బాకీలు, హామీల విస్మరణలు ప్రపంచంలో ఎవరూ చేయలేరేమోనని వ్యాఖ్యానించారు. 'నిరుద్యోగుల కలలు సాకారం చేస్తే, రైతు భరోసా ఇస్తే, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తే, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తే, వరికి బోనస్ ఇస్తే, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే, ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేస్తే, ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుంటే బకాయి పడ్డట్టా?' అని ప్రశ్నించారు. కాళేశ్వరం, ఫార్ములా ఈ–రేసుతోపాటు అనేక స్కాంలు వెలుగు చూస్తూ బీఆర్ఎస్ బండారం బయటపడుతుంటే ఏం చేయాలో దిక్కుతోచక బాకీ కార్డు అంటూ ప్రజల్లోకి వెళ్లాలని చూస్తున్నారన్నారు. బీసీ బిల్లుల గురించి ప్రధాని మోదీని అడిగే దమ్ము, ధైర్యం ఈటల రాజేందర్, బండి సంజయ్, ధర్మపురి అరవింద్‌లకు లేదా అని ప్రశ్నించారు.

అంతా ఆన్‌లైన్‌లోనే!

మద్యం షాపులకు దరఖాస్తుల నుంచి లాటరీ ఎంట్రీ ఫారం వరకు..

సాక్షి, హైదరాబాద్: మద్యం షాపులకు టెండర్ల ప్రక్రియను ఎక్సైజ్ శాఖ సులభతరం చేసింది. ఇందుకోసం ఈ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ చేసింది. ఇందు లో 34 ఎక్సైజ్ జిల్లాల గెజిట్స్‌ను పొందుపర్చడంతో పాటు దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవడం, మద్యం షాపుల రిజర్వేషన్ వివరాలు, టెండర్లలో పాల్గొనే మార్గదర్శకాలన్నీ ఎక్సైజ్ శాఖ అధికారిక వెబ్‌సైట్ అయిన tgbcl. telangana.gov.inలో పొందుపరిచింది. మద్యం షాపుల రిజర్వేషన్లు, దరఖాస్తుఫారం, దరఖాస్తు చేసిన రశీదుతో పాటు లాటరీలో పాల్గొనే ఎంట్రీ పాస్‌ను కూడా ఆన్‌లైన్‌లో పొందవచ్చని, తద్వారా మద్యం వ్యాపారులు, ఔత్సాహికులు ఎక్సైజ్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.



రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సరూర్‌నగర్ మైదానంలో నిర్వహించిన బతుకమ్మ కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిన నేపథ్యంలో మంగళవారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, పర్యాటక శాఖ ఎండీ క్రాంతి



వరంగల్ నగరంలోని రంగలీలా మైదానంలో మంగళవారం రాత్రి సద్దుల బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. వరంగల్ పరిధిలోని కాలనీల మహిళలు అందమైన బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు.
- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, వరంగల్


భారీ రైల్ ఓవర్ రైల్ వంతెన

డోర్నకల్ జంక్షన్ వద్ద పదిన్నర కి.మీ.నిడివితో ఆర్ఓఆర్

రూ.320 కోట్లతో నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్

విజయవాడ-కాజీపేట గ్రాండ్ ట్రంక్ రూట్, డోర్నకల్-భద్రాచలం రూట్ అనుసంధానం

త్వరలో టెండర్లు పిలిచేందుకు రైల్వేశాఖ ఏర్పాట్లు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్-విజయవాడ గ్రాండ్ ట్రంక్ రూట్‌లో ఉన్న డోర్నకల్ జంక్షన్ వద్ద భారీ రైల్ ఓవర్ రైల్ (రైలు మార్గాన్ని క్రాస్ చేసే రైలు మార్గపు వంతెన–ఆర్ఓఆర్) వంతెనకు కేంద్రప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దాదాపు రూ.320 కోట్ల వ్యయంతో ఏకంగా పదిన్నర కిలోమీటర్ల నిడివితో దీన్ని నిర్మిస్తారు. డోర్నకల్ నుంచి భద్రాచలం వైపు వెళ్లే రైలు మార్గంతో, విజయవాడ వైపు నుంచి డోర్నకల్ వైపు వచ్చే ప్రధాన రైలు మార్గాన్ని అనుసంధానిస్తూ ఈ ఆర్ఓఆర్ వంతెన నిర్మిస్తారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు రైల్వే శాఖ ఏర్పాట్లు చేస్తోంది. మూడేళ్లలో అందుబాటులోకి తేనున్నారు.

ఎందుకిది..?

➤ కాజీపేట–విజయవాడ రైలు మార్గం ఉత్తర–దక్షిణ భారత్‌లను అనుసంధానించే గ్రాండ్ ట్రంక్ రూట్. ఇది అత్యంత రద్దీ ఉండే రైలు మార్గం. ప్రస్తుతం ఈ మార్గంలో మూడో లైన్ నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. త్వరలో దాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోనున్నారు. అయితే భవిష్యత్తులో రైళ్ల రద్దీ మరింత పెరుగుతుందనే అంచనాతో ఈ మార్గంలో నాలుగో లైన్ కూడా మంజూరైంది. దాని పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇక డోర్నకల్ నుంచి భద్రాచలం–మణుగూరు లైను కూడా ప్రారంభమవుతుంది. ఇది ప్రస్తుతం సింగిల్ లైనే అయినప్పటికీ, త్వరలో రెండో లైను నిర్మాణాన్ని ప్రారంభించనున్నారు. వెరసి అటు గ్రాండ్ ట్రంక్ రూట్‌లో, ఇటు డోర్నకల్–భద్రాచలం మార్గంలో రైళ్ల సంఖ్య భవిష్యత్తులో భారీగా పెరుగుతుంది. అయితే కాజీపేట–డోర్నకల్ మీదుగా గ్రాండ్ ట్రంక్ రూట్‌లో వచ్చి భద్రాచలం వైపు వెళ్లే రైళ్లు ఎలాంటి అంతరాయం లేకుండా నేరుగా వెళ్లిపోతాయి. అదే విజయవాడ వైపు నుంచి వచ్చి భద్రాచలం వైపు వెళ్లాలంటే, గతంలో డోర్నకల్ స్టేషన్‌లోకి వచ్చి అక్కడ ఇంజిన్‌ను రివర్స్ చేసుకుని డోర్నకల్ మార్గంలోకి క్రాస్ అయి ముందుకు సాగాల్సి వచ్చేది. దీంతో కొన్నేళ్ల క్రితమే డోర్నకల్ స్టేషన్ కంటే ముందే భద్రాచలం వైపు బైపాస్ లైన్ నిర్మించారు. విజయవాడ వైపు నుంచివచ్చే రైళ్లు భద్రాచలం వైపు వెళ్లాలంటే డోర్నకల్ స్టేషన్‌లోకి వెళ్లాల్సిన అవసరం లేకుండా కుడి వైపు ఈ బైపాస్ లైన్ మీదుగా భద్రాచలం వైపు వెళ్తాయి. ఇప్పుడు రెండు, మూడు లైన్లు నిర్మితమైనందున.. విజయవాడ వైపు వచ్చి భద్రాచలం వైపు ఈ బైపాస్ లైన్ మీదుగా వెళ్లాలంటే, రెండు, మూడో లైన్లను క్రాస్ చేస్తూ కుడివైపు వెళ్లాలి. అప్పుడు ఎదురుగా డోర్నకల్ నుంచి విజయవాడ వైపు వేరే రైళ్లు వెళ్లాలంటే.. ఏదో ఓ లైన్ మీద ఉన్న రైళ్లను క్రాసింగ్ కోసం ఆపాల్సి వస్తోంది. రద్దీ కారణంగా కొన్ని సందర్భాల్లో రెండు గంటల పాటు కూడా నిలిచిపోవాల్సిన దుస్థితి ఉంది. ముఖ్యంగా సరుకు రవాణా రైళ్లను ఎక్కువ సేపు ఆపేస్తున్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే వంతెన నిర్మించి దాని మీదుగా రైళ్లను మళ్లించాల్సి ఉంటుంది.

మూడేళ్ల క్రితమే ప్రతిపాదనలు

➤ దక్షిణ మధ్య రైల్వే అధికారులు దాదాపు మూడేళ్ల క్రితమే దాన్ని ప్రతిపాదించారు. దానికి ఫీజిబిలిటీ, ఫైనల్ లొకేషన్ సర్వేలు పూర్తయి, డీపీఆర్ సిద్ధం చేసి, మంజూరయ్యే సరికి ఇంత కాలం పట్టింది. ఇప్పుడు దానికి కేంద్రప్రభుత్వం పచ్చజెండా ఊపటంతో వచ్చే బడ్జెట్‌లో నిధులు మంజూరు కానున్నాయి. ఈలోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ప్రాథమిక పనులు ప్రారంభిస్తారు. ప్రయాణికుల రైళ్లు, సరుకు రవాణా రైళ్ల సంఖ్యను పెంచటంతోపాటు ఉన్న రైళ్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ వంతెన బాగా ఉపకరిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

టిమ్స్‌కు స్వయం ప్రతిపత్తి

క్లినికల్, నాన్ క్లినికల్ విభాగాల నడుమ స్పష్టమైన పని విభజన

అధికారులకు దిశానిర్దేశం చేసిన మంత్రి దామోదర



సాక్షి, హైదరాబాద్: నిర్మాణంలో ఉన్న టిమ్స్ (తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆస్పత్రులకు స్వయం ప్రతిపత్తి కల్పించనున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. నిమ్స్‌కు ఉన్న స్వయం ప్రతిపత్తి తరహాలోనే సనత్‌నగర్, కొత్తపేట, అల్వాల్, వరంగల్ టిమ్స్ ఆస్పత్రులకు కూడా ఉంటుందన్నారు. ఈ ఆస్పత్రులను ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఏఐజీ, అపోలో, యశోద, నిమ్స్, ఎయిమ్స్ ఆస్పత్రుల తరహాలో పరిశుభ్రత, పేషెంట్ కేర్‌కు సమప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. త్వరలో సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులతో మంత్రి సమీక్షించారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్, డీఎంఈ నరేంద్రకుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్, ప్రొఫెసర్ విమలాథామస్ తదితరులు పాల్గొన్నారు. అధికారులు తయారు చేసిన నివేదికలోని అంశాలను మంత్రికి వివరించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో క్లినికల్, నాన్ క్లినికల్ విభాగాలు పనిచేస్తున్న విధానం, డాక్టర్లు, సిబ్బంది సంఖ్య, పెడుతున్న ఖర్చు, తదితర అంశాలను మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో క్లినికల్ సర్వీసెస్, అడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్, అకడమిక్స్ విభాగాలు వేర్వేరుగా ఉండాలని సూచించారు. నిమ్స్ తరహాలో మెడికల్ డైరెక్టర్, మెడికల్ సూపరింటెండెంట్‌తోపాటుగా చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్ కూడా ఉండాలని చెప్పారు. డాక్టర్లు, సిబ్బంది నియామకం, తదితర పూర్తి అంశాలతో వారం రోజుల్లో తుది నివేదికను తయారు చేయాలని హెల్త్ సెక్రటరీని మంత్రి ఆదేశించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నివారణపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా జ్వర సంబంధమైన వ్యాధుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు పూర్తి నియంత్రణలో ఉన్నాయని ఆరోగ్య శాఖ అధికారులు మంత్రికి వివరించారు. గత సంవత్సరంతో పోలిస్తే సీజనల్ వ్యాధుల కేసులు తగ్గుముఖం పట్టాయని చెప్పారు.

కాంగ్రెస్ పాలనలోనే గ్రూప్-1 ఉద్యోగాలు: పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: అప్పుడైనా..ఇప్పుడైనా.. ఎప్పుడైనా కాంగ్రెస్ పార్టీ పాలనలోనే నిరుద్యోగులకు గ్రూప్-1 ఉద్యోగాలు లభించాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'ఉద్యోగాలు ఇవ్వాలన్నా, పేదలకు అండగా ఉండాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వాలతోనే సాధ్యం. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేసి ప్రజాప్రభుత్వం చరిత్ర సృష్టించింది. ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణ రాష్ట్రంలోనూ గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి నియామకాలు జరిపిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదే. కానీ దురదృష్టవశాత్తూ గడచిన పదేళ్లలో ఒక్క గ్రూప్-1 ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదు.'అని పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్-1 పరీక్షల్లో ఉత్తీర్ణులై జిల్లా రిజిస్ట్రార్లుగా ఎంపికైన పలువురు సచివాలయంలో మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన ఆయన పలు సూచనలు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలొస్తాయని నిరుద్యోగులు కన్న కలలు గత పదేళ్లలో కల్లలయ్యాయని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఆ కలలను నిజం చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ల స్పెషల్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చేయూత ఇవ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

కొనుగోలు చేయలేదు. గత రికార్డు 67 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, ఈసారి 80 లక్షల టన్నులు కొనుగోలు అవుతాయి. అందులో 45–50 లక్షల టన్నులు సన్నాలు, 30–35 లక్షల టన్నులు దొడ్డురకాలు' అని ఉత్తమ్ చెప్పారు. వరి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,389గా ఉండటంతో ఖర్చు రూ.20 వేల కోట్లకుపైగా అవుతుందని, బోనస్, రవాణా వ్యయాలు కలిపి రూ.24–26 వేల కోట్లు అవుతుందని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రం ఒకే పంటకు ఇంత భారీగా ఖర్చు చేయలేదని స్పష్టంచేశారు.

సీఎంఆర్ డెలివరీపై అభ్యంతరం: కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ గడువు నవంబర్ 12 వరకు పొడిగించినా, కేవలం బాయిల్డ్ రైస్ మాత్రమే ఇవ్వాలని కేంద్రం ఆదేశించడంపై ఉత్తమ్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఖరీఫ్ వరి రా రైస్‌కి అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం 7.80 లక్షల టన్నుల రా రైస్ మిల్లర్ల వద్ద ఉంది. 1.67 లక్షల టన్నుల వరి (సుమారు 1.13 లక్షల టన్నుల బాయిల్డ్ రైస్) మాత్రం బాయిల్డ్ రైస్ మిల్లర్ల వద్ద ఉంది. రా, బాయిల్డ్ రైస్ రెండూ అందించేలా అనుమతించాలి. బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని రబీ సీజన్‌కి మార్చాలి' అని చెప్పారు. ఇక ఖరీఫ్ 2024–25 నుంచి 5.44 లక్షల టన్నుల సీఎంఆర్, రబీ 2024–25 నుంచి 14.92 లక్షల టన్నుల సీఎంఆర్ ఇంకా డెలివరీ కాని స్థితిలో ఉన్నాయన్నారు. దీనివల్ల మిల్లులు మూతపడటంతో కూలీలు పనిలేక వదిలి వెళ్తున్నారని తెలిపారు.

గోదాముల సంక్షోభం: రాష్ట్రంలో ఎఫ్‌సీఐ నిల్వ సామర్థ్యం 22.61 లక్షల టన్నులు కాగా, ఇప్పటికే 21.72 లక్షల టన్నులు నిండిపోయి, కేవలం 0.89 లక్షల టన్నుల పట్టే స్థలం మాత్రమే ఖాళీగా ఉందని ఉత్తమ్‌కుమార్ తెలిపారు. నెలకు కనీసం 300 రైళ్లు అదనంగా కేటాయించి గోదాములు ఖాళీ చేయాలని, అదనపు గోదాములను ఎఫ్‌సీఐ అద్దెకు తీసుకోవాలని చెప్పారు. 2025–26 కొనుగోలు సీజన్‌లో వరి ఉత్పత్తి 148.30 లక్షల టన్నులుగా అంచనా వేసినప్పటికీ, కేంద్రం కేవలం 53.73 లక్షల టన్నుల వరి (36 లక్షల టన్నుల బియ్యం) కొనుగోలుకే ఆమోదం తెలిపిందన్నారు. '10 లక్షల టన్నులు అదనంగా కొనుగోలు చేయాలి. మొత్తం లక్ష్యాన్ని 80 లక్షల టన్నుల వరి (53.60 లక్షల టన్నుల బియ్యం)కి పెంచాలి. లేకుంటే రైతులు నష్టపోతారు' అని ఉత్తమ్ పేర్కొన్నారు.

జహీరాబాద్ ఎన్‌కౌంటర్‌లో పోలీసులకు ఊరట

అధికారులపై దాఖలైన పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: జహీరాబాద్‌లో రెండు దశాబ్దాల క్రితం జరిగిన కాల్పుల ఘటనలో ఇద్దరు పోలీసులకు హైకోర్టులో ఊరట లభించింది. పోలీసు అధికారులపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. 2003 మేలో జహీరాబాద్‌లో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా దొంగతనం జరిగిందనే సమాచారం వాళ్లకు అందింది. ఘటన స్థలంలో ఇద్దరు పారిపోతుండగా పోలీసులు పట్టుకునే ప్రయత్నం చేశారు. ఆ ఇద్దరిలో మహ్మద్ షఫీ అనే వ్యక్తి కానిస్టేబుల్ గోపాల్‌పై కత్తితో పొడిచే ప్రయత్నంతోపాటు రైఫిల్ లాక్కుని కాల్పులకు ప్రయత్నించాడు. దీంతో ఏసీపీ శ్రీధర్‌రెడ్డి కాల్పులు జరపడంతో ఆ వ్యక్తి మరణించాడు. ఆత్మరక్షణ కోసమే కాల్పులు జరిగాయని కలెక్టర్, ఆ తర్వాత సీఐడీ నివేదికలిచ్చాయి. దీనిపై మహ్మద్ ఖాజా అనే వ్యక్తి మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించారు. పోలీసులిద్దరిపై కేసు విచారణ చేయాలని ఆదేశాలు వెలువడ్డాయి. దీనిపై పోలీస్ అధికారులు జిల్లా కోర్టుకు వెళ్లి ఉపశమనం పొందారు. దీన్ని సవాల్ చేస్తూ ఖాజా హైకోర్టులో అప్పీల్ వేశారు. ఈ అప్పీల్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారణ చేపట్టి.. ఇటీవల తీర్పునిచ్చారు. పోలీసులపై కేసును కొట్టివేశారు. మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేశారు.

సమస్యలు పరిష్కరిస్తా.. సమ్మె చేయొద్దు

రేషన్ డీలర్లకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సూచన

సమ్మె ఆలోచన విరమిస్తున్నట్టు ప్రకటించిన రేషన్ డీలర్ల సంఘం



పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను కలిసిన రేషన్ డీలర్లు

సాక్షి, హైదరాబాద్: రేషన్ డీలర్ల పెండింగ్ సమస్యలను పరిశీలించి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హామీ ఇచ్చారు. పండుగ సమయంలో రేషన్ పంపిణీ సజావుగా సాగేలా డీలర్లు సహకరించాలన్నారు. బకాయి కమీషన్ చెల్లింపులు, పెండింగ్ సమస్యల పరిష్కారానికి కొన్నిరోజులుగా ఆందోళన చేస్తున్న రేషన్ డీలర్లు అక్టోబర్ నెల రేషన్ పంపిణీ నిలిపివేయనున్నట్టు ప్రకటించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులను పిలిపించారు. తెలంగాణ రాష్ట్ర డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాయికోటి రాజు నేతృత్వంలో ఏ.సంజీవరెడ్డి, పి.నాగరాజు, కె.మురళీమోహన్ తదితరులు కమిషనర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రేషన్‌డీలర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాను కొత్తగా బాధ్యతలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేస్తూ, దసరా, దీపావళి పండుగల ముందు డీలర్లు రేషన్ నిలిపివేయాలనే ఆలోచనవిరమించుకోవాలని సూచించారు.

రేషన్ బంద్ ఆలోచన విరమణ : నాయికోటి రాజు

పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఇచ్చిన హామీతో బుధవారం నుంచి తలబెట్టాలని భావించిన రేషన్‌షాపుల బంద్, సమ్మె ఆలోచనలను విరమిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాయికోటి రాజు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కార్డులకు ఇవ్వాల్సిన కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని కోరినట్టు తెలిపారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో సన్న బియ్యం తూకం కోసం వేబ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. అక్టోబర్ నెలలోనే సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నట్టు తెలిపారు.

ఆయకట్టు ఆయువు కట్

▶ మొదటి పేజీ తరువాయి

నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2015–16లో శ్రీశైలానికి కనిష్ఠంగా 58.69 టీఎంసీల ప్రవాహం.. అందులో కృష్ణా నుంచి వచ్చింది కేవలం 24.97 టీఎంసీలేనని ఉదహరిస్తున్నారు. ఆల్మట్టి ఎత్తు పెంచడం వల్ల శ్రీశైలం ప్రాజెక్టుపై ఆధారపడ్డ కల్వకుర్తి, పాలమూరు–రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ, అచ్చంపేట తదితర ప్రాజెక్టులతోపాటు నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల కింద ఆయకట్టు ఎడారిగా మారుతుందని చెబుతున్నారు. ఆల్మట్టి ఎత్తు పెంపుతో బ్యాక్ వాటర్ వల్ల తమ రాష్ట్రంలో సంగ్లి, కొల్హాపూర్ జిల్లాలు ముంపునకు గురవుతాయని.. దీనిపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్సెల్పీ) దాఖలు చేస్తామని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఇప్పటికే చెప్పారు.

నాడు నోరు మెదపని చంద్రబాబు

అప్పర్ కృష్ణా ప్రాజెక్టు కింద 173 టీఎంసీలను కర్ణాటకకు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించింది. దాంతో అప్పర్ కృష్ణా ప్రాజెక్టు (ఆల్మట్టి డ్యాం, నారాయణపూర్ డ్యాం, హిప్పర్గి వియర్) పనులను 1964లో కర్ణాటక సర్కార్ చేపట్టింది. అప్పట్లో ఆల్మట్టి డ్యాంను 509.016 మీటర్ల ఎత్తుతో చేపట్టగా, తర్వాత 524.256 మీటర్లకు పెంచుతూ 1995లో నాటి దేవెగౌడ సర్కార్ పనులు ప్రారంభించినా అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం చంద్రబాబు నోరుమెదపలేదని సాగునీటిరంగ నిపుణులు గుర్తు చేస్తున్నారు. 1996, సెప్టెంబరు 1న ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన దేవెగౌడ ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో సమావేశమై ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచడానికి అవసరమైన నిధులను రుణంగా మంజూరు చేసేలా చక్రం తిప్పారు. దాంతో ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచే పనులు వేగవంతమయ్యాయి. దీంతో తమ రాష్ట్రంలోని ప్రాంతాలు ముంపునకు గురవుతాయంటూ అప్పట్లో మహారాష్ట్ర సర్కార్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆల్మట్టి ఎత్తు పెంచడం వల్ల ఆయకట్టుకు నీళ్లందవంటూ ఉమ్మడి ఏపీ రైతులు రోడ్డెక్కారు. ఉమ్మడి ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్సెల్పీ దాఖలు చేసి వాదన వినిపించాయి. దీంతో డ్యాంలో నీటిని నిల్వ చేసే ఎత్తును 519.06 మీటర్లకు పరిమితం చేయాలంటూ 2000, ఏప్రిల్ 25న సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు గడువు 2000, మే 31తో ముగియనున్న నేపథ్యంలో కృష్ణా జలాల పంపిణీకి కేంద్రం ఏర్పాటుచేసే కొత్త ట్రిబ్యునల్ వద్ద డ్యాం ఎత్తు పెంపుపై వాదనలు వినిపించుకోవాలని కర్ణాటకకు సూచించింది.

ఇప్పటికే 524.256 మీటర్లకి ఎత్తు పెంపు

కృష్ణా జలాలను మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లకు పంపిణీ చేయడానికి 2004, ఏప్రిల్ 2న జస్టిస్ బ్రిజేష్ కుమార్ అధ్యక్షతన కేంద్రం ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేసింది. డ్యాంలో 524.256 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేసేలా పనులను 2002 నాటికే కర్ణాటక సర్కార్ పూర్తి చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2002–03లో 519.06 మీటర్ల ఎత్తుతో 129.72 టీఎంసీలను నిల్వ చేసింది. డ్యాంలో 524.256 మీటర్ల ఎత్తులో నిల్వ చేసేలా పనులు పూర్తి చేశామని.. నీటి కేటాయింపులు చేయకపోతే.. ఆ పనులకు చేసిన వ్యయం వృథా అవుతుందని ట్రిబ్యునల్ ఎదుట కర్ణాటక వాదించింది. ఈ వాదనతో ఏకీభవించిన బ్రిజేష్ ట్రిబ్యునల్.. అప్పర్ కృష్ణా ప్రాజెక్టుకు బచావత్ ట్రిబ్యునల్ 75 శాతం లభ్యతగా కేటాయించిన 173 టీఎంసీల జోలికి వెళ్లకుండా 65 శాతం లభ్యత ఆధారంగా అదనంగా 130 టీఎంసీలను కేటాయించింది. ఈ క్రమంలో ఆల్మట్టి డ్యాంలో 524.256 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేసుకోవడానికి అనుమతి ఇస్తూ 2013, నవంబర్ 29న కేంద్రానికి తుది నివేదిక ఇచ్చింది. బ్రిజేష్ ట్రిబ్యునల్ తుది నివేదికను సవాల్ చేస్తూ ఉమ్మడి ఏపీ, మహారాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో ఎస్సెల్పీలు దాఖలు చేశాయి. దాంతో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తుది నివేదిక అమలును నిలుపుదల చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టును ఆదేశించింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ చేస్తుండటంతో ట్రిబ్యునల్ తుది నివేదికను అమలు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయలేదు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ సైతం ఈ కేసులో ప్రతివాదిగా చేరింది. దీనిపై బలంగా వాదనలు వినిపించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి సైతం ఇటీవల అధికారులను ఆదేశించారు. మరోవైపు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పును అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కేంద్రానికి లేఖ రాయడం గమనార్హం.

సాక్షి హైదరాబాద్

బుధవారం ॥ 1 ॥ అక్టోబర్ ॥ 2025



నార్సింగిలో యువకుడి దారుణ హత్య

సెల్‌ఫోన్ చోరీ వ్యవహారం యువకుడి హత్యకు దారి తీసింది. చోరీ చేసిన ఫోన్‌ను సదరు వ్యక్తికి తిరిగి ఇవ్వాలన్న స్నేహితుడిని మరో ఇద్దరు కత్తితో పొడిచి హత్య చేశారు.

-10లో



క్యూట్ క్యాట్.. ఒత్తిడి సెట్..

క్యాట్ థెరపీ మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు. నగర వాసులు ప్రత్యక్షంగా క్యాట్ థెరపీని ఆస్వాదించవచ్చంటున్నారు.

- సిటీప్లస్‌లో



వాతావరణం

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 30, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



ట్యాంక్‌బండ్‌కు పూలహారం

నేలకు పూల సింగిడి దిగి వచ్చింది. ప్రకృతి శోభతో ట్యాంక్‌బండ్ పులకించింది. మంగళవారం తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ ముగింపు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మహిళలు రంగు రంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. తెలంగాణ టూరిజం, జీహెచ్ఎంసీ సంయుక్తాధ్వర్యంలో బోనాలు, ఒగ్గుడోలు, డప్పు వాద్యాలు, చిందు, యక్షగానం కళాకారులు, దింసా నృత్యాలతో ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మలకు స్వాగతం పలికారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్, కలెక్టర్ హరిచందన, నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్‌లు వెన్నెల గద్దర్, నిర్మలా రెడ్డి, అలేఖ్య పుంజాల, నేర్లెళ్ల శారద, సుజాత తదితరులు పాల్గొన్నారు.

- కవాడిగూడ

బతుకమ్మలతో ట్యాంక్ బండ్‌పైకి వస్తున్న మహిళలు



ఆడుతూ.. పాడుతూ.. కలెక్టర్ హరిచందన, డిప్యూటీ మేయర్ శ్రీలత



కళాకారులతో సందడిగా మారిన హుస్సేన్‌సాగర్ తీరం



బతుకమ్మ వేడుకలను తిలకిస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, జూపల్లి, పొన్నం తదితరులు



బతుకమ్మ ఆడుతున్న మంత్రి కొండా సురేఖ, వెన్నెల గద్దర్



బతుకమ్మను ఎత్తుకుని విదేశీయురాలి ఆనందోత్సాహం

తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్.. బోర్డు అమర్చేశారు

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవలే జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో తెలుగుతల్లి ఫ్లై ఓవర్ పేరును తెలంగాణతల్లిగా మారుస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఫ్లై ఓవర్‌కు కొత్త బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. ఫ్లై ఓవర్‌కు తెలంగాణ తల్లి అనే పేరుతోపాటు ఎటువైపు ఏముందో తెలిసేలా సూచిక గుర్తులూ వేశారు. ఈ ఫ్లై ఓవర్ పనులు టీడీపీ హయాంలో ప్రారంభం కాగా, ఫ్లై ఓవర్‌ను పూర్తి చేసేందుకు చాలా జాప్యం జరిగింది. ఫ్లై ఓవర్‌ను ఎక్కడ ముగించాలో అర్థం కాక జాప్యం జరిగినట్లు సమాచారం. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిర్మాణం పూర్తిచేసి.. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కోనేరు రంగారావు దీన్ని ప్రారంభించారు. 2005 జనవరి 22వ తేదీన ప్రారంభోత్సవం జరిగినట్లు అధికారులు తెలిపారు. అప్పట్లో దీనికైన వ్యయం రూ. 22.97 కోట్లు.



అక్కడ 17,631



ఇక్కడ 4,855

అత్యధిక సైబర్ నేరాల కేసులు బెంగళూరులోనే

- ఆ తర్వాత స్థానంలో నిలిచిన హైదరాబాద్
- 2023 గణాంకాలను వెల్లడించిన ఎన్సీఆర్బీ
- ఆధారాలు లేక మూతపడుతున్నవే అధికం

నగరంలో సైబర్ నేరాలు ఇలా..

ఏడాది	నేరాలు
2020	2,553
2021	3,303
2022	4,436
2023	4,855



ఇతర నగరాల్లో ..

ఏడాది	2020	2021	2022	2023
బెంగళూరు	8,892	6,423	9,940	17,631
ముంబై	2,433	2,883	4,724	4,131
లక్నో	1,465	1,067	1,134	1,453
ఢిల్లీ	166	345	685	407
కోల్‌కతా	172	220	75	21

సాక్షి, సిటీబ్యూరో

నగరంలో సైబర్ నేరాలు నానాటికీ పెరుగుతున్నాయా..? ఈ-కేటుగాళ్లకు హైదరాబాద్ సాఫ్ట్ టార్గెట్‌గా మారుతోందా..? ఔననే అంటున్నాయి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) వర్గాలు. 2023కు సంబంధించిన డేటాను ఎన్సీఆర్బీ మంగళవారం విడుదల చేసింది. దీని ప్రకారం సైబర్ నేరాల నమోదులో హైదరాబాద్ నగరం దేశంలోనే రెండో స్థానంలో ఉంది. ఇక్కడ 2023లో 4,855 కేసులు నమోదయ్యాయి. 17,631 కేసులతో మొదటి స్థానంలో బెంగళూరు ఉండగా.. 4,131 కేసులతో ముంబై మూడో స్థానంలో ఉంది. 2022లో మూడో స్థానంలో ఉన్న హైదరాబాద్ ఏడాదిలోనే రెండో స్థానానికి వెళ్లింది.

బ్యాంకింగ్ ఫ్రాడ్స్ కేసులే అత్యధికం..

హైదరాబాద్‌లో నమోదవుతున్న సైబర్ నేరాల్లో ఆన్‌లైన్ బ్యాంకింగ్ సంబంధిత మోసాల కేసులే ఎక్కువగా నమోదవుతున్నాయి. 2,858 సంఖ్యతో మొత్తం కేసుల్లో 58.86 శాతం ఇవే ఉన్నట్లు ఎన్సీఆర్బీ స్పష్టం చేస్తోంది. బ్యాంకు అధికారుల పేర్లతో ఫోన్లు చేసే సైబర్ నేరగాళ్లు వినియోగదారులను నిండా ముంచుతున్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు అప్‌డేట్ చేయాలని, నో యువర్ కస్టమర్ (కేవైసీ) తప్పనిసరి అంటూ నమ్మిస్తున్నారు. ఈ పేర్లతో వినియోగదారుల నుంచి బ్యాంకు ఖాతాతో పాటు వ్యక్తిగత వివరాలు, వన్ టైమ్ పాస్‌వర్డ్స్ (ఓటీపీ) సంగ్రహిస్తున్నారు. వీటిని వినియోగించి ఎదుటి వారి ఖాతాలను గుల్ల చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఏటీఎం కార్డులు, కేంద్రాలు కేంద్రంగా జరిగే సైబర్ నేరాల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. 2023లో నగర వ్యాప్తంగా ఈ తరహా కేసులు 211 నమోదయ్యాయి.

'క్లూ' దొరకని కేసులే అధికం..

ఈ సైబర్ నేరాల్లో బాధితులు మోసపోవడం ఎంత తేలికో.. కేసు కొలిక్కి రావడం, నగదు రికవరీ అంత కష్టం. అత్యధిక కేసుల్లో దర్యాప్తు ముందుకు వెళ్లడానికి కనీసం ఒక్క ఆధారం కూడా దొరకదు. ఈ సైబర్ నేరగాళ్లు నేరాలు చేసే సమయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. సిమ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు తమ పేర్లు, వివరాలతో లేకుండా నేరం చేస్తారు. వీళ్లు వినియోగించే ఇంటర్నెట్ ప్రొటోకాల్ (ఐపీ) అడ్రస్ కూడా దర్యాప్తు సంస్థలకు తెలియకుండా ఉండేందుకు ప్రాక్సీ సర్వర్లు వినియోగిస్తారు. కొందరు పాత్రధారుల, దళారులు మినహా సూత్రధారులు అంతా విదేశాల్లోనే తిష్ట వేస్తుంటారు. అక్కడి వివరాలు సేకరించడానికి ఇక్కడి పోలీసులకు ఏమాత్రం అవకాశం ఉండదు. ఈ కారణంగానే అత్యధిక కేసుల్లో ఆధారాలు సేకరించడం పోలీసులకు సాధ్యం కావట్లేదు. దీంతో బాధితుడు మోసపోవడం, నష్టపోవడం నిజమైనప్పటికీ అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. 2023లో నగరంలో నమోదైన 4,855 కేసుల్లో 2733 (56.29 శాతం) ఆధారాలు లేకపోవడంతో క్లోజ్ అయ్యాయి.

ప్రతి ఫిర్యాదునూ నమోదు చేస్తున్నాం

భవిష్యత్తులో సైబర్ నేరాలు, ఉగ్రవాదమే పెను సవాల్‌గా మారే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే ఇక్కడ ప్రతి ఫిర్యాదును కేసుగా నమోదు చేస్తున్నాం. ఆర్థిక సంబంధిత నేరాల్లో రూ.లక్ష కంటే ఎక్కువ మొత్తంతో ముడిపడిన కేసులను సైబర్ క్రైమ్ ఠాణాలో, మిగిలిన వాటిని స్థానిక పోలీసు స్టేషన్లలో రిజిస్టర్ చేసి దర్యాప్తు చేయిస్తున్నాం. కొన్ని సున్నితమైన కేసుల్లో ఒకప్పుడు బాధితులు.. ప్రధానంగా మహిళలు బయటకు వచ్చి ఫిర్యాదు చేసేవాళ్లు కాదు. ఇటీవల కాలంలో అవగాహన పెరిగిన కారణంగా ఈ పరిస్థితి లేదు. దీంతో ప్రతి ఏడాది నగరంలో సైబర్ క్రైమ్ కేసులు పెరుగుతున్నాయి. వీటిని నిరోధించడానికి అనేక చర్యలు తీసుకుంటున్నాం. పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ కాలేజీలు, స్కూళ్ల వరకు వెళ్తున్నాం.

– నగర పోలీసు అధికారి

సిటీలో పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్

శాంతిభద్రతలతో పాటు సంక్షేమానికీ ప్రాధాన్యం

- కల్తీల నిరోధానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ యూనిట్‌కు రూపం
- సీసీ కెమెరాల ఆడిటింగ్‌తో సమగ్ర నిర్వహణ
- ప్రాధాన్యాలు వెల్లడించిన నగర సీపీ వీసీ సజ్జనర్

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనరేట్‌లో పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్ ఆవిష్కృతం కానుందని కొత్త కొత్వాల్ విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనర్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నిరోధంతో పాటు ప్రజా సంక్షేమానికీ పెద్దపీట వేస్తూ విధానాలు రూపొందించనున్నామని ఆయన పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ)లో మంగళవారం నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ప్రస్తుత విధానాలే కొనసాగింపు..

'గడచిన కొన్నేళ్లుగా నగర పోలీసింగ్‌లో అనేక సంస్కరణలు వచ్చాయి. అమలులో ఉన్న విధానాలు కొనసాగిస్తూనే అవసరమైన స్థాయిలో కొత్తవి అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రజా సంక్షేమ పోలీసింగ్‌లో భాగంగా నగర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడతాం. ఆహార కల్తీని నిరోధించడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తాం. ఏయే సరుకులు ఎలా కల్తీ అవుతున్నాయో గుర్తించడానికి మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ యూనిట్‌కు రూపమిస్తాం. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం. ఈ కేసుల్లో నిందితులతో డేటా బ్యాంక్ ఏర్పాటు చేసి ఇతర విభాగాలతో సమన్వయంతో పని చేస్తాం.

సైబర్ నేరాలపై పోరు..

ఎప్పటికప్పుడు పంథా మారుస్తూ నానాటికీ రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లకు చెక్ చెప్పడానికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తాం. ఇటీవల కాలంలో వృద్ధులే ఎక్కువగా టార్గెట్‌గా మారుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లోని వృద్ధులపై దృష్టి పెట్టాలి. పోలీసు విభాగానికి దూరంగా ఉన్నా బెట్టింగ్ యాప్స్‌పై ఇప్పటికే 'హ్యాష్‌ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్' పేరుతో ఉద్యమం చేశా. ఫలితంగానే వాటిని నిషేధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మల్టీ లెవల్ మార్కెటింగ్స్, రియల్ ఎస్టేట్ మోసాలు, భూ కబ్జాలపై కఠిన వైఖరి ఉంటుంది. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ నేరాలకు పాల్పడే వారు తమ ఇంట్లో ఉన్న తల్లి, సోదరి, భార్యల్ని గుర్తు చేసుకుని, మహిళల్ని గౌరవించాలి.

ప్రతి ఒక్కరి 'ఫ్యామిలీ టైమ్' పెంచుతాం...

నగరంలో నానాటికీ వాహనాల సంఖ్య పెరిగిపోతోంది. ట్రాఫిక్ సమస్యలతో వాహనచోదకులు ఎక్కువ సమయం రోడ్లపై ఉండాల్సి వస్తోంది. ఈ ప్రభావంతో వారు కాలుష్యం బారినపడి ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారు. కుటుంబాలతో వారు గడిపే సమయం కూడా తగ్గిపోతోంది. రహదారులపై వాహనాల సరాసరి వేగం పెంచడంతో పాటు కాలుష్యం తగ్గించి, నగర వాసులు తమ కుటుంబాలతో గడపడానికి ఎక్కువ సమయం మిగిలేలా చేస్తాం. డ్రంక్ డ్రైవింగ్ అనేది రోడ్ టెర్రరిజం. డ్రంక్ డ్రైవర్లు సూసైడ్ బాంబర్లు. వీరి వల్ల ఎన్ని ప్రాణాలైనా పోవచ్చు. కుటుంబాలు వీధినపడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. పోలీసింగ్‌లో ఏఐ, డ్రోన్లు వినియోగిస్తాం.

పెద్దల్ని వదిలేస్తే సీనియర్ సిటిజన్స్ యాక్ట్..

ఇటీవల కాలంలో అనేక మంది వృద్ధులైన తమ కుటుంబీకుల్ని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లతో పాటు బహిరంగ ప్రదేశాల్లో వదిలేసి వెళ్లిపోతున్నారు. ఇప్పటికే ఇలాంటి వారిపై రెస్క్యూ కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఇకపై ఈ పని ఎవరైనా చేస్తే సీనియర్ సిటిజన్స్ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటాం. నగరంలోని ప్రతి భవనంపైనా ఓ సీసీ కెమెరా ఉండాలి. ప్రస్తుతం ఉన్న వాటిని ఆడిటింగ్ చేయడం ద్వారా అన్నీ పని చేసేలా చర్యలు తీసుకుంటాం. సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపై చర్యలు తప్పవు.

మీ పిల్లలపై ఓ కన్నేసి ఉంచండి..

మైనర్లు చేసే నేరాలు పెరిగిపోతున్నాయి. వాళ్లు ఆ పని చేసే వరకు తల్లిదండ్రులకూ వారి ప్రవర్తన తెలియట్లేదు. స్మార్ట్‌ఫోన్ యుగంలో ప్రతి ఒక్కరూ వారి బిడ్డల కార్యకలాపాలు, ఆన్‌లైన్ స్నేహాలు, క్రయవిక్రయాలపై కన్నేసి ఉంచాలి. టీజీఐసీసీసీలోని కమిషనరేట్, బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్, పాతబస్తీలోని కొత్వాల్ హౌస్‌ల నుంచి పని చేస్తా. ఎప్పుడు ఎక్కడ ఉంటాననే ప్రణాళికను త్వరలోనే విడుదల చేస్తా. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా అందుబాటులో ఉంటాం. హైదరాబాద్ యాంటీ నార్కోటిక్స్ వింగ్‌కు సిబ్బంది, వనరులు కేటాయించి దాన్ని బలోపేతం చేస్తాం' అని పేర్కొన్నారు.



బాధ్యతల స్వీకరణ అనంతరం కుటుంబ సభ్యులతో సజ్జనర్

జూబ్లీహిల్స్ ఓటర్లు 3,98,982

జాబితాలో పేరు లేనివారు నామినేషన్లలోగా దరఖాస్తు చేసుకోవచ్చు

- ఉప ఎన్నిక సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి: ఆర్‌వీ కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో ఉప ఎన్నిక జరగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు వేసేందుకు 3,98,982 మంది అర్హత కలిగి ఉన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా కొత్తగా చేరికలు, తొలగింపుల అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తుది జాబితా వెలువరించారు. సంబంధిత ఈఆర్ఓ ఫొటో ఓటర్ల జాబితాను రూపొందించడంతో పాటు ఎన్నికల ప్రధానాధికారి వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జీహెచ్ఎంసీ తెలిపింది. ఓటర్లు తమ పేర్లను పరిశీలించుకోవచ్చని పేర్కొంది. గత నెల 2వ తేదీన ప్రచురించిన ముసాయిదా జాబితాలో 3,92,669 మంది ఓటర్లుండగా, తుది జాబితాలో 3,98,982 మందితో 1.61 శాతం పెరిగారు.

పేర్లున్నదీ లేనిదీ పరిశీలించుకోవచ్చు..

నియోజకవర్గ ఓటర్లు ఎన్నికల నమోదు అధికారి(ఈఆర్ఓ) కార్యాలయంలో గాని, ఎన్నికల సంఘం (ఈసీఐ) వెబ్‌సైట్‌లో గాని, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వెబ్‌సైట్‌లో గాని, ఓటర్స్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా గాని తమ పేర్లున్నదీ, లేనిదీ పరిశీలించుకోవచ్చని కర్ణన్ తెలిపారు. పేర్లు లేనివారు నామినేషన్ల దాఖలుకు గడువున్నంత వరకు నమోదు చేసుకోవచ్చు. ఏవైనా అభ్యంతరాలున్నా ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. ఏవైనా సందేహాలుంటే ఈ ఎన్నికల ఈఆర్ఓగా వ్యవహరిస్తున్న జీహెచ్ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజినీకాంత్‌రెడ్డిని సంప్రదించవచ్చని సూచించారు. సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్‌ను కూడా సంప్రదించవచ్చని, టోల్ ఫ్రీ కాల్ సెంటర్ నెంబర్ 1950కు ఫోన్ కూడా చేయవచ్చని కర్ణన్ పేర్కొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి: కర్ణన్

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ కోరారు. మంగళవారం ఓటర్ల తుది జాబితా వెల్లడి అనంతరం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జూలై 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండిన వారు, అర్హులు ఉంటే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటర్లు జాబితాలో తమ వివరాల్ని తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్ , రాజకీయ పార్టీల తరపున కె.నందేశ్ కుమార్ (బీఎస్పీ), పొన్న వెంకటరమణ, కొల్లూరు పవన్ కుమార్ (బీజేపీ), విజయ్ మల్లంగి (ఆప్), ఎం. శ్రీనివాసరావు (సీపీఐఎం), పి. రాజేశ్ కుమార్ (కాంగ్రెస్), ముఠా జై, ఎ. శ్రీనివాస్ గుప్తా (బీఆర్ఎస్), కె.జోగేందర్ సింగ్, బి.వై. శ్రీకాంత్ (టీడీపీ), సయ్యద్ ఖలీలుద్దీన్ (ఎంఐఎం) తదితరులు హాజరయ్యారు.

ఓటర్ల వివరాలు ఇలా..

అంశం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ముసాయిదా జాబితా మేరకు	2,04,288	1,88,356	25	3,92,669
కొత్తగా నమోదు చేసుకున్నవారు	3,415	3,561	0	6,976
తొలగించిన ఓట్లు	336	327	0	663
తుది జాబితా మేరకు ఓటర్లు	2,07,367	1,91,590	25	3,98,982

- తుది జాబితా మేరకు 95 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు, 6,052 మంది 80 ఏళ్ల వయసు పైబడిన వారు ఉన్నారు.
- 139 ప్రాంతాల్లోని భవనాల్లో 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. దాదాపు 980 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉంటుంది. 38 మందిని బూత్‌లెవెల్ ఆఫీస్ సూపర్‌వైజర్లుగా నియమించారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్‌వీ కర్ణన్

పోలీసుల పైకి కుక్కను వదిలారు..

- నలుగురిపై కేసు నమోదు

బంజారాహిల్స్: మద్యం మత్తులో న్యూసెన్స్‌కు పాల్పడుతుండగా డయల్ 100 కాల్‌తో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసుల పైకి కుక్కలను వదిలిన ఓ న్యూస్ రిపోర్టర్‌తో పాటు మరో ముగ్గురిపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని అరోరా కాలనీలో ఓ ఇంటి టెర్రస్‌పై 20 మందికి పైగా యువకులు అర్ధరాత్రి దాకా మద్యం సేవిస్తూ గాలిలోకి మద్యం బాటిళ్లను విసురుతూ, పగులగొడుతూ గోల చేస్తుండగా చుట్టుపక్కల నివాసితులు డయల్ 100కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న బంజారాహిల్స్ కానిస్టేబుల్ భరత్‌కుమార్, నైట్ డ్యూటీ ఎస్‌ఐ సంధ్యారాణి ఘటనా స్థలానికి చేరుకున్నారు. న్యూసెన్స్ జరుగుతున్న ఇంటి టెర్రస్ పైకి వెళ్లడానికి యత్నించగా వీరి పైకి కుక్కను వదిలి విధులను అడ్డుకున్నారు. దీనిపై బంజారాహిల్స్ కానిస్టేబుల్ భరత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓ న్యూస్ రిపోర్టర్ సహా అజయ్, శివ, రవి తదితరులపై బంజారాహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 121 (1), 126 (2), 291, 292, 352, 189 (5) కింద కేసు నమోదు చేశారు. తాము ఘటనా స్థలానికి వెళ్తున్న క్రమంలో సుమారు 20 మంది వరకు తమను అడ్డుకోవడంతో పాటు ఆగ్రహంతో ఊగిపోతూ దాడి చేయగా తన చేతికి గాయమైందని కానిస్టేబుల్ భరత్‌కుమార్ ఆరోపించారు. తాము ఘటనా స్థలం నుంచి మెట్లుదిగే క్రమంలో మరోసారి 10-15 మంది వరకు తమను చుట్టుముట్టి దుర్భాషలాడుతూ యూనిఫాం తీసేసి అవమానిస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. వీరిలో కుమార్ అనే వ్యక్తి తాను న్యూస్ చానల్ రిపోర్టర్‌నంటూ తీవ్రంగా దుర్భాషలాడాడని అజయ్, శివ, రవి సహా మరికొందరు కూడా తోడయ్యారని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సజ్జనర్ @62!


సజ్జనర్‌కు స్వాగతం పలుకుతున్న నగర అధికారులు

- బాధ్యతలు స్వీకరించిన కొత్త కొత్వాల్
- సిటీకి ఈయన 62వ పోలీసు కమిషనర్
- మూడేళ్ల కాలంలో కమిషనర్లుగా ఐదుగురు
- వీరిలో రెండుసార్లు పనిచేసిన ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు 62వ పోలీసు కమిషనర్‌గా విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీఐసీసీసీ) ఉన్న నగర పోలీసు కమిషనర్ కార్యాలయానికి వచ్చిన ఆయనకు పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తన చాంబర్‌లో సజ్జనర్ బాధ్యతలు తీసుకున్న అనంతరం సర్వమత ప్రార్థనలు జరిగాయి. టీజీఐసీసీసీ ఆవరణలో ఆయన శాంతి, స్వేచ్ఛకి సూచికంగా కొన్ని పావురాలను గాల్లోకి ఎగురవేశారు. కొత్త కొత్వాల్‌లు నగర పోలీసు విభాగంలో పని చేస్తున్న అధికారులు కలిసి అభినందించారు. బదిలీపై వెళ్తున్న సీవీ ఆనంద్ సైతం సజ్జనర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

అప్పట్లో అరుదైన ఘట్టాలు...

నగర పోలీసు కమిషనరేట్‌కు దాదాపు 150 ఏళ్ల చరిత్ర ఉంది. సుదీర్ఘకాలం నిజాం ఏలుబడిలో ఉన్న హైదరాబాద్ 1948 సెప్టెంబర్‌లో జరిగిన ఆపరేషన్ పోలోతో దేశంలో విలీనమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 62 మంది పోలీసు కమిషనర్లుగా (కొందరు రెండేసి సార్లు విధులు నిర్వర్తించారు) పని చేశారు. అయితే కేవలం రెండు సందర్భాల్లోనే ఒకే ఏడాదిలో ముగ్గురు కమిషనర్లుగా పనిచేశారు. 1990లో మాత్రం అప్పటి ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఏడాదిలో నలుగురు కమిషనర్లుగా బాధ్యతలు నిర్వర్తించారు. 1954 మే 14 వరకు ఈ స్థానంలో పని చేసిన ఎ.సుందరం పిళ్లై పదవీ విరమణ చేశారు. దీంతో ఆ మరుసటి రోజు బీఎల్ ఖేద్కర్ నగర కొత్వాల్‌గా బాధ్యతలు తీసుకుని సెప్టెంబర్ 25 వరకు పని చేసి రిటైర్ కావడంతో సి.రంగస్వామి అయ్యర్ పోలీసు కమిషనర్‌గా వచ్చారు.

1989 ఫిబ్రవరి 15 నుంచి 1990 మే 4 వరకు వి.అప్పారావు పోలీసు కమిషనర్‌గా పని చేసి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి వచ్చిన ఐ.పుల్లన్న అదే ఏడాది ఆగస్టు 15 వరకు విధులు నిర్వర్తించారు. మరుసటి రోజు బాధ్యతలు స్వీకరించిన జి.గుర్నాథ్‌రావు అదే ఏడాది నవంబర్ 28 వరకు.. ఆ తర్వాత ఎంవీ భాస్కర్‌రావు కొత్వాల్ అయ్యారు.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎనిమిదో సీపీ...

వీసీ సజ్జనర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌కు ఏడో సీపీ. 2014 నుంచి ఇప్పటి వరకు ఎనిమిది మంది మారగా...వీరిలో ఆనంద్ రెండుసార్లు పని చేశారు. తొలి కొత్వాల్ ఎం.మహేందర్‌రెడ్డి 2017 నవంబర్ 11న బదిలీ కావడంతో ఆయన స్థానంలో వీవీ శ్రీనివాసరావు 2017 నవంబర్ 12న బాధ్యతలు తీసుకున్నారు. ఈయన నుంచి అంజనీకుమార్ 2018 నవంబర్ 12న చార్జ్ తీసుకోవడం ఇద్దరూ ఒకే తేదీన బాధ్యతలు స్వీకరించిన వారయ్యారు. 2023 ఏడాది అక్టోబర్ 13న సందీప్ శాండిల్యా..అదే ఏడాది డిసెంబర్ 13న కొత్త కోట శ్రీనివాసరెడ్డి స్వీకరించారు. గత ఏడాది సెప్టెంబర్ 08న ఆయన్ను బదిలీ చేసిన సర్కారు సీవీ ఆనంద్‌ను మరోసారి పోలీసు కమిషనర్‌గా నియమించింది. ఆనంద్ సైతం బదిలీ కావడంతో మంగళవారం సజ్జనర్ బాధ్యతలు తీసుకున్నారు. ఇలా 2023-2025 మధ్య నగరానికి నలుగురు అధికారులు (సీవీ ఆనంద్ రెండుసార్లు) ఐదుసార్లు కొత్వాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. గడిచిన కొన్నేళ్లల్లో హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా అతి తక్కువ కాలం పని చేసింది సందీప్ శాండిల్య కావడం గమనార్హం.

పారదర్శకంగా...ప్రశాంతంగా ఎన్నికలు

- 48 గంటల్లో హోర్డింగ్స్, ఫ్లెక్సీలు తొలగించాలి
- ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి
- సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధం
- విలేకరుల సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి


మట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఇప్పటికే ఓటర్ల జాబితా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాల గుర్తింపు, రిజర్వేషన్ల కేటాయింపు, ఎన్నికల షెడ్యూల్ విడుదల ప్రక్రియ పూర్తైందని చెప్పారు. ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్ విడుదలతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

హోర్డింగ్‌లు తొలగించాల్సిందే..

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోన్ని రాజకీయ పార్టీ నేతల ఫోటోలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, బ్యానర్లను తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్టాండ్, రైల్వే స్టేషన్ పెట్రోల్ బంక్ తదితర పబ్లిక్ ప్లేస్సుల్లో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాల్లో 72 గంటల వ్యవధిలో తొలగించాలన్నారు. ఇదిలా ఉంటే అంతకు ముందు రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్ సహా కాంగ్రెస్‌పార్టీ నుంచి ఆవుల యాదయ్య, నవీన్ కుమార్, జంగారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నుంచి సత్తు వెంకటరమణ రెడ్డి, మిట్టూ జగదీశ్వర్, బీజేపీ నుంచి అందెల శ్రీరాములు, దేవేందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా భారత్ గోల్ఫ్ మహోత్సవ్

సాక్షి, సిటీబ్యూరో: గోల్ఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, టీ గోల్ఫ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన భారత్ గోల్ఫ్ మహోత్సవ్ జీఎఫ్ఐ టూర్-2025 ఉత్సాహంగా జరిగింది. గచ్చిబౌలి బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ అండ్ కంట్రీ క్లబ్‌లో జరిగిన ఈ టోర్నీలో 170 మంది గోల్ఫర్లు పాల్గొన్నారు. రెండు సెషన్ల పాటు డబుల్ పియోరియా ఫార్మాట్‌లో ఈ పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. గోల్ఫ్ క్రీడను ప్రమోట్ చేయడమే కాకుండా పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా భారత్ గోల్ఫ్ మహోత్సవ్ చేపట్టారు. ఇందులో భాగంగా బౌల్డర్ హిల్స్‌లో మొక్కలను నాటే కార్యక్రమాన్ని జీఎఫ్ఐ ప్రిన్సిపల్ ప్యాట్రన్ నిర్మల ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చైతన్య గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఫౌండర్ చైతన్య రాజు, గోల్ఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫౌండర్ ఆర్పవీర్ ఆర్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.


మహోత్సవ్‌లో పాల్గొన్న వారికి జ్ఞాపికలు అందిస్తూ..

కృష్ణా నదిలో విద్యార్థి గల్లంతు


చాణక్య(ఫైల్)


నాగార్జునసాగర్: స్నేహితులతో కలిసి హైదరాబాద్ నుంచి మంగళవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును చూసేందుకు వచ్చిన ఇంటర్మీడియట్ విద్యార్థి కృష్ణా నదిలో గల్లంతయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం..కూకట్‌పల్లికి చెందిన హర్షవర్ధన్, జ్ఞానేందర్, సుమన్, మణికంఠరెడ్డి, వెంకటేష్, చాణక్య (16)స్నేహితులు. వీరంతా వేర్వేరు కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్నారు. వీరంతా కలిసి నాగార్జునసాగర్ ప్రాజెక్టును చూడటానికి మంగళవారం రెండు బైక్‌లపై వచ్చారు. అందరూ కలిసి నాగార్జునసాగర్ డ్యాం దిగువన ఫొటోలు తీసుకున్నారు. అనంతరం కొత్త బ్రిడ్జి సమీపంలో చింతల పాలెం వెళ్లే దారి వెంట ఉన్న ఆంజనేయ పుష్కర ఘాట్‌లోకి దిగి స్నానాలు చేస్తుండగా.. చాణక్య నీటి ఉధృతికి కృష్ణా నదిలో కొట్టుకుపోయాడు. అతడి స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా..వారు గజ ఈతగాళ్లతో కృష్ణా నది తీరం వెంట గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం వరకు కూడా గల్లంతైన విద్యార్థి ఆచూకీ లభించలేదు.

అంతర్రాష్ట్ర మద్యం పట్టివేత


సీజ్ చేసిన మద్యాన్ని చూపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పహాడీషరీఫ్: ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి తీసుకొస్తున్న మద్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన ప్రకారం .. రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్ కిరణ్ ఆధ్వర్యంలో పహాడీషరీఫ్‌లో దాడులు నిర్వహించి 41 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గోవా, హరియాణ, ఢిల్లీ ప్రాంతాల నుంచి మద్యం బాటిళ్లను దిగుమతి చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బాటిళ్లను సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. శంషాబాద్ ఏరియాలో ఎస్టీఎఫ్ బీ అండ్ డీ టీమ్‌లు నిర్వహించిన దాడుల్లో 45 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్టీఎఫ్‌సీ టీమ్ సీఐ బిక్షారెడ్డి, డీ టీమ్ సిఐ నాగరాజులు చేపట్టిన ఈ వాహనాల తనిఖీలలో రెండు బోట్ల పట్టుబడిన మద్యం విలువ రూ.2.5 లక్షలుగా ఉంటుందని అధికారులు వెల్లడించారు.

హిందువులకు రక్షణగా ఆర్ఎస్ఎస్


శతాబ్ది వేడుకలో సంఘ్ నాయకులు

పహాడీషరీఫ్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలను మామిడిపల్లి గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చార్మినార్ బాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా సహ బౌద్ధిక్ లాలూ యాదవ్ జీ మాట్లాడుతూ.. సంఘ్ కార్యకర్తలు ప్రతి పనిలోనూ దేశ ప్రయోజనలే పరమావధిగా భావిస్తారన్నారు. 1925 సంవత్సరంలో విజయదశమి రోజున ప్రారంభించిన ఆర్ఎస్ఎస్ హిందువులకు అన్ని రకాలుగా రక్షణగా ఉంటుందన్నారు. హిందూ సమాజాన్ని సంఘటితం చేస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో బస్తీ ప్రముఖ్ నందీశ్వర్, సతీష్‌గౌడ్, విశ్వనాథ్‌గౌడ్, విజయేందర్‌రెడ్డి, రంగనాథ్, పంచముఖి హనుమాన్ వ్యాయామ శాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ పైకి ద్విచక్ర వాహనదారుడు

- కారు ఢీకొని మృతి


మృతి చెందిన బోయిని కృష్ణ

మేడ్చల్ రూరల్: ఔటర్ రింగు రోడ్డుపై ప్రయాణించడానికి ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదని తెలిసీ రాంగ్ రూట్లో ఔటర్ ఎక్కి ప్రాణాలు కోల్పోయాడో వ్యక్తి. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం గొల్లపల్లికి చెందిన బోయిని కృష్ణ (52) నర్సాపూర్ నుంచి శామీర్‌పేట్ వైపు వస్తూ ఓఆర్ఆర్ ఎగ్జిట్-5 దుండిగల్ వద్ద ద్విచక్ర వాహనంపై టోల్ గేట్ సిబ్బంది వారిస్తున్నా వినిపించుకోకుండా..వారికి చిక్కకుండా వేగంగా ఓఆర్ఆర్ ఎక్కాడు. అతి వేగంగా దుండిగల్ నుంచి శామీర్‌పేట వైపు రాంగ్ రూట్లో ప్రయాణించాడు. మునీరాబాద్ వద్ద ఎగ్జిట్‌కు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి, విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నా భర్త ఆచూకీ చెప్పండి

- సీఎం ప్రజావాణిలో మహిళ మొర

లక్డీకాపూల్: కెనడాలో నివాసం ఉంటున్న తనకు చెప్పకుండా తన భర్త జర్మనీకి వెళ్లిపోయాడని, అతని ఆచూకీ కనిపెట్టాలంటూ ఓల్డ్ మలక్‌పేట్‌కు చెందిన షబానా నస్రీన్ అహ్మద్ సీఎం ప్రజావాణిలో మొర పెట్టుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ముజామిల్ గులాబ్ నాయక్ అనే వ్యక్తితో షబానా నస్రీన్‌కు ఆరేళ్ల క్రితం పెళ్లి జరిగింది. ఇటీవల ఆమె భర్త షబానా నస్రీన్‌కు చెప్పకుండా జర్మనీ వెళ్లిపోయాడు. దీనిపై ఆరా తీయగా అతని ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన ఆమె..ఇండియాలో ఉంటున్న తన తల్లిద్వారా సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. దీనిపై వెంటనే స్పందించిన ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి ఉన్నతాధికారుల ద్వారా కెనడా, జర్మనీల్లోని ఇండియన్ ఎంబసీలకు లేఖ రాశారు. ముజామిల్ ఆచూకీ కనుగొనాలని విన్నవించారు. అలాగే ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు చేయాలని ఎన్నారై మహిళా విభాగం అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ను కోరుతూ కూడా జీఏడీ ఎన్నారై విభాగం అధికారులు లేఖ రాశారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. రాగన్నగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం 53వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో సంఘం రూ.4.5కోట్ల నికర లాభం సాధించిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. రైతులు పంట రుణాలను సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వం హయాంలో కొహెడలో ఐదెకరాల్లో గోదాములు నిర్మించి నెలకు రూ.7.5లక్షల అద్దెవస్తుందని వివరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరావు నాబార్డు 40వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఉత్తమ సంఘం అవార్డును సాధించామని గుర్తుచేశారు. స్టడీ టూర్ నిమిత్తం కేరళ, హిమాచల్ ప్రదేశ్, ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోని అనేక సహకార సంఘాల ప్రతినిధులు, ఉద్యోగుల బృందం పరిశీలనకు వచ్చిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఆదిబట్లలో ఖరీదైన ప్రాంతంలో ప్రభుత్వం డీసీసీబీ కార్యాలయ నిర్మాణానికి ఎకరం భూమిని కేటాయించిందన్నారు. త్వరలోనే ఈ స్థలంలో భవన నిర్మాణ పనులను చేపడతామన్నారు. అనంతరం సంఘం సెక్రటరీ వై.రాందాస్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో 2025 ఆగస్టు 31 వరకు జరిగిన లావాదేవీలు, జమ, ఖర్చులను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో పీఏసీ సభ్యులు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, కొంద్రు స్వప్న శ్రీనివాస్, చాపల యాదగిరి, కొత్త రాంరెడ్డి, కృష్ణారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మాజీ చైర్మన్లు సంరెడ్డి బాల్‌రెడ్డి, కొంతం మల్లారెడ్డి, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్థానిక పోరుకు సిద్ధం కండి

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని లష్కర్‌గూడ గ్రామంలో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి మంచిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ కార్డు గురించి వివరించారు. పార్టీ నాయకులు ఐక్యంగా పనిచేసి, స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, జగదీశ్, చక్రవర్తిగౌడ్, వెంకట్‌రెడ్డి, ధనుంజయగౌడ్, కిరణ్‌కుమార్‌గౌడ్, సాయికుమార్‌గౌడ్, గౌరీశంకర్, రాధాకృష్ణ, రంగయ్య, వివిధ గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని ఇనాంగూడలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పిట్టల బాలశివుడు తండ్రి మాజీ ఉప సర్పంచ్ సత్తయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బాలశివుడిని మంగళవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నార్సింగిలో యువకుడి దారుణ హత్య

- పొడిచి చంపిన స్నేహితులు
- అర్ధరాత్రి వరకు మద్యం తాగి..ఫోన్ గురించి గొడవ
- చోరీ చేసిన ఫోన్ తిరిగివ్వాలన్నందుకు ఘాతుకం


యాదగిరి(ఫైల్)

మణికొండ: ఓ సెల్‌ఫోన్ చోరీ వ్యవహారం యువకుడి హత్యకు దారి తీసింది. అర్ధరాత్రి వరకు ముగ్గురు స్నేహితులు కలిసి అతిగా మద్యం తాగి మత్తులో గొడవ పడ్డారు. చోరీ చేసిన ఫోన్‌ను తిరిగి ఇచ్చేయాలని చెప్పిన యువకున్ని మరో ఇద్దరు యువకులు దారుణంగా కత్తితో దాడి చేసి హత్య చేసిన సంఘటన నార్సింగి - కోకాపేట రోడ్డులోని డబుల్ బెడ్ రూం గృహాల సముదాయం పక్కన సోమవారం అర్ధరాత్రి జరిగింది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ..షాద్‌నగర్‌కు చెందిన కాశారం యాదగిరి(24), కిషన్‌బాగ్‌కు చెందిన అఫ్రోజ్, నవాజ్‌ల కుటుంబాలకు 11 నెలల క్రితం నార్సింగిలో డబుల్ బెడ్‌రూంలు మంజూరు కావటంతో ఇక్కడే పక్కపక్కనే నివసిస్తున్నారు. ముగ్గురు స్నేహితులు కలిసి మూడు రోజుల క్రితం నార్సింగిలో మరో యువకున్ని కొట్టి సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. దాన్ని యాదగిరి వ్యతిరేకించాడు. అది తిరిగి ఇచ్చేయాలని పట్టుపట్టాడు. అప్పటికే దాన్ని అమ్మేసిన హంతులకు విషయం యాదగిరి బయటపెడతాడని భావించి సోమవారం రాత్రి వారి గృహాలకు సమీపంలోనే నిర్మానుష్య ప్రాంతంలో మద్యం తాగుదామని అతన్ని పిలిచారు. వింటే సరే లేదంటే హత్య చేయాలని పథకం వేసుకున్నారు.

మద్యం తాగించి హత్య..

తమ పథకంలో భాగంగా మృతుడు యాదగిరికి ఎక్కువగా మద్యం తాగించి మత్తు ఎక్కేలా చేశారు. తర్వాత వారి వద్ద సిద్ధంగా ఉన్న కత్తులతో విచక్షణారహితంగా పొడిచారు. నొప్పి తాళలేక గట్టిగా అరవడంతో డబుల్ బెడ్ రూంలలో నివసిస్తున్న వారు సంఘటనా స్థలానికి వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108ను రప్పించి ఆసుపత్రికి తరలించే ప్రయత్నంలోనే అతను ప్రాణాలు కోల్పోయాడు. దాంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నిందితులలో ఒకడైన అఫ్రోజ్‌పై ఆర్‌జీఐ, బహదూర్ పురా పోలీస్‌స్టేషన్‌లలో పాత కేసులు ఉన్నాయని సీఐ తెలిపారు. నిందితులనిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

గొంతు కోసుకొని మహిళ ఆత్మహత్య

- భర్త అనారోగ్యంతో తీవ్ర మనస్తాపం
- వైద్యం కోసం వచ్చి హోటల్‌లో ఆత్మహత్య


ప్రణీత శర్మ (ఫైల్)

గచ్చిబౌలి: భర్త అనారోగ్యం బారిన పడటంతో తీవ్ర మనస్తాపానికి గురైన అస్సాంకు చెందిన ఓ మహిళ హోటల్‌లో గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్తకు వైద్యం చేయించేందుకు వచ్చి బలవన్మరణానికి పాల్పడిన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అస్సాం, లఖింపూర్ జిల్లాకు చెందిన అడ్వకేట్ అపూర్వ జ్యోతి శర్మ ఆరు నెలలుగా కాలేయ సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. భార్య ప్రణీత శర్మ(45), ఆమె సోదరి భర్తతో కలిసి గచ్చిబౌలిలోని ఏఐజీ హస్పిటల్‌లో ఈ నెల 20న చేర్పించారు. ఏఐజీలో చికిత్స తీసుకుంటూ గచ్చిబౌలిలోని బాబుఖాన్ లేన్‌లోని ఆకాశ్ హోటల్ రూమ్ నెంబర్ 303లో ఉంటున్నారు. ఈ నెల 25న సోదరి భర్త స్వగ్రామానికి వెళ్లిపోయాడు. అపూర్వ జ్యోతి శర్మకు ట్రీట్‌మెంట్ పూర్తి కావడంతో మంగళవారం తిరిగి వెళ్లాల్సి ఉంది. సోమవారం రాత్రి హోటల్‌లో నిద్రకు ఉపక్రమించిన భర్త 11.30 గంటల సమయంలో లేచి చూడగా భార్య కనిపించలేదు. బాత్‌రూమ్ డోర్ వెనక గడియ పెట్టి ఉండటంతో ఎంత పిలిచినా పలక లేదు. తలుపు తెరిచేందుకు ప్రయత్నించగా వీలు కాలేదు. పక్క గదిలో ఉన్న వారి సహాయంతో డోర్ పగులగొట్టి చూడగా గొంతు కోసుకొని తీవ్ర గాయంతో అపస్మారక స్థితిలో పడి ఉంది. వెంటనే ఏఐజీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందింది. లివర్ వ్యాధితో భర్తకు ప్రాణ భయం ఉంటుందేమోనని ఆలోచిస్తూ తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైందని, సోమవారం రాత్రి దేవున్ని ప్రార్థించిందని, అనంతరం ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆమె తరఫు బంధువులు వచ్చిన తరువాత కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. మృత దేహన్ని ఏఐజీ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం స్వామివారిని ముత్యపు పందిరి వాహనంలో భక్తులు ఊరేగించగా, సాయంత్రం నిర్వహించిన రథోత్సవం వేడుకగా జరిగింది. బాణాసంచా కాంతుల్లో, డప్పు చప్పుళ్ల హోరులో స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. శ్రీనగర్‌కాలనీలోని ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర స్థానికంగా అన్ని వీధుల్లో కొనసాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ముత్యపు పందిరి వాహనంలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

దసరా ఆఫర్ కాదు.. ఎలక్షన్ల పండగ సూపర్..



కార్మికనగర్‌లో వెలసిన ఫ్లెక్సీ

శ్రీనగర్‌కాలనీ: ఎటుచూసినా దసరా, దీపావళి ఆఫర్లే.. ఇది కొంటే అది ఫ్రీ.. అది కొంటే ఇది ఫ్రీ.. రోడ్డుపైకి వెళ్తే చాలు పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ మొదలు చిన్న షాపుల వరకు ఎటు చూసినా బ్యానర్లు, పోస్టర్లే.. ప్రజలు కూడా పెద్దఎత్తున షాపింగ్ చేసి ఆఫర్లను పొందుతున్నారు. అయితే.. ఈ ఫ్లెక్సీ చూసిన వారు మాత్రం కాస్త ఆశ్చర్యానికి గురవుతున్నారు. రహమత్‌నగర్ డివిజన్‌లోని కార్మికనగర్‌లో స్థానిక కాంగ్రెస్ నేత మల్లేష్‌యాదవ్ కేబుల్ డీటీహెచ్‌ను డివిజన్‌లోని పలు గల్లీల్లో సరఫరా చేస్తున్నారు. మాకు ఓటు వేయండి.. మీకు కేబుల్ డీటీహెచ్ ఫ్రీ, పాత కనెక్షన్స్‌తో పాటు కొత్త కనెక్షన్స్ కూడా ఫ్రీగా ఇస్తామని మంగళవారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఆకట్టుకుంటోంది. మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యదవ్ శిష్యుడైన మల్లేష్‌యాదవ్ తన అన్నకు టికెట్ వస్తుందనే ఆశతో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండి.. ఫ్రీగా డీటీహెచ్ పొందండి అంటూ ప్రచారం నిర్వహిస్తున్నాడు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎవరు ఎన్ని హామీలు ఇస్తారో వేచి చూడాల్సిందే..

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శ్రీనగర్‌కాలనీ: ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ సూచించారు. గణపతి కాంప్లెక్స్‌తో పాటు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు బస్తీల్లో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాలను సందర్శించారు. వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. నేతలు ఈఎల్ రామయ్య, మన్మోహన్, కాలయ్య, లక్ష్మీరెడ్డి, సుధాకర్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

2 నుంచి గోల్ఫ్ టోర్నమెంట్

పంజగుట్ట: ఆర్మీ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వచ్చేనెల 2 నుంచి 4వ తేదీ వరకు ఆర్మీ ఇంజనీరింగ్, ఇంటర్ – సైనిక్ స్కూల్ పూర్వ విద్యార్థుల గోల్ఫ్ టోర్నమెంట్ 2025 నిర్వహిస్తున్నట్లు స్టాల్వర్ట్స్ గోల్ఫ్ డైరెక్టర్ బ్రిగేడియర్ ధరమ్‌వీర్ సింగ్ తెలిపారు. గచ్చిబౌలిలోని బోల్డర్ హిల్స్ గోల్ఫ్ అండ్ కంట్రీ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీలకు దేశవ్యాప్తంగా సైనిక్ స్కూల్స్ నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు స్నేహభావంతో గోల్ఫ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. 36 సంవత్సరాల నుంచి 76 సంవత్సరాల వయస్సు ఉన్న వారు పోటీల్లో పాల్గొంటారని, సుమారు 130 మంది పాల్గొనే పోటీలను గోల్డ్, డైమండ్, ప్లాటినం మూడు విభాగాలుగా విభజించామన్నారు.



దుర్గాదేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి



దుర్గాదేవిగా శ్రీనగర్‌కాలనీ భ్రమరాంబికా దేవి



దుర్గాదేవిగా బంజారాహిల్స్‌లోని కనకదుర్గా దేవి అమ్మవారు



విజయగణపతి స్వామి ఆలయంలోని అమ్మవారు

దుర్గాదేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి



జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడిలో అమ్మవారిని దర్శించుకుంటున్న కేటీఆర్ దంపతులు



గాయత్రిహిల్స్‌లో అమ్మవారి మండపం వద్ద పూజల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అమ్మవారి ఆలయాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. తొమ్మిదో రోజు అమ్మవారు భక్తులకు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా ఆలయానికి తరలివచ్చారు. – బంజారాహిల్స్





ఫిలింనగర్ దైవసన్నిధానంలో చండీ హోమంలో భక్తులు



బంజారాహిల్స్‌లోని తట్టికాన వాటర్ సెక్షన్ కార్యాలయంలో ఆయుధ పూజలో జలమండలి జీఎం ప్రభాకర్



నందినగర్ గ్రౌండ్‌లో అన్నదానంలో మాజీ కార్పొరేటర్ భారతి నాయక్



మాగంటికాలనీ విజయ కనకదుర్గా దేవి ఆలయంలో సామూహిక కుంకుమార్చన



జలమండలిలో అమ్మవారి పూజల్లో యూనియన్ సభ్యులు



రహమత్‌నగర్‌లో పూజలు నిర్వహిస్తున్న మాగంటి అక్షర, దిషిర

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి బుధవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.15.30 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, నాలాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పాటుపడే ప్రభుత్వమని కొనియాడారు. రహమత్‌నగర్ డివిజన్‌లోని ప్రధాన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు భవానీశంకర్, నవీన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం

లక్డీకాపూల్: నిమ్స్‌లో ఉద్యోగం చేస్తున్న పలువురు ఉద్యోగులు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతివీర్ ఉద్యోగులను ఘనంగా సత్కరించి, వారు ఆస్పత్రికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఉద్యోగుల విరమణ పొందుతున్న వారిలో డా.పి.ఉషారాణి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్. అంజలి దేవి, లాబ్ టెక్నీషియన్ అప్పారి శ్రీధర్, ఎలక్ట్రికల్ హెల్పర్ యం.రమేష్ ఉన్నారు. కార్యక్రమంలో డా.మౌనిక, ఫయాజ్, ఫైనాన్స్ ఆఫీసర్ మోహన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు దయాకర్, సుజాత, ఉమేష్, ఏఎస్ జ్యోతి శైలజ, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, భరత్ భూషణ్, శాంతి, నర్సింగ్ యూనియన్ ఆశలత, కేజియా తదితరులు పాల్గొన్నారు.



నిమ్స్‌లో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

ట్రైనింగ్‌లో చేరిన రోజే బైక్‌తో ఉడాయించాడు

ఫిలింనగర్: శిక్షణలో చేరిన రోజే ఓ డెలివరీ బాయ్ బైక్‌తో ఉడాయించిన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆసిఫ్‌నగర్ మంగళహాట్ నటరాజనగర్‌కు చెందిన పి.దీపక్(28) డెలివరీ బాయ్‌గా డామినోస్ పిజ్జాలో ఈ నెల 19వ తేదీన చేరాడు. ట్రైనింగ్ భాగంగా దీపక్‌సింగ్‌ను కూకట్‌పల్లి వివేకానందనగర్‌లో ఓ ఫుడ్ ఆర్డర్ ఉండటంతో ప్రవీణ్ అనే డెలివరీబాయ్‌తో కలిసి పంపించారు. ప్రవీణ్ ఫుడ్ తీసుకుని కస్టమర్ ఇంటికి వెళ్లగా, దీపక్ కిందనే బైక్‌పై కూర్చొన్నాడు. డెలివరీ అనంతరం ప్రవీణ్ కిందికి వచ్చిచూడగా బైక్‌తో పాటు దీపక్ కనిపించలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో రెస్టారెంట్ మేనేజర్ నగేష్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిలింనగర్ డీఐ వెంకట్, కానిస్టేబుళ్లు రాంచందర్, సందీప్‌సింగ్‌ల సహాయంతో కేసును ఛేదించారు. బైక్ చోరీ చేసిన దీపక్‌ను అరెస్టు చేసి విచారించగా గతంలో ఎక్సైజ్ పోలీసులు ఓ బైక్ దొంగతనం కేసులో జైలుకు తరలించినట్లు తేలింది. నిందితుడి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకుని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం



లక్డీకాపూల్: నిమ్స్‌లో ఉద్యోగుల సమస్యలు ఐక్యతతో పరిష్కారమవుతాయని నిమ్స్ టెక్నికల్, నాన్ టెక్నికల్ కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో బ్యూటిఫికేషన్ నేపథ్యంలో యాజమాన్యం ఉద్యోగ సంఘాల స్థూపాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో నిమ్స్ మెయిన్ గేట్ లోపల ప్రాంతంలో సరికొత్తగా నిర్మించిన స్థూపాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలపై ప్రధానం వేతనాల పెంపుదలపై ఏళ్ల తరబడి పోరాడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ క్రమంలో ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరణ అంశంలో సీనియారిటీ ప్రాతిపదికన సమన్యాయం పాటించాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చే ఇందిరమ్మ క్యాంటిన్



రహమత్‌నగర్: ఇందిరమ్మ క్యాంటిన్‌తో పేదల ఆకలి తీరుతుందని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. బోరబండ డివిజన్‌లోని సైట్–3లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటిన్‌ను ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బుధవారం ప్రారంభించారు. రూ.5లకే బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్న హరేరామ హరే కృష్ణ సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



బతుకమ్మ వేడుకల్లో కాంగ్రెస్ మహిళా నాయకురాలు కంజర్ల విజయలక్ష్మి

బతుకమ్మ బతుకమ్మ.. ఉయ్యాలో..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో బతుకమ్మ శోభ సంతరించుకుంది. మహిళల రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి అందంగా తయారు చేశారు. సాయంత్రం బతుకమ్మ వద్ద గౌరమ్మ పెట్టి పూజలు చేశారు. అనంతరం యువతులు, మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. బతుకమ్మ ఆటపాటలతో కాలనీలు, బస్తీల్లో సందడి వాతావరణం నెలకొంది.
– ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ జోన్ బృందం



గౌరిశంకర్ కాలనీలో..



ద్వారకామాయి అపార్ట్‌మెంట్‌లో బతుకమ్మ వేడుకల్లో మహిళలు



రామకృష్ణానగర్‌లో బతుకమ్మతో..



కృష్ణకాంత్‌పార్క్ వద్ద ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, నవీన్‌యాదవ్

సమష్టిగా పనిచేస్తే బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ



కార్యకర్తలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

శ్రీనగర్‌కాలనీ: బూత్ కమిటీలు సమష్టిగా పనిచేస్తే బీఆర్ఎస్ భారీ మెజార్టీ సాధ్యమని ఎర్రగడ్డ డివిజన్ ఇన్‌చార్జి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎర్రగడ్డలోని షంషీర్ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, మాజీ సీఎం కేసీఆర్ ప్రజల కోసం ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించాలని కోరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు మోసపూరిత కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు. దివంగత మాగంటి గోపీనాథ్‌కు నివాళిగా ఆయన సతీమణి మాగంటి సునీతను గెలిపించి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గులాబీ జెండా మరోసారి ఎగురవేయాలన్నారు. నేతలు రాగిడి లక్ష్మారెడ్డి, సతీష్ అరోరా, డి.సంజీవ, షరీఫ్ ఖురేషి, కూకట్‌పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో ముస్లింలకు చేసిందేమీ లేదు



కుట్టు మిషన్లు అందజేస్తున్న మంత్రులు పొన్నం, లక్ష్మణ్, వివేక్

రహమత్‌నగర్: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ముస్లిం మైనారిటీలకు చేసిందేమీ లేదని, రెండు సంవత్సరాల తమ ప్రభుత్వ పాలనలో ముస్లింల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వారికి అండగా నిలిచిందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. రహమత్‌నగర్ డివిజన్ హెచ్ఎఫ్‌నగర్‌లో ఫంక్షన్ హాల్‌లో బుధవారం మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి మంజూరైన కుట్టు మిషన్లను ఆయన మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామితో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ఆరు గ్యారంటీలు ప్రవేశపెట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కుట్టుమిషన్లు పొందిన మహిళలు వాటి ద్వారా ఉపాధి పొందాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు మోసపూరిత మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల ఫలితాలే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పునరావృతం కావడం ఖాయమన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దాదాపు రూ.140 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. 450 మంది మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు ఓబేదుల్లా కొత్వాల్, దీపక్ జాన్, ఫయిమ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అజహరుద్దీన్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో పెరిగిన ఓటర్లు



సమావేశంలో డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి సంబంధించి భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్, జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ జి.రజనీకాంత్ రెడ్డి మంగళవారం తుది ఓటర్ల జాబితాను విడుదల చేశారు. దీనికి సంబంధించిన జాబితాను జీహెచ్ఎంసీ సర్కిల్–19 కార్యాలయంలో జరిగిన అన్ని పార్టీల(ఆల్‌పార్టీస్) సమావేశంలో హాజరైన నాయకులకు అందజేశారు. వివిధ కేంద్రాల్లో ఈ జాబితాను ప్రచురించడం, యూసుఫ్‌గూడ కార్యాలయంలో నోటీసు బోర్డులో అంటించడం జరిగింది. అసెంబ్లీ నియోజవకర్గంలో మొత్తం 3,98,982 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఈ ఏడాది జనవరిలో విడుదల చేసిన జాబితా ప్రకారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 9 నెలల్లో ఓటర్లు గణనీయంగా పెరిగారు. జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రసీద, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు బాల్‌రాజ్, కమాల్, ప్రేమ్‌కుమార్, వివిధ పార్టీలకు చెందిన నేతలు తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో అగ్రస్థానంలో అధికారులు తెలిపారు.

సాక్షి సిటీ ప్లస్
12
హైదరాబాద్‌, బుధవారం, 1, అక్టోబర్‌, 2025





క్యూట్ క్యాట్.. ఒత్తిడి సెట్..

నగరంలో క్యాట్ థెరపీకి పెరుగుతున్న డిమాండ్

దేశంలోనే ప్రప్రథమంగా హైదరాబాద్‌లో ఆవిష్కృతం

మానసిక ప్రశాంతత కోసం పిల్లుల థెరపీ

యుఎస్, జపాన్, కెనడా వంటి దేశాల్లో గ్లోబల్ ట్రెండ్



జంతువులపై ప్రేమతో సిటీకి పరిచయం చేసిన పశువైద్యుడు

ఫిజియోథెరపీ..

లాఫింగ్ థెరపీ.. ఫిష్ థెరపీ గురించి వినే ఉంటారు.. కానీ 'క్యాట్ థెరపీ' గురించి ఎప్పుడైనా విన్నారా..!? ఔను ప్రస్తుతం హైదరాబాద్ నగరవాసులు వినడమే కాదు ప్రత్యక్షంగా చూడబోతున్నారు. ఆ క్యాట్ థెరపీని ఆస్వాదించనున్నారు. ఉరుకులు పరుగుల నగర జీవితం.. తీవ్ర ఒత్తిళ్లతో అలసిపోయిన మనసుకు కాసేపు మానసిక ప్రశాంతత కోరుకోని వారెవరూ ఉండరంటే అతిశయోక్తి కాదేమో? అయితే మానసిక ప్రశాంతతకు పెంపుడు జంతువుల మధ్య గడపడం ఓ చక్కని పరిష్కారమని, ఎటువంటి మందులూ నయం చేయలేని నిరాశ నిస్పృహలు, ఒత్తిడి, ఆందోళన, మానసిక సమస్యలను జంతువులు దూరం చేస్తాయని చెబుతున్నారు నిపుణులు. క్యాట్ థెరపీ మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సులభమైన మార్గమని, దీనికోసం యజమానులు తమ పిల్లులకు శిక్షణ ఇచ్చి, పెట్ పార్ట్‌నర్స్ వంటి సంస్థల ద్వారా సేవలను అందిస్తారు. ఎన్నో జీవన వైవిధ్యాలకు వేదికైన మన నగరంలో క్యాట్ థెరపీలు సైతం హాయ్ చెప్పడం ఇక్కడి జీవనశైలికి నిదర్శనంగా నిలుస్తోంది.

– సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్‌లో రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇదే ఏడాది ప్రాయణీకుల ఒత్తిడిని తగ్గించేందుకు డాగ్ థెరపీ పేరుతో ప్యాసింజర్స్ లాంజ్‌లో క్యూట్ క్యూట్ పప్పీస్‌ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో ప్రస్తుతం నగరంలో క్యాట్ థెరపీని అందుబాటులోకి తెస్తున్నారు క్యాట్స్ కంట్రీ నిర్వాహకులు. మానసిక సమస్యలకు జంతువుల థెరపీ చక్కని పరిష్కారమని పలు అధ్యయనాలు సైతం వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే వివిధ దేశాల్లో వినూత్నంగా క్యాట్ థెరపీ కేంద్రాలు ప్రారంభమవుతున్నాయి. మానసిక ప్రశాంతతకు దోహదం చేసే ఈ క్యాట్ థెరపీ కేంద్రాలు దేశంలో మొట్టమొదటి సెంటర్ హైదరాబాద్‌లో ఆవిష్కృతం కావడం విశేషం.

క్యాట్స్ కంట్రీ.. దేశంలో ప్రథమం..

ఇప్పటివరకూ యుఎస్, జపాన్, కెనడా, థాయిలాండ్, ఇండోనేషియాలకే పరిమితమైన క్యాట్ థెరపీ సేవలు దేశంలో మొట్టమొదటిసారి హైదరాబాద్‌లో అందుబాటులోకి వచ్చాయి. కుతుబ్‌షాహీ 7 టూమ్స్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ఇటీవల్లే అంతర్జాతీయ పిల్లుల దినోత్సవం (ఇంటర్నేషనల్ క్యాట్స్ డే–ఆగస్టు–8) రోజున ప్రారంభమైంది. కుక్కలు, పిల్లులు లాంటి పెంపుడు జంతువుల మధ్య గడపడం, వాటితో ఆడుకోవడం ఎంతో సంతోషాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. తీవ్ర ఒత్తిడి, మానసిక సమస్యలతో బాధపడే వారికి ఇది ఉపశమనం కలిగిస్తుంది. అంతర్జాతీయంగా ప్రముఖ అధ్యయన సంస్థలు సైతం ఈ విషయాన్ని ధ్రువీకరించాయి.

50 రకాలకు పైగా పిల్లులు..

ప్రస్తుతం ఉరుకులు పరుగులతో కూడిన నగర జీవితంలో.. తమతో పాటు పెంపుడు జంతువులను పెంచుకునే వెసులుబాటు తక్కువే. అలాంటి వారు ఈ కేంద్రంలో సేవలు పొందవచ్చు. ఇక్కడ 50కి పైగా పర్షియన్ జాతికి చెందిన పిల్లులు ఉన్నాయి. ఇవన్నీ మానవులతో స్నేహంగా మెలుగుతాయి. మీతో ఆడుకుంటాయి.. గారాబం చేస్తాయి. వీటి మధ్య గడిపి నూతనోత్తేజాన్ని పొందవచ్చు. దీనినే క్యాట్ థెరపీ అంటారు. ఇవన్నీ వ్యాక్సినేషన్ చేసిన ఆరోగ్యవంతమైన పిల్లలు. కాబట్టి వీటితో ఎలాంటి ప్రమాదం ఉండదని నిర్వాహకులు చెబుతున్నారు. ఒక గంటకు అత్యధికంగా ఐదుగురికి మాత్రమే ప్రవేశం ఉండే ఈ సెంటర్‌లోకి వెళ్లాలంటే అధికారిక వెబ్‌సైట్‌లో ముందుగా.. స్లాట్ బుక్ చేసుకోవాలి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.. స్లాట్ బుక్ చేసి ఈ కేంద్రాన్ని ఎప్పుడైనా సందర్శించవచ్చు.







వృత్తిలో సంతృప్తితో.. వినూత్నంగా..




"స్వార్థపరుల ప్రపంచంలో నుంచి.. నిస్వార్థ జంతువుల ప్రపంచంలోకి రండి. కాసేపు మా ఆత్మీయమైన పిల్లులతో గడపండి. వయసును మర్చిపోయి కాసేపు బాల్యంలోకి వెళ్లండి. మిమ్మల్ని నిస్వార్థంగా ప్రేమించేందుకు, అలసిపోయిన మనసుకు కాస్త ప్రశాంతత కలిగించేందుకు, ఆటలు ఆడుకునేందుకు మా పిల్లులు సిద్ధంగా ఉన్నాయి. 35 సంవత్సరాల పాటు పశు సంవర్ధక శాఖలో వైద్యుడిగా పని చేసిన అనుభవంతో.. ఉద్యోగ విరమణ అనంతరం దీనిని ప్రారంభించాను. జంతువులతో మమేకమైన మనసు వాటితోనే సహవాసం, ఆత్మీయతను కోరుకుంటోంది అనడానికి నా ప్రయాణం ఒక ఉదాహరణ. మా వెబ్‌సైట్ www. CatsCountry. in లో దీనికి సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చు."

– ముహమ్మద్ యాకుబ్ షరీఫ్, క్యాట్స్ కంట్రీ వ్యవస్థాపకులు

పెయింట్ ది సిటీ పింక్..

రొమ్ము కేన్సర్‌పై అవగాహన కోసం







సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ రొమ్ము కేన్సర్ అవగాహనకు అక్టోబర్ నెలను గుర్తిస్తున్న నేపథ్యంలో నగరానికి చెందిన స్వచ్ఛంద సంస్థ ఉషలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'పెయింట్ ది సిటీ పింక్' వార్షిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా నగరంలోని పలు ప్రసిద్ధ భవనాలను పింక్ లైటింగ్‌తో కాంతులీనేలా చేశారు. వీటిలో చార్మినార్, బుద్ధ విగ్రహం, టీ–హబ్, ప్రసాద్ ఐమ్యాక్స్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్, కిమ్స్ హాస్పిటల్స్ వంటివి ఉన్నాయి. ప్రసిద్ధ భవనాలను గులాబీ రంగు లైట్లతో వెలిగించడం ద్వారా నగరవాసుల దృష్టిని ఆకర్షించడం, రొమ్ము కేన్సర్ పై అవగాహన, ఆసక్తి కలిగించడం సంబంధిత లక్ష్యాలతో దీనిని గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ సీఈఓ, డైరెక్టర్ డాక్టర్ పి.రఘురామ్ తెలిపారు.



ఉత్కంఠగా క్లోజ్డ్ స్క్వాష్..

విజేతలుగా ధ్రువ్ కుమార్ గంగశెట్టి, ఆర్యా ద్వివేది..

ముగిసిన గేమ్‌పాయింట్ తెలంగాణ స్టేట్ చాంపియన్‌షిప్

సాక్షి, సిటీబ్యూరో: నగర వేదికగా గేమ్‌పాయింట్, టీఎస్ ఆర్ఏ, ఎస్ఆర్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గేమ్‌పాయింట్ తెలంగాణ స్టేట్ క్లోజ్డ్ స్క్వాష్ చాంపియన్‌షిప్–2025'లో ధ్రువ్ కుమార్ గంగశెట్టి, ఆర్యా ద్వివేది విజేతలుగా నిలిచారు. పురుషుల విభాగం ఫైనల్లో ధ్రువ్ కుమార్ అద్భుత ఆటతీరుతో నసీం అలీని వరుస సెట్లలో (12–10, 11–6, 11–6) ఓడించి విజేతగా నిలిచాడు. మహిళల ఫైనల్ ఈ గేమ్‌పాయింట్ తెలంగాణ స్టేట్ క్లోజ్డ్ స్క్వాష్ చాంపియన్‌షిప్ 2025లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సోదరీమణులు ఆర్యా, ఆర్నా ద్వివేది మధ్య ఉత్కంఠభరితంగా ఐదు సెట్ల పోరు జరిగింది. చివరికి ఆర్యా 11–5, 9–11, 5–11, 14–12, 11–9 స్కోర్లతో గెలిచి టైటిల్‌ను దక్కించుకుంది. ఈ పోరు రాష్ట్రంలోని స్క్వాష్ క్రీడపై ఉన్న అభిరుచి, ప్రతిభను ప్రతిబింబించాయి. ఈ ఫైనల్స్‌కు తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరై విజేతల అభినందించారు. ఈ సందర్భంగా గేమ్‌పాయింట్ సీఈవో ఆదిత్య రెడ్డి మాట్లాడారు. ఈ చాంపియన్‌షిప్.. ప్రతిభతో పాటు రాష్ట్రంలో పెరుగుతున్న స్క్వాష్ గేమ్‌కు ఒక వేడుకని తెలిపారు. దీనికి సంబంధించి ప్రపంచ స్థాయి సదుపాయాలు, అవకాశాలు కల్పించి తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒక బలమైన స్క్వాష్ కేంద్రంగా మార్చడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

టాయ్‌పప్పీ స్ఫూర్తితో..



లెదర్ ఫ్యాషన్ యుటిలిటీ ఆవిష్కరణ

ఎఫ్‌డీడీఐ విద్యార్థి స్నిగ్ధప్రియ నైపుణ్యం

రాయదుర్గం: టాయ్ పప్పీ స్ఫూర్తితో మినీ లెదర్ బ్యాగ్ రూపకల్పన చేసింది ఎఫ్‌డీడీఐ విద్యార్థిని స్నిగ్ధప్రియ. తనలోని నైపుణ్యానికి పదునుపెట్టి తనదైన శైలిలో నూతన ఆవిష్కరణకు శ్రీకారం చుట్టింది. మినీబ్యాగ్, స్లింగ్ బ్యాగ్, స్పెక్స్‌హోల్డర్‌ను తయారుచేసి తన క్రియేటివిటీని చాటింది. వీటిని రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్‌లో మంగళవారం ప్రదర్శించారు. కాగా స్నిగ్ధప్రియ ఎఫ్‌డీడీఐలో బీ.డీఈఎస్ లైఫ్‌స్టైల్ యాక్సెసరీస్ డిజైనర్ కోర్సులో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ తేజ్‌లోహిత్‌రెడ్డి, ఫ్యాకల్టీ ప్రోత్సాహంతో వీటిని ఆవిష్కరించినట్లు ఆమె తెలిపారు.



ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలి..

భవిష్యత్తులో మంచి ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలన్నదే నా లక్ష్యం. ఆర్టిఫీషియల్ లెదర్‌తో ఈ మూడింటినీ తయారు చేశాను. టాయ్‌పప్పీ స్ఫూర్తితో వీటికి రూపకల్పన చేశాను. మినీ బ్యాగు తయారీకి ఆరు ఇంచుల లెదర్, ఒక బటన్ అవసరమైంది. దీనికి రూ.51 వ్యయం చేశాను. దీనికి స్పెక్స్ హోల్డర్‌గా నామకరణం చేశాను. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ క్యాంపస్ నూతన ఆలోచనలను, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది.

– స్నిగ్ధప్రియ, ఎఫ్‌డీడీఐ విద్యార్థి



మచుపిచ్చుపై.. నగర బృందం..

బంజారాహిల్స్: నగరానికి చెందిన 15 మంది బృందం పర్వతారోహణ చేసి విజయవంతంగా నగరానికి తిరిగొచ్చారు. 50 సంవత్సరాల పైబడ్డ వీరంతా రెండేళ్ల క్రితం ఎవరెస్టు బేస్ క్యాంప్ అధిరోహించి విజయవంతంగా తిరిగొచ్చారు. ఈ క్రమంలో రెండేళ్ల తర్వాత మచుపిచ్చు సాహస యాత్రకు శ్రీకారం చుట్టారు. సెప్టెంబర్ 4న ఈ యాత్రకు వెళ్లిన బృందం సెప్టెంబర్ 16న తిరిగొచ్చింది. మచుపిచ్చు అనేది ప్రపంచంలోని ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో ఒకటి. ఇది దక్షిణ అమెరికా దేశం పెరూలో ఉంది. మచు పిచ్చు సముద్ర మట్టానికి 2,430 మీటర్ల ఎత్తునున్న 15వ శతాబ్దపు ఇంకా సామ్రాజ్యం. ఇది పెరూలోని మచుపిచ్చు జిల్లా, ఉరుబంబా ప్రావిన్స్, కుస్కో ప్రాంతంలో ఉంది. 80 కిలోమీటర్ల దూరంలోని (50 మైళ్లు) కుస్కోకు వాయువ్యంగా పవిత్రలోయపై ఒక పర్వత శిఖరంపై ఉంది. దీని ద్వారా ఉరుబంబా నది ప్రవహిస్తోంది. ఎక్కువ మంది పురాతత్వ శాస్త్రవేత్తలు మచుపిచ్చు ఇంకా చక్రవర్తి పాచాకుటి (1438–1472) కోసం నిర్మించిన ఒక ఎస్టేట్ అని నమ్ముతారు.



ఫిట్‌నెస్ ప్రతీకగా..

ఈ సాహసయాత్రలో ఇక్ఫాయ్ డైరెక్టర్ సుధాకర్‌రావు, డాక్టర్ ప్రవీణ్‌మారెడ్డి, డాక్టర్ శశికాంత్ గోడె, డాక్టర్ నిఖిల్ ఎస్ గడియపాటి, డాక్టర్ గుమ్మి శ్రీకాంత్, డాక్టర్ సల్లేష్‌వితల, డాక్టర్ సంజయ్, ఐటీ ప్రొఫెషనల్స్ విజయభాస్కర్, శివశంకర్, పురుషోత్తం, కృష్ణమోహన్, ప్రసన్నకుమార్, రవి మేడిశెట్టి, అడ్వకేట్ రమేష్ విశ్వనాథ్, కాంట్రాక్టర్ పృధ్వీధర్ పాల్గొన్నారు. సౌత్ అమెరికా–భారత్ (సాంబ) 20 డిగ్రీస్ పేరుతో వీరు ఈ సంస్థను ఏర్పాటుచేసుకున్నారు. ఇక్ఫాయ్ డైరెక్టర్ సుధాకర్‌రావు వీరికి కెప్టెన్‌గా వ్యవహరించారు. మచుపిచ్చు పర్వతం ఆండీస్ పర్వతశ్రేణిలో ఒక భాగం. 48 గంటల పాటు నడక మార్గంలో ఈ పర్వతాన్ని అతికష్టంతో అధిరోహించాల్సి ఉంటుంది. ఫిట్‌నెస్ ప్రతీకగా తాము ఈ పర్వతారోహణ చేపట్టినట్లు వీరు తెలిపారు. ఇదే ఉత్సాహంతో ప్రపంచంలోని మరిన్ని పర్వతాల సాహసయాత్ర చేయనున్నట్లు తెలిపారు.



బ్రైడ్స్ దివాలీ కలెక్షన్..

10 నుంచి హైలైఫ్ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్: బ్రైడ్ కలెక్షన్ పేరుతో హెచ్ఐసీసీ నోవోటెల్ హోటల్లో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి హైలైఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రదర్శనకు సంబంధించిన సన్నాహక పోస్టర్‌ను బంజారాహిల్స్‌లో పలువురు మోడల్స్ మంగళవారం ఆవిష్కరించారు. ఇందులో నటి చాందిని భగ్వనాని, ప్రియాంక చౌదరితో పాటు పలువురు మోడల్స్ పాల్గొని కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్న డిజైనరీ దుస్తులు, ఆభరణాలను ధరించి ర్యాంప్‌వాక్ చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన డిజైనరీ దుస్తులు, ఆభరణాలతో పాటు దివాలీ కలెక్షన్ ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.



క్లుప్తంగా...

సెప్టెంబర్‌లో 23 కేసుల నమోదు

- 22 మంది అవినీతి అధికారుల అరెస్టు: ఏసీబీ

సాక్షి, హైదరాబాద్: అవినీతి అధికారులపై ఏసీబీ కేసుల కొరడా ఝులిపిస్తోంది. సెప్టెంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా 23 కేసులు నమోదు చేసింది. వీటిలో 11 ట్రాప్ కేసులు, రెండు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, రెండు క్రిమినల్ మిస్ కండక్ట్ కేసులు, ఆరు రెగ్యులర్ విచారణలు, రెండు ఆకస్మిక తనిఖీలు ఉన్నట్టు ఏసీబీ డైరెక్టర్ జనరల్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కేసులలో ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సహా 22 మంది ప్రభుత్వ అధికారులను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేసినట్టు పేర్కొన్నారు. ఏసీబీ ట్రాప్ కేసులలో రూ.8,91,000 స్వాధీనం చేసుకోగా..ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రూ.14,05,83,000 విలువైన ఆస్తులు గుర్తించినట్టు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు మొత్తం 203 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు మొత్తం 189 మంది ప్రభుత్వ అధికారులు, 15 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064, వాట్సాప్ నంబర్ 9440446106లో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

నేడు కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఉద్యోగుల 'ఎక్స్' వార్


- ప్రధానితో పాటు రాష్ట్రాల సీఎంలకు హ్యాష్‌ట్యాగ్‌ఎన్‌ఎంవోపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ

సాక్షి, హైదరాబాద్: నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్‌ఎంవోపీఎస్) ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం దేశవ్యాప్త ఆందోళన జరుగుతుందని యూనియన్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ వెల్లడించారు. 'సీపీఎస్ వద్దు... ఓపీఎస్ ముద్దు'హ్యాష్‌ట్యాగ్‌తో భారత ప్రధాని, కేంద్ర మంత్రులు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులను ట్యాగ్ చేస్తూ 'ఎక్స్'ద్వారా ఉద్యోగులు యుద్ధం చేస్తారని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఉద్యోగులు తమ 'ఎక్స్'అకౌంట్ల ద్వారా మెసేజ్‌లు పెట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తారని వెల్లడించారు. టెట్ ఉత్తీర్ణులు కాకపోతే ఉద్యోగం నుంచి ఉపాధ్యాయులను తొలగించాలనే సుప్రీంకోర్టు తీర్పు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని, ఇందుకోసం విద్యాహక్కు చట్టానికి సవరణలు చేయాలని ఎక్స్ వేదికగా టీచర్లు కోరుతారన్నారు.

సున్నా వడ్డీకి సున్నా... ఆడబిడ్డ నిధి ఔట్.. 'స్త్రీనిధి'కి గండం..

మహిళలకు బాబు మోసం!

- ఇప్పటికే ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పూర్తిగా రద్దు
- ఎన్నికల సమయంలో ఇస్తామని చెప్పినవి కూడా ఎగవేత..
- ఇప్పుడు ఆర్బీఐ, చట్ట నిబంధనలకు విరుద్ధంగా 'స్త్రీనిధి'కి ఎసరు



సాక్షి, అమరావతి: హామీలతో మభ్యపుచ్చిన చంద్రబాబు సర్కారు మరోసారి మహిళలను దారుణంగా దగా చేస్తోంది. ఇప్పటికే మాజీ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాలను పూర్తిగా రద్దు చేసిన కూటమి ప్రభుత్వం 1.80 కోట్ల మంది మహిళలకు ఆడబిడ్డ నిధి.. కోటి మందికి పైగా పొదుపు మహిళలకు సున్నా వడ్డీని ఎగరగొట్టింది. తాను అధికారంలోకి వస్తే సున్నా వడ్డీని రూ.3 లక్షల నుంచి ఏకంగా రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తామన్న ఎన్నికల హామీపై సీఎం చంద్రబాబు ఉలుకూ పలుకూ లేకుండా వ్యవహరిస్తున్నారు. ఈ మోసాలు ఇంతటితో ఆగడం లేదు. ఒకపక్క ఎన్నికల హామీలను నెరవేర్చకుండా.. మరోపక్క ఆర్బీఐ, చట్ట నిబంధలనకు విరుద్ధంగా 'స్త్రీనిధి'కి ఎసరు పెడుతున్నారు. స్త్రీనిధి నుంచి మహిళలకు హక్కుగా రావాల్సిన డబ్బులను నిబంధనలకు విరుద్ధంగా మళ్లించి తిరిగి వసూలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. టీడీపీ కూటమి తాము అధికారంలోకి వస్తే ఒక ఇంట్లో ఎంతమంది మహిళలు ఉంటే అంతమందికీ.. ఆడబిడ్డ నిధి కింద ఏటా రూ.18 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ లెక్కన ఓ ఇంట్లో 18 ఏళ్ల దాటిన మహిళలు ఇద్దరు ఉంటే ఏటా రూ.36 వేల చొప్పున ఇవ్వాలి.. అదే నలుగురు ఉంటే రూ.72 వేలు ఇవ్వాల్సి ఉండగా ఈ పథకాన్ని ఎగరగొట్టింది. ఆడబిడ్డ నిధి పథకాన్ని 16 నెలలు దాటినా అమలు చేయలేదు. మరోవైపు.. వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్లపాటు పొదుపు సంఘాల మహిళలకు అమలు చేసిన సున్నా వడ్డీ పథకం సైతం కూటమి సర్కారు వచ్చాక నిలిచిపోయింది. గత ప్రభుత్వం పొదుపు సంఘాల మహిళలు తీసుకునే రుణాలపై రూ.3 లక్షల వరకే సున్నా వడ్డీ అమలు చేసిందని, తాము అధికారంలోకి వస్తే సున్నా వడ్డీ రూ.10 లక్షల దాకా వర్తింపజేస్తామంటూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. కూటమి నేతల హామీ మేరకు ఈ పథకం అమలుకు ఏటా సుమారు రూ.ఆరు వేల కోట్ల దాకా అవసరమని అంచనా. నాడు వైఎస్ జగన్ ప్రభుత్వం ఏటా ఏప్రిల్‌లో ఈ పథకాన్ని అమలు చేసింది. ఎన్నికల కోడ్ కారణంగా 2024 ఏప్రిల్‌లో నిధుల విడుదల నిలిచిపోగా అనంతరం కూటమి సర్కారు ఆ ఏడాది డబ్బులను మహిళలకు బకాయి పెట్టింది. రెండేళ్లకు సంబంధించి ఒక్క సున్నా వడ్డీ పథకం ద్వారానే బకాయిలతో కలిపి సుమారు రూ.7,000 కోట్ల మేర రాష్ట్రంలోని కోటి మందికి పైగా పొదుపు సంఘాల మహిళలకు చెల్లించాల్సి ఉన్నా చంద్రబాబు సర్కారు విడుదల చేయడం లేదు. ఇక ఆడబిడ్డ నిధి పథకం ద్వారా రాష్ట్రంలో దాదాపు 1.80 కోట్ల మంది మహిళలు ఏటా రూ.18 వేలు చొప్పున సాయం పొందేందుకు అర్హులని అంచనా. ఈ హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడంతో మహిళలు ఏటా రూ.32,400 కోట్లు దాకా నష్టపోతున్న పరిస్థితి నెలకొంది. వైఎస్ జగన్ హయాంలో అన్ని సంక్షేమ పథకాలను మహిళలు కేంద్రంగా సంతృప్త స్థాయిలో అమలు చేసి మహిళా సాధికారతకు బాటలు వేశారు. మహిళలకు నేరుగా పథకాలు అందచేయడంతో రూ.1.89 లక్షల కోట్ల మేర డీబీటీ విధానంలో ప్రయోజనం పొందారు. వైఎస్ జగన్ ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందజేసిన రూ.1.70 లక్షల కోట్ల రుణాలు కాకుండా స్త్రీనిధి ద్వారా దాదాపు మరో రూ.13,172 కోట్లు రుణాలు పొదుపు సంఘాల మహిళలకిచ్చింది. ఇక సున్నా వడ్డీ ద్వారా గత ప్రభుత్వ హయాంలో 3.86 కోట్ల మంది మహిళలు దాదాపు రూ.ఐదు వేల కోట్ల మేర ప్రయోజనం పొందారు.

'స్త్రీనిధి'కి ఎసరు..

ఎన్నికల హామీలను నెరవేర్చకుండా మహిళలను మోసం చేస్తున్న చంద్రబాబు సర్కారు మరో మోసపూరిత ఎత్తుగడకు తెర తీసింది. పొదుపు సంఘాల మహిళలు తమ హక్కుగా రుణాలను పొందే 'స్త్రీనిధి'డబ్బులను.. ఆర్బీఐ, చట్ట నిబంధనలకు విరుద్ధంగా 'ఎన్టీఆర్ కళ్యాణలక్ష్మీ''ఎన్టీఆర్ విద్యాలక్ష్మీ'పథకాలకు మళ్లించేందుకు సిద్ధమైంది. నాడు వైఎస్ జగన్ ప్రభుత్వం వైఎస్సార్ కళ్యాణమస్తు–షాదీ తోఫా పథకాల ద్వారా అర్హులకు పూర్తి ఉచితంగా ఆర్థిక సహాయం అందజేస్తే.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పేర్లు మార్చిన ఆ పథకాలకు పొదుపు సంఘాల మహిళలకు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం మాత్రమే ఇవ్వనుంది. దానిపై నాలుగు శాతం వడ్డీతో కలిపి అసలు వసూలు చేసేందుకు సమాయత్తమైంది. గత ప్రభుత్వం వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా కార్యక్రమాల ద్వారా రూ.427.27 కోట్ల మొత్తాన్ని ఆయా లబ్ధిదారులు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని విధానంలో అర్హులకు అందచేయడం గమనార్హం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఏపీ సీఎం సొంత జిల్లాలో అమానుషం..

బాలికపై టీడీపీ మూకల గ్యాంగ్ రేప్

- చిత్తూరులోని అటవీ శాఖ నగరవనం పార్కులో ఘోరం
- ఫారెస్టు ఆఫీసర్లమంటూ బాలిక, స్నేహితుడికి బెదిరింపులు
- స్నేహితుడి గొంతుపై కత్తిపెట్టి.. అతని ఎదుటే దారుణం



చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌రావుతో నిందితుడు కిశోర్


నిందితులు మహేశ్, హేమంత్

సాక్షి, అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు సొంత జిల్లాలో మాటలకందని అమానుషం చోటుచేసుకుంది. చిత్తూరులోని అటవీ శాఖ పార్కులో పట్టపగలు టీడీపీ మూకలు వంతులేసుకుంటూ ఒకరి తర్వాత ఒకరుగా సాగించిన కీచకపర్వానికి ఓ బాలిక జీవితం బలయ్యింది. స్నేహితుడి గొంతుపై కత్తి పెట్టి.. బాలికను బెదిరించి అతని కళ్లెదుటే కామాంధులు ఈ దారుణానికి పాల్పడ్డారు. చిత్తూరులో ఇంటర్ చదువుతున్న 17 ఏళ్ల బాలిక తన స్నేహితుడితో కలిసి సెప్టెంబర్ 25వ తేదీ మధ్యాహ్నం పెనుమూరు క్రాస్‌లోని అటవీ శాఖకు చెందిన నగరవనం పార్కుకు వెళ్లింది. ఇద్దరూ ఓ బెంచీపై కూర్చుని మాట్లాడుకుంటుండగా.. సంతపేటకు చెందిన హేమంత్, మురకంబట్టు అగ్రహారానికి చెందిన మహేశ్, కిశోర్‌తో పాటు మరికొందరు పార్కు లోపలికి వచ్చారు. ఒంటరిగా కూర్చున్న వీరిద్దరి వద్దకు వెళ్లి.. 'మేము ఫారెస్టు ఆఫీసర్లం. మీకు ఇక్కడేం పని? మీపై మాకు అనుమానం ఉంది. స్టేషన్‌కు పదండి'అంటూ బెదిరించారు. తాము స్నేహితులమని.. మాట్లాడుకోవడానికి వచ్చామని చెబుతున్నా వినకుండా.. వారిద్దరినీ పార్కులోని పొదల్లోకి లాక్కెళ్లారు. ప్రతిఘటించిన బాలిక స్నేహితుడిపై దాడి చేశారు. మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కున్నారు. గొంతుపై కత్తి పెట్టి బెదిరించారు. అతడి కళ్లెదుటే యువతిపై ఒకరి తర్వాత ఒకరు వరుసగా లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ దారుణాన్ని తమ ఫోన్లలో చిత్రీకరిస్తూ.. దాదాపు రెండు గంటల పాటు కీచకపర్వం సాగించారు. ముగ్గురు లైంగిక దాడికి పాల్పడగా.. మిగిలిన వారు బాలికను అసభ్యకరంగా తాకుతూ పైశాచిక ఆనందం పొందినట్లు తెలిసింది. ఆ వెంటనే నిందితులంతా అక్కడి నుంచి పారిపోయారు.

పంచాయితీకి ప్రయత్నించిన టీడీపీ నేతలు

ఈ ఘటన గురించి తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు, ఓ కార్పొరేటర్.. గుట్టుచప్పుడు కాకుండా పంచాయితీ చేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అయితే జరిగిన ఘోరాన్ని బాలిక స్నేహితుడు.. తన కుటుంబసభ్యులకు చెప్పాడు. దీంతో అతని కుటుంబసభ్యులు పార్కు సమీపంలోని హోటల్‌లో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించి.. 29వ తేదీన నిందితులను పట్టుకున్నారు. వారికి దేహశుద్ధి చేశారు. ఆ సమయంలో నిందితుల ఫోన్లలో ఘటనకు సంబంధించిన ఏడు వీడియోలను గుర్తించినట్లు తెలిసింది. అంతకుముందు యువకుడి కుటుంబసభ్యులు చిత్తూరు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లగా.. పోలీసులు సరిగ్గా పట్టించుకోకపోవడంతో వాళ్లు వెనుదిరిగినట్లు తెలిసింది. నిందితులకు దేహశుద్ధి జరిగిన విషయం బయటకురావడంతో పోలీసులు.. బాలిక స్నేహితుడి నుంచి సోమవారం రాత్రి ఫిర్యాదు తీసుకున్నారు. కానీ హత్యాయత్నం, దోపిడీ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందితులు ముగ్గురూ టీడీపీ కండువాలతో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌రావు, టీడీపీ నాయకుడు ఎల్‌బీఐ లోకేశ్, కార్పొరేటర్ నవీన్‌తో ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో మంగళవారం సాయంత్రం చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ నాయుడు, సీఐలు శ్రీధర్ నాయుడు, మహేశ్వర మీడియా సమావేశం నిర్వహించారు. బాలిక ఫిర్యాదు మేరకు.. హేమంత్, మహేశ్, కిశోర్ అనే ముగ్గురిపై అత్యాచారం, పోక్సో, అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

మూసీ ప్రాంతాల్లో నిర్మాణాలపై చర్యలు చేపట్టాలి

- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: మూసీ పరీవాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని బీజేపీ మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. మూసీ ఏరియాల్లో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లనే హైడ్రా కూల్చివేసిందని, హైడ్రా అధికారులు అస్మదీయులకు ఒకరకంగా, తస్మదీయులకు మరోరకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మూసీ పరీవాహక ప్రాంతాల్లో అక్రమ కట్టడాల నిర్మాణాలు నిలిచిపోగా, మళ్లీ ఆ నిర్మాణాలకు అనుమతి లభించి నిర్మాణాలు ఊపందుకున్నాయన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, మూసీ నదిని శుద్ధి చేయాలని కలలుగంటున్న సీఎం.. మరోవైపు ఇలాంటి నిర్మాణాలు ఎలా వస్తున్నాయో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి రాసిన బహిరంగలేఖను ఆయన విడుదల చేశారు. మూసీ పారుతున్న ప్రాంతంలో నీటిలో నిర్మాణాలు సాగుతున్న ఫొటోలను రఘునందన్ మీడియాకు ప్రదర్శించారు. నార్సింగిలో ఆదిత్య వింటేజ్ కన్‌స్ట్రక్షన్ నిర్మాణాలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుతో పాటు ఎఫ్ఐఆర్ సైతం నమోదు అయ్యిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణాలకు అనుమతులిస్తే, వాటిని ఆ తర్వాత ఆపేస్తే మళ్లీ ఇప్పుడు అనుమతులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. దీనిపై పూర్తి విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

అక్టోబర్ 7న పాలస్తీనా సంఘీభావ ర్యాలీ

సాక్షి, హైదరాబాద్: పాలస్తీనా భూభాగంపై ఇజ్రాయెల్ దాడికి పాల్పడి అక్టోబర్ 7వ తేదీనాటికి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఇజ్రాయెల్ దాష్టీకాలను ఖండిస్తూ, పాలస్తీనాకు సంఘీభావంగా హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. హైదరాబాద్‌లోని సీపీఎం రాష్ట్రకార్యాలయం ఎంబీ భవన్‌లో సీపీఎం రాష్ట్రకార్యదర్శి జాన్ వెస్లీ అధ్యక్షతన వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర నాయకులు డీజే నరసింహారావు, సీపీఐ నుంచి ఈటీ నర్సింహ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నుంచి పోటు రంగారావు, రమ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ తరుపున జేవీ చలపతిరావు, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకులు వనం సుధాకర్, ఆర్ఎస్‌పీ రాష్ట్రకార్యదర్శి జానకి రాములు, ఎస్‌యూసీఐ(సి) రాష్ట్ర నాయకులు భరత్ పాల్గొన్నారు.

నగర వార్తలు

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో దేనాదబ్రహ్మోత్సవ్ 2025ను పురస్కరించుకుని సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు ప్రముఖ కళాకారులచే అన్నమాచార్య సంకీర్తనలతో నాద నైవేద్యం కార్యక్రమం జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఉద్యానవన శాఖ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హార్టికల్చర్ షో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ హాల్‌లో దసరా పండుగ ప్రత్యేకంగా హ్యాండ్‌లూమ్ ఇండియా పేరిట స్వచ్ఛమైన ఫైబర్ సిల్క్ ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్టప్చర్స్, స్టేకిడ్ స్టోరీస్, దీప్ ఇంటీరియల్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

డీఎంహెచ్ఓగా డాక్టర్ లలితాదేవి!

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి(ఇన్‌చార్జి)గా డాక్టర్ లలితాదేవి నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ డీఎంహెచ్ఓగా పని చేసిన డాక్టర్ బి.వెంకటేశ్వర్‌రావు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఖాళీగా ఉన్న ఈ పోస్టులో డాక్టర్ లలితాదేవిని నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రెగ్యులర్ అధికారి వచ్చే వరకు ఆమె ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.

బాపుఘాట్‌లో మరమ్మతులు చేయరా..?

అధికారులపై మండిపడిన జిల్లా కలెక్టర్


బాపుఘాట్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ హరిచందన

లంగర్‌హౌస్: బాపుఘాట్‌లో చిన్న, చిన్న మరమ్మతులు కూడా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అంటూ అధికారులపై హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి మండిపడ్డారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె మంగళవారం లంగర్‌హౌస్ బాపుఘాట్‌లో పర్యటించారు. బాపు ధ్యాన మందిరం మెట్లు ఊడిపోతుండటంతో కనీసం మరమ్మతులు కూడా చేయకుంటే ఎలా అని అధికారులపై మండిపడ్డారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ హరిచందన ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ధ్యాన మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. బాపు సమాధి వద్ద గవర్నర్, ముఖ్యమంత్రి నివాళులు అర్పించి, ధ్యానమందిరంలో నిర్వహించే సర్వమత ప్రార్థనల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రముఖులు వెళ్లే వరకు స్థానికులకు బాపుఘాట్‌లో ప్రవేశం ఉండదన్నారు. వరదల కారణంగా మునిగిన గాంధీ సమాధిని శుభ్రం చేసి, ఏర్పాట్లు చేయాలని పర్యాటక శాఖ అధికారులకు సూచించారు. అంతకుముందు గాంధీ సమాధి పరిసర ప్రాంతాలను పర్యాటక శాఖ ఎండీ వల్లూరి క్రాంతి పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ డాక్టర్ జి.ముకుందారెడ్డి, గోల్కొండ తహసీల్దార్ అహల్య, ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ వెంకట్రాములు తదితరులు ఉన్నారు.

ఆధునిక విద్యకు మాలవ్యా ప్రోత్సాహం


పేద విద్యార్థినీ, విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులను అందజేసిన రాంచందర్‌రావు తదితరులు

అల్విన్ కాలనీ: సమాజంలో ఆధునిక విద్యను ప్రోత్సహించడానికి పండిట్ మదన్‌మోహన్ మాలవ్యా దార్శనికతతో ముందుకు వెళ్లారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి ఎల్లమ్మబండలోని అక్షయ విద్యా కమ్యూనిటీ లెర్నింగ్ అండ్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో మాలవీయ శిక్ష సేవా ప్రకల్ప్ యోజన కింద పేద విద్యార్థులకు చెక్కులు పంపిణీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు హాజరై పేద విద్యార్థుల కాలేజీ, పాఠశాలల ఫీజుల నిమిత్తం 4 లక్షల 64 వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో విద్యలేని వారు ఉండకూడదనే లక్ష్యంతో ప్రతి పేద విద్యార్థి విద్యను అభ్యసించే విధంగా మదన్‌మోహన్ మాలవ్యా ప్రోత్సహించారని గుర్తుచేశారు. పేదలకు విద్యను అందించడంలో మాలవ్యా విద్యా ఫౌండేషన్, అక్షయ విద్యా కమ్యూనిటీ లెర్నింగ్ అండ్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుంచే పిల్లలను సరైన దిశలో పెంచటానికి అక్షయ ఫౌండేషన్ నిర్వాహకులు చేస్తున్న కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాలవ్యా మిషన్ హైదరాబాద్ అధ్యక్షుడు పదమ్‌చంద్ జైన్, జనరల్ సెక్రటరీ గోపాల్‌రెడ్డి, బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, నాయకులు నర్సింగ్ యాదవ్, నరేందర్‌రావు, నరేందర్‌రెడ్డి, కుమార్ యాదవ్, చారి తదితరులు పాల్గొన్నారు.

- **అభినందనలు**


హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వీసీ సజ్జనర్‌ను పోలీసు అధికారుల సంఘం, సిటీ పోలీస్ కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యులు మంగళవారం కలిశారు. సంఘం అధ్యక్షుడు, సొసైటీ కార్యదర్శి నల్లా శంకర్‌రెడ్డి, సభ్యులు జీఎంఎస్ విక్టర్, ఆసిఫ్ ఖాన్, నవీన్ కుమార్, శాంతి, వినీత్ తదితరులు సజ్జనర్‌కు మొక్కను అందించి అభినందనలు తెలిపారు. – సాక్షి, సిటీబ్యూరో

సినీనటి డింపుల్ హయతిపై కేసు

వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసిన పనిమనిషి


సినీనటి డింపుల్ హయతి

ఫిలింనగర్: వేధిస్తున్నారని పనిమనిషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సినీనటి డింపుల్ హయతి, ఆమె భర్త డేవిడ్‌లపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... ఒడిశా రాష్ట్రం రాయ్‌ఘడ్ జిల్లాకు చెందిన ప్రియాంక బిబర్(22) షేక్‌పేటలోని వెస్ట్‌వుడ్ అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్న సినీనటి డింపుల్ హయతి ఇంట్లో గృహ సహాయకురాలిగా చేరింది. అక్కడ చేరినప్పటి నుంచి డింపుల్, డేవిడ్ తనను దూషిస్తూ, అవమానిస్తూ సరైన ఆహారం ఇవ్వకుండా రోజూ హింసిస్తున్నారని ప్రియాంక పోలీసులకు ఫిర్యాదు చేసింది. మంగళవారం ఉదయం ఇంట్లో పెంపుడు కుక్క అరిచిందని, అందుకు కారణం తానేనంటూ భార్యాభర్తలిద్దరూ అసభ్య పదజాలంతో దూషించారని, దుస్తులు విప్పేసి నగ్నంగా నిలబెట్టి కొట్టేందుకు యత్నించారని ఆరోపించింది. వీడియో రికార్డు చేసేందుకు ప్రయత్నించగా డేవిడ్ బలవంతంగా తన ఫోన్ లాక్కొని కిందపడేసి పగులగొట్టాడని పేర్కొంది. తన తల్లిదండ్రులను చంపేస్తామంటూ బెదిరించారని భయాందోళన వ్యక్తం చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు డింపుల్, ఆమె భర్తపై పోలీసులు పలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేవ ఒకటే.. చార్జీల చెల్లింపు రెండు సంస్థలకు!

సాక్షి,సిటీ బ్యూరో: నగరవాసులు ఒకే సేవకుగాను రెండు సంస్థలకు చార్జీలు చెల్లిస్తున్నారని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం. పద్మనాభరెడ్డి అన్నారు. ఈ విషయమై మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను విడుదల చేశారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ప్రతి వ్యక్తి నగరపాలక సంస్థకు ఆస్తి పన్ను చెల్లిస్తున్నారని, అయితే నగర పాలక సంస్థ చట్టం సెక్షన్ 199లో ఆస్తిపన్ను అంటే జనరల్ ట్యాక్స్, నీటి ట్యాక్స్, డ్రైనేజీ ట్యాక్స్, కన్జర్‌వెన్సీ ట్యాక్స్ అని ఉందని గుర్తు చేశారు. అయితే మహానగరంలో మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థకు ప్రత్యేక సంస్థ ఉందని, ఇది నీరు, డ్రైనేజీ ట్యాక్స్‌ను నగరవాసుల నుంచి వసూలు చేస్తోందన్నారు. ఈ విధంగా ఒకే సేవకుగాను రెండు సంస్థలకు నగరవాసి ట్యాక్స్ చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు మాత్రం కొన్ని సంవత్సరాలుగా నీటి చార్జీలు చెల్లించడం లేదని, వెంటనే వాటి నుంచి వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జీహెచ్ఎంసీ పురోగతిలో మరవలేని సేవలు



ఉద్యోగ విరమణ పొందిన 19 మందిని సత్కరించిన కమిషనర్ కర్ణన్

లక్డీకాపూల్: జీహెచ్ఎంసీ పురోగతిలో ఉద్యోగ విరమణ పొందినవారి సేవలు మరువలేనివని కమిషనర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. మంగళవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో విరమణ పొందిన 19 మంది అధికారులు, ఉద్యోగులకు కమిషనర్ ఆత్మీయ సత్కారం చేశారు. సత్కారం పొందినవారిలో సహాయ మున్సిపల్ కమిషనర్ జీవన్ కుమార్, అబ్దుల్ సత్తార్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులందరూ తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సేవలందించారన్నారు. సహచర ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. రిటైర్మెంట్ పొందినవారు కుటుంబసభ్యులతో సమయం గడుపుతూ, ఆసక్తులకు ప్రాధాన్యం ఇస్తూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, అదనపు కమిషనర్ కె.వేణుగోపాల్, పీఆర్ఓ మామిండ్ల దశరథం, ఏఎంసీ శారద, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన సాత్విక్‌కు సత్కారం

జీహెచ్ఎంసీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన సాత్విక్ నాయక్‌ను అదనపు కమిషనర్ కె.వేణుగోపాల్ ఘనంగా సత్కరించారు. సాత్విక్ నాయక్ ప్రస్థానం స్ఫూర్తిదాయకమని అన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పీఆర్ఓ మామిండ్ల దశరథం, జీహెచ్ఎంసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

– జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి


బయోమెట్రిక్ హాజరు విధానం ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ హరిచందన

సాక్షి, సిటీ బ్యూరో: సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయం ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తప్పక పాటించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సూచించారు. మంగళవారం స్నేహ సిల్వర్ జూబ్లీ భవన్ రెండో అంతస్తులోని జిల్లా సర్వే అండ్ ల్యాండ్ కార్యాలయంలో అదనపు కలెక్టర్లు ముకుంద రెడ్డి, కదిరవన్ పళనితో కలసి ఆమె బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రారంభించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఈ విధానాన్ని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటాచారి, జిల్లా సర్వే అధికారి వి.శ్రీరామ్, జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ మహేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఎం.వెంకటేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హైడ్రాలో వాహన పూజ

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు దుస్తుల పంపిణీ



సాక్షి, సిటీబ్యూరో: హైడ్రా కార్యాలయంలో మంగళవారం దసరా ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. హైడ్రా వాహనాల పార్కింగ్ యార్డులో ఉన్న దుర్గగుడి వద్ద హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు అశోక్ కుమార్, వర్ల పాపయ్య, సుదర్శన్‌లు కమిషనర్‌తోపాటు పూజల్లో పాల్గొన్నారు. యార్డులో జేసీబీలతోపాటు వాహనాలు, నీటిని తోడే ఇంజిన్లు, డీఆర్ఎఫ్ సిబ్బంది వాడే పనిముట్లకు హైడ్రా కమిషనర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హైడ్రాలో పనిచేస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది, డ్రైవర్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు దుస్తులు, స్వీట్ బాక్సులు కమిషనర్ అందజేశారు. మహిళా ఉద్యోగులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హైడ్రా వాహనాల పార్కింగ్ యార్డులో సందడి నెలకొంది. ఈ వర్షాకాలంలో హైడ్రా సిబ్బంది అందించిన సేవలను కమిషనర్ రంగనాథ్ కొనియాడారు. ప్రజలకు మెరుగైన జీవనాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

కుటుంబ సమస్యలే.. ఉరితాళ్లు

దేశంలో 2023లో మొత్తం 1,71,418 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 2022తో పోలిస్తే ఇది స్వల్పంగా ఎక్కువ. గత 5 ఏళ్లుగా చూస్తే.. ఏటా ఆత్మహత్యల సంఖ్య పెరుగుతోంది. జాతీయ నేర గణాంక విభాగం (ఎన్‌సీఆర్‌బీ) 2023వ సంవత్సరానికి విడుదల చేసిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. కుటుంబ సమస్యలు, తట్టుకోలేని అనారోగ్య సమస్యలు; మాదక ద్రవ్యాలు, మద్యానికి బానిసలు కావడం, ప్రేమ వ్యవహారాలు, అప్పుల భారం, నిరుద్యోగం, పరీక్షల్లో ఫెయిల్ కావడం.. ఇలా అనేక కారణాలతో ప్రాణాలు తీసుకుంటున్నారు. మొత్తం మరణించినవారిలో దాదాపు 33 శాతం.. 18-30 ఏళ్లలోపు వారే. 2022తో పోలిస్తే (34.56 శాతం) ఇది తక్కువ. 2022లో విద్యార్థుల ఆత్మహత్యలు 7.6 శాతం కాగా, 2023లో ఇవి 8.1 శాతానికి పెరగడం గమనార్హం. మొత్తం మృతుల్లో 72.7 శాతం పురుషులు కాగా, 27.2 శాతం మహిళలు.

- సాక్షి, స్పెషల్ డెస్క్



32 శాతం ఆత్మహత్యలు కుటుంబ సమస్యల వల్లే

- బాధితుల్లో సుమారు **73** శాతం మంది పురుషులే
- 2023లో దేశవ్యాప్తంగా **1,71,418** ఆత్మహత్యలు
- మృతుల్లో మూడొంతులు 18-30 ఏళ్లలోపు వారే
- స్వల్పంగా పెరిగిన విద్యార్థుల ఆత్మహత్యలు
- ఆత్మహత్యలపై నివేదిక విడుదల చేసిన ఎన్‌సీఆర్‌బీ

సంవత్సరం	మొత్తం ఆత్మహత్యలు
2019	1,39,123
2020	1,53,052
2021	1,64,033
2022	1,70,924
2023	1,71,418

టాప్ 10 రాష్ట్రాలు 2021, 2022, 2023.. ఈ మూడు సంవత్సరాల్లోనూ ఆత్మహత్యల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన రాష్ట్రాలు మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్. మొత్తం ఆత్మహత్యల్లో సుమారు 34 శాతం ఈ రాష్ట్రాల్లోనే జరిగాయి.

రాష్ట్రం	ఆత్మహత్యలు	శాతం
మహారాష్ట్ర	22,687	13.2
తమిళనాడు	19,483	11.4
మధ్యప్రదేశ్	15,662	9.1
కర్ణాటక	13,330	7.8
పశ్చిమబెంగాల్	12,819	7.5
కేరళ	10,972	6.4
తెలంగాణ	10,580	6.2
ఉత్తరప్రదేశ్	9,154	5.3
గుజరాత్	8,948	5.2
ఆంధ్రప్రదేశ్	8,684	5.1

అనేక కారణాలు దేశంలో ఆత్మహత్యలకు ప్రధాన కారణాలు.. కుటుంబ సమస్యలే. అనారోగ్య సమస్యలను తట్టుకోలేక మరణాన్ని ఆశ్రయించేవారూ ఎక్కువగానే ఉన్నారు. పై రెండు కారణాల వల్లే దాదాపు 51 శాతం ఆత్మహత్యలు జరిగాయి.

- కుటుంబ సమస్యలు 31.9%
- మాదక ద్రవ్యాలు, మద్యానికి బానిసలు కావడం 7%
- అనారోగ్యం 19%
- వివాహ సంబంధ సమస్యలు 5.3%
- రుణ భారం 3.8%
- నిరుద్యోగం 1.8%
- ప్రేమ వ్యవహారాలు 4.7%
- పరీక్షల్లో ఫెయిల్ కావడం 1.4%
- ఆప్తుల మరణం తట్టుకోలేక 1.3%
- వృత్తి లేదా కెరీర్ సమస్యలు 1.1%
- అనుమానాస్పద లేదా అక్రమ సంబంధాలు 0.4%
- ఆస్తి తగాదాలు 1%
- పేదరికం 0.7%

కుటుంబ సమస్యలతో.. అత్యధిక శాతం ఆత్మహత్యలు జరిగిన రాష్ట్రాలు

ఒడిశా	బిహార్	తెలంగాణ
72.1%	50.3%	44.2%

వయసుల వారీగా.. ఆడా, మగా..

వయసు	స్త్రీలు	పురుషులు
60 ఏళ్లకుపైబడి	3,680	12,107
45-60	6,352	26,591
30-45	12,665	43,059
18-30	18,128	38,012
18 ఏళ్ల లోపల	5,823	4,961

వృత్తి / ఉద్యోగాల పరంగా..: ఆత్మహత్యలు చేసుకున్నవారిలో గృహిణులు 14 శాతం కాగా, వ్యవసాయ రంగానికి సంబంధించిన వారు 6.3 శాతం. నిరుద్యోగులు 8.3 శాతం కాగా, విద్యార్థులు 8.1 శాతం. రోజువారీ కూలీలు అత్యధికంగా 27.5 శాతం ఉన్నారు.

తక్కువ చదువుకున్నవారే..

విద్యార్హత	శాతం
ప్రాథమికస్థాయి చదువు చదివినవారు	14.8
మాధ్యమికస్థాయి	18.6
మెట్రిక్యులేషన్ / సెకండరీ స్థాయి	24.6
హయ్యర్ సెకండరీ (ఇంటర్)	17.5

ఉరివేసుకుని..: ఆత్మహత్యల్లో అత్యధికంగా సుమారు 61 శాతం ఉరి వేసుకుని మరణించారు. విషం తాగి 25 శాతం మంది, నీట మునిగి 4.1 శాతం, వాహనాల కింద పడి 2.8 శాతం మంది ప్రాణాలు తీసుకున్నారు.

క్లుప్తంగా...

విమానంలో ధూమపానం

పోలీసులకు ప్రయాణికుని అప్పగింత

శంషాబాద్ (హైదరాబాద్): విమానంలో సిగరెట్ కాల్చిన ప్రయాణికుడిని ఆర్‌జీఐఏ ఔట్‌పోస్ట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ కనకయ్య తెలిపిన వివరాలివి. సోమవారం దుబాయ్ నుంచి విమానంలో హైదరాబాద్ వచ్చిన కరీంనగర్ ప్రాంతానికి చెందిన ప్రయాణికుడు మార్గమధ్యలో.. విమానంలోని రెస్ట్‌రూంలోకి వెళ్లి సిగరెట్ తాగాడు. విషయం తెలుసుకున్న ఎయిర్‌లైన్స్ సిబ్బంది అతన్ని ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు. ఏవియేషన్ నిబంధనలకు వ్యతిరేకంగా అతడు వ్యవహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే దుబాయ్ నుంచి వచ్చే సమయంలో సిగరెట్, మ్యాచ్ బాక్స్‌లకు అనుమతి ఇవ్వడంతోనే.. కాల్చినట్లు ప్రయాణికుడు తెలిపాడని సమాచారం. ప్రయాణికుడు ఉద్దేశపూర్వకంగా సిగరెట్ తాగాడా? లేదా మరేదైనా కారణం ఉందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బస్తాల్లో ఇసుక నింపి తరలింపు

అక్రమార్కుల కొత్త మార్గం



లారీలో తరలిస్తున్న ఇసుక బస్తాలు

అశ్వారావుపేట రూరల్: సహజంగా లారీలు, టిప్పర్లలో ఇసుక తరలిస్తుంటే అనుమతి లేని వాహనాలను పోలీసులు సీజ్ చేస్తుంటారు. ఈ తనిఖీలు, సీజ్‌లను తప్పించుకునేందుకు అక్రమార్కులు కొత్త మార్గం ఎంచుకున్నారు. అయినా పోలీసులకు అనుమానం వచ్చి పరిశీలించడంతో దందా బయటపడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని ఆర్‌టీఏ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ యయాతి రాజు ఆధ్వర్యాన పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఏపీ రాష్ట్రం వైపు నుంచి వస్తున్న రెండు లారీలను తనిఖీ చేయగా.. పెద్ద సంఖ్యలో నిండు బస్తాలు కనిపించాయి. వాటిని పరిశీలించగా ఇసుక బస్తాలని తేలింది. దీంతో లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్లపై కేసు నమోదు చేశారు.

మాత్రలు వేసుకోలేదన్న కోపంతో తల్లిని కొట్టి చంపిన కూతురు



కూతురు మాధవి

అమీర్‌పేట: మాత్రలు వేసుకోలేదన్న కోపంతో కన్నకూతురే తల్లిని తీవ్రంగా కొట్టి చంపింది. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగిన సంఘటన వివరాలను ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి వెల్లడించారు. అమీర్‌పేట లీలానగర్‌లో నివాసముండే సెక్రటేరియట్ రిటైర్డ్ ఉద్యోగి వేణుగోపాల్‌రావు, లక్ష్మి విలాసం (82)దంపతులకు ఒక కూతురు ఉంది. కూతురు మాధవికి 12 సంవత్సరాల క్రితం వివాహం చేయగా, కొద్ది రోజులు కాపురం చేసి తర్వాత భర్తను వదిలేంది. 8 ఏళ్ల క్రితం లక్ష్మివిలాసం భర్త మృతి చెందగా, మాధవి తల్లితో కలిసి ఉంటోంది. తల్లి వృద్ధాప్యానికి చేరుకోవడంతో మానసిక స్థితి సరిగా ఉండటం లేదు. కొద్ది రోజులుగా మాధవికి సైతం మానసిక స్థితి సరిగా లేని కారణంగా తరచూ ఇద్దరు గొడవ పడుతుండేవారు. అనారోగ్య కారణాలతో మాధవి తల్లి వివిధ రకాల మాత్రలు వాడుతుంది. రాత్రి మాత్రలు వేసుకోకపోవడంతో తల్లితో ఎప్పటిలాగే గొడవ పడి 12 గంటల సమయంలో డోర్ కర్టెన్ పైప్ తీసుకొని మాధవి తల్లి కాళ్లు, చేతులు, ఒంటిపై తీవ్రంగా కొట్టింది. దెబ్బలకు తాళలేక ఆమె స్పృహ కోల్పోయింది. కొద్ది సేపటి తర్వాత 100కు డయల్ చేసి జరిగిన విషయాన్ని చెప్పింది. సమాచారం అందుకున్న ఎస్ఆర్‌నగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరీక్షించగా అప్పటికే లక్ష్మి విలాసం మృతి చెందినట్లు గుర్తించారు. హత్య కేసు నమోదు చేసి నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు.

హత్యలు తగ్గాయి.. కిడ్నాప్‌లు పెరిగాయి

దేశవ్యాప్తంగా 7.2 శాతం మేర పెరిగిన నేరాలు

- మహిళలపై 0.7 శాతం, చిన్నారులపై 9.2 శాతం నేరాల పెరుగుదల
- 31.2 శాతం పెరిగిన సైబర్ నేరాలు
- 2023లో మొత్తం 18,236 సైబర్ కేసుల నమోదు
- వెల్లడించిన ఎన్‌సీఆర్‌బీ 2023 నివేదిక

సాక్షి, హైదరాబాద్ : దేశవ్యాప్తంగా 2023లో నేరాల్లో 7.2 శాతం పెరుగుదల నమోదైంది. అన్ని రకాల నేరాలు కలిపి దేశవ్యాప్తంగా 2022లో 58,24,946 కేసులు నమోదు కాగా..2023లో 62,41,569 కేసులు నమోదైనట్టు ఎన్‌సీఆర్‌బీ (నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో) 2023 నివేదిక వెల్లడించింది. ఆ ఏడాది నమోదైన వాటిల్లో 27,53,235 కేసుల్లో చార్జ్‌షీట్ పూర్తయింది. ప్రతి లక్ష మంది జనాభాకు 2022లో 422.2గా ఉన్న నేర నమోదు శాతం..2023లో 448.3కి పెరిగినట్టు గణాంకాలు వెల్లడించాయి. తెలంగాణలో 2022లో 1,65,830 కేసులు నమోదు కాగా, 2023 నాటికి అది 1,83,644కి చేరినట్టు నివేదిక పేర్కొంది. ఈ మేరకు నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో 2023 వార్షిక నివేదికను సోమవారం విడుదల చేసింది. అందులో పేర్కొన్న ప్రకారం దేశవ్యాప్తంగా పలు రకాల నేరాలకు సంబంధించిన గణాంకాలు ఇలా..

హత్యలు తగ్గాయి

2023లో మొత్తం 27,721 హత్య కేసులు నమోదదయ్యాయి. 2022తో పోలిస్తే 2023లో 2.8 శాతం తగ్గుదల కనిపించింది. హత్య కేసుల్లో అత్యధికంగా వివాదాలు (9,209 కేసులు) ప్రధాన కారణంగా ఉన్నాయి, ఆ తర్వాత 'వ్యక్తిగత శత్రుత్వం లేదా ద్వేషం'(3,458 కేసులు), 'వ్యక్తిగత లబ్ధి లేదా లాభం (1,890 కేసులు) కారణంతో జరిగాయి.



5.6 శాతం పెరిగిన కిడ్నాప్ కేసులు

2022, 1,07,588 కిడ్నాప్ కేసులు నమోదు కాగా 2023లో 1,13,564 కేసులు నమోదయ్యాయి. 2022తో పోలిస్తే 2023లో 5.6% పెరుగుదల నమోదైనట్టు ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది. 2023లో కిడ్నాపైన వారిలో 1,40,813 మంది జాడను పోలీసులు గుర్తించగా, వీరిలో 1,39,164 మంది బతికి ఉన్నారు. మరో 1,649 మంది చనిపోయినట్టు గుర్తించారు.

మహిళలపై నేరాల్లో స్వల్ప పెరుగుదల

మహిళలపై నేరాల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. 2022లో 4,45,256 కేసులు నమోదు కాగా..2023లో 4,48,211 కేసులు మహిళలపై నేరాలకు సంబంధించి నమోదయ్యాయి. ఇందులో భర్త లేదా అత్తింటివారి దాడులకు సంబంధించి 1,33,676 కేసులు, మహిళల కిడ్నాప్‌నకు సంబంధించి 88,605 కేసులు, లైంగిక వేధింపులకు సంబంధించినవి 83,891 కేసులు, పోక్సో యాక్టు కింద 66,232 కేసులు నమోదయ్యాయి.

చిన్నారులపై నేరాల నమోదులో 9.2 శాతం పెరుగుదల

చిన్నారులపై నేరాల నమోదులో 2022తో పోలిస్తే 2023లో 9.2 శాతం పెరిగింది. 2023లో పిల్లలపై మొత్తం 1,77,335 నేరాలు నమోదయ్యాయి. వీటిలో పిల్లల కిడ్నాప్‌నకు సంబంధించినవి 79,884 కేసులు, లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం (పోక్సో చట్టం) కింద 67,694 కేసులు నమోదయ్యాయి.

సైబర్ నేరాల్లో 31.2 శాతం పెరుగుదల నమోదు

సైబర్ నేరాల్లో భారీగా పెరుగుదల నమోదవుతోంది. 2022తో పోలిస్తే 2023లో సైబర్ నేరాల్లో 31.2 శాతం పెరుగుదల నమోదైంది. 2023లో దేశవ్యాప్తంగా మొత్తం 86,420 సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయి. 2023లో నమోదైన వాటిలో 68.9 శాతం మోసం, లైంగిక దోపిడీ 4.9 శాతం కేసులు, దోపిడీ 3.8శాతం కేసులు ఉన్నాయి.

ఆరు శాతం పెరిగిన ఆర్థిక నేరాలు

ఆర్థిక నేరాల్లోనూ గత ఏడాదితో పోలిస్తే..ఆరు శాతం పెరుగుదల నమోదైనట్టు ఎన్‌సీఆర్‌బీ 2023 నివేదిక వెల్లడించింది. 2023 మొత్తం 2,04,973 కేసులు నమోదయ్యాయి. వీటిలో నమ్మక ద్రోహం, ఫోర్జరీ, మోసం కేసులు ఎక్కువగా ఉన్నాయి.

ఈసారి ఎంతో ఆలస్యంగా నివేదిక..:

ఎన్‌సీఆర్‌బీ నివేదిక 'క్రైం ఇన్ ఇండియా'సాధారణంగా ఏడాది మధ్యలో విడుదల చేస్తారు. కానీ, 2023 నివేదికల ప్రచురణ చాలా ఆలస్యమైంది. డేటా సేకరణలో ఆలస్యం కారణంగానే 2023 నివేదిక ఆలస్యం అవుతోందని ఇటీవల కేంద్ర హోంశాఖ సైతం పార్లమెంట్‌లో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పింది. కాగా, 2022 సంవత్సరానికి సంబంధించిన నివేదిక సైతం డిసెంబర్ 2023లో విడుదలైంది.

సైబర్ నేరాల నమోదులో రెండో స్థానంలో తెలంగాణ

కర్ణాటక తర్వాత మన రాష్ట్రంలోనే అత్యధిక కేసులు నమోదు

సాక్షి, హైదరాబాద్ : సైబర్‌నేరాల నమోదులో తెలంగాణ జాతీయస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. 2023లో కేసుల సంఖ్య 18,236కి చేరినట్టు నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) 2023 నివేదిక వెల్లడించింది. సైబర్ నేరాల నమోదులో దేశవ్యాప్తంగా కర్ణాటక మొదటి స్థానంలో నిలిచింది.

- తెలంగాణ వ్యాప్తంగా హత్య కేసులు సైతం స్వల్పంగా పెరిగాయి. 2022లో 937 హత్య కేసులు నమోదు కాగా..2023లో 954 కేసులు నమోదైనట్టు గణాంకాలు వెల్లడించాయి. ఆర్థిక నేరాల్లోనూ తెలంగాణ జాతీయస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. 2022లో 26,321 కేసులు, 2023లో 26,881 కేసులు నమోదైనట్టు ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది.

2022, 2023లో తెలంగాణలో నమోదైన కేసుల సంఖ్య ఇలా..:

కేసు	2022	2023
సైబర్ నేరాలు	15,297	18,236
హత్యలు	937	954
ఆర్థిక నేరాలు	26,321	26,881
కిడ్నాపులు	2,981	3,174
మహిళలపై నేరాలు	22,066	23,678
సీనియర్ సిటిజన్లపై	331	292
ఎస్సీ,ఎస్టీలపై నేరాలు	2,332	2,496

ఆన్‌లైన్ ఆచార్య!

▶ మొదటి పేజీ తరువాయి

సున్నితంగా మెదడు పొరల్లోకి విషయం చేరుతోందని గత ఏడాది ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిశోధనల్లో తేలింది. ఈ నేపథ్యంలోనే విద్యార్థులు క్లాస్ రూం బోధన కన్నా, ఆన్‌లైన్ చదువు తేలికగా ఉందని భావిస్తున్నారు. అయితే, సబ్జెక్టుకు సంబంధించి వచ్చే సందేహాలు ఆన్‌లైన్‌లో నివృత్తి చేసుకునే క్రమంలో కొంత గందరగోళానికి గురవుతున్నారు. చాట్ జీపీటీ, ఇతర బ్రౌజర్లు విభిన్న సమాచారాన్ని అందిస్తుండటమే ఇందుకు కారణం.

ఈ-పాఠాలు.. ఎన్నో యాప్‌లు

ఈ-పాఠశాల: ఎన్‌సీఈఆర్‌టీ, సీఐఈటీ ఆధ్వర్యంలో నడిచే ఈ-పాఠశాల పాఠ్యపుస్తకాలు, ఆడియో, వీడియో, ఇతర విద్యా వనరులను అందిస్తోంది.

డౌట్‌నట్: గణితం, అణుశాస్త్రానికి సంబంధించిన సందేహాలను ఇది దృశ్యరూపాల్లో అప్‌లోడ్ చేసి అందిస్తోంది. ఈ యాప్ ద్వారా వీడియోలతో కూడిన అర్థవంతమైన సమాధానాలు పొందే వీలుంది.

ఆన్‌లైన్ బోధనకే పరిమితం కాకూడదు



కాలానుగుణంగా వస్తున్న మార్పులతో ఆన్‌లైన్ విద్యా విధానం అనివార్యమైంది. అదనపు స్కిల్స్, సమాచారం కోసం ఆన్‌లైన్‌కు వెళ్లడం మంచిదే. కానీ ఆన్‌లైన్ బోధనకే పరిమితం కావడం సరైన విధానం కాదు. దీనివల్ల క్లాస్ రూం కనెక్టివిటీ పోతుంది.

– ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి (చైర్మన్, ఉన్నత విద్యా మండలి)

అన్అకాడమీ: జేఈఈ, నీట్, యూపీఎస్సీ, ఎస్సెస్సీ వంటి పోటీ పరీక్షలకు ఉద్దేశించి దీన్ని రూపొందించారు. ప్రశ్నలకు సమాధానాలు, ఆన్‌లైన్ పరీక్ష విధానం, నిష్ణాతులైన అధ్యాపకుల లెక్చర్స్ ఇందులో ఉంటున్నాయి. ఎక్కువ మంది విద్యార్థులు దీన్ని అనుసరిస్తున్నారు. నీట్, జేఈఈ కోసం అమెజాన్ అకాడమీ కూడా పనిచేస్తోంది. ఇక యూనివర్సల్ బోధన పద్ధతులతో ఖాన్ అకాడమీ ప్రాక్టికల్ విద్య బోధనతో ఆన్‌లైన్ రంగంలో విద్యార్థులను ఆకర్షిస్తోంది. స్థానిక భాషల్లో ప్రోగ్రామింగ్ చేసిన గువీ, టెక్ డేటా సైన్స్ నైపుణ్యాలతో ఎడ్యురేకా వంటి యాప్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి.

కారులో ఒక్కరే వెళ్తే ట్యాక్స్?

బెంగళూరు నిపుణుల సూచన

బనశంకరి: తట్టుకోలేనంత ట్రాఫిక్ రద్దీతో సతమతవుతున్న బెంగళూరు మహానగరంలో పరిష్కార చర్యలను ప్రభుత్వం రంధ్రాన్వేషణ సాగిస్తోంది. ఇక నుంచి ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో కొన్ని రోడ్లలో ఒక్కరే కారులో వెళ్తే సర్కారుకు పన్ను చెల్లించాల్సి రావచ్చు. ఇటీవల ట్రాఫిక్ రద్దీ, గుంతల రోడ్ల సమస్యపట్ల వివిధ శాఖల అధికారులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం జరిగింది. కొందరు నిపుణులు ట్రాఫిక్ రద్దీ ట్యాక్స్ ప్రస్తావనను తీసుకువచ్చారు. అటువంటి రహదారుల్లో ఒక్కరే కారులో ప్రయాణించడాన్ని అడ్డుకోవాలని సూచించారు. కార్‌పూలింగ్ వ్యవస్థను విస్తృతం చేయాలని తెలిపారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. లండన్, సింగపూర్, న్యూయార్క్ నగరాల్లో ట్రాఫిక్ రద్దీ ట్యాక్స్‌లు అమలులో ఉన్నాయని నిపుణులు తెలిపారు. బెంగళూరులో ట్యాక్స్ ప్రస్తావనను ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందేమోనని ప్రభుత్వం కూడా దీనిని పెండింగ్‌లో పెట్టింది.

కక్ష సాధించాలంటే.. నన్ను ఏమైనా చేసుకోండి

- నావాళ్లను వదిలేయండి
- సీఎం స్టాలిన్‌ను ఉద్దేశించి టీవీకే అధ్యక్షుడు విజయ్



సాక్షి, చెన్నై: కక్ష సాధింపు చర్యలకు పాల్పడాలంటే తనను ఏమైనా చేసుకోవాలని, తన కేడర్‌ను విడిచి పెట్టాలని తమిళనాడు ప్రభుత్వానికి తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ విజ్ఞప్తి చేశారు. కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై మూడు రోజుల తర్వాత విజయ్ ఒక వీడియో విడుదల చేశారు. తన జీవితంలో ఇంత వేదన ఎన్నడూ అనుభవించలేదని తెలిపారు. ప్రజల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని చెప్పారు. జరగకూడనిది జరిగిందని, తాను ఘటన జరిగిన రోజున అక్కడే ఉంటే, పరిస్థితిని మరింత సమస్యాత్మకంగా మార్చేస్తారేమోనని చెన్నైకి వచ్చేసినట్టు వివరించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి, సంతాపం తెలిపారు. ఈ సమయంలో తనకు అండగా నిలబడ్డ రాజకీయ పక్షాల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. విజయ్ వీడియోలో కొన్ని కీలక అంశాలను ప్రస్తావించారు. 'ఐదు జిల్లాలకు ప్రచారానికి వెళ్లాను. కరూర్‌లో మాత్రమే ఎందుకు జరిగింది.. ఎలా జరిగింది.. ఏం జరిగింది.. ప్రజలకు అన్ని వాస్తవాలు తెలుసు. ప్రజలు అన్నింటిని చూస్తున్నారు..' అని పేర్కొన్నారు. ' కరూర్ ప్రజలు బయటకు వచ్చి వాస్తవాలు చెబుతున్నప్పుడు దేవుడే తన ముందుకు వచ్చి చెబుతున్నట్టుగా అనిపించింది. కేటాయించిన స్థలానికి వెళ్లి నిలబడి ప్రసంగించాను. ఏ తప్పు చేయలేదు. అయితే, నా పార్టీ వర్గాలను కేసుల పేరిట వేధిస్తున్నారు. అరెస్టులు చేస్తున్నారు. సీఎం సార్.. కక్షసాధింపు చర్య ఏదైనా ఉంటే .. నన్ను ఏమైనా చేసుకోండి. నా వాళ్లను వదిలేయండి' అని అన్నారు. కాగా, టీవీకే వర్గాలపై కేసులు, అరెస్టుల ప్రక్రియ సాగుతుండటంతో ఆయన ఈ వీడియోను విడుదల చేసినట్టుందనే విమర్శలు వెల్లువెత్తాయి. కక్షసాధింపు అంటూ సీఎం స్టాలిన్‌ను టార్గెట్ చేయడం మరింత చర్చకు దారితీసింది. మరోవైపు తొక్కిసలాట ఘటనకు సంబంధించి టీవీకే కరూర్ పశ్చిమ జిల్లా కార్యదర్శి మది అళగన్, కరూర్ నగర్ ఇన్‌చార్జ్ మాశి పౌన్‌రాజ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వారికి కోర్టు రిమాండ్ విధించింది.

బీజేపీ బృందం అనుమానాలు

తొక్కిసలాటకు సంబంధించి వాస్తవాలను తెలుసుకునేందుకు బీజేపీ ఎంపీ హేమమాలిని నేతృత్వంలో ఎనిమిదిమంది ఎంపీలున్న బీజేపీ నిజనిర్ధారణ కమిటీ మంగళవారం కరూర్‌లో పర్యటించింది. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. ప్రచారసభ కోసం సరైన స్థలం కేటాయించలేదని చెప్పారు. ఇరుకైన రోడ్డులో అనుమతి ఇవ్వడం, విద్యుత్ సరఫరా ఆగడం, చెప్పులు విసరడం వంటి అంశాలను పరిశీలిస్తే ఈ ఘటన యాదృచ్ఛికంగా జరిగినట్టు కనిపించడం లేదని అనుమానాలు వ్యక్తం చేశారు.

సిమెంట్ బ్యాగులు.. మధ్యలో గంజాయి

- సినీ ఫక్కీలో డీసీఎంలో గంజాయి అక్రమ రవాణా
- రూ.6.25 కోట్ల విలువ చేసే 1,210 కిలోల సరుకు స్వాధీనం



నిందితుడు విక్రమ్

నాగోలు: పుష్ప సినిమా తరహాలో డీసీఎం వాహనంలో సిమెంట్ బ్యాగుల మధ్యలో ఏర్పాటు చేసిన సీక్రెట్ సెల్‌లో అక్రమంగా పెద్దస్థాయిలో తరలిస్తున్న గంజాయిని రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా నుంచి రాజస్తాన్‌కు అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి గంజాయిని, డీసీఎంను స్వాధీనం చేసుకున్నారు. 70 బ్యాగుల్లో 1,210 కేజీల బరువున్న ఈ గంజాయి విలువ రూ.6.25 కోట్లు ఉంటుందని పోలీసులు చెప్పారు. మంగళవారం ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన విక్రమ్ బిష్ణోయ్ అలియాస్ వికాస్ (22) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాజస్తాన్‌కు చెందిన డెవిలాల్ అలియాస్ కటు, అయూబ్ ఖాన్, రామ్‌లాల్ రాజస్తాన్‌లో గంజాయి సరఫరా చేసే నెట్‌వర్క్‌ను నడుపుతున్నారు. ఒడిశా నుంచి రాజస్తాన్‌కు గంజాయి తెస్తే ట్రక్కు లోడ్‌కు రూ.5 లక్షలు ఇస్తామని విక్రమ్‌కు చెప్పారు. విక్రమ్ రాజస్తాన్ నుంచి ఐరన్ లోడ్‌తో మహారాష్ట్ర నాందేడ్‌లో అన్‌లోడ్ చేసి హైదరాబాద్ మీదుగా ఖమ్మం చేరుకున్నాడు. పోలీసులకు అనుమానం రాకుండా అక్కడ సిమెంట్ బస్తాలను కొనుగోలు చేసి ఒడిశాలోని మల్కన్‌గిరికి వెళ్లాడు. అక్కడ 1,210 కిలోల గంజాయిని కొనుగోలు చేసి డీసీఎంలో సిమెంట్ బస్తాల కింద గంజాయిని దాచిపెట్టి హైదరాబాద్ మీదుగా రాజస్తాన్‌కు తరలిస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న ఎస్ఓటీ మహేశ్వరం జోన్ పోలీసులు, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు విజయవాడ జాతీయ రహదారిపై కొత్తగూడ చౌరస్తాలో డీసీఎంను అడ్డగించారు. పోలీసులు డీసీఎంను తనిఖీ చేయగా సిమెంట్ బ్యాగుల మధ్యలో రహస్యంగా ఏర్పాటు చేసిన సెల్‌లో 70 బ్యాగులతో 1,210 కేజీల గంజాయిని గుర్తించారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సీపీ తెలిపారు.

ఆఖరి మజిలీకి చచ్చే చావు!



నీటిలో మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్తులు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధిలోని వెంగళరావుపేట గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు తిప్పలు తప్పటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన వేల్పూల సమ్మయ్య మంగళవారం చనిపోగా, మృతదేహాన్ని గ్రామస్తులు శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గ్రామ సమీపంలోని గోదావరి పాయ వద్దకు.. సుమారు కిలోమీటర్ దూరం నడుం లోతు నీటిలో మృతదేహాన్ని మోసుకుంటూ బిక్కుబిక్కుమంటూ వెళ్లారు. అధికారులు స్పందించి శ్మశానవాటికకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

'టెట్'పై మళ్లీ సుప్రీంకోర్టుకు..

రివ్యూ పిటిషన్ దాఖలు చేసిన ఎస్‌టీఎఫ్

సాక్షి, న్యూఢిల్లీ: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్ఐ) రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. మంగళవారం ఎస్‌టీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావా రవి పేరుతో న్యాయవాది సుభాష్ చంద్రన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) అమల్లోకి వచ్చిన 2009 తర్వాత నియమితులైన టీచర్లు ఇక ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణులు కావడం తప్పనిసరి. పదోన్నతి పొందాలన్నా టెట్ పాస్ కావాల్సిందే. టెట్ పాస్ కాకుంటే వారు ఉద్యోగం వదులుకోవాల్సి ఉంటుంది. అలాంటి వారిని విధిగా ఉద్యోగ విరమణ చేయించి, సంబంధిత బెనిఫిట్స్ ఇచ్చి పంపండి'అని సెప్టెంబర్ 1వ తేదీన సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఆ తీర్పును ఎస్‌టీఎఫ్ఐ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. అలాగే, సుప్రీంకోర్టు తీర్పు దేశవ్యాప్తంగా 25 లక్షల మంది ఉపాధ్యాయులపై ప్రభావం చూపుతుంది కాబట్టి.. కేంద్రం, ఎన్‌సీటీఈతోపాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలని ఎస్‌టీఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీఎస్ భార్తి, చావా రవి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఐబీఆర్ నివారణకు ఐఐఎల్ టీకా

వ్యాక్సిన్ విడుదల చేసిన ప్రభుత్వ, ఐఐఎల్ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: దేశంలోని పశుజాతులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోన్న ఇన్‌ఫెక్షియస్ బొవైన్ రైనోట్రాకైటిస్ (ఐబీఆర్) అనే వ్యాధికి శాశ్వత పరిష్కారం లభించింది. ఈ వ్యాధి సోకకుండా పశువుల్లో వ్యాధి నిరోధకతను పెంచేందుకు ఉపయోగపడే టీకాను ఇండియన్ ఇమ్యునలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) విడుదల చేసింది. పశుపోషణ, పాల ఉత్పత్తుల శాఖ కార్యదర్శి నరేంద్రపాల్ గాంగ్వార్, జాతీయ డెయిరీ అభివృద్ధి బోర్డు సీఈవో డాక్టర్ మీనేశ్, ఐఐఎల్ ఎండీ డాక్టర్ ఆనంద్‌కుమార్‌లు ఎన్‌డీడీబీ డైమండ్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఈ టీకాను విడుదల చేశారు. వివిధ కారణాల వల్ల పశువులకు సోకే ఐబీఆర్ అనే వైరల్ వ్యాధిని ఈ టీకా నియంత్రించనుంది. ఈ వ్యాధి కారణంగా దేశంలోని పాడి రంగానికి రూ.18 వేల కోట్ల విలువైన నష్టం జరుగుతోందని అంచనా. ఈ నేపథ్యంలో మార్కెట్‌లోకి ఈ టీకాను తొలిసారిగా ఐఐఎల్ ప్రవేశపెట్టింది. వ్యాధికారకమైన బొవైన్ హెర్పిస్ అనే వైరస్ జన్యువులను మార్కర్‌తో స్థానచలనం చేయడం ద్వారా రూపొందించిన ఈ టీకాను పశువుకు వేయడం ద్వారా ముందుగానే వ్యాధి నిరోధకతను పెంపొందించవచ్చని చెప్పారు. ఇప్పుడు ఈ టీకాతో ఐబీఆర్ వ్యాధికి శాశ్వత పరిష్కారం లభించినట్టేనని పాడి పరిశ్రమరంగ నిపుణులు చెబుతున్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 1-10-2025



పూజా హెగ్డే

"మనందరిలో ఓ దుర్గా మాత ఉంది. ఆ శక్తిని మనం గ్రహించగలిగితే మనం ఏదైనా సాధించగలం. స్త్రీలు అనుకుంటే ఎలాంటి సవాల్‌ని అయినా అద్భుతంగా ఎదుర్కొంటారని నా నమ్మకం" అంటున్నారు పూజా హెగ్డే. సౌత్–నార్త్‌లో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళుతున్న ఆమె 'దసరా' సందర్భంగా 'సాక్షి'తో ప్రత్యేకంగా పంచుకున్న విశేషాలు...

మహిళల్లోనే మహాశక్తి

ఈ నవరాత్రి రోజుల్లో మా కుటుంబం మొత్తం శాకాహారులుగా మారిపోతాం. ఈ పండగ అప్పుడు కుదిరితే గుడికి వెళతాను. లేకపోయినా నాకు తరచూ గుడికి వెళ్లడం అలవాటు. మన ఎనర్జీ లెవల్స్ బాగుండటానికి మనం గుడికి వెళ్లడం మంచిది అని నా అభిప్రాయం. గుడిలో కాలు పెట్టగానే తెలియకుండా ఒక పాజిటివ్ ఎనర్జీ వచ్చేస్తుంది. మనం క్షేమంగా ఉండటానికి ఆ ఎనర్జీ పనికొస్తుంది. అందుకే గుడికి వెళ్లడాన్ని నేను బాగా నమ్ముతాను.

➡ నవరాత్రి టైమ్‌లో ఉపవాసం ఉండను కానీ నాకు ఫాస్టింగ్ అంటే నమ్మకం. ఫాస్టింగ్‌లో ఉన్నప్పుడు దేవుడికి దగ్గరగా ఉన్న ఫీలింగ్ కలుగుతుంది. నా చిన్నప్పుడు మా నాన్నగారు ఉపవాసం ఉండేవారు. తొమ్మిది రోజులు కేవలం నీరు మాత్రమే తీసుకునేవారు. అంత కఠినమైన ఉపవాసం ఆచరించేవారు. కానీ నేనెప్పుడూ అలా చేయలేదు. నేను ఏడాదికి రెండుసార్లు ఉపవాసం ఉంటాను. 'అంగారిక సంకష్ట చతుర్థి' నాడు, మహా శివరాత్రికి తప్పకుండా ఫాస్టింగ్ చేస్తాను.

➡ చాలా సంవత్సరాలుగా నేను దాండియా ఆడలేదు. ఓ పదేళ్ల క్రితం నా స్నేహితులతో కలిసి దాండియా ఆడటానికి వెళ్లాను. గర్బా డ్యాన్స్ పోటీ జరుగుతోందని అక్కడికి వెళ్లాక తెలిసింది. ఈ కాంపిటీషన్ కోసం కొన్ని గ్రూప్స్ సభ్యులు ఏళ్ల తరబడి ప్రాక్టీస్ చేసి మరీ పాల్గొంటారని తెలిసి, ఆశ్చర్యపోయాను. వాళ్ల డ్యాన్స్ నిజంగా అద్భుతం. నేను కూడా ఒక గ్రూపులోకి వెళ్లి, డ్యాన్స్ చేయడం మొదలుపెట్టాను. కానీ అది అంత తేలికైన విషయం కాదని అర్థమైంది.

➡ ప్రతి మహిళలోనూ ఓ శక్తి ఉంది. మనలో ఆ శక్తి స్వరూపిణి దుర్గా మాత ఉందని గ్రహించాలి. నవరాత్రి అంటే మనలో ఉన్న ఆ దేవిలోని పలు షేడ్స్‌ని సెలబ్రేట్ చేయడమే. మన లోపల ఉన్న దైవిక స్త్రీత్వాన్ని గుర్తించడమే. అయితే నేనిప్పటివరకూ గమనించినంతవరకూ స్త్రీలకు ఏదైనా సవాల్ ఎదురైతే అద్భుతంగా అధిగమించే నేర్పు వారికి ఉందని తెలుసుకున్నాను. కానీ మనకు మనంగా పరిష్కరించుకోగలుగుతాం అనే విషయం మనకు అర్థం కావాలి. లోపల దాగి ఉన్న ఆ శక్తిని గుర్తించి ముందుకెళితే మన వల్ల కానిది ఏదీ లేదు.

> నవరాత్రి సమయంలో మా ఇంట్లో బాగా భజనలు చేస్తాం. నా చిన్నప్పట్నుంచి ఇప్పటివరకూ ఒకే పద్ధతిలోనే పండగ జరుపుకుంటూ వస్తున్నాం. ప్రపంచంలో ఏదైనా మారొచ్చు. కానీ మన ఆచారాలను మనం ఎప్పుడూ ఒకేలా పాటించాలి. ఇప్పుడు వర్క్ షెడ్యూల్స్ వల్ల నేను చాలా పండగలను మిస్సవుతున్నాను. అయితే ఏ మాత్రం వీలు కుదిరినా పండగలప్పుడు ఇంట్లోనే ఉండటానికి ప్రయత్నిస్తాను.

➡ నవరాత్రి సమయంలో నాకు బాగా నచ్చినది 'హవన్' (హోమం). హవన్‌లో బియ్యం, నువ్వులు, ధాన్యాలు, నెయ్యి వంటివి సమర్పించి, ఆ దుర్గా మాత ఆశీర్వాదాన్ని కోరతాం. హవన్ చుట్టూ తిరుగుతున్నప్పుడు వెచ్చగా ఉంటుంది. అది చాలా బాగుంటుంది. చాలా పవిత్రంగా అనిపిస్తుంది. మామూలుగా నవరాత్రి అప్పుడు బంధువులు ఇంటికి వస్తుంటారు. మిగతా రోజుల్లో ఎలా ఉన్నా 'హవన్'కి మాత్రం అందరూ హాజరవుతారు. అలాగే పసుపు ఆకు తింటాం. ఆ ఆకు నుంచి వచ్చే సువాసన ఇల్లంతా వ్యాపిస్తుంది. నా చిన్నప్పటి తీపి గుర్తుల్లో ఇదొకటి.

➡ మా ఇంట్లో తొమ్మిది రోజులు పండగను చాలా శ్రద్ధగా చేస్తాం. ఇందాక నవరాత్రి సమయంలో ఆచరించేవాటిలో నాకు 'హవన్' ఇష్టం అని చెప్పాను కదా. అష్టమి రోజున అది చేస్తాం. మేం లక్ష్మీ పూజ కూడా బాగా చేస్తాం. అలాగే 'మాంజో లిరెట్టా గట్టి' అని వంటకం చేస్తాం. కొబ్బరి తురుము, బెల్లం కలిపి ముద్దలా కలిపి, పసుపు ఆకులో పెట్టి ఉడికిస్తాం. చాలా టేస్టీగా ఉంటుంది. నేను ఓ పట్టు పడుతుంటాను.

➡ దసరా అనగానే మనకు చెడు పై మంచి గెలుపు అనేది గుర్తొస్తుంది. నా వరకూ నా చుట్టూ ఉన్న చెడు గురించి, చెడు చేసేవాళ్ల గురించి అస్సలు పట్టించుకోను. ఏ పని చేసినా మనస్ఫూర్తిగా చేయడంపైనే దృష్టి పెడతాను. వందకు వంద శాతం పని చేయడం... మంచి ఆలోచనలతో ముందుకు వెళ్లడం... ఈ రెంటినీ ఫాలో అవుతాను. అప్పుడు ఎన్నో రెట్లు రూపంలో మంచి మన వద్దకు వస్తుందని నమ్ముతాను. ఇక చెడు చేసిన వారి గురించి ఆలోచించకుండా... మానవులకు అతీతమైన 'ఉన్నత శక్తి'కి వదిలేస్తాను.

– డి.జి. భవాని

నవశక్తి

అన్నీ అమ్మ ఆకృతులే

'అమ్మవారి తొమ్మిది అలంకారాలు, కృతులు స్త్రీ శక్తి గురించి తెలియజేసేవే. మనలోని శక్తిని ఎలా జాగృతం చేస్తామో అదే మనం' అంటూ నవరాత్రుల సందర్భంగా చేస్తున్న సాధన, అమ్మవారి కృపతో మొదలైన తన ప్రయాణం గురించి తెలియజేశారు గాయని భమిడిపాటి శ్రీలలిత. విజయవాడ వాసి, గాయని, అమ్మవారి పాటలకు ప్రత్యేకంగా నిలిచిన శ్రీలలిత చెప్పిన విశేషాలు నవశక్తిలో.

"నవరాత్రి సిరీస్ ఆరేళ్లుగా చేస్తున్నాను. బెజవాడ కనకదుర్గమ్మ అలంకరణ ఎలా ఉంటుందో అలాంటి అలంకరణల సెట్ వేసి, షూట్ చేసి, వీడియో ద్వారా చూపించాం. ఈ నవరాత్రుల్లో కనకదుర్గమ్మను నేరుగా దర్శించుకోలేనివారు సోషల్ మీడియాలో తొమ్మిది పాటలుగా విడుదల చేసిన వీడియోలు చూడవచ్చు. అమ్మవారి ప్రతి అలంకరణకు తగ్గట్టుగా పాట ఎంపిక, విజువల్స్ డిజైన్ చేశాం. ప్రతియేటా కొత్తదనం ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నాం. అమ్మవారి కృతులు అందరిళ్లలో పాడుకునే విధంగా ఆడియోను తీసుకువచ్చాం. పరంపరంగా వచ్చిన కృతులనే తీసుకున్నాం. ఈసారి మాత్రం రెండు భజనలు కూడా వీడియోలో ఉండేలా ప్లాన్ చేశాం. ఈ నవరాత్రి వీడియోకు నెల రోజుల టైమ్ పట్టింది. రోజుకు మూడు అలంకారాల చొప్పున షూట్ చేశాం.



శ్రీలలిత

కృతులను నేర్చుకుంటూ ..

చిన్నప్పటి నుంచి ఇంట్లో భక్తి గీతాలు వింటూ ఉండేదాన్ని. మా ఇంట్లో అందరూ అమ్మవారి ఆరాధకులే. అమ్మవారి దీక్ష చేసేవారు. ఇంట్లో అందరూ ఆమె కృతులను పాడుతుంటారు. ఆ విధంగా అమ్మవారి కృతులు వినడం, నేర్చుకోవడం ప్రారంభించాను. మా అత్తింట్లోనూ అమ్మవారి ఆరాధకులే. మా మామగారు నలభై ఏళ్లుగా దుర్గమ్మవారి ఉత్సవాలు జరుపుతున్నారు. దీంతో నేనూ ఆ ఉత్సవాల్లో పాల్గొంటూ, ప్రదర్శన ఇస్తూ వస్తున్నాను. అన్ని పుణ్యక్షేత్రాలూ దర్శించి, అక్కడ ప్రదర్శనలో పాడే అవకాశమూ లభించింది.

పరీక్షలను తట్టుకుంటూ...

అమ్మవారి ఉత్సవాలు, గ్రామ దేవతా ఉత్సవాలు, మొన్న జరిగిన తిరుపతి బ్రహ్మోత్సవాల్లోనూ పాల్గొన్నాను. పాట ఎంపిక నుంచి అమ్మవారే ఈ కార్యక్రమం నా చేత చేయిస్తున్నట్టు అనిపిస్తుంది. ఆ కృతులు పాడుతున్నా, వింటున్నా ఒక ఆధ్యాత్మిక భావనకు లోనవుతుంటాను. ఉదాహరణకు.. ఒక కృతిలో 13 చరణాలు ఉంటే.. 9 లేదా 11 చరణాలు పాడుదాం, అంత సమయం ఉండదు కదా అని ముందు అనుకుంటాను. కానీ, ప్రదర్శనలో నాకు తెలియకుండానే 13 చరణాలనూ పూర్తి చేస్తాను. ఇటువంటి అనుభూతులెన్నో.

సినిమాలోనూ...

ఇటీవలే ఒక సినిమాకు పాటలు పాడాను. ఆరేళ్ల వయసు నుంచి 20 వరకు రియాలిటీ షోలలో పాల్గొన్నాను. బయట మూడు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాను. మన దేశంలోనే కాకుండా విదేశాలలోనూ ప్రదర్శనలు ఇవ్వడం నిజంగా అదృష్టం. సంగీత కళానిధులైన బాల సుబ్రహ్మమణ్యం, చిత్ర, కోటి, ఉషా ఉతుప్.. వంటి పెద్దవారిని కలిశాను. వారితో కలిసి పాడుతూ, ప్రయాణించాను. ఒకసారి రియాలిటీ షో ఫైనల్స్‌లో పాడుతున్నప్పుడు బాలు గారు 'నీ వెనక ఏదో దైవశక్తి ఉంది...' అన్నారు. అదంతా అమ్మవారి ఆశీర్వాదంగా భావిస్తుంటాను.

వదలని సాధన...

ఈ సీరీస్‌లో నాకు చాలా ఇష్టమైనది మహాకవి కాళిదాసు 'దేవీ అశ్వధాటి' స్తోత్రం. ప్రవాహంలా సాగే ఆ స్తోత్రాన్ని అమ్మవారి మీద రాశారు. అశ్వధాటి అంటే.. ఒక గుర్రం పరుగెడుతూ ఉంటే ఆ వేగం, శబ్దం ఎలా ఉంటుందో .. ఆ స్తోత్రం కూడా అలాగే ఉంటుంది. 13 చరణాలు ఉండే ఆ స్తోత్రం పాడటం చాలా కష్టం. కానీ, నాకు అది చాలా ఇష్టమైనది. ఏదైనా స్తోత్రం మొదలుపెట్టినప్పుడు దోషాలు లేకుండా జాగ్రత్త పడుతూ, ప్రజల ముందుకు తీసుకువస్తాను. కరెక్ట్‌గా వచ్చేంతవరకు సాధన చేస్తూ ఉంటాను.

మహిళలు జన్మతః శక్తిమంతులు కాబటి వారు ఎక్కడినుంచో స్ఫూర్తి పొందడం ఏమీ ఉండదు. మనలోని శక్తి ఏ రూపంలో ఉందో దానిని వెలికి తీసి, ప్రయత్నించడమే. నా కార్యక్రమాలన్నింటా మా అమ్మానాన్నలు, అన్నయ్య, అత్తమామలు, మా వారు.. ఇలా అందరి సపోర్ట్ ఉంది. ఆడియో, వీడియో టీమ్ సంగతి సరే సరి! ' అంటూ వివరించారు ఈ శాస్త్రీయ సంగీతకారిణి.

– నిర్మలారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

● లీగల్

ఆమె ఆస్తికి అత్తింటి వారే మొదటి హక్కుదారులు

మా కూతురికి పెళ్లి చేసి ఐదేళ్లవుతోంది. పెళ్లి చేసేటప్పుడు కట్నం కింద ఎకరా భూమి – ఒక ఇల్లు ఇచ్చాము. గిఫ్ట్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ కూడా చేశాము. ఇదే కాకుండా మా అమ్మాయి సొంత సంపాదన అయిన మరొక ఇంటి స్థలం కూడా ఉంది. మా అమ్మాయికి సంతానం లేరు. అయితే దురదృష్టవశాత్తూ మా కూతురు – అల్లుడు ఇటీవలే ఒక రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఇప్పుడు తన సొంతగా సంపాదించుకున్న భూమితో పాటు మేము ఇచ్చిన భూమి, ఇల్లు కూడా తిరిగి ఇచ్చేది లేదు అంటూ మా అల్లుడు గారి తల్లి – అక్క పేచీ పెడుతున్నారు. ఒక లాయర్‌ను సంప్రదించగా హిందూ వారసత్వ చట్టం ప్రకారం మాకు ఏమీ రాదు అని చెబుతున్నారు. అది నిజమేనా?

– రామ సుధ, సూర్యాపేట

హిందూ వారసత్వ చట్టం, 1956 లోని సెక్షన్ 14 ప్రకారం ఒక హిందూ మహిళ వారసత్వం ద్వారా, వీలునామా ద్వారా, విభజన ద్వారా, మెయింటెనెన్స్‌లో (బకాయిలతో కలిపి) భాగంగా, మరొక వ్యక్తి నుంచి బహుమతిగా/గిఫ్ట్ ద్వారా ఆమె వివాహానికి ముందు, వివాహ సమయంలో లేదా వివాహం తరువాత, మరే ఇతర విధంగా సంక్రమించినప్పటికీ, స్వార్జితం ద్వారా లేదా 'స్త్రీ ధనం' రూపేణా వచ్చినప్పటికీ, అది ఆమె పూర్తి హక్కులు కలిగిన సొంత ఆస్తిగా పరిగణించబడుతుంది. అంతేకాకుండా ఇదే చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం వీలునామా రాయకుండా మరణించిన హిందూ మహిళ ఆస్తి ఈ కింది పేర్కొన్న వారికి (వారసత్వంగా) క్రమ పద్ధతిలో చెందుతుంది: అంటే మొదటి క్రమంలో ఉన్నవారు ఉంటే కేవలం వారికి మాత్రమే చెందుతుంది. వారు లేని పక్షంలో రెండవ నిబంధనలో చూపించిన వారికి, వారు లేకపోతే మూడవ వారికి, అలా ఎవరూ లేకపోతే ఆఖరున చూపిన వారికి చెందుతుంది.

1) మొదటగా: కొడుకులకు, కూతుళ్లకు (కొడుకు కూతురు మరణించి ఉంటే వారి సంతానానికి) – భర్తకు
2) రెండు: భర్త వారసులకు
3) మూడు: తల్లికి– తండ్రికి
4) నాలుగు: తండ్రి వారసులకు
5) ఆఖరున: తల్లి వారసులకు

ఇక మీ విషయానికి వస్తే, మీ అమ్మాయికి మీరు ఇచ్చింది గిఫ్ట్ డీడ్ అని చెప్పారు. అది వరకట్నంగా ఇప్పుడు రుజువు చేయటం సాధ్యపడకపోవచ్చు. ఈ లావాదేవిని స్త్రీ ధనం లాగానే పరిగణిస్తారు. ఒకవేళ మీరు సంపాదించి తనకి ఇచ్చినప్పటికీ ఆ ఆస్తి మీ కూతురి స్వంత ఆస్తి అయిపోయింది. మీ అల్లుడిగారి తల్లి – అక్క కూడా బతికే ఉన్నారు కాబట్టి, పైన చూపిన విధంగా తన భర్త వారసులైన వారికే మీ అమ్మాయి ఆస్తి చెందుతుంది. ఇటీవలే సుప్రీంకోర్టు కూడా ఇలాంటి ఒక కేసు పరిష్కరించే క్రమంలో "ఒక హిందూ మహిళకి పెళ్లి అయిన తర్వాత తన గోత్రం మారుతుంది. దానితో తన ఆస్తులు కూడా భర్తకి చెందుతాయి కానీ ఆమె తల్లిదండ్రులకు కాదు" అని పేర్కొంది. మీ అమ్మాయి భర్త, భర్త వారసులు లేని పక్షంలో మాత్రమే మీకు తన ఆస్తి వచ్చే అవకాశం ఉంది. అయితే మీ అమ్మాయికి ఇచ్చిన ఆస్తి ఒకవేళ తనకి వారసత్వంగా చెందినది అయితే మాత్రం, ఆ వారసత్వ మూలానికి తిరిగి వెళ్ళిపోతుంది. మీ వద్ద ఉన్న పత్రాలను తీసుకుని ఒకసారి లాయరు గారిని కలవండి. మీ కేసులో మీ పక్షాన ఏదైనా వీలు ఉంటే చూసి చెప్పవచ్చు.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది
మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

పండగ విందు

వంటిల్లు

పండగ అంటేనే ఇంటిల్లిపాదీ కలిసి నచ్చిన ఆహారాన్ని ఆస్వాదిస్తూ ఆనందంగా జరుపుకోవడం. ఆ ఆనందాన్ని ఈ దసరా సందర్భంగా ప్రత్యేకమైన దమ్ బిర్యానీ, మటన్ కర్రీ, స్వీట్‌తో ఆస్వాదిద్దాం. ఈ స్పెషల్ వంటకాల తయారీ గురించి చెఫ్ గోవర్ధన్ మనకు వంటిల్లులో వివరిస్తున్నారు.

కద్దూ కా ఖీర్
(సొరకాయ పాయసం)

ఈ పాయసం ఒక రిచ్, క్రీమీ డెజర్ట్. ప్రత్యేక పండుగ సందర్భాల్లో, విందుల్లో వడ్డించడానికి అద్భుతంగా ఉంటుంది.

కావలసినవి: సొరకాయ తురుము (గింజలు లేకుండా) – 500 గ్రా.లు; నీళ్లు – 500 మి.లీ; పాలు – 500 మి.లీ; యాలకుల పొడి – టీ స్పూన్; వెనిల్లా ఎసెన్స్ – 10 మి.లీ; పంచదార – 250 గ్రా.లు (లేదా రుచికి తగినంత); పిస్తా – 50 గ్రా.లు; బాదం – 50 గ్రాములు; మిల్క్ మేడ్ – 400 మి.లీ; కోవా – 250 గ్రా.లు; ఆకుపచ్చ ఫుడ్ కలర్ – 5 గ్రా.లు; బాస్మతి బియ్యం (నానబెట్టి, మెత్తగా రుబ్బినది) – 200 గ్రా.లు; నెయ్యి – 100 గ్రా.లు; రోజ్‌వాటర్ – 15 మి.లీ + 30 మి.లీ నీళ్లు; జీడిపప్పు – 50 గ్రా.లు;



తయారీ: ● తురిమిన సొరకాయను 500 మి.లీ నీళ్లలో ఉడికించాలి. అవసరమైతే నీళ్లు వడకట్టాలి; ● ఒక మందపాటి పాన్‌లో ఉడికిన సొరకాయ తురుగు, పాలు, మిల్క్‌మేడ్, కోవా వేసి సన్నని మంటపై ఉడికించాలి; ● నానబెట్టి, రుబ్బిన బాస్మతి బియ్యప్పిండి వేసి, మిశ్రమం చిక్కబడే వరకు ఉడికించాలి; ● యాలకుల పొడి, వెనిల్లా ఎసెన్స్, చక్కెర, పిస్తా, బాదం, జీడిపప్పు వేసి బాగా కలపాలి; ● నెయ్యి, రోజ్‌వాటర్ (నీటితో కలిపినది) వేసి కలపాలి; ● గ్రీన్ ఫుడ్ కలర్‌ని రెండు టేబుల్ స్పూన్ల నీటిలో కలిపి, మిశ్రమంలో వేసి కలపాలి ● ఈ కద్దూ కా ఖీర్ ను వేడిగా లేదా చల్లగా సర్వ్ చేయవచ్చు.

చంపారణ్ మటన్ కర్రీ



మాంసాహారులకు దసరా రోజున తప్పనిసరిగా మాంసాహార వంటకాలు తినడం ఆచారం. ఇది బీహార్‌లోని చంపారణ్ ప్రాంతానికి చెందిన సంప్రదాయ వంటకం. మసాలా రుచులు, సువాసనలు దీని ప్రత్యేకత.

కావల్సినవి: మటన్ (బోన్‌తో) – 1 కేజీ; ఆవ నూనె – 30 మి.లీ; నెయ్యి – 50 గ్రా.లు; అల్లం వెల్లుల్లి పేస్ట్ – 2 టేబుల్ స్పూన్లు; పెరుగు – 300 గ్రా.లు; ఉప్పు – తగినంత; కారం – 2 టేబుల్ స్పూన్లు; పసుపు – 2 టీ స్పూన్లు; ఉల్లిపాయ (సన్నగా తరిగినది) – 1; జీలకర్ర పొడి – 2 టీ స్పూన్లు; ధనియాల పొడి – 2 టీ స్పూన్లు; కాశ్మీరి మిర్చి పొడి – 2 టేబుల్ స్పూన్లు; నిమ్మరసం – అర నిమ్మకాయ; సోంపు పొడి – టీ స్పూన్; గరం మసాలా పొడి – 2 టీ స్పూన్లు; లవంగాలు – 12; మిరియాలు – 15; దాల్చిన చెక్క – 4 చిన్న ముక్కలు; బిరియానీ ఆకులు – 6; పుదీనా – కట్ట; కొత్తిమీర – కట్ట; పచ్చిమిర్చి (చీల్చినవి) – 4.

తయారీ: ● మ్యారినేట్ చేయడానికి ఒక గిన్నెలోకి మటన్‌ను తీసుకోవాలి ● అందులో పెరుగు, టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్, తగినంత ఉప్పు, టేబుల్ స్పూన్ కారం, టీ స్పూన్ పసుపు, టీ స్పూన్ జీలకర్ర పొడి, టీ స్పూన్ ధనియాల పొడి వేసి బాగా కలిపి, అరగంట సేపు అలాగే ఉంచాలి ● ఒక పాత్రలో ఆవ నూనె వేసి వేడి చేయాలి ● అందులో దాల్చిన చెక్క, లవంగాలు, మిరియాలు, బిరియానీ ఆకు వేసి వేయించాలి ● మ్యారినేట్ చేసిన మటన్ వేసి ఉడికించాలి. అవసరమైతే నీళ్లు వేసుకోవచ్చు.

మసాలా కోసం... ● మరో పాత్రలో నెయ్యి వేడి చేసి, టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి మంచి వాసన వచ్చే వరకు వేయించాలి. సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి, బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి ● ఉడికిన మటన్‌ను ఈ మసాలా మిశ్రమంలో వేసి బాగా కలపాలి ● తరువాత సోంపు పొడి, గరం మసాలా, కాశ్మీరీ మిర్చి పొడి, నిమ్మరసం వేసి కలపాలి ● చివరగా కొత్తిమీర, పుదీనా, పచ్చిమిర్చి వేసి అలంకరించాలి ● ఈ చంపారణ్ మటన్ కర్రీని వేడిగా అన్నం లేదా రోటీతో వడ్డించాలి.

కాబూలీ బిర్యానీ

ఈ కాబూలీ బిర్యానీ ప్రత్యేకత – శనగపప్పు, బాస్మతి బియ్యం, మసాలాల కలయికతో వచ్చే రుచిని ఆస్వాదించాల్సిందే!

కావల్సినవి: శనగపప్పు – 500 గ్రా.లు (నానబెట్టి ఉడికించాలి); బాస్మతి బియ్యం – 500 గ్రా.లు

మ్యారినేట్‌కి... నూనె – 50 మి.లీ; అల్లం వెల్లుల్లి పేస్ట్ – 2 టేబుల్ స్పూన్లు; వేయించిన ఉల్లిపాయ – 100 గ్రాములు; కారం – 2 టేబుల్ స్పూన్లు; పసుపు – టీ స్పూన్; ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి – టీ స్పూన్; ధనియాల పొడి – టీ స్పూన్; గరం మసాలా పొడి – టీ స్పూన్; నెయ్యి – 50 గ్రా.లు; నిమ్మరసం – అర నిమ్మకాయ; పుదీనా (తరిగినది) – ఒక కట్ట; కొత్తిమీర (తరిగినది) – ఒక కట్ట; పచ్చిమిర్చి (చీల్చినవి) – 4; పెరుగు – 200 గ్రాములు;

అన్నం వండటానికి... నీళ్లు – 3 లీటర్లు; బిరియానీ ఆకు – 3; షాజీరా – టీ స్పూన్; దాల్చిన చెక్క – 4 చిన్న ముక్కలు; యాలకులు – 6; లవంగాలు – 6; జాపత్రి – 2; పచ్చిమిర్చి (చీల్చినవి) – 4; పుదీనా (తరిగినది) – ఒక కట్ట; కొత్తిమీర (తరిగినది) – ఒక కట్ట; ఉప్పు – తగినంత;



తయారీ: ● శనగపప్పు నానబెట్టి, ఉడికించాలి; ● బియ్యాన్ని వేయించి పక్కన పెట్టాలి.

మ్యారినేట్‌కి... ● పెరుగు, అల్లం వెల్లుల్లి పేస్ట్, వేయించిన ఉల్లిపాయ, కారం, పసుపు, ఉప్పు, జీలకర్రపొడి, ధనియాల పొడి, గరం మసాలా పొడి, నెయ్యి, నిమ్మరసం, పుదీనా తరుగు, కొత్తిమీర తరుగు, చీల్చిన పచ్చిమిర్చి వేసి కలపాలి ● ఈ మిశ్రమంలో ఉడికించిన శనగపప్పు వేసి కనీసం 30 నిమిషాల సేపు మ్యారినేట్ చేయాలి.

బిర్యానీ తయారీ.. ● 3 లీటర్ల నీటిలో బిరియానీ ఆకులు, షాజీరా, దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు, జాపత్రి, పచ్చిమిర్చి, పుదీనా, కొత్తిమీర, ఉప్పు వేసి మరిగించాలి. అందులో వేయించిన బాస్మతి బియ్యం వేసి ముప్పావు వంతు వరకు ఉడికంచాలి ● అదనపు నీరు వడకట్టేయాలి.

లేయరింగ్‌కి... ● ఒక పాత్రలో అన్నం, మ్యారినేట్ చేసిన శనగపప్పు మిశ్రమాన్ని పొరలుగా వేసుకోవాలి ● తక్కువ మంటపై (దమ్‌లో) 10–15 నిమిషాలు ఉంచాలి ● కొత్తిమీర, పుదీనాతో అలంకరించి వేడి వేడిగా సర్వ్ చేయాలి.



చెఫ్ గోవర్ధన్

బులియన్
బంగారం 10 గ్రా.; వెండి కిలో
సెప్టెంబర్ 30న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,22,510	1,20,420	1,18,310	1,20,240	1,22,100	1,18,470
బంగారం (22 క్యారెట్లు)	1,15,450	1,03,450	1,08,450	1,11,170	1,12,330	1,08,600
వెండి	1,55,000	1,49,200	1,61,000	1,49,200	1,50,000	1,61,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి బిజినెస్
బుధవారం
1-10-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
97	24
80,268	24,611

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,540	▽	52
డోజోన్స్	46,230	▽	86
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,359	△	59
డాక్స్	23,884	△	139
షాంఘై	3,883	△	20
నికాయ్	44,932	▽	111

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.35	89.37
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.90	120.88
€	యూరో	ఎస్‌బీఐ	102.80	105.60
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.81	60.34
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.47	59.74
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.52	70.22
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.79	24.29
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.30	24.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.60	13.42

ఎల్‌జీ @ రూ. 1,080-1,140

- ఈ నెల 7–9 మధ్య పబ్లిక్ ఇష్యూ
- రూ. 15,000 కోట్ల సమీకరణకు సై



న్యూఢిల్లీ: దక్షిణ కొరియా దిగ్గజం ఎల్‌జీ దేశీ అనుబంధ సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఐపీవోకి వస్తోంది. ఈ నెల 7న ప్రారంభంకానున్న ఇష్యూకి రూ. 1,080–1,140 ధరల శ్రేణి ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. 9న ముగియనున్న ఇష్యూలో భాగంగా మాతృ సంస్థ ఎల్‌జీ 15 శాతం వాటా(10.18 కోట్లకు పైగా షేర్లు) విక్రయానికి ఉంచనుంది. తద్వారా కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లయెన్సెస్ దిగ్గజం రూ. 11,500–15,000 కోట్ల మధ్య సమీకరించే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. యాంకర్ ఇన్వెస్టర్లకు 6న షేర్లు జారీ చేయనుంది. గతేడాది అక్టోబర్‌లో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా దేశీయంగా లిస్టయ్యాక మళ్లీ మరో దక్షిణ కొరియా దిగ్గజం ఐపీవో బాట పట్టడం గమనార్హం! కాగా.. పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు వీలుగా కంపెనీ 2024 డిసెంబర్‌లో సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసి 2025 మార్చిలో అనుమతి పొందింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) కావడంతో ఐపీవో నిధులు కంపెనీకికాకుండా మాతృ సంస్థకు చేరనున్నాయి. కంపెనీ ఎల్‌జీ బ్రాండుతో ఏసీలు, లెడ్ టీవీలు, వాషింగ్ మెషీన్లు, ఫ్రిడ్జ్‌లు, మైక్రోవేవ్‌లు, వాటర్ ఫిల్టర్లు తదితర పలు ప్రొడక్టులను విక్రయిస్తున్న విషయం విదితమే. నోయిడా, పుణేలలో తయారీ ప్లాంట్లను కలిగి ఉన్న కంపెనీ 2023–24లో రూ. 64,088 కోట్ల ఆదాయం సాధించింది.

చిన్న మొత్తాల పొదుపు ఖాతాలపై
వడ్డీ రేటు యథాతథం



న్యూఢిల్లీ: అక్టోబర్ 1తో ప్రారంభమయ్యే త్రైమాసికానికి సంబంధించి, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌తో పాటు వివిధ చిన్న మొత్తాల పొదుపు ఖాతాలపై వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. దీనితో వరుసగా ఏడు త్రైమాసికాలుగా వడ్డీ రేట్లను మార్చకుండా కొనసాగించినట్లవుతుంది. నోటిఫికేషన్ ప్రకారం సుకన్య సమృద్ధి స్కీమ్‌లో డిపాజిట్లపై 8.2%, మూడేళ్ల టర్మ్ డిపాజిట్లు.. పీపీఎఫ్‌పై 7.1%, పోస్టాఫీస్ సేవింగ్స్ డిపాజిట్ స్కీములపై 4%, కిసాన్ వికాస పత్రపై 7.5%, ఎన్ఎస్‌సీపై 7.7% వడ్డీ రేట్లు ఉంటాయి. కేంద్రం ప్రతి మూడు నెలలకోసారి స్మాల్ సేవింగ్స్ స్కీములపై వడ్డీ రేట్లను నోటిఫై చేస్తుంది.

పసిడి @ రూ. 1.2 లక్షలు

పండుగ జోరుతో జీవితకాల గరిష్టానికి జంప్



న్యూఢిల్లీ: పసిడి రేట్లు ఆకాశమే హద్దుగా పెరిగిపోతున్నాయి. మంగళవారం 10 గ్రాముల బంగారం రేటు మరో రూ. 500 పెరిగి జీవితకాల గరిష్టమైన రూ. 1.20 లక్షలకు చేరింది. డాలరు బలహీనంగా ఉండటం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరింతగా వడ్డీ రేట్లను తగ్గించవచ్చనే అంచనాలతో పాటు దేశీయంగా పండుగ సీజన్ కూడా పసిడి పరుగులకు కారణంగా నిలుస్తోంది. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం గత సెషన్లో పసిడి రేటు రూ. 1,500 పెరిగి రూ. 1,19,500కి చేరింది. తాజాగా 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం ధర వరుసగా నాలుగో సెషన్లోను రూ. 500 పెరిగి రూ. 1,19,400కి చేరింది. అలాగే 99.9 శాతం స్వచ్ఛమైన పసిడి రేటు కూడా అంతే పెరిగి రూ. 1.20 లక్షలకు ఎగిసింది. మరోవైపు, వెండి రేటు సైతం కేజీకి రూ. 500 చొప్పున పెరిగి రూ. 1,50,500కి చేరింది. ఈ ఏడాది ఇప్పటివరకు వెండి ధరలు రూ. 60,800 మేర (67.78 శాతం) పెరిగాయి. 2024 డిసెంబర్ 31న రేటు రూ. 89,700గా ఉండేది. అటు అంతర్జాతీయంగా పసిడి ధర ఔన్సుకు (31.1 గ్రాములు) 3,871 డాలర్ల రికార్డు స్థాయిని తాకినట్లు మిరే అసెట్ షేర్‌ఖాన్ సంస్థ కమోడిటీస్, కరెన్సీస్ విభాగం హెడ్ ప్రవీణ్ సింగ్ తెలిపారు. అమెరికాలో వ్యవసాయేతర ఉద్యోగాల వృద్ధి, నిరుద్యోగం తదితర గణాంకాలు వెల్లడి కానున్న నేపథ్యంలో పసిడి ధరలు హెచ్చుతగ్గులకు లోనైనట్లు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వీపీ జతీన్ త్రివేది తెలిపారు.

ఇక స్విస్ చాక్లెట్లు.. వాచీలు చౌక

నేటి నుంచి భారత్-ఈఎఫ్‌టీఏ వాణిజ్య ఒప్పందం అమల్లోకి
15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడుల రాక



న్యూఢిల్లీ: ఇకపై చాక్లెట్లు, వైన్స్, దుస్తులు, వాచీల్లాంటి పలు స్విట్జర్లాండ్ ఉత్పత్తులు భారత మార్కెట్లో చౌకగా లభించనున్నాయి. అలాగే మన దేశానికి చెందిన పలు ఎగుమతి సంస్థలకు మరింత విస్తృత మార్కెట్ అందుబాటులోకి రానుంది. ఇందుకు సంబంధించి నాలుగు యూరప్ దేశాల కూటమి ఈఎఫ్‌టీఏతో భారత్ కుదుర్చుకున్న వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టీఈపీఏ) అక్టోబర్ 1 నుంచి (నేడు) అమల్లోకి రానుంది. ఐస్‌ల్యాండ్, లీక్టెన్‌స్టెయిన్, నార్వే, స్విట్జర్లాండ్ సభ్యదేశాలుగా ఉన్న యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఈఎఫ్‌టీఏ)తో 2024 మార్చి 10న ఈ ఒప్పందం కుదిరింది. దీని కింద, వచ్చే 15 ఏళ్లలో భారత్‌లో 100 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టేందుకు ఈఎఫ్‌టీఏ హామీ ఇచ్చింది. ఒప్పందం అమల్లోకి వచ్చిన పదేళ్ల వ్యవధిలో 50 బిలియన్ డాలర్లు, ఆ తర్వాత అయిదేళ్లలో 50 బిలియన్ డాలర్ల మేర కూటమి దేశాలు భారత్‌లో ఇన్వెస్ట్ చేయనున్నాయి. దీనితో భారత్‌లో ప్రత్యక్షంగా పది లక్షల ఉద్యోగాల కల్పన జరగనుంది. ఒకవేళ ఏదైన కారణం వల్ల ప్రతిపాదిత పెట్టుబడులు రాకపోతే ఆ నాలుగు దేశాలకు ఇస్తున్న సుంకాలపరమైన వెసులుబాట్లను సర్దుబాటు చేసే లేదా పూర్తిగా ఎత్తివేసేందుకు వీలుగా సదరు ఒప్పందంలో నిబంధన ఉంది. ఈఎఫ్‌టీఏ దేశాలనేవి యూరోపియన్ యూనియన్‌లో (ఈయూ) భాగం కావు. ఈయూతో కూడా భారత్ విడిగా వాణిజ్య ఒప్పందంపై కసరత్తు చేస్తోంది. వివిధ దేశాలతో, అలాగే కూటములతో భారత్ కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల్లో టీఈపీఏ పద్నాలుగోది. మోదీ సారథ్యంలోని ప్రభుత్వం కుదుర్చుకున్న వాటిల్లో మారిషస్, యూఏఈ, యూకే, ఆస్ట్రేలియా తర్వాత అయిదోది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
నిధుల వేటలో 4 కంపెనీలు	ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై ధరలు తగ్గాయా?

ప్రయోజనాలు ఇలా..

ఈ ఒప్పందం కింద స్విస్ వాచీలు, చాక్లెట్లు, కట్.. పాలిష్డ్ డైమండ్లలాంటి వాటిపై సుంకాల భారం తగ్గుతుంది. కార్మిక శక్తి ఎక్కువగా ఉండే తేయాకు..కాఫీ, టెక్స్‌టైల్స్, మెరైన్ ఉత్పత్తులు, లెదర్, స్పోర్ట్స్ గూడ్స్, పండ్లు, రత్నాభరణాలు మొదలైన మన దేశ పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతులకు విస్తృత మార్కెట్ లభిస్తుంది. సుంకాల తగ్గింపుతో ఇంజనీరింగ్ గూడ్స్, ఎలక్ట్రానిక్ ఐటమ్స్, రసాయనాలు, ప్లాస్టిక్ గూడ్స్ తదితర ఎగుమతి ఆధారిత పరిశ్రమలకు ప్రయోజనం చేకూరుతుంది. లీగల్, ఆడియో–విజువల్, కంప్యూటర్, అకౌంటింగ్‌లాంటి సేవలందించే భారతీయ సంస్థలకు లబ్ధి చేకూరనుంది. ఒప్పందం ప్రకారం భారత్ నుంచి వచ్చే దాదాపు 99.6 శాతం దిగుమతులపై సుంకాలను తగ్గించేందుకు లేదా పూర్తిగా తొలగించేందుకు ఈఎఫ్‌టీఏ అంగీకరించింది. అలాగే ఈఎఫ్‌టీఏ నుంచి వచ్చే 95 శాతం దిగుమతులపై సుంకాలను భారత్ తగ్గిస్తుంది. డెయిరీ, సోయా, కొన్ని వ్యవసాయ ఉత్పత్తులు మాత్రం ఈ పరిధిలోకి రావు. దశలవారీగా కొన్ని రకాల బొగ్గు, చాలామటుకు ఔషధాలు, అద్దకపు రంగులు, టెక్స్‌టైల్స్, దుస్తులు, ఇనుము..ఉక్కు వంటి ఉత్పత్తుల దిగుమతులపై భారత్‌లో టారిఫ్‌లు సున్నా స్థాయికి తగ్గిపోతాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) తెలిపింది. ప్రాసెస్డ్ కూరగాయలు, బాస్మతి బియ్యం, తాజా పండ్లు మొదలైన వాటిని ఈఎఫ్‌టీఏ దేశాలకు భారత్ ఎగుమతి చేస్తోంది. 2023–24లో ఈఎఫ్‌టీఏ కూటమికి భారత్ నుంచి 1.94 బిలియన్ డాలర్లుగా ఉండగా 2024–25లో 1.97 బిలియన్ డాలర్లకు చేరాయి. దిగుమతులు 22.05 బిలియన్ డాలర్ల నుంచి 22.44 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

8 రోజులు.. 2,746 పాయింట్లు డౌన్!

కొనసాగుతున్న మార్కెట్ పతనం..

- విదేశీ ఇన్వెస్టర్ల తిరోగమనం ఎఫెక్ట్
- సెన్సెక్స్ 97 పాయింట్లు, నిఫ్టీ 24 పాయింట్లు డౌన్



ముంబై: విదేశీ ఇన్వెస్టర్లు పోలోమంటూ అమ్మకాలకు తెగబడుతుండటంతో దేశీ మార్కెట్లు వరుసగా ఎనిమిదో రోజూ నష్టాల్లో ముగిశాయి. మరోపక్క, నేడు ఆర్‌బీఐ పాలసీ నిర్ణయం ఉండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడం కూడా సూచీలపై ప్రభావం చూపింది. ఆద్యంతం ఒడిదుడుకుల నేపథ్యంలో సెన్సెక్స్ 97 పాయింట్లు కోల్పోయి 80,268 పాయింట్ల వద్ద, నిఫ్టీ 24 పాయింట్ల నష్టంతో 24,611 పాయింట్ల వద్ద ముగిశాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ 80,677 పాయింట్ల గరిష్టాన్ని, 80,201 పాయింట్ల కనిష్టాన్ని తాకింది. కాగా, ఎనిమిది ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,746 పాయింట్లు (3.3 శాతం) పతనమైంది.

మెటల్స్ మెరుపు..: ఎఫ్అండ్ఓ కాంట్రాక్టుల నెలవారీ ముగింపు నేపథ్యంలో ట్రేడింగ్ మందకొడిగా సాగింది. మెటల్, బ్యాంకింగ్ షేర్లు, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లు లాభాల్లో నిలిచాయి. రియల్టీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్‌లో ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, ట్రెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్, రిలయన్స్ ప్రధానంగా నష్టపోయాయి. అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, బజాజ్ ఫైనాన్స్ లాభపడ్డాయి.

- ఎక్కువగా క్షీణించిన సూచీల్లో టెలికం (0.9%), రియల్టీ (0.79%) కన్జూమర్ డ్యూరబుల్స్ (0.78%) ఉన్నాయి. మెటల్స్ సూచీ (1.1%), ఆటో (0.3%) బ్యాంకెక్స్ (0.2%) పెరిగాయి.
- మ్యాన్ ఇండస్ట్రీస్ కంపెనీతో పాటు ముగ్గురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లపై సెబీ నిషేధం విధించడంతో షేరు 10.6 శాతం కుప్పకూలి రూ.363కు పడిపోయింది.

1 హిట్.. 3 ఫట్!

మంగళవారం స్టాక్ మార్కెట్లో లిస్టయిన నాలుగు కంపెనీల్లో ఒకటి హిట్ కొట్టగా.. మూడు ఇన్వెస్టర్లకు నష్టాలు మిగిల్చాయి.

ఆనంద్ రాఠీ: ఈ స్టాక్ బ్రోకింగ్ సంస్థ షేర్లు ఇష్యూ ధర (రూ.414)తో పోలిస్తే బీఎస్ఈలో దాదాపు 8 శాతం ప్రీమియంతో రూ.432 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 10.7 శాతం జంప్ చేసి, చివరకు 7.64 శాతం లాభంతో రూ.445 వద్ద స్థిరపడింది. మార్కెట్ విలువ రూ.2,795 కోట్లుగా నమోదైంది.

శేషసాయి టెక్: పేమెంట్స్ సొల్యూషన్లను అందించే ఈ కంపెనీ షేర్లు ఇష్యూ ధర (రూ.423)తో పోలిస్తే బీఎస్ఈలో 3 శాతం ప్రీమియంతో రూ. 436 వద్ద అరంగేట్రం చేశాయి. చివరికి స్వల్పంగా 2.73 శాతం నష్టపోయి రూ. 411 వద్ద ముగిశాయి. మార్కెట్ విలువ 6,658 కోట్లకు చేరింది.

సోలార్‌వరల్డ్ ఎనర్జీ సొల్యూషన్స్: ఈ గ్రీన్ ఎనర్జీ స్టాక్ ఇష్యూ ధర (రూ.351)తో పోలిస్తే 10 శాతం ప్రీమియంతో రూ. 389 వద్ద లిస్టయింది. అయితే, తర్వాత లాభాల స్వీకరణతో 8 శాతం నష్టపోయి రూ.323 వద్ద స్థిరపడింది.

జారో ఎడ్యుకేషన్: లిస్టింగ్‌లో బోర్లా పడింది. ఇష్యూ ధర (రూ.890) కోట్లతో పోలిస్తే బీఎస్ఈలో 16 శాతం పతనమై రూ.718 వద్ద ఆరంభమైంది. ఒకదశలో 19 శాతం పైగా దిగజారి, చివరకు 16 శాతం నష్టంతో రూ.745 వద్ద క్లోజయ్యింది.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

అవుతారా.. బ్యాంక్ మేనేజర్

దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ).. నిరుద్యోగులకు కొలువుల కబురు అందించింది. పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న 122 స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు వేర్వేరుగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్వ్యూ ఆధారంగా భర్తీ చేస్తే ఈ ఉద్యోగాలకు.. అభ్యర్థులు ముంబై కేంద్రంగా పని చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐలో మేనేజర్ ఉద్యోగాల పూర్తి వివరాలు..

» ఎస్‌బీఐలో 122 మేనేజర్ పోస్టులకు నోటిఫికేషన్
» షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక



- మొత్తం పోస్టులు: 122

పోస్టుల వివరాలు

- మేనేజర్ (క్రెడిట్ అనలిస్ట్)-63, మేనేజర్(ప్రొడక్ట్స్–డిజిటల్ ప్లాట్‌ఫామ్స్)–34, డిప్యూటీ మేనేజర్ (ప్రొడక్ట్స్–డిజిటల్ ప్లాట్‌ఫామ్స్)–25.

అర్హతలు

- మేనేజర్(క్రెడిట్ అనలిస్ట్) పోస్టుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీతో పాటు ఎంబీఏ(ఫైనాన్స్), పీజీడీబీఏ, పీజీడీబీఎం, ఎమ్ఎమ్ఎస్(ఫైనాన్స్), సీఏ, సీఎఫ్ఏ, ఐసీడబ్ల్యూఏ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ ఫైనాన్స్ రంగంలో మూడేళ్ల పని చేసిన అనుభవం ఉండాలి.
- డిప్యూటీ మేనేజర్, మేనేజర్ పోస్టులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈ, బీటెక్ కోర్సును పూర్తి చేసి ఉండాలి. లేదా ఎంసీఏ కోర్సులో కనీసం 60 శాతం మార్కులతో పూర్తి చేసి ఉండాలి. అదనంగా ఎంబీఏ కోర్సులు చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. డిజిటల్ పేమెంట్స్, డిజిటల్ సొల్యూషన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఐదేళ్ల పనిచేసిన అనుభవం ఉండాలి. డిప్యూటీ మేనేజర్ పోస్టుకు మూడేళ్ల పని చేసిన అనుభవం ఉండాలి.

వయసు

సంబంధిత పోస్టును అనుసరించి 25 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

వేతనం

మేనేజర్‌కు వేతనం రూ.85,920– రూ.1,05,280, డిప్యూటీ మేనేజర్‌కు నెలకు రూ.64,820–రూ.93,960 మధ్య ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ

దరఖాస్తు చేసిన అభ్యర్థుల అకడమిక్ మార్కులు, పని అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. షార్ట్ లిస్టు అయిన వారికి బ్యాంకు కాల్‌లెటర్/ఈమెయిల్ ద్వారా సమాచారం అందిస్తుంది. వీరికి ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది. ఈ ఇంటర్వ్యూ 100 మార్కులకు ఉంటుంది. మెరిట్ మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూకు ఎవరిని పిలవాలనే విషయంలో తుది నిర్ణయం పూర్తిగా బ్యాంకుదే.

దరఖాస్తు ఫీజు

జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.750, ఎస్సీ,ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు లేదు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం తేదీ:11.09.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 02.10.2025
- వెబ్‌సైట్: https://sbi.co.in



ఎస్ఎస్‌సీ-ఢిల్లీ పోలీస్ సీఏపీఎఫ్ పరీక్ష-2025

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ఢిల్లీ పోలీస్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(సీఏపీఎఫ్)లో సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన పురుషులు, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 2,861.
» అర్హత: పోస్టును అనుసరించి ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎత్తు: పురుషులు 170 సెం.మీ. మహిళలు 165 సెం.మీ. ఉండాలి. చెస్ట్ 80 నుంచి 85 సెం.మీ. ఉండాలి.
» వయసు: 01.08.2025 నాటికి 20 నుంచి 25 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.35,400 నుంచి 1,12,400.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్(పీఎస్‌టీ) ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 26.09.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 16.10.2025
» దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరితేది: 17.10.2025.
» దరఖాస్తు సవరణ తేదీలు: 24.10.2025 నుంచి 26.10.2025 వరకు
» వెబ్‌సైట్: https://ssc.gov.in

ఇండియన్ బ్యాంక్‌లో 171 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

ఇండియన్ బ్యాంక్ దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో వివిధ విభాగాల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 171.
» పోస్టుల వివరాలు: చీఫ్ మేనేజర్–41, సీనియర్ మేనేజర్–70, మేనేజర్–60.
» విభాగాలు: క్రెడిట్ అనలిస్ట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, కోఆపరేటివ్ క్రెడిట్ అనలిస్ట్, ఫైనాన్షియల్ అనలిస్ట్, రిస్క్ మేనేజ్‌మెంట్, ఐటీ రిస్క్ మేనేజ్‌మెంట్, డేటా అనలిస్ట్,కంపెనీ సెక్రటరీ, చార్టెడ్ అకౌంటెంట్.
» అర్హత: సంబంధిత విభాగంలో సీఏ/ఐసీడబ్ల్యూ, ఐసీఏఐ, పీజీ, బీఈ/బీటెక్, ఎంసీఏ/ఎంఎస్సీ, డిగ్రీ, ఎంబీఏ, ఎంఎంఎస్, పీజీడీబీఎం, ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: పోస్టును అనుసరించి 23 నుంచి 36 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, ఆన్‌లైన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 23.09.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 13.10.2025
» వెబ్‌సైట్: www.indian-bank.in



ఎస్ఎస్‌సీలో ఢిల్లీ పోలీస్-హెడ్ కానిస్టేబుల్(ఏడబ్ల్యూవో/టీపీవో) 552 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ఢిల్లీ పోలీస్-హెడ్ కానిస్టేబుల్(అసిస్టెంట్ వైర్‌లెస్ ఆపరేటర్/టెలి ప్రింటర్ ఆపరేటర్) పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహిస్తారు.

» మొత్తం పోస్టుల సంఖ్య: 552. (పురుషులు: 370, మహిళలు–182)
» అర్హత: 10+2(సైన్స్,మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణులవ్వాలి. మెకానిక్–కమ్–ఆపరేటర్ ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ సిస్టమ్‌లో నేషనల్ ట్రేడ్ సర్టిఫికేట్ ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
» వయసు: 01.07.2025 నాటకి 18 నుంచి 27 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.25,500 నుంచి రూ.81,000.
» ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఫిజికల్ ఎండ్యూరెన్స్ అండ్ మెజర్‌మెంట్ టెస్ట్, ట్రేడ్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 24.09.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 15.10.2025
» దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరి తేది: 16.10.2025.
» దరఖాస్తు సవరణ తేదీలు: 23.10.2025 నుంచి 25.10.2025 వరకు
» సీబీటీ పరీక్ష: డిసెంబర్ 2025/జనవరి 2026.
» వెబ్‌సైట్: https://ssc.gov.in

సీఎస్ఐఆర్-ఐఐసీటీ, హైదరాబాద్‌లో సైంటిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ).. సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 07.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ, ఎంఈ/ఎంటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 30.10.2025 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.1,34,907.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 01.10.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.10.2025.
» వెబ్‌సైట్: http://www.iict.res.in

ఎన్ఐవోటీ, చెన్నైలో 25 అప్రెంటిస్‌లు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐవోటీ).. డిప్లొమా, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 25.
» ఖాళీల వివరాలు: డిప్లొమా టెక్నీషియన్ అప్రెంటిస్‌లు–08, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు–17.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా, బీటెక్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: డిప్లొమా టెక్నీషియన్ అప్రెంటిస్‌కు 18 నుంచి 24 ఏళ్లు, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు 21 నుంచి 26 ఏళ్లు ఉండాలి.
» స్టైపెండ్: నెలకు డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.12,000, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.13,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఇంటర్వ్యూ తేది: 27.10.2025.
» వెబ్‌సైట్: https://www.niot.res.in

ఎస్ఎస్‌సీలో 737 కానిస్టేబుల్(డ్రైవర్) పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ఢిల్లీలో పోలీస్ కానిస్టేబుల్ (డ్రైవర్).. పోస్టుల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 737.
» అర్హత: పోస్టును అనుసరించి 10+2 ఉత్తీర్ణతతో పాటు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
» వయసు: 01.07.2025 నాటికి 21 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.21,700 నుంచి రూ.69,100.
» ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 24.09.2025.
» ఆన్‌లైన్ ఫీజు చెల్లించడానికి చివరితేది: 16.10.2025.
» దరఖాస్తు సవరణ తేదీలు: 23.10.2025 నుంచి 25.10.2025 వరకు
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.10.2025.
» పరీక్ష తేది: డిసెంబర్ 2025/ జనవరి 2026.
» వెబ్‌సైట్: https://ssc.gov.in

ఎయిమ్స్ పాట్నాలో వివిధ ఉద్యోగాలు

పాట్నాలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులుకోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 02.
» పోస్టుల వివరాలు: ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్–01, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్–01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, బీఏఎంఎస్‌తో పాటు డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ, ఆయుర్వేద శాస్త్రంలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» వయసు: 28 నుంచి 35 ఏళ్లు మించకూడదు.
» వేతనం: ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్‌కు రూ.67,000, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్‌కు రూ.18,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఈమెయిల్: gastroenterology@aiimspatna.org.
» దరఖాస్తులకు చివరితేది: 04.10.2025.
» వెబ్‌సైట్: https://aiimspatna.edu.in

ఎస్వీఐఎంఎస్, తిరుపతిలో వివిధ పోస్టుల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎస్వీఐఎంఎస్).. వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 03.
» పోస్టుల వివరాలు: మెడికల్ సూపరింటెండెంట్-01, ప్రిన్సిపల్–01, రిజిస్ట్రార్–01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, ఎండీ(హెచ్ఏ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 60 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తులకు చివరితేది: 07.10.2025.
» వెబ్‌సైట్: https://svimstpt.ap.nic.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–రీజనింగ్



ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మవారు మంగళ వారం దుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించారు. నగరోత్సవం నయనమనోహరంగా సాగింది.

బెజవాడ



నవరాత్రి ఉత్సవాల తొమ్మిదవ రోజు మంగళవారం సిద్ధిధాత్రిగా భక్తులకు దర్శనమిచ్చిన అలంపూర్ జోగుళాంబ

- అలంపూర్



శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం మహాదుర్గాలంకారంలో దర్శనమిచ్చిన వరంగల్ భద్రకాళి

- హనుమకొండ కల్చరల్



శారదీయ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా తొమ్మిదోరోజు సిద్ధిధాత్రిగా భక్తులను కరుణించిన బాసర శ్రీ జ్ఞానసరస్వతీదేవి

- బాసర

కొండాపూర్ భూములు సర్కార్‌వే..

- సర్కార్ వేసిన అప్పీల్‌ను అనుమతిస్తూ హైకోర్టు తీర్పు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ సర్వే నంబర్ 59లోని వివాదాస్పద భూములు సర్కార్‌వేనని హైకోర్టు తేల్చి చెప్పింది. ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను అనుమతిస్తూ.. సివిల్ కోర్టు తీర్పును రద్దు చేసింది. కొండాపూర్‌లోని భూములు ప్రైవేట్ వ్యక్తులవేనంటూ సివిల్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం అప్పీళ్లు వేసింది. వీటిపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారించి తీర్పు వెలువరించారు. లావణి నిబంధనల్లో జి పట్టా ఫారంతో వీరి వద్ద ఉన్న పట్టాతో సంబంధం లేకుండా ఉందన్నారు. 1961, డిసెంబర్ 13న తహసీల్దార్ పట్టా ఇచ్చినట్లు చెబుతున్నా.. సంతకం మాత్రం అదే నెల 21వ తేదీతో ఉండటం అనుమానాలకు తావిస్తోందన్నారు. ముందు పట్టాలు సిద్ధంచేసి, తర్వాత సంతకాలు పెట్టించినట్లు సివిల్ కోర్టు పేర్కొనడం ఆమోదయోగ్యంగా లేదన్నారు. 1958లో అసైన్‌మెంట్ భూముల కేటాయింపునకు సర్కార్ కొత్త జీవో తెచ్చిందని, ఈ జీవో అమల్లో ఉండగా 1961లో అమల్లో లేని లావణి పట్టా జారీ చేసే అవకాశం ఉండదన్నారు. జీవో సమయంలోనే రాజధానికి 10 మైళ్ల వరకు అసైన్‌మెంట్‌పై నిషేధం ఉంది, కొండాపూర్ అంతకంటే తక్కువ దూరమే ఉన్నందున పట్టా జారీ చేయడం సందేహాలకు తావి స్తోందన్నారు. కోర్టు సందేహాలను నివృత్తి చేయడంలో ప్రైవేట్ వ్యక్తులు విఫలమయ్యారని న్యాయమూర్తి పేర్కొన్నారు. 1988 నుంచి ఆ భూములు సర్కార్ అధీనంలో ఉన్నట్టు ఆధారాలు చూపారని, ఇప్పుడు 10 ఎకరాలు మాత్రమే మిగిలి ఉందని అధికారులు చెబుతున్నప్పుడు.. ప్రైవేట్ వ్యక్తులు తమ అధీనంలో భూములు ఉన్నాయని చెప్పడం ఆమోదయోగ్యం కాదన్నారు. భూములన్నీ సర్కార్‌వేనంటూ కలెక్టర్ దాఖలు చేసిన అప్పీల్‌ను అనుమతిస్తున్నామని చెప్పారు. ఇందులో కాసాని జ్ఞానేశ్వర్, కుటుంబసభ్యులు దాఖలు చేసిన మరో పిటిషన్‌ను కొట్టివేశారు.

చేనును మేసిన కంచె

- భక్షకులుగా మారుతున్న చెరువుల రక్షకులు
- అక్రమార్కులకు చట్ట విరుద్ధంగా ఎన్‌ఓసీలు
- ఆనక రికార్డులు దొరక్కుండా ధ్వంసం చేస్తున్న తీరు
- నీటిపారుదల శాఖ అధికారుల అతి తెలివి
- కొత్తకుంట ఎన్‌ఓసీపై విచారణలో విస్తుపోయే నిజాలు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మహా నగరంలోని చెరువులు, కుంటలను స్థిరాస్తి వ్యాపారులకు అక్రమంగా అప్పగించేందుకు కొందరు నీటిపారుదల శాఖ ఇంజనీర్లు ఎందాకైనా బరితెగిస్తున్నారు. చెరువులు, కుంటల ఫుల్‌ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోని భూముల్లో అక్రమ నిర్మాణాలకు ఎడాపెడా నిరభ్యంతర పత్రాలు(ఎన్‌ఓసీ) జారీ చేస్తున్నారు. సంబంధిత ఉత్తర ప్రత్యుత్తరాల రికార్డులనే మాయం చేసేసి తమ పాపాలకు సాక్ష్యాల్లేకుండా చూసుకుంటున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంఖాల్ గ్రామంలోని కొత్తకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు ఎన్‌ఓసీ జారీ చేసినట్టు వచ్చిన ఆరోపణలపై తాజా నీటిపారుదల శాఖ జరిపించిన విచారణలో ఇలాంటి ఎన్నో సంచలన అంశాలు వెలుగు చూశాయి. నీటిపారుదల శాఖ హైదరాబాద్ సర్కిల్ సీఈ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఆ శాఖ ఈఎన్సీ (జనరల్)కు ఇటీవల సమర్పించిన నివేదికలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి..

ఎన్‌ఓసీ కోసం ఎఫ్‌టీఎల్ తగ్గించి..

కొత్తకుంట చెరువు ఎఫ్‌టీఎల్ 8.284 ఎకరాల్లో విస్తరించి ఉందని లాంటెక్ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ గతంలో సర్వే నిర్వహించి తేల్చగా, దీనిని ధ్రువీకరిస్తూ నీటిపారుదల శాఖ ఏఈఈ వి.గంగరాజు, డీఈఈ కె.జగదీశ్వర్, ఈఈ కె.బన్సీలాల్ సంతకం సైతం చేశారు. పొరుగున ఉన్న స్థల యజమాని దీని ఎఫ్‌టీఎల్ పరిధిలో సీసీ డ్రెయిన్ నిర్మిస్తున్నట్టు 2024 జూలై 19న జరిపిన తనిఖీల్లో స్థానిక ఏఈఈ గోవింద్‌నాయక్ గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అదే రోజు ఎఫ్ఐఆర్ నమోదైంది. గత ఫిబ్రవరి 8న హైడ్రా, నీటిపారుదల శాఖ అధికారుల బృందం సీసీ డ్రెయిన్‌ను కూల్చివేసింది. చెరువుకి సంబంధించి సర్వే నంబర్ 776లో 15.13 ఎకరాలుండగా, 12.32 ఎకరాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు తనకు నీటిపారుదల శాఖ ఎన్‌ఓసీ ఇచ్చిందని స్థల యజమానికి హైడ్రా అధికారులకు చూపెట్టారు. ఎఫ్‌టీఎల్ పరిధి 2.03 ఎకరాలేనని పేర్కొంటూ ఈ ఎన్‌ఓసీ జారీ చేశారని హైడ్రా, నీటిపారుదల శాఖ అధికారుల పరిశీలనలో తేలింది. వాస్తవానికి 8.284 ఎకరాల్లో ఎఫ్‌టీఎల్ విస్తరించి ఉన్నట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. స్థల యజమాని ఎన్‌ఓసీ కోసం హైదరాబాద్ ఎస్ఈ, డివిజన్-1 ఈఈ కార్యాలయాలకు ఎలాంటి దరఖాస్తు చేసుకోకపోయినా ఎన్‌ఓసీలు జారీ చేశారు.

రికార్డులు మాయం

స్థల యజమాని సమర్పించిన రికార్డులను హైడ్రా, నీటిపారుదల శాఖ సంయుక్తంగా తనిఖీ చేయగా అతడి నుంచి నోటరైజ్ క్లారిఫికేషన్ కోరుతూ హైదరాబాద్ సర్కిల్ ఎస్ఈ హైదర్ ఖాన్ గతేడాది జూలై 19న లేఖ రాసినట్టు తేలింది. ఆయన కార్యాలయం అవుట్‌వార్డ్ రిజిస్టర్‌లో సైతం ఈ లేఖ ప్రస్తావన ఉండగా, లేఖ ప్రతి మాత్రం మాయమైంది. అయితే, సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ లేఖ ప్రతి లభించింది. ఎన్‌ఓసీ జారీ విషయంలో సీఈ నుంచి తమ కార్యాలయానికి మెమో అందిందని ఇదే లేఖలో ఎస్ఈ ప్రస్తావించగా, ఆయన కార్యాలయ ఇన్‌వార్డ్ రిజిస్టర్‌లో ఎలాంటి ఎంట్రీ లేదు. మెమో ప్రతి మాత్రం సబ్ డివిజన్ కార్యాలయంలో లభించింది. ఈ మెమోలో ఎస్ఈ గతేడాది జూన్ 5న రాసిన ఓ లేఖ ప్రస్తావన ఉండగా, దాని ప్రతి సైతం ఆయన కార్యాలయంలో మాయమైంది. ఈ లేఖను మాత్రం అవుట్‌వార్డ్ రిజిస్టర్‌లో ఎంట్రీ చేశారు. ఇదే మెమోలో 2021 మార్చి 10న డివిజన్-1 ఈఈ రాసిన లేఖ ప్రస్తావన సైతం ఉండగా, సీఈ కార్యాలయం ఇన్‌వార్డ్ రిజిస్టర్‌లో దానిని ఎంట్రీ చేయలేదు. ఈఈ కార్యాలయ అవుట్‌వార్డ్ రిజిస్టర్‌లో ఈ లేఖను పంపినట్టు ఎంట్రీ చేసి ఉండగా, ఈ లేఖ ఇతర అంశానికి సంబంధించిందని తేలింది. గత ఫిబ్రవరి 21న సీఈకి ఈఈ పంపిన లేఖలో 2021 మార్చి 16న రాసిన మరో లేఖ ప్రస్తావన ఉండగా, ఆయన కార్యాలయ అవుట్‌వార్డ్ రిజిస్టర్‌లో లేఖ సంఖ్య రాసి ఎంట్రీని మాత్రం ఖాళీగా ఉంచారు. ఈ లేఖ ప్రతిని సైతం మాయం చేశారు. ఏఈఈ వి.గంగరాజు 2021 ఫిబ్రవరి 1న కొత్తకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి 2.018 ఎకరాలు, 8.284 ఎకరాలతో రెండు విరుద్ధమైన మ్యాప్‌లు ఇచ్చారు. కొత్తకుంట ఈయన పరిధిలోకి రాకపోయినా ఎన్‌ఓసీని సిఫారసు చేశారు. ఎస్ఈ కార్యాలయానికి పంపిన రికార్డులను ఆయన మాయం చేశారని తేల్చారు. డీఈఈ కె.జగదీశ్వర్, ఈఈ కె.బన్సీలాల్ సైతం రెండు విరుద్ధమైన ఎఫ్‌టీఎల్ మ్యాప్‌లపై సంతకాలు చేసి ఎన్‌ఓసీ కోసం సిఫారసు చేశారు.

ఫైల్ సర్క్యులేట్ చేయకుండానే ఎన్‌ఓసీ జారీ

ఎన్‌ఓసీ కోసం నోటరైజ్ అండర్‌టేకింగ్ సమర్పించాలని స్థల యజమానికి లేఖ రాసిన ఎస్ఈ హైదర్ ఖాన్, దీనికి విరుద్ధంగా గత మార్చి 11న హైడ్రా కమిషనర్‌కు రాసిన లేఖలో సీఈ కార్యాలయం నుంచి తన కార్యాలయానికి ఎన్‌ఓసీ విషయంలో ఎలాంటి మెమో అందలేదని, తానెలాంటి ఎన్‌ఓసీ జారీ చేయలేదని తెలిపారు. సీఈ కె.ధర్మా స్వయంగా ఎన్‌ఓసీపై సంతకం చేసినా, దానిని తన కార్యాలయానికి మాత్రం సర్క్యులేట్ చేయలేదు. గత జూలై 18న ఆయనను ప్రభుత్వం విధుల నుంచి తప్పించింది. 2021 మార్చి 16న ఎన్‌ఓసీని ఈఈ బన్సీలాల్ జారీ చేయగా, అదే ఏడాది జూలై 8న సీఈ కె.ధర్మా సైతం మరో ఎన్‌ఓసీ జారీ చేశారు. వీటికి సంబంధించిన రికార్డులేమీ లేవు. సీఈ ధర్మా నేరుగా స్థల యజమానికి ఎన్‌ఓసీ జారీ చేసినట్టు తేలింది.

సొంత ఇల్లులా తెలంగాణ

- ఇక్కడి ప్రజలతో ఎంతో అనుబంధం ఏర్పడింది
- నా తల్లిదండ్రులను కోల్పోవడం ఎంతో బాధించింది
- పదవీ విరమణ కార్యక్రమంలో డీజీపీ జితేందర్ భావోద్వేగం



డీజీపీ జితేందర్ వీడ్కోలు సందర్భంగా జీపును లాగుతున్న శివధర్‌రెడ్డి, ఇతర సీనియర్ ఐపీఎస్ అధికారులు

సాక్షి, హైదరాబాద్: పంజాబ్‌కు చెందిన తనను ఐపీఎస్ ఆఫీసర్‌గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించినప్పుడు కొంత ఆలోచనలో పడ్డానని, కానీ ఇప్పుడు తెలంగాణ తన సొంత ఇల్లుగా మారిపోయిందని డీజీపీ డాక్టర్ జితేందర్ చెప్పారు. చిన్నతనంలో 20 ఏళ్లు మాత్రమే పంజాబ్‌లో ఉన్నానని, గత 40 ఏళ్లలో కనీసం 40 రోజులు కూడా అక్కడ లేనని, అంతగా ఏపీ, తెలంగాణతో, ఇక్కడి ప్రజలతో అనుబంధం ఏర్పడిందని అన్నారు. డీజీపీగా రిటైర్మెంట్ తర్వాత తన కుటుంబంతో ఇక్కడే స్థిరపడాలని కూడా నిర్ణయించుకున్నానని తెలిపారు. డీజీపీగా తనకు అవకాశం ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జితేందర్ పదవీ విరమణ సందర్భంగా మంగళవారం తెలంగాణ పోలీస్ అకాడమీలో వీడ్కోలు పరేడ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గౌరవ వందనం స్వీకరించిన ఆయన.. తన వృత్తిగత జీవితంలోని అనుభవాలు గుర్తు చేసుకున్నారు.

మూలాలు మరవద్దని నా తల్లిదండ్రులు చెప్పారు

జీవితంలో ఏ స్థాయిలో ఉన్నా మూలాలు మరవొద్దని తల్లిదండ్రులు నేర్పిన విలువలు తాను ఎప్పటికీ మరువలేదని జితేందర్ అన్నారు. అన్ని విధాలా తనను ముందుకు నడిపిన తల్లిదండ్రులను కోల్పోవడం ఎంతో బాధించిందని ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. తన స్నేహితుల ప్రోత్సాహంతో యూపీఎస్సీవైపు వచ్చానని, ఐపీఎస్ అధికారిగా పనిచేసిన తొలినాళ్లలో బీఎల్ మీనా తన గురువు అని తెలిపారు. తన వృత్తిగత జీవితంలో విజయాలు సాధించడంలో తన భార్య, పిల్లలు, ఇతర కుటుంబ సభ్యుల కృషి ఎంతో ఉందని అన్నారు. తాను డీజీపీగా పనిచేసిన 14 నెలల్లో తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్‌కు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, దాన్ని కొనసాగించేలా ముమ్ముందు పనిచేయాలని ఆకాంక్షించారు. కాగా డీజీపీగా జితేందర్ అనుభవం భవిష్యత్ పోలీసింగ్‌లో మార్గదర్శనంగా ఉంటుందని కొత్త డీజీపీగా నియమితులైన శివధర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్, అదనపు డీజీలు మహేశ్ భగవత్, చారుసిన్హా, నాగిరెడ్డి, స్టీఫెన్ రవీంద్ర, సంజయ్‌కుమార్ జైన్, విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, వీవీ శ్రీనివాసరావు, సజ్జనార్, స్వాతి లక్రా, ఐజీలు అవినాశ్ మహంతి, ఎం.రమేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్ నాయుడు, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు

పదవీ విరమణ పొందిన జితేందర్‌కు డీజీపీ కార్యాలయం ఘనంగా వీడ్కోలు పలికింది. పూలతో అలంకరించిన వాహనంలో ఆయన్ను ఎక్కించి, ఆ వాహనానికి ఇరువైపులా ఏర్పాటు చేసిన తాళ్లను శివధర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది గౌరవ సూచకంగా లాగుతూ కార్యాలయం గేటు వరకు తీసుకొచ్చారు. అక్కడినుంచి జితేందర్ తన వాహనంలో వెళ్లారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


FLAT 30% TO 50% OFF ON
VALUE ADDITION*
FOR PLAIN, TEMPLE & ANTIQUE
JEWELLERY
కల్యాణ్
జువెల్లర్స్
TRULY
Deepavali
FLAT 50% OFF ON
VALUE ADDITION*
FOR PREMIUM GOLD
JEWELLERY
FLAT 50% OFF ON
VALUE ADDITION
FOR UNCUT, PRECIOUS & DIAMOND
JEWELLERY
T&C apply. Limited period offer. *For purchases above 30 grams
FLAT 25% OFF ON VALUE ADDITION
FOR EVERY PURCHASE BELOW 30 GRAMS
OPEN ON ALL DAYS
HYDERABAD: PANJAGUTTA - PH: 040-23408733, 23418733 | KUKATPALLY - PH: 91334 75533, 040-23157333, 23155333 | A.S. RAO NAGAR - PH: 96406 13533, 040-27124233, 27123233
DILSUKHNAGAR - PH: 90522 56333, 040-24143233 | CHARMINAR - PH: 95810 35033 | CHANDANAGAR - PH: 82978 01533 | KOMPALLY- PH : 95819 46133
FOR MORE DETAILS CONTACT US ON TOLL FREE NUMBER: 1800 425 7333 | WWW.KALYANJEWELLERS.NET | FOLLOW US ON | BUY ONLINE @ WWW.CANDERE.COM | FOR INSTITUTIONAL REQUIREMENTS, WRITE TO B2BINDIA@KALYANJEWELLERS.NET

'ఉద్యోగుల బకాయిలు చెల్లించండి'

సాక్షి, అమరావతి: దసరా కానుకగానైనా ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని కూటమి ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ, ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

కాకినాడ శ్రీపీఠంలో వంద కోట్ల కుంకుమార్చనలు పూర్తి

కాకినాడ రూరల్: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని కాకినాడ శ్రీపీఠంలో నిర్వహిస్తున్న మహాశక్తి యాగంలో భాగంగా వంద కోట్ల కుంకుమార్చనలు మంగళవారం పూర్తయ్యాయి. పీఠంలో సెప్టెంబర్ 22 నుంచి లలితా సహస్ర నామాలు పఠిస్తూ వేలాదిగా మహిళలు పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి ఆధ్వర్యాన కుంకుమార్చనలు నిర్వహించారు.

గొర్రె పిల్లలను మింగిన కొండచిలువ



పుట్టపర్తి అర్బన్: మందలో ఉన్న రెండు చిన్న గొర్రె పిల్లలను కొండ చిలువ మింగింది. ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం పైపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం రాత్రి పొద్దుపోయాక సమీపంలోని కొండ నుంచి వచ్చిన భారీ కొండ చిలువ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి విజయ్ మందలోకి చొరబడింది. ఒక పిల్లను మింగేసింది. రెండవ పిల్లను నోట కరుచుకోవడంతో అరుపులు వినిపించాయి. వెంటనే అప్రమత్తమైన విజయ్ తోటి కాపరుల సహకారంతో రెండవ పిల్లను కొండ చిలువ నోటి నుంచి లాగేశారు. అప్పటికే అది మృతి చెందింది. కొండచిలువ ఎటూ వెళ్లలేక మందలోనే ఉండడంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు పుట్టపర్తికి చెందిన కరుణ సొసైటీ సిబ్బందికి తెలపడంతో వారు వచ్చి కొండ చిలువను చాకచక్యంగా పట్టుకుని బుక్కపట్నం సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలోకి వదిలేశారు.

అప్పన్నను దర్శించుకున్న న్యాయమూర్తి



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఉత్తరాఖండ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్ మెహ్రా కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో న్యాయమూర్తి పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు అందజేశారు.

శక్తిరూపిణి అయిన ఆదిపరాశక్తి దానవ సంహారానికి కాళికామాత అవతారం దాల్చి భక్తుల కోరిక మేరకు తన ప్రతిరూపంగా ఇచ్చినట్లు భావించే కళారాలు దుర్గాష్టమి, మహార్నవమి రోజుల్లో ఒంగోలు పురవీధుల్లో దర్శనమిస్తాయి. దసరా ఉత్సవాల్లో ప్రకాశం జిల్లాకు ప్రత్యేకమైన ఈ కళారాల ఊరేగింపు.. వాటి విశిష్టత తెలుసుకుందాం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకి మైసూరు తరువాత ఒంగోలు కళారాల ప్రత్యేకత

- తొలిసారిగా పంచలోహ కనకదుర్గ కళారం ఊరేగింపు
- ఒంగోలు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తజనం
- మేళతాళాలతో అమ్మవారి వేషధారణలో కళాకారుల నృత్య ప్రదర్శన

కళారాల కళకళ

ఒంగోలు మెట్రో: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో రోజుకొక అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో అర్ధరాత్రి పూట జరిగే కళారాల వేడుకలకు జిల్లా నలు వైపుల నుంచి ప్రజలు తరలి వచ్చి భక్తిశ్రద్ధలతో వారి మొక్కులు తీర్చుకుంటారు. దసరా నవరాత్రుల్లో ముఖ్యమైన దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి రోజున కళారాల ఊరేగింపు, నగరంలోని వివిధ దేవాలయాల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపునకు పారువేట వేడుకలకు ఒంగోలు నగరం ముస్తాబైంది. మంగళవారం మూడు కళారాలు ఊరేగించనుండగా, బుధవారం మరో మూడు కళారాలకు నగరోత్సవం నిర్వహించనున్నారు. మైసూర్ తర్వాత ఒంగోలుకే ఈ కళారాల ఉత్సవం ప్రత్యేకం.

వందలేళ్ల నాటి చరిత్ర

ఒంగోలులో జరిగే కళారాల ఉత్సవానికి వందల సంవత్సరాల చరిత్ర ఉంది. అప్పట్లో చిన్న గూడు బండ్లు కట్టుకొని అమ్మవారి కళారాన్ని ఊరేగిస్తూ తప్పెట్లు వాయిస్తూ కాగడాలు పట్టుకొని అర్ధరాత్రి నుంచి నగరం మొత్తం తిరిగేవారు. తెల్లవారే వరకు ఈ సందడి కొనసాగేది. ఎంత రాత్రి అయినా సరే తమ వీధిలోకి వస్తున్న కళారాన్ని చూసి అమ్మవారికి హారతులు సమర్పించి ఆశీస్సులు అందుకునేవారు. ఇప్పటి కాలంతోపాటు ఉత్సవ తీరులోనూ ఆధునికత చోటు చేసుకుంది. అదిరిపోయే డీజే, బాణసంచా శబ్దాలతో దేవాలయాల నుంచి వీధుల్లోకి ఊరేగింపుగా వచ్చే అమ్మవారి కళారాన్ని దర్శిస్తే మళ్లీ ఏడాది వరకు ఎలాంటి దుష్ట శక్తుల పీడ, ఈతి బాధలు ఉండవని భక్తుల నమ్మకం.



బాలాజీరావు పేటలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో 50 కేజీల పంచలోహ కనకదుర్గమ్మ కళారం

భక్తుల కొంగుబంగారం ఆరు కళారాలు...

ఒంగోలు మొత్తం ఆరు కళారాలు ఉన్నాయి. స్థానిక బాలాజీరావుపేటలో కనకదుర్గాదేవి, గంటపాలెంలో పార్వతీదేవి, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోమ్ దగ్గర బాలా త్రిపుర సుందరీ దేవి, నరసింహస్వామి, ఏనుగు చెట్టు దగ్గర ఉన్న అంకమ్మపాలెం కాళికాదేవి, కేశవ స్వామిపేటలోని మహిషాసుర మర్దిని కళారాలు ఉన్నాయి. నాలుగు కళారాలు పసుపు వర్ణంతో, కాళికాదేవి ఎర్రగా, నరసింహ స్వామి తెల్లగా ఉంటారు. ఈసారి బాలాజీరావు పేటలోని కనకదుర్గమ్మ కళారం నూతనంగా తయారు చేశారు. సుమారు 50 కేజీల పంచలోహాలతో అమ్మవారి కళారాన్ని తయారుచేసి నగరోత్సవం నిర్వహిస్తున్నామని దేవస్థానం నిర్వాహకులు తెలిపారు. దుర్గాష్టమి సందర్భంగా మంగళవారం రాత్రి బాలాజీరావు పేటలోని కనకదుర్గమ్మ అంకమ్మపాలెంలోని కాళికా దేవి. కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోమ్ దగ్గర బాలా త్రిపుర సుందరీ దేవి, నగర ఉత్సవానికి బయలుదేరుతాయి. నగరంలోని వేరువేరు మార్గాల్లో పయనించి బుధవారం ఉదయం మస్తాన్ దర్గా సెంటర్ దగ్గరకు చేరుకుంటాయి. బుధవారం అర్ధరాత్రి కేశవస్వామి పేటలోని మహిషాసుర మర్దిని, గంటాపాలెంలోని పార్వతీదేవి కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోమ్ దగ్గర నరసింహ స్వామి కళారాల ఉత్సవం అంగరంగ వైభవంగా జరుగుతాయి.



కాళికాదేవి కళారం

కళారం అంటే...

ఒకసారి రక్త బీజుడు అనే రాక్షసుడుతో అమ్మవారు యుద్ధం చేయాల్సి వచ్చింది. అతని శిరస్సును ఖడ్గంతో ఖండిస్తుంది. రక్తం ధారలుగా నేల మీద పడుతుంది. ప్రతి రక్తపు చుక్క నుంచి మళ్లీ ఒక రక్త బీజుడు పుట్టుకొస్తాడు. బ్రహ్మదేవుడు ఆ రాక్షసుడికి ఇచ్చిన వరంతో అమ్మవారితో యుద్ధం చేస్తూ పోటీగా నిలబడతాడు. అమ్మవారు తన శక్తి నుంచి నల్లని కాళీ రూపాన్ని సృష్టించి కాళికాదేవిగా దేవిగా మారి పెద్ద నాలుకతో రక్తబీజుడి నుంచి కారే రక్తపు బొట్టును భూమి మీద పడకుండా తాగేస్తూ ఆ రాక్షసుడి శక్తిని హరించి అంతం చేస్తుంది. అప్పుడు ప్రజలంతా కాళికామాతకు జయ జయ ధ్వానాలు పలికి అమ్మవారిని తమ మధ్య ఉండి పోవాలని కోరగా దానికి అమ్మవారు ''అలా కుదరదు, ముల్లోకాలు రక్షణ బాధ్యత నాదే కదా. మీ కోరిక ప్రకారం ప్రజలందరికీ దుష్టశక్తుల భయం లేకుండా నా అంశంతో నిబిడీకృతమైన కళారాన్ని నోరు తెరిచి ఉన్న శిరస్సు భాగం ప్రసాదిస్తున్నాను. ఆ రూపాన్ని పూజించి ఆరాధించండి. దసరా నవరాత్రులలో దుర్గాష్టమి, మహార్నవమి రోజుల్లో అర్ధరాత్రి కళారాన్ని నగరసంచారం చేయించండి. నగరంలోని దుష్టశక్తులన్నీ పారిపోతాయని'' అమ్మవారు అభయమిస్తుంది. విష్ణుమూర్తి తత్వమైన నరసింహ స్వామి కళారంగా వచ్చి మిమ్మల్ని తరింప చేస్తానని అమ్మవారు వరమిస్తుంది. అని పెద్దలు చెబుతారు. ఈ విధంగా ప్రారంభమైనదే మన కళారాల చరిత్ర.

మందులపై 'జీఎస్టీ' మతలబు



- ధరల్లో కనిపించని వ్యత్యాసం
- పాత ధరలతోనే దోపిడీ
- మెడికల్ షాపుల్లో కనిపించని జీఎస్టీ తగ్గింపు బోర్డులు
- తనిఖీ చేయని డ్రగ్స్ డిపార్ట్‌మెంట్
- పట్టించుకోని వాణిజ్య పన్నుల శాఖ

మహారాణిపేట: ప్రజలకు దసరా కానుకగా జీఎస్టీ భారాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. ఈనెల 22 నుంచి కొత్త శ్లాబులను అమల్లోకి తెచ్చింది. ముఖ్యంగా నిత్యావసరాలు, వాహనాలు, ఎలక్ట్రికల్ వస్తువులు, గృహోపకరణాలతోపాటు, ప్రజారోగ్యం దృష్ట్యా పలు మందులపైనా జీఎస్టీని కుదించింది. అయితే ప్రతి ఇంట్లో ఉపయోగించే మందులపైన ప్రజల్లో అవగాహన లోపం వ్యాపారులకు వరంగా మారింది. జీఎస్టీ అమలులోకి వచ్చిన తేదీకి ముందే రేట్లు ముద్రించడంతో అవి కాస్తా హోల్‌సేల్ నుంచి రిటైల్ షాపులకు చేరాయి. దీంతో జీఎస్టీ తగ్గింపు సాధ్యపడే పరిస్థితి లేదని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. మరోవైపు కేంద్రం పాత రేట్లతో పనిలేదు.. జీఎస్టీ తగ్గింపు నాటి నుంచే అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అయితే అది అమలుకావడం లేదు. దీంతో మందుల్లో మతలబుతో జనానికి ఎటువంటి ఊరట లభించడం లేదు.

పాత స్టాక్ పేరుతో దోపిడీ

జీఎస్టీ తగ్గింపు కారణంగా క్యాన్సర్, గుండె జబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన అత్యవసర మందుల ధరలు తగ్గుతాయనే ప్రచారం కేవలం ఆర్భాటంగానే మిగిలిపోయింది. మందుల షాపుల యాజమానులు పాత స్టాక్ పేరు చెప్పి పాత ధరలకే విక్రయిస్తున్నారు. పాత స్టాక్ పూర్తయిన తర్వాతే కొత్త ధరలు అమలవుతాయని చెబుతుండగా, పాత స్టాక్ నిల్వలపై కొత్త ధరలు వర్తింపజేయడానికి నిబంధనలు ఉన్నా వాటిని అమలు చేయడం లేదు.

నిలువు దోపిడీ, బిల్లుల మాయం

విశాఖ జిల్లాలోని దాదాపు 2,200 మెడికల్ స్టోర్స్, 600 హోల్‌సేల్ షాపుల్లో మందుల కొనుగోలుకు బిల్లులు ఇవ్వడం లేదు. బిల్లు అడిగితే ఇస్తామని చెప్పి జాప్యం చేస్తున్నారు. కొనుగోలు ధర ఒకటి, బిల్లులో నమోదు చేసే ధర మరొకటిగా ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక మందుల ప్యాకెట్లపై గడువు తేదీలు కూడా సరిగా కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో అదనపు బేరం

చాలా ప్రైవేట్ ఆస్పత్రుల్లో సొంతంగా మెడికల్ షాపులు నడుపుతూ రోగులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ఆస్పత్రిలో చేరిన రోగులు అక్కడే మందులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. వైద్యులు సైతం తమ షాపుల్లో లభించే మందులనే రాయడం గమనార్హం. ఈ షాపుల్లో మందులపై ఎలాంటి తగ్గింపులు లేకుండా ఎంఆర్‌పీకే విక్రయిస్తున్నారు.

నిఘా కరువు

జీఎస్టీ తగ్గింపు ధరలు (సెప్టెంబర్ 22 నుంచి అమలులోకి వచ్చినా) అమలుపై నిఘా పూర్తిగా కొరవడింది. ఔషధ నియంత్రణ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ పర్యవేక్షణలో, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఎక్కడా తనిఖీలు గానీ, సోదాలు గానీ చేసినట్లు కనిపించడం లేదు. లంచాల మత్తులో అధికారులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ రెండు శాఖల అధికారులు ఈ బాధ్యత మాది కాదు అంటూ ఒకరిపై మరొకరు నెట్టుకుంటుండంతో జిల్లాలో జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు ప్రజలకు అందడం లేదు.

22 నుంచి జీఎస్టీ తగ్గింపు

మందులపై జీఎస్టీ తగ్గింపు ధర ఈనెల 22 నుంచి అమలులోకి వచ్చింది. సవరించిన ధరలతో మెడికల్ షాపుల్లో బోర్డులు పెట్టాలి. ఎక్కడ ఈ బోర్డులు కనపించడం లేదు.

పాత జీఎస్టీ	కొత్త జీఎస్టీ	ఎంఆర్‌పీ తగ్గింపు
12 శాతం	5 శాతం	6.25 శాతం
18శాతం	5 శాతం	11.02 శాతం
5 శాతం	జీరో శాతం	4.77 శాతం

చికెన్ వ్యర్థాలతో కాసులు

చేపల గుంతల్లో విచ్చలవిడిగా వినియోగం

- శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో యథేచ్ఛగా..
- అడపాదడపా పట్టుబడుతున్న వాహనాలు
- కట్టడి చేయలేకపోతున్న అధికార యంత్రాంగం
- మాఫియా ఆడిందే ఆట
- ప్రమాదంలో ప్రజారోగ్యం

ప్రజారోగ్యం ఏమైతేనేం.. తమ జేబులు నిండితే చాలన్నట్లుగా మారింది టీడీపీ నేతలు, పోలీసులు, మత్స్యశాఖ అధికారుల వైఖరి. చేపల గుంతల్లో చికెన్ వ్యర్థాలను డంప్ చేస్తూ.. భారీగా కాసులు గడిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నెల్లూరు జిల్లాలోని కోవూరు, ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో ఈ తంతు అడ్డూ అదుపులేకుండా సాగుతోంది. వీటిని తరలించే వాహనాలు అడపాదడపా పట్టుబడుతున్నా, కంటపడకుండా తరలుతోంది భారీగానే ఉంటుందని అంచనా. ఇంత జరుగుతున్నా, అధికారులు పట్టించుకోకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది.



చేపల గుంతల్లో చికెన్ వ్యర్థాలను వేస్తూ..

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు జిల్లాలో చికెన్ మాఫియా ఆగడాలు నానాటికీ తీవ్రమవుతున్నాయి. సమీప రాష్ట్రాల నుంచి చికెన్ వ్యర్థాలను జిల్లాకు యథేచ్ఛగా తీసుకొచ్చి.. చేపల చెరువుల్లో డంప్ చేస్తున్నారు. జిల్లాలోని ఆత్మకూరు, సంగం, కోవూరు, ఇందుకూరుపేట, విడవలూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, సంగం మండలల్లో దాదాపు రెండు వేల ఎకరాల్లో చేపలను పెంచుతున్నారు.

తక్కువ ధరకే వస్తుండటంతో..

సాధారణంగా చేపలు కిలోపైగా పెరిగేందుకు దాదాపు ఆర్నెల్ల నుంచి ఎనిమిది నెలలు పడుతుంది. రైతుల నుంచి కిలోను రూ.80 నుంచి రూ.90కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో నష్టాలే ఎక్కువగా వస్తున్నాయి. అదే మేతగా బ్రాండెడ్ ఫీడ్‌కు ప్రత్యామ్నాయంగా అతి తక్కువ ఖర్చుతో కూడిన కోళ్ల వ్యర్థాలను చేపలకు ఆహారంగా వినియోగిస్తున్నారు. వీటితో నాలుగు నెలలకే కిలో.. అంతకుమించి బరువు పెరుగుతున్నాయి. దీంతో జిల్లాలో దాదాపు 80 శాతం మంది చేపల రైతులు వీటినే వినియోగిస్తున్నారు. ఫలితంగా తమిళనాడు, కేరళ, కర్ణాటక నుంచి చికెన్ వ్యర్థాలను జిల్లాకు తీసుకొచ్చి విక్రయించే మాఫియా తయారైంది. అక్కడ కిలోను ఐదారు రూపాయలకు కొనుగోలు చేసి ఇక్కడ రూ.15కు విక్రయిస్తున్నారు.

టీడీపీ నేతల కనుసన్నల్లో..

కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, ముత్తుకూరు, పొదలకూరు, తోటపల్లిగూడూరు, సంగం ప్రాంతాలకు చెందిన కొందరు టీడీపీ నేతలు, పోలీస్ అధికారుల కనుసన్నల్లో మాఫియా బరితెగిస్తోంది. పదుల సంఖ్యలో వర్కర్లు వీరికి అండగా ఉన్నారు. ముందుగా బెంగళూరు, చెన్నై, కేరళ ప్రాంతాల్లో చికెన్ వ్యర్థాల సేకరణ కోసం డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసుకున్నారు. దీని కోసమే రూ.కోట్లను వెచ్చించారు. అక్కడే కొందర్ని చేరదీసి వారి ద్వారా నిత్యం సేకరిస్తున్నారు. ఆపై రాత్రివేళ లోడ్ చేసి నెల్లూరుకు చేరుస్తున్నారు.

నెలకు రూ.లక్షల్లో మామూళ్లు

ఈ వాహనాలు టోల్‌గేట్లు దాటి జిల్లాలోకి ప్రవేశిస్తున్న సమయంలో కట్టడి చేసే అవకాశం ఉంది. అయినా పోలీసులు, మత్స్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఒక్కో వాహనానికి రూ.పది వేల చొప్పున పోలీస్ శాఖకు నెలవారీ మామూళ్లను ముట్టజెప్తున్నారని తెలుస్తోంది. ఈ రకంగా నెలకు వంద వాహనాలు తిరిగితే స్టేషన్‌కు రూ.పది లక్షల మేర అందుతోందని సమాచారం. సర్కిల్, డీఎస్పీ స్థాయి అధికారులకు సైతం ఇదే పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వీటిని ఆపేందుకు ఎవరూ ఉత్సాహం చూపడంలేదు. మత్స్యశాఖ అధికారులకు సైతం నెలకు రూ.లక్షల్లో అందుతోందని తెలుస్తోంది. రోడ్డు ప్రమాదాలు జరిగితేనో.. వాహనం పాడైన సందర్భాల్లోనో ఈ ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి.

రూ.కోట్లల్లో ఆదాయం

కిలోకు రూ.పది మేర వెచ్చించి.. చేపల చెరువు యజమానులకు రూ.20 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. ఈ రకంగా చూస్తే జిల్లాలో నెలకు రూ.పది కోట్ల వ్యాపారం జరుగుతోందని సమాచారం. మాఫియాకు భారీగా ఆదాయం వస్తుండటంతో దీనిపై ఎక్కువ మంది దృష్టి సారిస్తున్నారు. అధికార పార్టీ నేతలకు మాఫియా భారీగా సమర్పిస్తోందనే టాక్ ఉంది.



చికెన్ వ్యర్థాలను తరలిస్తూ పట్టుబడిన వాహనాలు (ఫైల్)

అంతా ఆర్భాటమే..

చికెన్ వ్యర్థాల విషయమై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో కఠిన చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాలిచ్చారు. నాలుగు నెలల్లో కట్టడి చేయాలని పేర్కొన్నా, అవేవీ అమలుకు నోచుకోవడంలేదు. ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం, ఆత్మకూరు రూరల్ ప్రాంతాలకు చెందిన తెలుగు తమ్ముళ్లు.. మాఫియాలో చేరారు. కొందరు పోలీస్ అధికారులు సహకారం అందిస్తుండటంతో వ్యాపారం సజావుగా సాగుతోంది. అడపాదడపా వాహనాలను పట్టుకున్నట్లు చూపుతున్నారు. ఆత్మకూరు మండంలోని వాసిలిలో చికెన్ వ్యర్థాల డంపింగ్ కేంద్రాన్ని జనసేన నేతలు చూపి పోలీసులకు పట్టించారు. ఇంత జరుగుతున్నా, పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు.

ఆరోగ్యానికి చేటే..

చికెన్ వ్యర్థాలను ఆహారంగా తీసుకునే చేపలను భుజిస్తే ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 80 శాతం మంది మాంసాహార ప్రియులు చెరువుల్లో పెంచే చేపలనే తింటున్నారు. ఈ – కోలి బ్యాక్టీరియా చేరి కేన్సర్, జీర్ణకోశ వ్యాధులొచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

త్వరలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

తాడేపల్లి రూరల్ : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కింద ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేయనున్నారు. మంగళవారం విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ తాడేపల్లిలోని ఆయన నివాసం వద్ద లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కెఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ ఎండీ కెఎల్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా సుమారు 40 లక్షల రూపాయల విలువైన నోట్‌పుస్తకాలు, పెన్నులను విరాళంగా అందజేశామని తెలిపారు. మంత్రి నారా లోకేష్ ట్రక్‌ను జెండా ఊపి ప్రారంభించారని, త్వరలో వీటిని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందజేస్తామని పేర్కొన్నారు.

టీడీపీ నేతల బాహాబాహీ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని హై రోడ్డులో టీడీపీకు చెందిన రెండు వర్గాలు రోడ్డుపై తన్నులాడుకున్నారు. ఓ పెట్రోలు బంకు నిర్వాహకులకు కొందరు రూ.లక్షల్లో అప్పులిచ్చి, వాటాలు రాసుకున్నారు. నిర్వాహకులు పలువురిని మోసం చేసినట్లు రూ.కోట్లలో వసూలు చేసినట్లు తెలుసుకున్న రెండు వర్గాలు మంగళవారం పెట్రోలు బంకు వద్దకు చేరుకున్నారు. ఇక్కడ పుంగనూరుకు చెందిన టీడీపీ నేత.. బంకు నిర్వహణ ప్రస్తుతం తనపైనే ఉందని, గతంలో ఉన్నవాళ్లకు సంబంధంలేని చెబుతుండగా.. మరో వర్గం వచ్చి వాదనకు దిగింది. స్థానిక ఎమ్మెల్యే అనుచరులమంటూ కొందరు వాగ్వాదానికి దిగారు. దీంతో రెండు వర్గాల మధ్య బాహాబాహీ జరిగింది. పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపు చేశారు.

ప్రభుత్వంపై పోరు మొదలుపెడతాం

దళిత, ఆదివాసీ, బహుజన, మైనారిటీ సంఘాలు

శ్రీకాకుళం: వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించాలనుకుంటున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం మొదలుపెడదామని దళిత, ఆదివాసీ, బహుజన, మైనారిటీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఉద్యమాల పురిటిగడ్డ శ్రీకాకుళం నుంచే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని మొదలుపెడతామని స్పష్టం చేశారు. దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ బడుగులను వైద్య విద్యకు దూరం చేసే కుట్రలను అంతా కలిసి అడ్డుకోవాలన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ప్రైవేటీకరణలను అమలు చేస్తారని గుర్తు చేశారు. రూ.లక్షల కోట్లు అప్పులు చేసే ప్రభుత్వం మెడికల్ కాలేజీ కట్టలేదా అని ప్రశ్నించారు.

పెద్దమ్మ గొంతు కోసిన యువకుడు

చిత్తూరు అర్బన్: స్వయానా తనకు పెద్దమ్మ అయ్యే మహిళ గొంతు కోసేసాడో వ్యక్తి. మంగళవారం దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ ఎస్ఐ రమేష్ కథనం మేరకు.. చిత్తూరులోని తేనబండకు చెందిన గాయత్రి (45) మునిసిపల్ కార్పొరేషన్‌లో రీసోర్స్ పర్సన్. ఈమె చెల్లెలి కుమారుడు నరేంద్రకు పెళ్లయ్యి బెంగళూరులో ఉంటున్నాడు. గాయత్రితో ఇతనికి ఆర్థికపరమైన వివాదం ఏర్పడటంతో కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. తన కుటుంబంలో గొడవలకు తన పెద్దమ్మ గాయత్రీనేని భావించిన నరేంద్ర.. సోమవారం రాత్రి కత్తి తీసుకుని తేనబండలో ఇంటి వద్ద ఉన్న గాయత్రీ గొంతు కోసేసాడు. ఆపై గాయత్రి గొంతుపై కత్తితో ఆరుసార్లు దాడిచేసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ మహిళను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి భర్త గోపినాథ్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగుబడి

హస్త కార్తె: సెప్టెంబర్ 27 నుంచి





నల్ల తామర డిజిటల్ అరెస్ట్!

మిరప పంటకు నల్ల తామర పురుగుల బెడద చాలా ఎక్కువ. మిరపతో పాటు, పత్తి, మిర్చి, కంది, మినుములు, మామిడి, పుచ్చకాయ, తదితర పంటలను దెబ్బతీస్తుంది. అతి చిన్నగా ఉండే నల్ల తామర రైతులను విపరీతంగా నష్టాల పాలు చేస్తోంది. అయితే, ఆధునిక డిజిటల్ ఉపకరణాల సహాయంతో రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ మిరప పంటను ఆశించే తామర పురుగును జీవన పురుగు మందులతో కట్టడి చేసే పద్ధతులపై యూనివర్సిటీలు, స్వచ్ఛంద సంస్థల నిపుణులు ప్రచారోద్యమం చేపట్టారు. విశేషం ఏమిటంటే... డిజిటల్ సమాచారం అంతా తెలుగులోనే అందించటం. సుస్థిర వ్యవసాయ కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డా. జి. చంద్రశేఖర్ అందించిన సమగ్ర సమాచారం ఇక్కడ పొందుపరుస్తున్నాం...

మిరప ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొదటి స్థానంలో.. తెలంగాణ, మధ్యప్రదేశ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గుంటూరు మిర్చి యార్డ్ ఆసియాలోనే అతిపెద్ద మిర్చి మార్కెట్. ఇది దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మిర్చి ధరలను ప్రభావితం చేస్తుంది. 2021లో ఆంధ్రప్రదేశ్‌లో మిరప పంటను తీవ్రంగా నష్టపరిచే కొత్త నల్ల తామర (బ్లాక్ త్రిప్స్) జాతి పురుగులు వెలుగులోకి వచ్చాయి. దీని శాస్త్రీయ నామం 'త్రిప్స్ పార్విస్పినస్. దీన్ని సాధారణంగా 'చిల్లీ బ్లాక్ త్రిప్స్' అని పిలుస్తారు. అతి తక్కువ సంవత్సరాల్లోనే దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలకు ఇది విస్తరించింది. ఆగ్నేయాసియా నుంచి ఉద్భవించిన చీల్చి రసం పీల్చే పురుగు ఇది.

2015 నాటికి అనేక రాష్ట్రాలకు పాకింది. ఈ పురుగులు కణజాలాలను తినే ముందు లేత ఆకులు, పువ్వులను చీల్చివేస్తాయి. ముఖ్యంగా పువ్వు చీలికలు, పండ్ల నిర్మాణాన్ని దెబ్బతీస్తాయి. విషయానికి వస్తే, ఇది పాలిఫాగస్ పురుగు. అంటే, ఇది వివిధ రకాల వృక్ష జాతులను ఆహారంగా తీసుకోగలదు. మిరపతో పాటు, పత్తి, మిర్చి, కంది, మినుములు, మామిడి, పుచ్చకాయ, తదితర పంటలను దెబ్బతీస్తుంది.

పంట నష్టం 85 నుంచి 100 వరకు!

2022లో ఆరు దక్షిణాది రాష్ట్రాల్లో మిరప పంటను గణనీయంగా దెబ్బతీసింది. తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాల్లో అంచనా నష్టాలు 85 నుండి 100% వరకు ఉన్నాయి. ఊహించని విధంగా నష్టాన్ని కలిగిస్తున్న కారణంగా రైతులు తమ పంటలను రక్షించుకోవడానికి రసాయన పురుగుమందులను ప్రయోగించడం తప్ప వేరే మార్గం లేకుండా పోయింది. ఇది ఖర్చుతో కూడుకున్నదే కాకుండా, తదనంతరం నిరుపయోగంగా మారింది. అదనంగా, నల్లతామర ఆశించిన మిరప కాయలకు మార్కెట్‌లో తక్కువ ధరలు రావటంతో చాలా మంది రైతులు నష్టాల పాలవుతున్నారు.

దీన్ని దృష్టి లో పెట్టుకుని అంతర్జాతీయంగా ప్రసిద్ధి గాంచిన సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్సెస్ ఇంటర్నేషనల్ (సీఏబీఐ) అనే సంస్థ హైదరాబాద్‌లోని సుస్థిర వ్యవసాయ కేంద్రంతో కలిసి తెలంగాణలో మిరపని ఆశించే నల్ల తామర పురుగులపై సీఏబీఐ డిజిటల్ టూల్స్ ఉపయోగించడం ద్వారా మిరపలో నల్ల తామర పురుగును నివారించడానికి ఒక ప్రచారోద్యమం మొదలు పెట్టింది. జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో మిరప పండించే కొన్ని గ్రామాలను ఎంపిక చేసుకొని వేలాది మంది రైతులకు సేవలందించే లక్ష్యంతో ఈ ఖరీఫ్ కాలంలో ప్రచారోద్యమం జరుగుతోంది. దీనిలో భాగంగా జులై 9న హైదరాబాద్ హబ్సిగుడాలో మిరప పంట పండిస్తున్న రైతులు, శాస్త్రవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, స్పైసెస్ బోర్డు ప్రతినిధి, అపెడా ప్రతినిధి, నాబార్డ్ ప్రతినిధి, శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రతినిధి, యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్- రాయచూరు ప్రతినిధి, డి డి ఎస్ కృషి విజ్ఞాన కేంద్రం- జహీరాబాద్ ప్రతినిధి, బయో పెస్టిసైడ్స్ తాయారీదారులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా విశ్వవిద్యాలయ బయో కంట్రోల్ యూనిట్ ప్రతినిధి, సీఏబీఐ ప్రతినిధులతో వర్క్‌షాప్ జరిగింది.

గత సంవత్సరం రాయచూరులోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ శాస్త్రవేత్తలు గత సంవత్సరం మిరపలో నల్లతామరపై తాము నిర్వహించిన ప్రచారోద్యమంతో రైతులకు కలిగిన ప్రయోజనాలను వివరించారు. ఉద్యానవనశాఖ నిర్దేశకులు బాబు మాట్లాడుతూ నల్లతామరను నివారించే మార్గాలు వివరించారు. ఈ క్యాంపెయిన్‌కు ఉద్యాన శాఖ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

ప్రచారోద్యమం

ఈ క్యాంపెయిన్ ద్వారా 1000 ఎకరాలలో మిర్చి పండించే 2000 మంది రైతులు ఈ పద్ధతులకు సలహాలు అందిస్తున్నారు. రైతుల ప్రదర్శన క్షేత్రాలను చూసే మిగతా రైతులు కూడా ఈ పద్ధతులు పాటించే అవకాశం ఉంటుంది. అలాగే పోస్టర్స్, మీడియా ద్వారా ఎక్కువ మందికి ఈ క్యాంపెయిన్ ద్వారా చైతన్యం కలిగిస్తున్నారు.

పంటలకు మేలు చేసేవి కూడా..!

తామర పురుగులు (త్రిప్స్) రెక్కలు కలిగిన చిన్న కీటకాలు. తామర పురుగులలో అనేక జాతులు ఉన్నాయి. నల్ల తామర పురుగులు ఉల్లి, టమోటో, స్ట్రాబెర్రీ, ద్రాక్ష సహా వివిధ పంటలకు గణనీయమైన నష్టాన్ని కలిగిస్తాయి. మరికొన్ని త్రిప్స్ జాతులు ఇతర పురుగులను తినటం ద్వారా వ్యవసాయానికి ప్రయోజనం చేకూరుస్తాయి కూడా!

తామర పురుగులు మొక్కల బయటి పొరను చీల్చుకుని అందులోని పదార్థాలను తినడం ద్వారా మొక్కలను దెబ్బతీస్తాయి. త్రిప్స్ జాతులు చూడటానికి భిన్నంగా ఉంటాయి. జాతిని బట్టి, జీవిత దశను బట్టి ఇవి వివిధ రంగుల్లో లభిస్తాయి. పిల్ల పురుగు(లార్వా)లు సాధారణంగా పారదర్శకంగా, పెద్దవాటి కంటే చిన్నవిగా ఉంటాయి. చాలావరకు పెద్ద తామర పురుగులు పొడవాటి, సన్నని రెక్కలతో, అంచులలో చిన్న వెంట్రుకలను కలిగి ఉంటాయి. గుడ్లు సాధారణంగా పొడుగ్గా ఉంటాయి. మూత్రపిండాల ఆకారంలో కనిపిస్తాయి. ఉష్ణమండలంలో నివసించే త్రిప్ జాతులు సాధారణంగా సమశీతోష్ణ వాతావరణంలో కంటే పెద్దవిగా పెరుగుతాయి.

జాతిని, వాతావరణ అనుకూలతను బట్టి తామర పురుగులు వేగంగా సంతానోత్పత్తి చెయ్యగలవు. సంవత్సరానికి ఎనిమిది తరాల వరకు వీటి సంతతి పెరుగుతుంది. ఆడ త్రిప్స్ అతిథేయ (హోస్ట్) మొక్కల ఆకులపై గుడ్లు పెడతాయి. లార్వా పొదిగిన తర్వాత ఆహారం తీసుకోవడం ప్రారంభిస్తుంది. లార్వా పెద్దది పురుగు కావడానికి నాలుగు దశల్లో పురోగమిస్తుంది. వెచ్చని వాతావరణంలో యుక్త వయస్సు వరకు పురోగతి వేగంగా ఉంటుంది. శీతాకాలంలో వీటి సంఖ్య సాధారణంగా తగ్గుతుంది. మొక్కల లోపల ద్రవాలను పీల్చుకోడానికి లోపలికి చొచ్చుకుపోతాయి. పండ్లు, ఆకులు, రెమ్మలను ఆశిస్తాయి. త్రిప్స్ పెద్ద మొత్తంలో పంటని ఆశించినప్పుడు, పంట పెరుగుదల, దిగుబడి తగ్గిపోతుంది. ఇవి చాలా పెద్ద చెట్ల జాతులపై కూడా దాడి చేయగలవు. ఐతే సాధారణంగా పండ్లు, కూరగాయల చెట్లు వీటి తాకిడికి తట్టుకోలేవు. పెద్ద చెట్లు కొంత వరకు తట్టుకుంటాయి. తామరపురుగులు వేరుశనగలో మొవ్వ కుళ్ళు (బడ్ నెక్రోసిస్), టొమాటో-స్పాటెడ్ విల్ట్ కలిగించే వైరస్‌లను వ్యాపింపజేస్తాయి.

నల్లతామర యాజమాన్య పద్ధతులు:

1. తామర పురుగులు నేలపై పడ్డ వ్యర్థపదార్థాల్లో జీవిస్తూ పంటలను ఆశిస్తుంటాయి. కాబట్టి పంట వ్యర్థాలను ఎప్పటికప్పుడు తీసేయడం మంచిది.
2. సూర్యకాంతి పరావర్తనం చెందే మల్చింగ్ షీట్‌లను బెడ్స్ మీద వాడటం ఉపయోగకరం.
3. నీలం రంగు జిగురు అట్టలను ఏకరానికి 20 వరకు ఏర్పాటు చేసుకోవాలి. ఇవి పురుగులతో నిండగానే ఎప్పటికప్పుడు మార్చుకోవాలి.
4. సహజ శత్రువులైన అల్లిక రెక్కల పురుగు(లేస్ వింగ్ బగ్స్)లు, అతిచిన్న పైరేట్ బగ్స్, పరాన్న భుక్కు నల్లులు (ప్రిడేటరీ మైట్స్)ను రక్షించుకోవడం అవసరం.
5. వేప నూనె 3% తామర పురుగులకు వికర్షణను కలిగిస్తుంది. పునరుత్పత్తి చక్రాలకు అంతరాయం కలిగిస్తుంది.
6. బ్యువేరియా బ్యాసియానా, మెటార్హిజియం అనిసోప్లియె అనే శిలీంద్రాలు తామరపురుగులకు రోగాన్ని కలుగజేయటం ద్వారా పంటలను రక్షిస్తాయి. ఇవి బజారులో దొరుకుతున్నాయి.

మొబైలు ఫోన్ ద్వారా సమాచారం

ఈ డిజిటల్ యుగంలో అనేక సంస్థలు డిజిటల్ సలహాలను, సమాచారాన్ని రైతులకు చేరవేస్తున్నాయి. వీటివల్ల రైతులకు సరైన సలహాలు సరైన సమయంలో మొబైల్ ఫోన్ ద్వారా అందుబాటులో ఉండటం వల్ల తన దైనందిన కార్యక్రమాలకు అంతరాయం లేకుండా రైతు సమాచారాన్ని పొందుతున్నారు. ఇటువంటి డిజిటల్ సాధనాల్లో అంతర్జాతీయంగా ప్రసిద్ధి గాంచిన సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్సెస్ ఇంటర్నేషనల్ (సీఏబీఐ) అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ సాధనాలు 27 దేశాలలో సేవలు అందిస్తున్నాయి. సీఏబీఐ అంతర్జాతీయ లాభాపేక్ష లేని, వంద సంవత్సరాలకు పైగా చీడపీడల యాజమాన్యంలో అనుభవమున్న సంస్థ. ఈ డిజిటల్ సాధనాలు మనదేశంలో కూడా అందుబాటులో ఉన్నాయి. ఇది హైదరాబాద్ లో గల సుస్థిర వ్యవసాయ కేంద్రంతో పాటు అనేక వ్యవసాయ విశ్వ విద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా ఈ జ్ఞానాన్ని రైతులకు అందిస్తున్నారు. ఈ డిజిటల్ సాధనాలను రైతులు ఉచితంగా ఉపయోగించుకోవచ్చు. విజ్ఞాన పరంగా పరీక్షించి, నిరూపించబడిన, బజారులో లభ్యమౌతున్న ఉత్పత్తుల వివరాలు లభ్యమౌతాయి.

ఇతర వివరాలకు...
www.cabi.org

ఇవీ డిజిటల్ సాధనాలు

సీఏబీఐ వివిధ భాగస్వాములతో కలిసి పెస్ట్ మేనేజ్‌మెంట్ డెసిషన్ గైడ్ (పీఎండీజీ) అభివృద్ధి చేసింది. ఇది త్రిప్స్ పార్విస్పినస్‌ను గుర్తించడం, సురక్షితమైన యాజమాన్యంపై సలహాలను అందిస్తుంది. దేశంలో వాణిజ్యపరంగా అందుబాటులో ఉన్న అనేక బయోపెస్టిసైడ్స్‌ను సూచిస్తున్నారు. పీఎండీజీ ఇప్పుడు తెలుగు, కన్నడ, తమిళం భాషలలో రైతులకు, విస్తరణ కార్యకర్తలకు అందుబాటులో ఉన్నాయి. విస్తరణ అధికారులు, విద్యార్థులు, శిక్షకులు, రైతులు, పరిశోధకులు ఈ కింది సీఏబీఐ డిజిటల్ సాధనాలను ఉపయోగించి డిజిటల్ సలహాలు తెలుసుకుంటున్నారు. వీటిని సమర్థవంతంగా, ఉపయోగించడం ద్వారా నల్ల తామర పురుగును అరికట్టే మార్గాలపై సమాచారాన్ని ఎవరైనా పొందవచ్చు.



1. బయోప్రొటెక్షన్ పోర్టల్... తెగులును నిర్వహించడానికి స్థానికంగా లభించే బయోపెస్టిసైడ్స్ గురించి సమాచారం కోసం ఇక్కడ స్కాన్ చేయండి.

2. క్రాప్ స్ప్రేయర్ యాప్... స్ప్రేయర్ పరిమాణాన్ని బట్టి పురుగు మందు/ బయోపెస్టిసైడ్ మోతాదు ఎంత వాడాలి అన్నది తెలుసుకోవడం కోసం ఇక్కడ స్కాన్ చేయండి.

3. ఫ్యాక్ట్‌షీట్ యాప్/నాలెడ్జ్ బ్యాంక్... సమర్థవంతంగా చీడపీడల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి సమాచారాన్ని ఇక్కడ స్కాన్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవటం ద్వారా తెలుగు తదితర భాషల్లోనూ పొందవచ్చు.

మునగ చెట్లు కరువును తట్టుకుంటాయి!

- నీరు నిలవని ఇసుక గల ఒండ్రు నేలల్లో మునగ మంచి దిగుబడినిస్తుంది
- మునగ వార్షిక రకాలతో హెక్టారుకు 50-55 టన్నుల మునగ కాలయ దిగుబడికి అవకాశం
- అధిక సాంద్రత పద్ధతిలో విత్తనోత్పత్తి చేసి రైతులకు ఇస్తున్న రాస్ కేవీకే

– నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్

కరువు వంటి ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోవటానికి మునగ సాగు దోహద పడుతుంది. మెట్ట ప్రాంతాల్లో పండించుకోవచ్చు. మునగ కాయలతో పాటు ఆకుల పొడి, గింజల ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చు. గొప్ప రోగ నిరోధక, ఔషధ లక్షణాల కారణంగా మునగ ఉత్పత్తులకు ఔషధ పరిశ్రమలో అధిక డిమాండ్ ఉంది. మునగ ఆకును పొడి రూపంలో లేదా గుళికలు లేదా మాత్రలుగా విక్రయిస్తారు. దీని గింజల నుండి తీసిన నూనెలను ఆహార పదార్థాలు, సౌందర్య సాధనాల తయారీకి, వివిధ యంత్ర నూనెల తయారీకి ఉపయోగిస్తారు. 3 సంవత్సరాలలోపు ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కూడా మునగను సాగు చేసుకోవచ్చు. తిరుపతి జిల్లాలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డా. ఎస్. శ్రీనివాసులు మునగ సాగుపై అందించిన వివరాలు...

మునగ (మోరింగ ఒలిఫెరా) కరువును తట్టుకునే చెట్టు. మునగ కాయలు, ఆకులు, పువ్వులకు అధిక పోషక విలువలకు నిలయం . మునగ ఆకులు, గింజలు లేదా పండ్లు, పువ్వులు, వేర్లలో విటమిన్లు ఎ, సి, కాల్షియంతో పాటు మానవ ఆరోగ్యానికి ముఖ్యమైన అన్ని ఇతర ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. మునగ ఆకుల్లో నారింజలో లభించే విటమిన్ సి కంటే 7 రెట్లు ఎక్కువ, పాలలో లభించే కాల్షియం కంటే 4 రెట్లు, అరటి పండ్లలో లభించే పొటాషియం కంటే 3 రెట్లు, పాలలో లభించే ప్రోటీన్ కంటే 2 రెట్లు ఎక్కువ.

నీరు నిలవని నేలలు అనుకూలం

మునగ వేడి, ఉష్ణ మండల, సమశీతోష్ణ మండల ప్రాంతాల్లో బాగా పెరుగుతుంది. 25-30 డిగ్రీల ఉష్ణోగ్రత మునగ పూత రావడానికి అనుకూలం. వేడి, పొడి వాతావరణం దీనికి బాగా సరిపోతుంది. ఈ పంట వివిధ రకాల నేలలకు అనుగుణంగా ఉంటుంది. కానీ 6.5-8.0 పీహెచ్ కలిగిన, బాగా ఇసుక గల ఒండ్రు నేలల్లో మంచి పంటనిస్తుంది. నీరు నిలవని తేలికపాటి ఇసుక లేదా లోతైన ఒండ్రు నేలలు అనుకూలం. నీరు బాగా ఇంకే నేలలు అనుకూలం. నేలను చాలాసార్లు బాగా దున్నాలి. వార్షిక రకాలకు 45×45×45 సెం.మీ. కొలతలు గల గుంతలు తవ్వాలి. ప్రతి గుంతకు 10 కిలోల కంపోస్ట్ లేదా పశువుల ఎరువు వేసి, నాటడానికి ముందు పై మట్టితో కలిపి నింపుకోవాలి. హెక్టారు భూమికి దాదాపు 1200-1500 మొక్కలను పెంచవచ్చు. వర్షాకాలంలో మొక్కలు నాటాలి. విత్తడానికి ఇది సరైన సమయం.

మన దేశంలో అనేక మునగ రకాలు ఉన్నాయి. చాలా రకాలు కాయల ఉత్పత్తికి అనుకూలంగా ఉంటాయి, కొన్ని కొన్ని మాత్రమే మంచి ఆకు ఉత్పత్తిని ఇస్తాయి. అధిక దిగుబడినిచ్చే వార్షిక రకాలు వాణిజ్య సాగు ఎంపిక అనుకూలం. మునగ మొక్కలను విత్తనాలు లేదా కాండపు కత్తిరింపుల ద్వారా ప్రవర్ధనం చేయవచ్చు. ఏక వార్షిక రకాలను విత్తన ప్రవర్ధనం చేయటం వలన బలమైన వేర్ల వ్యవస్థ అభివృద్ధి చెంది, మొక్కలు కరువును బాగా తట్టుకుంటాయి. అధిక దిగుబడినిచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలి. నాణ్యమైన విత్తనం కోసం విశ్వసనీయ నర్సరీలను (లేదా) వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను సంప్రదించాలి. రాస్ - కేవీకే 2013-14 నుంచి అరెకరంలో అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తున్న మునగ తోటలో విత్తనోత్పత్తి చేస్తోంది. రైతులకు మునగ విత్తనాలు, నారును అందిస్తోంది.

రకాన్ని బట్టి నాటే దూరం

జూలై-అక్టోబర్ మధ్య నాటవచ్చు. పూత సమయంలో వర్షాలు లేకుండా విత్తే సమయం నిర్ణయించుకోవాలి. హెక్టారుకు సుమారు 500-625 గ్రా. విత్తనాలు అవసరం. విత్తనాలను 2.5-3 సెం.మీ. లోతులో విత్తవచ్చు. మొక్కలు బాగా నిలదొక్కుకోవడం కోసం, నాటడానికి ముందు 35-40 రోజులు పాలీబ్యాగ్‌లలో 70-90 సెం.మీ. ఎత్తుకు పెంచి తర్వాత ప్రధాన పొలంలో నాటుకోవాలి. సాగుదారులు ఎకరానికి 1000-1250 విత్తనాలను ఒక గుంతలో 2 విత్తనాల చొప్పున ఉపయోగించవచ్చు. రకం, సాగు పద్ధతిని బట్టి నాటే దూరం మారుతూ ఉంటుంది. ఏక వార్షిక రకాల మొక్కలను 2.5×2.5 మీ. దూరంలో నాటవచ్చు. పి.కె.ఎం-1 వంటి రకం 1.5×1.0 మీ. దూరంతో అధిక సాంద్రత పద్ధతిలో నాటవచ్చు. బహువార్షిక రకాల మొక్కలను 6×6 మీటర్ల దూరంలో నాటుకోవాలి.





రెండు నెలలు విధిగా నీరు

ముఖ్యంగా పొడి పరిస్థితులలో మొదటి రెండు నెలలు క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. మునగ చెట్లు కరువును తట్టుకుంటాయి, కానీ, పొడి కాలంలో ప్రతి 10-15 రోజులకు నీరు పెట్టడం వల్ల ప్రయోజనం ఉంటుంది. బిందు సేద్యం దిగుబడిని గణనీయంగా పెంచుతుంది. పూత రాలిపోకుండా ఉండాలంటే ఫిబ్రవరి-మార్చి నెలల్లో నీటిని తగ్గించాలి. కానీ, నీటి ఎద్దడిని నివారించడానికి తగినంత తేమను వుండేలా చూడాలి.

కొమ్మ చివర్లను తుంచాలి

మునగ మొక్కలు 75 సెం.మీ. ఎత్తు ఉన్నప్పుడు పెరుగుతున్న చివర్లను తుంచి వేయాలి. తద్వారా పక్క కొమ్మలు పెరుగుతాయి. ఆ పక్క కొమ్మలు 40-60 సెం.మీ పొడవుకు చేరుకున్నప్పుడు, వాటి పైభాగాన్ని తుంచి వేయాలి. ఇలా చేయడం వల్ల మొక్కలు ఎక్కువ కొమ్మలతో గుబురుగా పెరుగుతాయి. ఎక్కువ కాయలతో దిగుబడి పెరుగుతుంది. బహువార్షిక రకాల్లో ప్రతి పంట తర్వాత కొమ్మలను కత్తిరించడం వలన కొత్త కొమ్మలు వచ్చి దిగుబడి పెరుగుతుంది. ఏక వార్షిక రకాల మొదటి పంట తర్వాత, కొత్త పంటను ప్రోత్సహించడానికి చెట్లను నేల నుండి ఒక మీటరు వరకు కత్తిరించాలి. ముఖ్యంగా మొక్కలు పెరిగే ప్రారంభ దశల్లో క్రమం తప్పకుండా కలుపు తీయటం చాలా అవసరం. మొక్కలు పూర్తి స్థాయిలో పెరిగి దిగుబడినిచ్చే వరకు, తక్కువ కాలవ్యవధి గల కూరగాయలతో అంతర పంటలు వేయడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ పద్ధతి కలుపు మొక్కల నియంత్రణలో కూడా సహాయపడుతుంది.

సస్యరక్షణ

కాయ తొలిచే పురుగు లేత కాయలపై గుడ్లు పెట్టి కుళ్ళిపోయేలా చేస్తుంది. కాయలను తొలచి లోపలి గుజ్జును తినేస్తుంది. గొంగళి పురుగుల వల్ల పూత, మొగ్గలు ముందుగానే రాలిపోతాయి. సోకిన మొగ్గలను సేకరించి నాశనం చేయాలి. గొంగళి పురుగు లార్వా ఆకులను గుంపుగా తిని ఆకులు రాల్చుతాయి. బెరడు తొలచే పురుగు కాండం బెరడును తొలచి మొక్కను బలహీనపరుస్తుంది. ఆకు తినే పురుగు లార్వా మొక్కల ఆకులను తిని వాటి పెరుగుదలకు హాని కలిగిస్తుంది. తామర పురుగుల వల్ల కాయల మీద మచ్చలు ఏర్పడి నాణ్యత తగ్గుతుంది. వేరు, కాండం కుళ్లు వర్షాకాలంలో మురుగు నీరు పోయే సౌకర్యం లేని నేలలో ఎక్కువగా ఆశిస్తుంది. వీటి నిర్వహణకు శాస్త్రవేత్తల సూచనల ప్రకారం పురుగుమందులను వాడాలి.

రకం, నిర్వహణను బట్టి దిగుబడి

సాధారణంగా మొక్కలు నాటిన 6-8 నెలల్లో మొదటి పంటను పొందవచ్చు. మొక్కలకు బదులు నేరుగా విత్తనాలు వేసుకుంటే తొలి పంటకు ఒక సంవత్సరం పడుతుంది. సంవత్సరానికి రెండు సార్లు రెండు పంటలు (జూలై-సెప్టెంబర్) మరియు (మార్చి-ఏప్రిల్) వస్తాయి. ప్రారంభంలో మొదటి రెండు సంవత్సరాలలో, మొక్కలు 250-300 కాయలను దిగుబడి నివ్వ గలవు. తర్వాత సంవత్సరాలలో 500 వరకు పెరుగుతుంది. సంవత్సరానికి హెక్టారుకు 31 టన్నుల కాయలను ఉత్పత్తి చేయవచ్చు. అనేక హైబ్రిడ్ జాతులు సంవత్సరానికి ఒక మొక్కకు 800 -1000 కాయల దిగుబడిని అందించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. రకం, నిర్వహణ ఆధారంగా దిగుబడి గణనీయంగా మారుతుంది. వార్షిక రకాలు హెక్టారుకు 50-55 టన్నులను ఉత్పత్తి చేయగలవు.

- డా. ఎస్. శ్రీనివాసులు (79810 70420), సీనియర్ సైంటిస్ట్-హెడ్, రాస్ కృషి విజ్ఞాన

బిజినెస్ రీల్

రెట్టింపు ఆదాయంపై బొండాడ ఇంజినీరింగ్ గురి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెట్టింపు, 2030 ఏడు రెట్లు ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు బొండాడ ఇంజినీరింగ్ సీఎండీ బొండాడ రాఘవేంద్ర రావు తెలిపారు. బ్యాటరీ స్టోరేజీ విభాగంతో పాటు ఇతర రంగాల్లోకి విస్తరించడం ఇందుకు దోహదపడగలదని 2024–25 వార్షిక సర్వ సభ్య సమావేశంలో తెలిపారు. 2030 నాటికి 25 గిగావాట్ల పునరుత్పాదక శక్తి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు వివరించారు. కంపెనీ గత ఆర్థిక సంవత్సరం రూ. 1,571 కోట్ల ఆదాయంపై రూ. 115 కోట్ల లాభం నమోదు చేసింది. బీఎస్ఎన్ఎల్ 4జీ శాచురేషన్ ప్రాజెక్టులో 1,250 పైగా టెలికం టవర్ల ఏర్పాటులో సంస్థ కీలక పాత్ర పోషించినట్లు రావు చెప్పారు.

రూ. 115 కోట్లతో ఏబీడీ పెట్ బాట్లింగ్ ప్లాంటు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిలరీస్ (ఏబీడీ) సంస్థ తెలంగాణలోని రంగాపూర్‌లో కొత్తగా పెట్ బాట్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. దీని వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 60 కోట్ల యూనిట్లుగా ఉంటుంది. ఈ ప్లాంటుపై రూ. 115 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు సంస్థ ఎండీ అలోక్ గుప్తా ఈ సందర్భంగా తెలిపారు. రంగాపూర్‌లోని బాట్లింగ్ యూనిట్, సింగిల్ మాల్ట్ డిస్టిలరీ యూనిట్‌తో పాటు ఇటీవల మహారాష్ట్రంలో కొనుగోలు చేసిన ఈఎస్‌పీ డిస్టిలరీ విస్తరణపై రూ. 525 కోట్లు వెచ్చిస్తున్నట్లు వివరించారు. ఇతరత్రా వ్యయ నియంత్రణ చర్యలతో 2028 ఆర్థిక సంవత్సరం నాటికి స్థూల మార్జిన్లు సుమారు మూడు శాతం మేర మెరుగుపడగలవని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, తమ ఆదాయంలో సుమారు 30 శాతం వాటా తెలంగాణ మార్కెట్ నుంచి ఉన్నట్లు గుప్తా చెప్పారు. ప్రస్తుతం 27 దేశాలకు ఎగుమతులు చేస్తుండగా ఈ సంఖ్యను 35కి పెంచుకోనున్నట్లు వివరించారు. బీఎస్ఈలో మంగళవారం కంపెనీ షేరు స్వల్పంగా తగ్గి రూ. 507.70 వద్ద క్లోజయ్యింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

1-10-2025

విశాఖ	520–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530–00
విజయవాడ	530–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,406.10	1.66
ULTRACEMCO	12,240.00	1.65
JSWSTEEL	1,140.30	1.61
TATAMOTORS	682.55	1.49
HINDALCO	764.00	1.35

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDIGO	5,591.00	-2.03
ITC	401.70	-1.36
BAJAJFINSV	2,001.00	-1.17
BHARTIARTL	1,883.00	-1.01
TECHM	397.00	-0.97

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,690
ఎన్ఎస్ఈ	1,02,544
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,18,693
ఎఫ్ఐఐ	- 2,327
డీఐఐ	+ 5,762

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.71 (రాత్రి 11.30కు)	$ 63.45 (సోమ మంగళ)
బ్రెంట్	66.36 (రాత్రి 11.30కు)	$ 67.09 (సోమ మంగళ)

ఐపీవో స్ట్రీట్

నిధుల వేటలో 4 కంపెనీలు



ఆర్‌వీ ఇంజినీరింగ్, విరూపాక్ష ఆర్గానిక్స్

క్యాపిల్లరీ టెక్నాలజీస్‌కు సెబీ గ్రీన్ సిగ్నల్ • సెబీకి ఏక్వస్ అప్‌డేటెడ్ ప్రాస్పెక్టస్ దాఖలు

సెప్టెంబర్‌లో సందడే సందడిగా సాగిన ప్రైమరీ మార్కెట్లు ఈ నెల(అక్టోబర్)లోనూ మరింత దూకుడు చూపనున్నాయి. దిగ్గజాలు టాటా క్యాపిటల్, వియ్‌వర్క్ ఇండియా, ఎల్‌జీఎలక్ట్రానిక్స్ ఐపీవోలు ప్రారంభంకానుండగా.. మరో 4 కంపెనీలు నిధుల సమీకరణ బాట పట్టాయి. వివరాలు చూద్దాం..

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి 2 కంపెనీలు తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. జాబితాలో హైదరాబాద్ కంపెనీలు ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్, విరూపాక్ష ఆర్గానిక్స్ చేరాయి. మరోపక్క సాస్ సేవల కంపెనీ క్యాపిల్లరీ టెక్నాలజీస్ ఇండియా లిస్టింగ్‌కు సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ బాటలో గోప్యతా మార్గంలో దాఖలు చేసిన ప్రాస్పెక్టస్‌కు అప్‌డేటెడ్‌గా ఏక్వస్ మరోసారి సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది.

షేర్ల జారీ, ఆఫర్..

హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఇన్‌ఫ్రా కన్సల్టెన్సీ సేవల సంస్థ ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఐపీవోలో భాగంగా రూ. 202.5 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటితోపాటు మరో 67.5 లక్షల షేర్లను విక్రయించనుంది. ఐపీవో ద్వారా సమీకరించిన నిధుల్లో రూ. 76 కోట్లను రుణాల చెల్లింపునకు, దేశీ అనుబంధ సంస్థ ఎస్ఆర్‌ఏ ఓఎస్ఎస్‌లో రూ. 21.9 కోట్లు, విదేశీ అనుబంధ సంస్థలైన ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్‌లో రూ. 34.8 కోట్లు, బ్రిటన్ సంస్థ ఆర్‌వీ అసోసియేట్స్‌లో రూ. 20.8 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు కంపెనీ వినియోగించుకోనుంది. హైస్పీడ్ రైల్ ప్రాజెక్ట్, డెడికేటెడ్ ఫ్రైట్ రైల్ కారిడార్ మొదలైన ప్రాజెక్టులకు ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ సేవలు అందించింది.

ఫార్మా రంగ కంపెనీ

ఫార్మాస్యూటికల్ రంగ హైదరాబాద్ కంపెనీ విరూపాక్ష ఆర్గానిక్స్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 740 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. తద్వారా సమీకరించనున్న నిధులలో రూ. 360 కోట్లు సామర్థ్య విస్తరణపై వెచ్చించనుంది. మరో రూ. 195 కోట్లు రుణ చెల్లింపులకు, మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. ఆర్‌అండ్‌డీ ఆధారిత ఫార్మా కంపెనీ విరూపాక్ష ప్రధానంగా ఏపీఐలు, ఇంటర్మీడియేట్స్‌ను తయారు చేస్తోంది. 2025 మార్చి31కల్లా 54 ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. గతేడాది(2024–25) రూ. 811 కోట్ల ఆదాయం, రూ. 78 కోట్ల నికర లాభం ఆర్జించింది. హైదరాబాద్‌లో నాలుగు, కర్ణాటకలోని హుమ్నాబాద్‌లో రెండు చొప్పున తయారీ యూనిట్లను కలిగి ఉంది. లారస్, న్యూలాండ్, దివీస్ ల్యాబ్స్, ఆర్తి డ్రగ్స్ తదితరాలను ప్రత్యర్థి సంస్థలుగా భావించవచ్చు.

సాస్ సేవలతో..

సాస్ సేవల కంపెనీ క్యాపిల్లరీ టెక్నాలజీస్ ఇండియా ఐపీవోకు సెబీ అనుమతించింది. జూన్‌లో దాఖలు చేసిన ప్రాస్పెక్టస్ ప్రకారం ఇష్యూలో భాగంగా రూ. 430 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.83 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 120 కోట్లు క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యయాలకు, రూ. 152 కోట్లు ప్రొడక్టులు, ప్లాట్‌ఫామ్ డెవలప్‌మెంట్‌కు వెచ్చించనుంది. మిగిలిన నిధులను ఇతర సంస్థల కొనుగోళ్లకు వినియోగించనుంది. కంపెనీ గతంలో 2021 డిసెంబర్‌లో సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసినప్పటికీ అనుమతి లభించకపోవడం గమనార్హం! కంపెనీ ఏఐ ఆధారిత క్లౌడ్‌లో భాగమైన సాఫ్ట్‌వేర్ ప్రొడక్టులు, సొల్యూషన్లు అందిస్తోంది. గతేడాది(2024–25) రూ. 598 కోట్ల ఆదాయం, రూ. 13 కోట్ల నికర లాభం ఆర్జించింది.

లిస్టింగ్‌కు ఏక్వస్ రెడీ

కన్జూమర్ డ్యురబుల్ గూడ్స్, ఏరోస్పేస్ పరికరాల కాంట్రాక్ట్ తయారీ కంపెనీ ఏక్వస్ సెబీకి తాజాగా అప్‌డేటెడ్ ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. దీంతో ఐపీవో చేపట్టేందుకు వీలు చిక్కనుంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 720 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 3.17 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థలు ఏరోస్ట్రక్చర్స్ మాన్యుఫాక్చరింగ్ ఇండియా, ఏక్వస్ కన్జూమర్ ప్రొడక్ట్స్ రుణ చెల్లింపులకు, మెషీనరీ, ఎక్విప్‌మెంట్ కొనుగోలుకి వెచ్చించనుంది. అంతేకాకుండా ఇతర సంస్థల కొనుగోళ్లకు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు సైతం నిధులను వినియోగించనుంది. కంపెనీ గోప్యతా మార్గంలో సెబీకి జూన్‌లో ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీంతో ఐపీవోకు వీలుగా మరోసారి అప్‌డేటెడ్ పత్రాలు అందించింది. కంపెనీలో అమికస్, అమన్సా, స్టెడ్‌వ్యూ క్యాపిటల్‌తోపాటు.. కాటమారన్, స్పర్థ గ్రూప్‌లు ఇన్వెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కంపెనీ క్లయింట్లలో బోయింగ్, బోయింగ్, బంబార్డియర్, జీకేఎన్ ఏరోస్పేస్, హనీవెల్, ఈటన్ తదితర దిగ్గజాలున్నాయి.

అంచనాల్లో 38 శాతానికి ద్రవ్యలోటు

ఆగస్ట్ చివరికి రూ.5,98,153 కోట్లు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆగస్ట్ చివరికి రూ.5,98,153 కోట్లకు చేరింది. 2025–26 జీడీపీలో ద్రవ్యలోటు (ఆదాయం– వ్యయాల మధ్య అంతరం) 4.4 శాతం, అంటే రూ.15.69 లక్షల కోట్లుగా ఉంటుందన్నది ప్రభుత్వం అంచనా. తొలి ఐదు నెలల్లో ద్రవ్యలోటు మొత్తం అంచనాల్లో 38 శాతానికి చేరింది. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) ఈ వివరాలు విడుదల చేసింది. ఆగస్ట్ చివరికి కేంద్ర ప్రభుత్వానికి వచ్చిన నికర ఆదాయం రూ.8.1 లక్షల కోట్లు. ఇందులో రూ.4.4 లక్షల కోట్లు పన్నేతర రూపంలో, రూ.31,970 కోట్లు రుణాల రూపంలో ఉన్నాయి. పన్నుల్లో వాటా కింద రాష్ట్రాలకు రూ.5.3 లక్షల కోట్లను కేంద్రం బదిలీ చేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూస్తే రూ.74,431 కోట్లు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.18.8 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇందులో రూ.14.49 లక్షల కోట్లు రెవెన్యూ వ్యయాలు కాగా, రూ.4.31 లక్షల కోట్లు మూలధన వ్యయాల కింద ఖర్చు అయింది. రెవెన్యూ వ్యయంలోనూ రూ.5,28,668 కోట్లు వడ్డీ చెల్లింపులకు పోగా, రూ.1,50,377 కోట్లు సబ్సిడీలకు వెచ్చించారు.

ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై ధరలు తగ్గాయా?

- వినియోగదారుల నుంచి ఫిర్యాదులు
- వాస్తవ పరిస్థితులపై ప్రభుత్వం పర్యవేక్షణ



న్యూఢిల్లీ: జీఎస్టీలో శ్లాబుల క్రమబద్ధీకరణ ద్వారా నిత్యావసరాల నుంచి ఖరీదైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల వరకు రేట్లను తగ్గించగా.. ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు ఈ-కామర్స్ సంస్థలు అందించడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని బదిలీ చేస్తున్నాయా? అన్నది తెలుసుకునేందుకు కేంద్ర సర్కారు ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై నిఘా పెట్టింది. వస్తు, సేవల పన్నులో (జీఎస్టీ) 12 శాతం, 28 శాతం శ్లాబులను ఎత్తివేసి, వీటిల్లోని వస్తువులను 5, 18 శాతం శ్లాబుల్లోకి మార్చడం తెలిసిందే. దీనివల్ల 375కు పైగా వస్తువుల రేట్లు తగ్గాల్సి ఉంది. కొత్త రేట్లు ఈ నెల 22 నుంచి అమల్లోకి వచ్చేలా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే పాత రేట్లతో మార్కెట్లో ఉన్న వస్తువులను సైతం తగ్గించిన రేట్లపైనే విక్రయించాల్సి ఉంటుందని కేంద్ర సర్కారు ఆదేశించింది. అయినప్పటికీ ధరల తగ్గింపు పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా తెలుస్తోంది. కొన్ని ఈ-కామర్స్ వేదికలపై విక్రయించే రోజువారీ వస్తువుల రేట్లను తగ్గించలేదంటూ ఫిర్యాదులు వస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీంతో జీఎస్టీ రేట్ల కోతను ఈ-కామర్స్ సంస్థలు సాఫీగా, సజావుగా బదిలీ చేసేందుకు వీలుగా ప్రభుత్వం పర్యవేక్షణ మొదలుపెట్టింది. పన్ను రేట్లను తగ్గించారా? లేదా అన్నది రెవెన్యూ శాఖ పరిశీలిస్తోంది''అని చెప్పాయి. జీఎస్టీ రేట్లు అమల్లోకి వచ్చినా, రేట్లలో మార్పులు చేయకపోవడాన్ని సాంకేతిక సమస్యలుగా ఈ-కామర్స్ సంస్థలు పేర్కొంటున్నట్టు సమాచారం.

నెలవారీ నివేదిక..

సాధారణంగా వినియోగించే 54 వస్తువుల రేట్లలో మార్పులపై నెలవారీ నివేదిక ఇవ్వాలంటూ సెంట్రల్ జీఎస్టీ అధికారులకు కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశించడం గమనార్హం. వీటిల్లో వెన్న, షాంపూ, టూత్‌పేస్ట్, టమాటా కెచప్, జామ్, ఐస్‌క్రీమ్, ఏసీ, టీవీలు, డయగ్నోస్టిక్స్ కిట్లు, గ్లూకోమీటర్లు, బ్యాండేజీలు, థర్మోమీటర్లు, ఎరేజర్లు, క్రేయాన్లు, సిమెంట్ ఉన్నాయి.


అదానీ ఎయిర్‌పోర్ట్స్‌కి డిజిటల్ సొల్యూషన్స్ దన్ను



ముంబై: ప్రయాణికులు, భాగస్వాములకు మరింత మెరుగైన అనుభూతిని అందించే దిశగా తమ విమానాశ్రయాల్లో డిజిటల్ సొల్యూషన్స్‌ను విస్తృతంగా వినియోగించనున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ సంస్థ అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ (ఏఏహెచ్ఎల్) తెలిపింది. డిజిటల్ వ్యూహంలో భాగంగా ఏవియో, అదానీ వన్‌యాప్, ఎయిర్‌పోర్ట్ ఇన్ ఏ బాక్స్ లాంటి స్మార్ట్ ప్లాట్‌ఫాంలను ఉపయోగించనున్నట్లు వివరించింది. కార్యకలాపాలను సాఫీగా నిర్వహించుకోవడంలో ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లు, విమానయాన సంస్థలు, సెక్యూరిటీ ఏజెన్సీలు, గ్రౌండ్ హ్యాండ్లర్స్, సర్వీస్ ప్రొవైడర్లకు ఏవియో సహాయపడుతుంది. మరోవైపు, ఎయిర్‌పోర్ట్ సర్వీసులన్నింటినీ ఒకే చోట అందించే డిజిటల్ ప్లాట్‌ఫాం అదానీ వన్‌యాప్ ఉపయోగపడుతుంది. దేశంలో తొలిసారిగా ఆయా విమానాశ్రయాల్లో ప్రత్యేకమైన సర్వీసులను, అదానీ రివార్డ్స్ లాయల్టీ ప్రోగ్రాం ప్రయోజనాలను పొందవచ్చు. ఎయిర్‌పోర్ట్ ఇన్ ఏ బాక్స్ ప్లాట్‌ఫాం ప్రస్తుత కార్యకలాపాల కోసం మౌలిక సదుపాయాలను పటిష్టపర్చుకోవడంతో పాటు భవిష్యత్ విస్తరణ అవసరాల్లోనూ సహాయకరంగా ఉంటుంది. అదానీ గ్రూప్‌నకు చెందిన నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెలలోనే ప్రారంభించనున్న నేపథ్యంలో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. ఏఏహెచ్ఎల్‌కి ప్రస్తుతం ముంబై, అహ్మదాబాద్, మంగళూరు, తిరువనంతపురం, గువాహటి, జైపూర్, లక్నో విమానాశ్రయాలు ఉన్నాయి.

స్వావలంబనపై భారత్ ఫోకస్

కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ: భౌగోళిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు మారిపోతున్న పరిస్థితుల్లో తయారీ సామర్థ్యాలను, సరఫరా వ్యవస్థలను పటిష్టం చేసుకోవడం ద్వారా స్వావలంబన సాధించడంపై భారత్ మరింతగా కసరత్తు చేస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ తెలిపారు. భారీ లక్ష్యాలను సాధించేందుకు, దేశ ప్రయోజనాలను పరిరక్షించుకునేందుకు అవసరమైన ఆత్మవిశ్వాసాన్ని సాధించడంపై దృష్టి పెడుతోందని వివరించారు. విశాఖలో నవంబర్‌లో నిర్వహించబోయే సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు చెప్పారు.

పది రెట్లు టర్నోవరుపై రివర్ దృష్టి



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల సంస్థ రివర్, 2028 మార్చి నాటికి టర్నోవరును పది రెట్లు పెంచుకోవాలని నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా ఉత్పత్తుల సంఖ్యను పెంచుకోవడంతో పాటు దేశవ్యాప్తంగా సేల్స్ నెట్‌వర్క్‌ను కూడా పటిష్టం చేసుకుంటున్నట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు అరవింద్ మణి తెలిపారు. ఒక్క ఎలక్ట్రిక్ స్కూటర్ మోడల్ (ఇండీ), 30 సేల్స్ ఔట్‌లెట్స్‌తో కంపెనీ రూ. 100 కోట్ల ఆదాయ మార్కును దాటింది. ఔట్‌లెట్స్ సంఖ్యను 2028 మార్చి నాటికి 350కి పెంచుకోనున్నట్లు మణి చెప్పారు. దీనితో నెలవారీగా అమ్మకాలు సుమారు 20,000 యూనిట్లకు, వార్షిక టర్నోవరు దాదాపు రూ. 1,200 కోట్లకు చేరగలదని అంచనా వేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 500 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు, 2027 మార్చి నాటికి రెండు కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టనున్నట్లు మణి పేర్కొన్నారు. కంపెనీ ప్రస్తుతం బెంగళూరులో ఉన్న ప్లాంటులో నెలకు 3,000 యూనిట్లను ఉత్పత్తి చేస్తోంది. తదుపరి దశ వృద్ధికి సంబంధించి వచ్చే 3–4 ఏళ్లలో 120–130 మిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయని ఆయన తెలిపారు. రివర్‌లో జపాన్‌కి చెందిన యమహా మోటర్ కార్పొరేషన్, మిత్సుయి అండ్ కో, మరుబెని కార్పొరేషన్ మొదలైనవి 70 మిలియన్ డాలర్ల వరకు ఇన్వెస్ట్ చేశాయి.

భారత్ ఎగుమతులపై టారిఫ్‌ల ప్రభావం



2025–26లో 6.5% వృద్ధికి పరిమితం

- ఆసియా అభివృద్ధి బ్యాంక్ అంచనా

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ జూన్ త్రైమాసికంలో (క్యూ1) బలమైన వృద్ధి రేటు (7.8 శాతం)ను నమోదు చేసినప్పటికీ.. పూర్తి ఆర్థిక సంవత్సరంలో (2025–26) 6.5 శాతానికి పరిమితం కావొచ్చని ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) మరోసారి తన అంచనాలను ప్రకటించింది. భారత్‌పై అమెరికా మోపిన 50 శాతం టారిఫ్‌లు వృద్ధి అవకాశాలకు విఘాతం కలిగిస్తాయని, ముఖ్యంగా ద్వితీయ ఆరు నెలలపై ఈ ప్రభావం ఉంటుందని పేర్కొంది. ఏడీబీ ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించిన అంచనాల్లో భారత జీడీపీ 7 శాతం వృద్ధి రేటును నమోదు చేస్తుందని ప్రకటించడం గమనార్హం. భారత్‌పై టారిఫ్‌లు విధిస్తున్నట్టు అమెరికా ప్రకటించడంతో జూలైలో వృద్ధి రేటు అంచనాను 6.5శాతానికి తగ్గించింది. ఇప్పుడు కూడా అదే అంచనాను కొనసాగించింది. ''వినియోగం పెరగడం, ప్రభుత్వం అధికంగా వ్యయం చేయడంతో క్యూ1లో భారత్ జీడీపీ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. భారత ఎగుమతులపై అమెరికా అదనంగా టారిఫ్‌లు విధించడం వృద్ధి రేటును తగ్గిస్తుంది. ముఖ్యంగా 2025–26 ద్వితీయార్ధం, 2026–27 వృద్ధిపై ఈ ప్రభావం ఉంటుంది. అదే సమయంలో స్థిరమైన దేశీ వినియోగం, సేవల ఎగుమతులు ఈ ప్రభావాన్ని తగ్గిస్తాయి''అని ఏడీబీ తాజా నివేదిక వెల్లడించింది.

ప్రభావం పరిమితమే..

జీడీపీలో ఎగుమతుల వాటా తక్కువగా ఉండడం, అదే సమయంలో ఇతర దేశాలకు ఎగుమతులు పెరగడంతో వృద్ధి రేటుపై అమెరికా టారిఫ్‌ల కారణంగా పడే ప్రభావం పరిమితంగానే ఉంటుందని ఏడీబీ తెలిపింది. సేవల ఎగుమతులు బలంగా ఉన్నాయంటూ, వాటిపై టారిఫ్‌లు లేని విషయాన్ని గుర్తు చేసింది. పరపతి విధాన పరంగా దేశీ వినియోగానికి ఊతమివ్వడాన్ని సైతం ప్రస్తావించింది. ఇక ప్రభుత్వం అంచనా వేసిన 4.4 శాతం కంటే అధికంగా ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉండొచ్చని ఏడీబీ నివేదిక పేర్కొంది. జీఎస్టీ శ్లాబుల కుదింపు కారణంగా పన్ను ఆదాయం తగ్గనుందని, 2025–26 బడ్జెట్ అంచనాలు ప్రకటించే నాటికి ఈ ప్రతిపాదన లేకపోవడాన్ని గుర్తు చేసింది. అదే సమయంలో 2024–25 ఆర్థిక సంవత్సరం జీడీపీలో ద్రవ్యలోటు 4.7 శాతం కంటే తక్కువే ఉండొచ్చని అంచనా వేసింది. కరెంట్ ఖాతా లోటు మాత్రం జీడీపీలో 0.9 శాతానికి ఎగబాకొచ్చని తెలిపింది. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది 0.6 శాతంగా ఉంది. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2026–27) కరెంటు ఖాతా లోటు 1.1 శాతానికి పెరగొచ్చని పేర్కొంది. ద్రవ్యోల్బణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 3.1 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. అంచనాలకు మించి ఆహార ధరలు వేగంగా తగ్గడాన్ని ప్రస్తావించింది. 2025–26 మొదటి నాలుగు నెలల్లో కేంద్ర ప్రభుత్వ వ్యయాలు ఆదాయానికి మించి బలంగా ఉన్నట్టు, దీంతో క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే ద్రవ్యలోటు పెరిగినట్టు వివరించింది.

ఎల్ఐసీతో ఆర్‌బీఎల్ బ్యాంక్ జట్టు



న్యూఢిల్లీ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)తో బ్యాంకెష్యూరెన్స్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రైవేట్ రంగ ఆర్‌బీఎల్ బ్యాంకు వెల్లడించింది. దీనితో ఎల్ఐసీ టర్మ్ ప్లాన్లు, ఎండోమెంట్ పాలసీలు మొదలైన పథకాలను బ్యాంకు శాఖలు, డిజిటల్ మాధ్యమాల ద్వారా తమ కస్టమర్లకు అందించేందుకు వీలవుతుందని వివరించింది. ఎల్ఐసీకి చెందిన 3,600 పైగా శాఖలు, శాటిలైట్ ఆఫీసులతో పాటు తమ 2,000 పైగా టచ్‌పాయింట్ల విస్తృత నెట్‌వర్క్‌తో దేశవ్యాప్తంగా జీవిత బీమా లభ్యతను మరింతగా పెంచవచ్చని ఆర్‌బీఎల్ తెలిపింది.

ఈక్వల్ నుంచి తొలి ఏఐ కాల్ అసిస్టెంట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కి సమాధానమిచ్చేలా భారతదేశపు తొలి ఏఐ కాల్ అసిస్టెంట్‌ను రూపొందించినట్లు హైదరాబాదీ అంకుర సంస్థ ఈక్వల్ వ్యవస్థాపకుడు, పారిశ్రామిక దిగ్గజం జీవీకే వారసుడు కేశవ రెడ్డి తెలిపారు. ఈక్వల్ ఏఐ అక్టోబర్ 2 నుంచి ఢిల్లీ–ఎన్‌సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్)లో అందుబాటులోకి వస్తుందని, దశలవారీగా దేశవ్యాప్తంగా ప్రవేశపెడతామని యన తెలిపారు. 2026 మధ్య నాటికి రోజుకు 10 లక్షల యాక్టివ్ యూజర్లను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. గుర్తు తెలియని నంబర్లు, టెలీమార్కెటింగ్, డెలివరీ ఏజెంట్ల కాల్స్ మొదలైన వాటికి ఇది ఇంగ్లీష్, హిందీ, హింగ్లీష్ భాషల్లో సమాధానమివ్వగలదు. అవసరమైతే యూజర్ మధ్యలో కాల్‌ను టేకోవర్ చేయొచ్చు.

సుమిత్ 'హ్యాట్రిక్'



● వరుసగా మూడోసారి స్వర్ణం గెలిచిన భారత పారా జావెలిన్ త్రోయర్
● ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: సొంతగడ్డపై తొలిసారి జరుగుతున్న ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మంగళవారం భారత అథ్లెట్లు అదరగొట్టారు. రెండు స్వర్ణ పతకాలు, రెండు రజత పతకాలతో మెరిశారు. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్64 విభాగంలో సుమిత్ అంటిల్ పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నాడు. 27 ఏళ్ల సుమిత్ జావెలిన్‌ను 71.37 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానాన్ని సంపాదించాడు. ఈ క్రమంలో ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో వరుసగా మూడో బంగారు పతకాన్ని గెల్చుకున్నాడు. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ పారాథ్లెట్‌గా గుర్తింపు పొందాడు. 2023, 2024 ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లలో కూడా సుమిత్ స్వర్ణ పతకాలు సాధించాడు. 2020 టోక్యో, 2024 పారిస్ పారాలింపిక్స్ క్రీడల్లోనూ సుమిత్ బంగారు పతకాలను గెలిచాడు. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్44 విభాగంలోనూ భారత్‌కు రెండు పతకాలు లభించాయి. సందీప్ సంజయ్ సర్గార్ (62.82 మీటర్లు) పసిడి పతకం నెగ్గగా... సందీప్ చౌధరీ (62.67 మీటర్లు) రజత పతకం సాధించాడు. అంతకుముందు పురుషుల డిస్కస్ త్రో ఎఫ్56 విభాగంలో యోగేశ్ కథునియా (42.49 మీటర్లు) రజత పతకాన్ని సాధించాడు. ప్రస్తుతం భారత్ 4 స్వర్ణాలు, 4 రజతాలు, 1 కాంస్యంతో కలిపి మొత్తం తొమ్మిది పతకాలతో నాలుగో స్థానంలో ఉంది.



స్వర్ణం, రజతం భారత్‌కే

న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్‌ఎస్‌ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. మంగళవారం భారత షూటర్లు ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యం గెలిచారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జోడీలు స్వర్ణం, రజతం దక్కించుకున్నాయి. ఫైనల్లో ఇషా తక్సలె-హిమాన్షు జోడీ 17-15తో భారత్‌కే చెందిన శాంభవి-నరేన్ ప్రణవ్ జంటపై గెలిచింది. ఇషా-హిమాన్షు ద్వయం ఖాతాలో పసిడి చేరగా... శాంభవి-నరేన్ జంటకు రజతం దక్కింది. జూనియర్ పురుషుల ట్రాప్ ఈవెంట్‌లో వినయ్ ప్రతాప్ చంద్రావత్ కాంస్యం గెలిచాడు. ఫైనల్లో వినయ్ 34 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచాడు. ఐదో రోజు పోటీలు ముగిశాక భారత్ 7 స్వర్ణాలు, 9 రజతాలు, 7 కాంస్యాలతో కలిపి మొత్తం 23 పతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

శ్రీహరి ఖాతాలో ఐదో పతకం




అహ్మదాబాద్: ఆసియా అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత స్విమ్మర్ శ్రీహరి నటరాజ్ పతకాల వేట కొనసాగుతోంది. మంగళవారం జరిగిన పురుషుల 100 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో తమిళనాడుకు చెందిన శ్రీహరి కాంస్య పతకం సాధించాడు. శ్రీహరి 49.96 సెకన్లలో లక్ష్యానికి చేరి మూడో స్థానంలో నిలిచాడు. ఈ పోటీల్లో శ్రీహరికి ఐదో పతకం కావడం విశేషం. మరోవైపు భారత్‌కే చెందిన బెనెడిక్షన్ బెనిస్టన్ రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. పురుషుల 50 మీటర్ల బటర్‌ఫ్లయ్ ఈవెంట్‌ను బెనెడిక్షన్ 23.89 సెకన్లలో ముగించి రెండో స్థానంలో నిలిచాడు. ప్రస్తుతం భారత్ 4 రజతాలు, 5 కాంస్యాలతో కలిపి మొత్తం 9 పతకాలతో తొమ్మిదో స్థానంలో ఉంది.

శ్రీజ పరాజయం



బీజింగ్: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చైనా స్మాష్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ పోరాటం ముగిసింది. మంగళవారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో శ్రీజ 7-11, 9-11, 4-11తో వాంగ్ యిది (చైనా) చేతిలో ఓడిపోయింది. 21 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో శ్రీజ తన సర్వీస్‌లో 11 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 9 పాయింట్లు స్కోరు చేసింది. రెండో రౌండ్‌లో ఓడిన శ్రీజకు 9000 డాలర్ల (రూ. 8 లక్షలు) ప్రైజ్‌మనీతో పాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



అల్‌కరాజ్ అదరహో

ఈ ఏడాది ఎనిమిదో సింగిల్స్ టైటిల్ సొంతం

టోక్యో: ఈ సీజన్‌లో తన అద్భుత ప్రదర్శన కొనసాగిస్తూ ప్రపంచ పురుషుల టెన్నిస్ నంబర్‌వన్ ర్యాంకర్ కార్లోస్ అల్‌కరాజ్ ఎనిమిదో సింగిల్స్ టైటిల్‌ను గెల్చుకున్నాడు. మంగళవారం ముగిసిన జపాన్ ఓపెన్ ఏటీపీ-500 టోర్నీలో అల్‌కరాజ్ చాంపియన్‌గా అవతరించాడు. ప్రపంచ ఐదో ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)తో జరిగిన ఫైనల్లో 22 ఏళ్ల అల్‌కరాజ్ 6-4, 6-4తో విజయం సాధించాడు. ఓవరాల్‌గా అల్‌కరాజ్ కెరీర్‌లో ఇది 24వ సింగిల్స్ టైటిల్ కావడం విశేషం. 93 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో అల్‌కరాజ్ ఆరు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, మూడుసార్లు బ్రేక్ చేశాడు. విజేతగా నిలిచిన అల్‌కరాజ్‌కు 4,16,365 డాలర్ల (రూ. 3 కోట్ల 69 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. రన్నరప్ ఫ్రిట్జ్‌కు 2,24,035 డాలర్ల (రూ. 2 కోట్లు) ప్రైజ్‌మనీతోపాటు 300 ర్యాంకింగ్ పాయింట్లు దక్కాయి. ఈ ఏడాది అల్‌కరాజ్ రోటర్‌డామ్ ఓపెన్, మోంటెకార్లో ఓపెన్, రోమ్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, క్వీన్స్ క్లబ్ ఓపెన్, సిన్సినాటి ఓపెన్, యూఎస్ ఓపెన్ టోర్నీల్లో విజేతగా నిలిచాడు. ఈ ఏడాది తొమ్మిదో టైటిల్ లక్ష్యంగా అల్‌కరాజ్ షాంఘై ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో బరిలోకి దిగుతాడని భావించినా... చివరి నిమిషంలో అతను ఈ టోర్నీ నుంచి వైదొలిగాడు. జపాన్ ఓపెన్ ఫైనల్ సందర్భంగా అల్‌కరాజ్ ఎడమ చీలమండ గాయానికి గురయ్యాడు. దాంతో షాంఘై ఓపెన్ నుంచి తప్పుకుంటున్నట్లు అల్‌కరాజ్ ప్రకటించాడు.

దీపేశ్‌కు 5 వికెట్లు



బ్రిస్బేన్: ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో మంగళవారం మొదలైన నాలుగు రోజుల తొలి యూత్ టెస్టులో భారత అండర్-19 బౌలర్లు ఆకట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల దీపేశ్ దేవేంద్రన్ తన పేస్ బౌలింగ్‌తో మెరిపించాడు. 16.2 ఓవర్లు వేసిన దీపేశ్ 45 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. ఫలితంగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా జట్టు తొలి రోజు తొలి ఇన్నింగ్స్‌లో 91.2 ఓవర్లలో 243 పరుగులకే ఆలౌటైంది. భారత ఇతర బౌలర్లలో కిషన్ కుమార్ మూడు వికెట్లు తీసుకోగా... అన్‌మోల్‌జీత్ సింగ్, ఖిలాన్ పటేల్‌లకు ఒక్కో వికెట్ లభించింది. ఆస్ట్రేలియా జట్టులో స్టీవెన్ హోగన్ (92; 8 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

ఢిల్లీ వీధిలో జమైకన్ చిరుత

ఉసేన్ బోల్ట్‌తో సింధు, శ్రీజేశ్, అనిమేశ్ పరుగు



న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరంలో 'జమైకన్ చిరుత' ఉసేన్ బోల్ట్ సందడి చేశాడు. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఈ స్ప్రింటర్ కోసం ఢిల్లీ కాసేపు అథ్లెటిక్ రన్నింగ్ ట్రాక్‌గా మారింది. ఆసియాలోనే అతిపెద్ద మసాలా దినుసుల మార్కెట్ అయిన ఢిల్లీ 'ఖరి బౌలీ'లో స్ప్రింట్ దిగ్గజం బోల్ట్ భారత ఒలింపిక్ పతక విజేతలు పీవీ సింధు, పీఆర్ శ్రీజేశ్, జాతీయ 200 మీటర్ల అథ్లెటిక్స్ చాంపియన్ అనిమేశ్ కుజుర్‌లతో కలిసి అభిమానుల్ని ఉత్సాహపరిచాడు. ప్రముఖ విదేశీ అపారల్, స్పోర్ట్స్ కిట్ ఉత్పాదక సంస్థ 'ప్యూమా' ఏర్పాటు చేసిన ఈ ప్రచార కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసభరితంగా సాగింది. ఢిల్లీ సుప్రసిద్ధ మార్కెట్ 'ఖరి బౌలీ' టెర్రస్ (రూఫ్ టాప్)పై ఏర్పాటు చేసిన ప్రత్యేక ట్రాక్‌పై బోల్ట్ సరదాగా పరుగు పెట్టాడు. ఈ సరదా సరదా రిలే పరుగు ఈవెంట్‌లో బోల్ట్‌తో బ్యాడ్మింటన్ స్టార్ సింధు, మాజీ హాకీ దిగ్గజ గోల్ కీపర్ శ్రీజేశ్, అనిమేశ్ బ్యాటన్‌ను పంచుకున్నారు. 'క్రీడలంటే ఇదే... సరిహద్దులను చెరిపేసి, సంస్కృతిని సమ్మిళితం చేస్తూ సాగే పయనం' అని బోల్ట్ అన్నాడు. భారత బ్యాడ్మింటన్ స్టార్ సింధు మాట్లాడుతూ 'ఢిల్లీ నడిబొడ్డున బోల్ట్‌తో భుజం భుజం కలిపి పరుగు పెట్టడం స్ఫూర్తిదాయకంగా ఉంది. ఓ క్రీడాకారిణిగా జీవితంలో ఒక్కసారైన జగద్విఖ్యాత అథ్లెట్‌తో రిలే ఈవెంట్‌లో పాల్గొనాలనే కల ఇక కల కాదు. నేటితో అది నిజమైంది. నేను క్రీడను ఎందుకింతలా ప్రేమించానో నాకు గుర్తు చేసే క్షణమిది' అని సంతోషం వ్యక్తం చేసింది. ఖరి బౌలీలోని రూఫ్ టాప్ ట్రాక్‌పై జమైకన్ స్ప్రింటర్ బోల్ట్‌తో పాల్గొన్న ఈ రిలే తన జీవితంలో చిరస్మరణీయమవుతుందని హాకీ లెజెండ్ శ్రీజేశ్ అన్నాడు. ముగ్గురు భారత క్రీడాకారులు బోల్ట్ ట్రేడ్‌మార్క్ విక్టరీ సెలబ్రేషన్ పోజు 'లైట్నింగ్ బోల్ట్'తో దిగ్గజాన్ని అనుకరించి... అలరించారు.

భళా బెన్నెట్...

మూడు ఫార్మాట్‌లలో సెంచరీలు చేసిన అతిపిన్న వయస్కుడిగా గుర్తింపు



హరారే: జింబాబ్వే క్రికెటర్ బ్రియాన్ బెన్నెట్ కొత్త చరిత్ర సృష్టించాడు. టి20 ప్రపంచకప్ ఆఫ్రికా రీజియన్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా... మంగళవారం టాంజానియాతో జరిగిన మ్యాచ్‌లో బెన్నెట్ సెంచరీ (60 బంతుల్లో 111; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) సాధించాడు. ఈ క్రమంలో మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) సెంచరీలు చేసిన అతిపిన్న వయస్కుడిగా బెన్నెట్ (21 ఏళ్ల 342 రోజులు) గుర్తింపు పొందాడు. గతంలో ఈ రికార్డు పాకిస్తాన్ ప్లేయర్ అహ్మద్ షెహజాద్ (22 ఏళ్ల 127 రోజులు) పేరిట ఉంది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 221 పరుగులు చేసింది. అనంతరం టాంజానియా 18.4 ఓవర్లలో 108 పరుగులకు ఆలౌటైంది. దాంతో 113 పరుగుల తేడాతో విజయం సాధించిన జింబాబ్వే వరుసగా మూడో గెలుపుతో గ్రూప్ 'బి'లో టాపర్‌గా నిలిచి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది.

తొలి వన్డే వర్షార్పణం

కాన్పూర్: భారీ వర్షం కారణంగా... మంగళవారం భారత్ 'ఎ'-ఆస్ట్రేలియా 'ఎ' జట్ల మధ్య జరగాల్సిన తొలి అనధికారిక వన్డే రద్దు అయింది. వర్షం నీటితో గ్రీన్‌పార్క్ స్టేడియం చిత్తడిగా మారిపోయింది. ఫలితంగా టాస్ కూడా వేయడం సాధ్యపడలేదు. రెండు జట్ల మధ్య రెండో అనధికారిక వన్డే కూడా శుక్రవారం ఇదే వేదికపై జరగాల్సి ఉంది.



టైటాన్స్ 'సిక్సర్'

మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్‌పై ఘనవిజయం

చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ తమ నిలకడైన ప్రదర్శనను కొనసాగిస్తోంది. మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 37-28 పాయింట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ సీజన్‌లో తెలుగు టైటాన్స్‌కిది ఆరో విజయం కావడం విశేషం. టైటాన్స్ కెప్టెన్ విజయ్ మలిక్ 13 పాయింట్లతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. మొత్తం 23 సార్లు రెయిడింగ్‌కు వెళ్లిన విజయ్ 13 పాయింట్లు సాధించాడు. ఇందులో తొమ్మిది టచ్ పాయింట్లుకాగా... మూడు బోనస్ పాయింట్లు, ఒకటి టాకిల్ పాయింట్ ఉండటం విశేషం. మరో ఆల్‌రౌండర్ భరత్ 8 పాయింట్లు స్కోరు చేయగా... డిఫెండర్ అంకిత్ 4 పాయింట్లు సంపాదించాడు. చేతన్, శుభమ్ షిండే మూడు పాయింట్ల చొప్పున స్కోరు చేశారు. పట్నా పైరేట్స్ జట్టులో రెయిడర్ అయాన్ 13 పాయింట్లతో మెరిపించినా... ఇతర ప్లేయర్లు తడబడటంతో ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 49-44 పాయింట్లతో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. పుణేరి తరఫున ఆదిత్య షిండే 18 పాయింట్లు, పంకజ్ మొహితే 13 పాయింట్లు సాధించారు. బెంగాల్ వారియర్స్ రెయిడర్ దేవాంక్ ఏకంగా 25 పాయింట్లు సాధించినా చివరకు ఆ జట్టును గట్టెక్కించలేకపోయాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో హరియాణా స్టీలర్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్; యు ముంబాతో తమిళ్ తలైవాస్ తలపడతాయి.

స్ఫూర్తిదాయక సురేఖ!

ఆసియా తొలి మహిళా లోకో పైలట్ సురేఖ యాదవ్ ఉద్యోగ విరమణ

36 ఏళ్ల 'అద్భుత ప్రయాణం' ముగింపు ● ప్రతిష్టాత్మక రైళ్లు నడిపిన ధైర్యశాలి

ముంబై: ఆసియాలోనే మొదటి మహిళా లోకో పైలట్‌గా, 36 ఏళ్లకు పైగా తన వృత్తి జీవితంలో దేశంలోని ఎన్నో ప్రతిష్టాత్మక రైళ్లను నడిపిన సురేఖ యాదవ్ మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆమె ధైర్య సాహసాలు, స్ఫూర్తిదాయకమైన వారసత్వాన్ని వదిలి వెళ్లారని సెంట్రల్ రైల్వే కొనియాడింది. ఈ 'మార్గదర్శి అద్భుత ప్రయాణం'రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని పేర్కొంది.

పురుషాధిక్య ప్రపంచంలో మెరిసి..

యాదవ్ 1989లో భారతీయ రైల్వేలో చేరారు. పురుషాధిక్యం ఉన్న రైల్వే రంగంలో అడ్డంకులను ఛేదించారు. ఆమె 1990లో అసిస్టెంట్ డ్రైవర్‌గా మారారు, తద్వారా ఆసియా ఖండంలోనే మొట్టమొదటి మహిళా రైలు డ్రైవర్‌గా గుర్తింపు పొందారు.

క్లిష్టమైన మార్గాల్లో రైళ్లు నడిపి

ముంబై సబర్బన్ లోకల్ రైళ్లతో పాటు, భారతదేశంలోనే అత్యంత ఎత్తయిన కొండ మార్గాల గుండా సురేఖ యాదవ్ గూడ్స్ రైళ్లను నడిపారు. వందేభారత్ నుండి రాజధాని ఎక్స్‌ప్రెస్ వరకు.. దేశంలోని కొన్ని అత్యంత ప్రతిష్టాత్మక రైళ్లను కూడా ఆమె నడపడం విశేషం.

రైతు కుటుంబంలో పుట్టి..

మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చెందిన ఒక రైతు కుటుంబంలో సెప్టెంబర్ 2, 1965న జన్మించిన యాదవ్, రైల్వే ఉద్యోగంలో చేరడానికి ముందు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా పూర్తి చేశారు. ఆమె క్రమంగా ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. 1996లో మొదటి గూడ్స్ రైలును నడిపారు, ఆపై 2000 సంవత్సరంలో మోటార్ ఉమన్‌గా పదోన్నతి పొందారు. 2010లో, ఆమె ఘాట్ డ్రైవర్‌గా అర్హత సాధించారు. ఆ తర్వాత వివిధ మార్గాల్లో సుదూర మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సారథ్యం వహించారు.

వందేభారత్‌కు సారథ్యం

ఆమె వృత్తి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా 2023 మార్చి 13వ తేదీ నిలిచిపోతుంది. సోలాపూర్, ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ మధ్య తొలిసారిగా నడిపిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఆమె సారథ్యం వహించారు. ఉద్యోగ విరమణకు కొన్ని రోజుల ముందు, చివరి బాధ్యతగా, ఇగత్‌పురి సీఎస్ఎంటీ మధ్య హజ్రత్ నిజాముద్దీన్-సీఎస్ఎంటీ మార్గంలో ప్రతిష్టాత్మక రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను నడిపే అవకాశం ఆమెకు లభించింది. యాదవ్ తన చివరి రోజు ఉద్యోగ విరమణకు సంబంధించిన అన్ని లాంఛనాలను పూర్తి చేశారు. సంప్రదాయం ప్రకారం, ఆమె సహోద్యోగులు కొద్ది రోజుల క్రితం ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు.



వీడ్కోలు చెబుతున్న సురేఖా యాదవ్

మార్గదర్శికి వీడ్కోలు

ఒక మార్గదర్శికి వీడ్కోలు. ఆసియా తొలి మహిళా రైలు డ్రైవర్ సురేఖ యాదవ్.. 36 ఏళ్ల అద్భుతమైన సేవల తర్వాత నేడు సెలవు తీసుకుంటున్నారు. ఆమె అద్భుత ప్రయాణం.. రాబోయే తరాల రైల్వే మహిళలు, పురుషులకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది.

- 'ఎక్స్'లో సెంట్రల్ రైల్వే పోస్టు

నాలుగు నెలల నైరుతి ముగిసింది

● ఈసారి సాధారణం కంటే 8 శాతం అధికంగా వానలు
● వెల్లడించిన భారత వాతావరణ విభాగం



న్యూఢిల్లీ: దేశంలో వ్యవసాయ రంగానికి అత్యంత కీలకమైన నాలుగు నెలల నైరుతి రుతు పవన కాలం మంగళవారంతో ముగిసింది. ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే 8 శాతం అధికంగా వానలు కురిశాయని బారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెలిపింది. కొండచరియలు, మట్టి చరియలు విరిగిపడటం, క్లౌడ్ బరస్ట్ వంటి విపత్తులు చోటుచేసుకున్నప్పటికీ మొత్తమ్మీద అత్యంత విజయవంతమైన సీజన్‌గా భావించవచ్చని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ మహాపాత్ర పేర్కొన్నారు. నాలుగు నెలల కాలంలో సాధారణంగా వర్షపాతం 86.86 సెంటీమీటర్లు కాగా, ఈ ఏడాది 8 శాతం అధికంగా ఏకంగా 93.72 సెంటీమీటర్ల మేర వర్షాలు పడ్డాయన్నారు. దేశంలోని తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో మాత్రం సాధారణ వర్షపాతం 136.73 సెంటీమీటర్లు కాగా 108.99 సెంటీమీటర్ల వర్షపాతమే నమోదయినట్లు మహాపాత్ర వివరించారు. బిహార్, అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయల్లో నాలుగు నెలల సీజన్‌కుగాను మూడు నెలల్లో లోటు వర్షపాతమే నమోదైందన్నారు. తూర్పు, ఈశాన్య భారతాల్లో లోటు వర్షపాతం నమోదవడం 1901 తర్వాత ఇది రెండోసారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో 2013లోనూ తక్కువ వానలు కురిశాయని, అప్పట్లో 106.57 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని ఆయన మంగళవారం వర్చువల్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతాల్లో తరచుగా లోటు వర్షపాతం నమోదవుతోందని, 2020 తర్వాత ఇలా వర్షపాతం క్రమేపీ తగ్గుతూ వస్తోందన్నారు. గడిచిన 20 ఏళ్లుగా ఈ ధోరణి అనేక అధ్యయనాల్లోనూ వెల్లడైందన్నారు. అదే సమయంలో, వాయువ్య భారతదేశంలో పరిస్థితి ఇందుకు వ్యతిరేకంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఈ సీజన్‌లో 74.79 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే ఇది 58.76 సెంటీమీటర్లు అంటే, 27.3 శాతం ఎక్కువని మహాపాత్ర అన్నారు. ఇలా జరగడం 1901 తర్వాత ఆరోసారి కాగా, 2001 తర్వాత అత్యధికమని చెప్పారు. వాయవ్య భారతంలోని అన్ని జిల్లాల్లోనూ జూన్, ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో సాధారణానికి మించి వానలు రికార్డయ్యాయని చెప్పారు. మధ్య భారతంలో 112.53 సెంటీమీటర్లు కురిసింది. ఇది సాధారణ వర్షపాతం 97.8 సెంటీమీటర్ల కంటే 15.1 శాతం ఎక్కువ. దక్షిణాదిన సాధారణం 71.62 సెంటీమీటర్లు కాగా, ఈసారి 9.9 శాతం అధికంగా వానలు కురిశాయని మహాపాత్ర పేర్కొన్నారు.

సీజన్ తర్వాత కూడా...

రుతు పవన సీజన్ తర్వాత అక్టోబర్- డిసెంబర్ నెలల్లో సైతం వాయవ్య ప్రాంతం మినహా దేశమంతటా సాధారణానికి మించి వానలు కురిసే అవకాశముందని మహాపాత్ర వివరించారు. వాయవ్య భారతంలో సాధారణం కంటే తక్కువగానే వర్షపాతం నమోదవుతుందన్నారు. దేశంలో అక్టోబర్‌లో సాధారణం కంటే 15 శాతం అధికంగా వానలు పడ్తాయని చెప్పారు. డిసెంబర్ వరకు దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతల్లోనూ పెద్దగా మార్పులుండవన్నారు.

అకౌంట్ రద్దు చేసిన ఫలితం

ట్రంప్‌తో యూట్యూబ్ రూ. 217 కోట్ల సెటిల్‌మెంట్

శాన్‌ఫ్రాన్సిస్కో: 2021లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖాతాను సీజ్ చేసిన గూగుల్ సంస్థకు చెందిన యూట్యూబ్ రాజీ కుదుర్చుకుంది. అందుకోసం ఆయనకు 2.45 కోట్ల డాలర్లు అంటే సుమారు రూ.217 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. ఈ విషయం కాలిఫోర్నియాలోని ఫెడరల్ కోర్టులో అందజేసిన పత్రాల్లో పేర్కొంది. ఈ మొత్తాన్ని ట్రస్ట్ ఫర్ ది నేషనల్ మాల్, అమెరికన్ కన్జర్వేటివ్ యూనియన్ తదితరులకు చెల్లించనుంది. 2021 జనవరి ఆరో తేదీన యూఎస్ క్యాపిటల్ భవనంపై దాడి జరిగిన అనంతరం అప్పటి అధ్యక్షుడు ట్రంప్ ఖాతాను యూట్యూబ్ స్తంభింప జేసింది. దీనిపై ఆయన కోర్టుకెక్కారు. కేసు అక్టోబర్ 6వ తేదీన కాలిఫోర్నియా కోర్టులో విచారణకు రావాల్సి ఉండగా ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. తాజా ఒప్పందంపై గూగుల్ స్పందించలేదు. దీంతో, ట్రంప్‌తో వివాదాన్ని సెటిల్ చేసుకున్న టెక్ దిగ్గజాల జాబితాలో గూగుల్ చేరినట్లయింది. 2021లో ట్రంప్ ఫేస్‌బుక్ ఖాతాను సస్పెండ్ చేసినందుకు గాను మెటా ఈ ఏడాది జనవరిలో రెండున్నర కోట్ల డాలర్లను చెల్లించింది. ఎలాన్ మస్క్‌కు చెందిన ఎక్స్ కూడా ఇలాంటి కేసులో ట్రంప్‌నకు కోటి డాలర్లు చెల్లించి, రాజీ కుదుర్చుకుంది.

బలూచిస్తాన్‌లో పేలుడు..10 మంది దుర్మరణం

కరాచీ: పాకిస్తాన్‌లోని కల్లోలిత బలూచిస్తాన్ రాజధాని క్వెట్టాలో మంగళవారం బాంబు దాడి జరిగింది. పారామిలటరీ బలగాల ప్రధాన కార్యాలయం వద్ద మంగళవారం చోటుచేసుకున్న పేలుడులో కనీసం 10 మంది చనిపోగా, 30మందికి పైగా గాయపడ్డారు. నిత్యం రద్దీగా ఉండే వీధిలో పేలుడు సంభవించడంతో ఆ చుట్టుపక్కలున్న సామాన్యులు సైతం బాధితులుగా మారారు. ఘటనకు కారణమంటూ ఎవరూ ప్రకటించుకోలేదు. అయితే, ప్రావిన్స్‌లోని భద్రతా సిబ్బంది, ప్రభుత్వ ప్రాజెక్టులు, చైనా-పాకిస్తాన్ ఆర్థిక కారిడార్(సీపెక్) లక్ష్యాలుగా తరచూ హింసాత్మక చర్యలకు పాల్పడుతున్న బలూచ్ గ్రూపులే కారణమని భావిస్తున్నారు. ఇరాన్, అఫ్గానిస్తాన్‌లతో సరిహద్దులు కలిగిన బలూచిస్తాన్‌లో ఖనిజ సంపద అపారం. దశాబ్దాలుగా ఇక్కడ వేర్పాటువాద ఉద్యమం కొనసాగుతోంది.

కేసినో వద్ద కాల్పులు.. ఇద్దరు మృతి

టెక్సాస్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలోని సరిహద్దు నగరం ఈగిల్ పాస్‌లో చోటుచేసుకున్న కాల్పుల ఘటనలో ఇద్దరు చనిపోగా, ఐదుగురు గాయపడ్డారు. స్థానిక కికాపూ లక్కీ ఈగిల్ క్యాసినో పార్కింగ్ ప్రాంతంలో శనివారం రాత్రి ఓ వ్యక్తి కాల్పులకు దిగాడని పోలీసులు తెలిపారు. ఘటన కారణంగా ఆ ప్రాంతంలో కొన్ని గంటలపాటు ట్రాఫిక్‌ను అధికారులు నిలిపివేశారు. ఘటనకు కారకుడిగా భావిస్తున్న కెర్యన్ రషద్ జోన్స్(34)అను అక్కడికి 290 కిలోమీటర్ల దూరంలోని స్టాక్‌డేల్‌లో అధికారులు సోమవారం ఉదయం అరెస్ట్ చేశారు. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది.

అమెరికా నుంచి 120 మంది ఇరానియన్లు డిపోర్ట్

టెహ్రాన్: అమెరికాలోకి దొంగచాటుగా ప్రవేశిస్తూ దొరికిపోయిన 120 మంది ఇరానియన్లు త్వరలో తిరిగి స్వదేశానికి చేరుకోనున్నారు. అమెరికాతో కుదిరిన ఒప్పందం మేరకు సుమారు 400 మంది డిపోర్ట్ అవుతారని ఇరాన్ విదేశాంగ శాఖ అధికారి హొస్సైన్ నొషబాది మంగళవారం తెలిపారు. మొదటి విడత డిపోర్టేషన్‌లో భాగంగా 120 మందితో కూడిన ప్రత్యేక విమానం ఒకట్రెండు రోజుల్లో టెహ్రాన్‌కు చేరుకుంటుందన్నారు. ఇరాన్‌తో కుదిరిన డిపోర్టేషన్ ఒప్పందంపై అమెరికా ప్రభుత్వం స్పందించలేదు.

త్రివిధ దళాలు సంఘటిత శక్తిగా పనిచేయాలి

రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపు

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైన్యం, వైమానిక దళం, నావికాదళం పూర్తి సమన్వయంతో కలిసికట్టుగా పనిచేశాయని, అద్భుతమైన ఫలితాలు సాధించాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. త్రివిధ దళాలు సంఘటితంగా పని చేస్తే ఎలాంటి నిర్ణయాత్మక ఫలితాలు వస్తాయో చెప్పడానికి ఆపరేషన్ సిందూర్ ఒక ఉదాహరణ అని వివరించారు. భవిష్యత్తులో జరిగే మిలటరీ ఆపరేషన్లకు ఇది బెంచ్‌మార్క్ అని స్పష్టంచేశారు. మంగళవారం ఢిల్లీలో భారత వైమానిక దళం(ఐఏఎఫ్) సెమినార్‌లో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. భద్రత విషయంలో పరిణామాలు నానాటికీ మారిపోతున్నాయని, ఇలాంటి తరుణంలో త్రివిధ దళాల మధ్య ఐక్యత, సమన్వయం అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. సైన్యం, వైమానిక, నావికా దళాల సంఘటిత శక్తిగా పనిచేయాలని, దేశ రక్షణకు పాటుపడాలని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది మే 7 నుంచి 10వ తేదీ దాకా జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో భారత వైమానిక దళానికి చెందిన ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కమాండ్‌అండ్ కంట్రోల్ సిస్టమ్ సైన్యానికి సంధించిన ఆకాశ్‌తీర్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌తోపాటు నావికా దళానికి చెందిన త్రిగుణ్ వ్యవస్థతో అనుసంధానమైన పని చేసిందని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్‌కు ఈ సమన్వయమే వెన్నుముకగా నిలిచిందన్నారు. ఒక దళానికి ఎదురవుతున్న సవాళ్లను ఇతర రెండు దళాలు గుర్తించాలని, ఉమ్మడిగా ఎదుర్కోవడానికి కొత్త వ్యవస్థలు సృష్టించాలని పేర్కొన్నారు.

ఫతాహ్-4ను పరీక్షించిన పాక్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ దేశీయంగా అభివృద్ధి చేసిన క్రూయిజ్ మిస్సైల్ 'ఫతాహ్-4'ను మంగళవారం విజయవంతంగా పరీక్షించింది. 750 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఇది కచ్చితంగా ఛేదించిందని సైన్యం ప్రకటించింది. అత్యాధునిక పరికరాలు, ఏవియానిక్స్, నావిగేషనల్ వ్యవస్థలు ఇందులో ఉన్నాయని తెలిపింది. శత్రువు క్షిపణ రక్షణ వ్యవస్థలను సైతం తప్పించుకునే సామర్థ్యం దీనికుందని పేర్కొంది. ఫతాహ్-4తో తమ ఆర్మీ రాకెట్ ఫోర్స్ కమాండ్ మరింత బలోపేతం కానుందని ఆర్మీ వెల్లడించింది.

తోడేలు దాడిలో వృద్ధ దంపతుల మృతి

బహ్రెయిచ్: ఉత్తరప్రదేశ్‌లో బహ్రెయిచ్ జిల్లాలో తోడేళ్ల దాడిలో వృద్ధ దంపతులు ప్రాణాలు కోల్పోయారు. కైసర్‌గంజ్ తహశీల్‌లోని మఝ్రా టొక్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి దాటాక ఘటన చోటుచేసుకున్నట్లుగా భావిస్తున్నారు. 60 ఏళ్ల వయస్సున్న ఖేదన్, మాణిక్య దంపతులు తమ పొలానికి కాపలాకు వెళ్లారు. అక్కడే ఉన్న గుడిసెలో నిద్రిస్తుండగా వారిపై దాడి జరిగిందని అటవీ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం గుడిసెలో ఇద్దరి ఛిద్రమైన మృత దేహాలను వీరి కుమరుడు గుర్తించాడన్నారు. ఆ తోడేలే మరో ముగ్గురిని గాయపర్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో, ఆ తోడేలును ఎలాగైనా బంధిస్తామని, వీలు కాకుంటే చంపేస్తామని చెప్పారు.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: ముంబై-న్యూఢిల్లీ ఇండిగో విమానానికి మంగళవారం ఉదయం బాంబు బెదిరింపు అందింది. సుమారు 200 మందితో టేకాఫ్ తీసుకున్న విమానంలో బాంబు పెట్టినట్లుగా కొద్దిసేపటికే బెదిరింపు అందింది. దీంతో, విమాన సిబ్బంది అధికారులు సమాచారం అందించారు. ఈ మేరకు ఢిల్లీ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ప్రకటించారు. ఉదయం 7.53 గంటలకు విమానం ల్యాండ్ కాగానే, ప్రయాణికులను కిందికి దించేసి ప్రొటోకాల్ ప్రకారం పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టారు.



ఢిల్లీలోని సీఆర్ పార్కు ప్రాంతంలో ఏర్పాటైన మంటపంలో మంగళవారం పూజలు చేస్తున్న ప్రధాని మోదీ



ఢిల్లీలో మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసిన సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠీ

హెచ్1బీకి 'లాటరీ' మంచిది కాదు

● 2026 ఫిబ్రవరి లోపు వీసా జారీలో ముఖ్యమైన మార్పులు
● అమెరికా వాణిజ్యశాఖ మంత్రి హోవార్డ్ లుట్నిక్

న్యూయార్క్: విదేశీ వృత్తి నిపుణులకు జారీచేసే హెచ్1బీ వీసాల జారీ విధానంలో 2026 ఫిబ్రవరి లోపు ముఖ్యమైన మార్పులు ఉంటాయని అమెరికా వాణిజ్యశాఖ మంత్రి హోవార్డ్ లుట్నిక్ తెలిపారు. ఈ వీసాల జారీలో ప్రస్తుతం పాటిస్తున్న 'లాటరీ'విధానం వచ్చే ఏడాది నుంచి ఉండకపోవచ్చని హింట్ ఇచ్చారు. ఇటీవల తాను ప్రపంచంలోనే అతిపెద్దవైన రెండు కంపెనీల ప్రతినిధులతో మాట్లాడినప్పుడు.. వాళ్లు కూడా హెచ్1బీ వీసాలకు లాటరీ విధానాన్ని పాటించటం సరైన ఆలోచన కాదని చెప్పినట్లు వెల్లడించారు. న్యూస్ నేషన్ అనే వార్తా సంస్థకు ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం చెప్పారు. హెచ్1బీ వీసా ఫీజును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచిన విషయం తెలిసిందే. దీనిపై అమెరికా లోపలా, వెలుపలా తీవ్ర ఆగ్రహం, ఆందోళన వ్యక్తంకావటంతో కొత్త వీసాల జారీకి మాత్రమే లక్ష డాలర్ల ఫీజు అని, అది కూడా ఒకేసారి అని ట్రంప్ యంత్రాంగం వివరణ ఇచ్చింది. అయితే, ఇంత ఫీజును నిర్ణయించటం మంచి ఆలోచన కాకపోవచ్చని లుట్నిక్ తాజాగా పేర్కొన్నారు. 'ఇంత భారం ప్రజలపై పడటం మంచిది కాదు. ముందుముందు ఈ వీసీల విధానం, జారీలో ముఖ్యమైన మార్పులు ఉంటాయని నేను భావిస్తున్నా. లాటరీ విధానం కొనసాగించాలా? ఉంటే అది ఎలా ఉండాలి? అనే అంశాలపై చర్చిస్తున్నారు. వచ్చే ఫిబ్రవరి నాటికి అది పరిష్కారమవుతుంది. అమెరికాలోకి వచ్చే అత్యంత నైపుణ్యం గల వ్యక్తులను లాటరీ ద్వారా ఎంపికచేయటం సరైన పద్ధతి కాదని టెక్ కంపెనీలు అంటున్నాయి. ఇది 1990 నుంచి కొనసాగుతోంది. ఈ విధానంలో మార్పులు ఉండొచ్చు. నిజానికి హెచ్1బీ వీసాల కోసం 7 నుంచి 10 రెట్లు దరఖాస్తులు వస్తున్నాయి. అందులో 70 శాతం టెక్ కన్సల్టెంట్లకు సంబంధించినవే. ఈ వీసాలు వారికోసమేనా? విద్య, వైద్య రంగంలో నాలుగు శాతమే హెచ్1బీ వీసాలు దక్కుతున్నాయి. తక్కువ వేతనాలున్న టెకీలు ఈ వీసాలతో దేశంలోకి వచ్చి, వారి కుటుంబాలను కూడా తీసుకొస్తున్నారు. ఇలాంటివారిని రానివ్వకూడదు. భారీగా వేతనాలున్నవారినే రానివ్వాలి'అని లుట్నిక్ స్పష్టంచేశారు.

బీజేపీతో దోస్తీ కన్నా సీఎం పదవి వదిలేయడం నయం

● ప్రభుత్వంలోకి బీజేపీని తీసుకుంటే రాష్ట్రహోదా ఇస్తామంటున్నారు
● అలా చేయటం కంటే సీఎం పదవి నుంచి తప్పుకోవటమే మంచిది
● జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: తన ప్రభుత్వంలోకి బీజేపీని భాగస్వామిగా చేర్చుకుంటే.. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కానీ ఆ పని చేయటం తనకు ఇష్టం లేదని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. బీజేపీతో దోస్తీ కట్టడం కంటే.. ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోవటమే తనకు ఇష్టమని స్పష్టంచేశారు. అనంత్‌నాగ్ జిల్లాలోని అచబల్‌లో మంగళవారం ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. 'మీరు (ప్రజలను ఉద్దేశించి) సిద్ధమైతే చెప్పండి.. ఈ వ్యాపారం (బీజేపీతో పొత్తు) చేయటం నాకు ఇష్టంలేదు. బీజేపీని ప్రభుత్వంలోకి తీసుకోవటం అవసరమని మీరు అనుకుంటే ముందు నా రాజీనామాను ఆమోదించండి. మరో ఎమ్మెల్యే సీఎం అయ్యి ప్రభుత్వాన్ని నడిపిస్తారు. బీజేపీతో పొత్తుకు నేను మాత్రం సిద్ధంగా లేను. మన ప్రభుత్వంలోకి బీజేపీని తీసుకొంటే మనకు ఒక బహుమతి లభించవచ్చు. వాళ్లు (కేంద్రం) మనకు త్వరలోనే రాష్ట్ర హోదా ప్రకటించవచ్చు'అని పేర్కొన్నారు. ప్రభుత్వంలో కశ్మీర్‌కు మాత్రమే ప్రాతినిధ్యం ఉందన్న వాదనను ఒమర్ అబ్దుల్లా తిరస్కరించారు. 'ప్రభుత్వంలో పిర్‌పంజాల్‌కు ప్రాతినిధ్యం ఉంది. దిగువ జమ్ము ప్రాంతానికి కూడా ప్రాతినిధ్యం ఉంది. జమ్మూ నుంచి ఉపముఖ్యమంత్రి ఉన్నారు'అని తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదాను శాంతియుత, ప్రజాస్వామ్యయుత పోరాటాలతోనే సాధించుకుంటామని స్పష్టంచేశారు.



శాక్యగా ప్రకటించిన అనంతరం కుమార్తెను ఎత్తుకుని, ఉద్వేగానికి లోనయిన తండ్రి

ఈ చిన్నారి.. 'కుమారి'..

నేపాల్‌కు కొత్త జీవన దేవత

● రెండున్నరేళ్ల బాలిక ఎంపిక
● సింహాసనాన్ని అధిష్టించిన ఆర్య తార శాక్య

కఠ్మాండు: నేపాల్‌లో కొత్త 'కుమారి' (జీవన దేవత)గా రెండున్నరేళ్ల చిన్నారి ఎంపికైంది. ఆర్య తార శాక్య మంగళవారం సంప్రదాయ 'కుమారి'సింహాసనాన్ని అధిష్టించింది. ఖాట్మండులోని తలేజు భవాని ఆలయ పూజారి ఉద్ధవ్ కర్మచార్య తెలిపిన వివరాలివి. మంగళవారం శుభ ముహూర్తంలో జరిగిన ప్రత్యేక వేడుకలో ఆర్య తార శాక్య.. అధికారికంగా ఖాట్మండు నగరం మధ్యలో ఉన్న బసంతాపూర్‌లోని కుమారి గృహంలోకి ప్రవేశించింది.

తొలి రుతుస్రావానికి ముందే ఎంపిక

కుమారిని శాక్య జాతి బాలికల నుండి ఎంపిక చేస్తారు. అయితే, బాలికకు మొదటి రుతుస్రావం (రజస్వల) కాకముందే ఈ ఎంపిక జరుగుతుంది. ఇంతకుముందు కుమారిగా ఉన్న బాలిక, తన 12వ ఏట మొదటి రుతుస్రావమయ్యాక ఆ బాధ్యతల నుండి ఇటీవల తప్పుకుంది. ప్రస్తుతం కుమారిగా ఎంపికైన బాలిక వయసు 2 ఏళ్ల 8 నెలలని పూజారి తెలిపారు. కుమారిగా అర్హత సాధించడానికి.. ఈ చిన్నారి కఠినమైన ఎంపిక ప్రక్రియను ఎదుర్కొంది.

ఎంపిక కఠినతరం

కుమారిగా ఎంపికయ్యే బాలికకు రుతుస్రావం కారాదు. శరీరంపై ఎలాంటి గీతలు లేదా గాయాలు ఉండకూడదు. అన్నిటి కన్నా నిర్భయంగా ఉండాలి. ఎంపిక ప్రక్రియలో భాగంగా, ఒక చీకటి గదిలో గేదె తల, భయంకరమైన ముసుగులను ఉంచుతారు. ఆ గదిలోంచి చిన్నారి భయపడకుండా బయటకు రావాలి. కొత్త కుమారిని కొద్ది రోజుల క్రితమే ఎంపిక కమిటీ ఎంపిక చేసింది. కుమారిని హిందువులు, బౌద్ధులు పూజిస్తారు. కుమారిని ఎంపిక చేసే శాక్య జాతిని బౌద్ధులుగా పరిగణించినప్పటికీ, కుమారిని మాత్రం హిందూ దేవతగా గౌరవిస్తారు. ఈ ద్వంద్వత్వం నేపాల్‌లో శతాబ్దాలుగా ఉన్న మత సామరస్యాన్ని సూచిస్తుంది.

500-600 ఏళ్ల క్రితం నుంచే..

ఈ జీవన దేవత లేదా కుమారిని పూజించే సంప్రదాయం.. మల్ల రాజుల పాలనలో సుమారు 500 నుండి 600 ఏళ్ల క్రితం మొదలైంది. అయితే, ఖాట్మండు ప్రధాన ప్రాంతాలలో కుమారిని ఒక ప్రత్యేక రథంపై ఊరేగించే సంప్రదాయం, 18వ శతాబ్దం మధ్యలో చివరి మల్ల రాజు జయప్రకాశ్ మల్ల కాలంలో ప్రారంభమైంది. ఈ సమయంలోనే కుమారి కోసం ప్రత్యేక గృహమైన కుమారి ఘర్ కూడా నిర్మితమైంది. ఖాట్మండులోని హనుమాన్‌ధోకలో కుమారిని తలేజు దేవత మానవ రూపంగా భావిస్తారు. ప్రస్తుతం ఈ జీవన దేవత ఖాట్మండులో విదేశీ పర్యాటకులకు ప్రధాన ఆకర్షణలలో ఒకటిగా మారింది. ఏటా ఆగస్టులో వచ్చే ఇంద్ర జాతర పండుగ సందర్భంగా, నేపాల్ అధ్యక్షుడు జీవన దేవతను పూజించి, ఆమె ఆశీర్వాదం పొందే సంప్రదాయం కూడా ఉంది.

ప్రాథమిక హక్కులను రద్దు చేసే అధికారం ఎవరికి ఉంది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక హక్కులు- విమర్శనాత్మక పరిశీలన

ప్రాథమిక హక్కుల్లో ఆర్థిక పరమైన హక్కులను గుర్తించలేదు. ఉదాహరణకు పని హక్కు, విశ్రాంతి హక్కు, సామాజిక భద్రతా హక్కులను ప్రాథమిక హక్కుల్లో పొందుపరచలేదు.

మితిమీరిన పరిమితులు

'మూడో భాగంలో ఆరు ప్రాథమిక హక్కులుంటే రెట్టింపు సంఖ్యలో పరిమితులున్నాయి. ఒకవైపు హక్కులు కల్పిస్తూ మరోవైపు పరిమితులు విధించడం సమంజసం కాదు' అని విమర్శకులు అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని మూడో భాగం ప్రాథమిక హక్కుల జాబితా కాదని, ప్రాథమిక హక్కులపై పరిమితుల జాబితా అని జస్వంత్‌రాయ్ కపూర్ అనే రచయిత వ్యాఖ్యానించారు. ఒక చేత్తో హక్కులిచ్చి మరో చేత్తో వాటిని తీసుకునే విధంగా హక్కులున్నాయని ప్రఖ్యాత రాజ్యాంగ నిపుణుడు ఎం.సి. చాగ్లా వ్యాఖ్యానించారు.

స్పష్టత లేకపోవడం, కఠిన పదజాలం

ప్రాథమిక హక్కుల్లో ఉపయోగించిన భాష సంక్లిష్టంగా ఉంది.దీంతో ఇది సామాన్యులకు అర్థం కాదు. దీన్ని అర్థం చేసుకోవడం న్యాయకోవిదులకు కూడా తేలిక కాదు. భారత రాజ్యాంగం న్యాయవాదుల స్వర్గం అన్న ఐవర్ జెన్నింగ్స్ విమర్శ ఒక్క ప్రాథమిక హక్కులతోనే రుజువు అవుతుంది.

ఆస్తి హక్కు- తొలగింపు

మౌలిక రాజ్యాంగంలో ఉన్న ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. దీంతో ప్రాథమిక హక్కుల స్థాయిని తగ్గించినట్లయింది. అత్యవసర పరిస్థితి సమయంలో ప్రాథమిక హక్కులు రద్దవుతాయి. నివారక నిర్బంధ చట్టాల ఆధారంగా ప్రాథమిక హక్కులపై పరిమితులు విధించవచ్చు. రాజకీయ ప్రయోజనాలు, కక్ష సాధింపులకు ఇది ఆస్కారం కల్పిస్తోంది. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య వివాదాలు ఏర్పడవచ్చు. అది శాసన, న్యాయ వ్యవస్థల మధ్య ఘర్షణ వైఖరికి దారితీసే అవకాశముంది.

అత్యవసర పరిస్థితి-హక్కుల రద్దు

జాతీయ అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో ప్రాథమిక హక్కులను రద్దు చేయవచ్చు. దీంతో ప్రజల స్వేచ్ఛకు, హక్కులకు రక్షణ ఉండదు. ప్రాథమిక హక్కులపై విమర్శ ఉన్నప్పటికీ, వాటి ప్రాముఖ్యతను, విలువను విస్మరించలేం. ఇవి వ్యక్తి స్వేచ్ఛకు మూలాలు. వ్యక్తి వికాసానికి అనివార్యమైనవి. వ్యక్తులు నైతికంగా, భౌతికంగా ఎదగడానికి ఇవి ఎంతో అవసరం. హక్కుల అమలు కేవలం న్యాయస్థానాల జోక్యం ద్వారానే కాకుండా పౌరుల చైతన్యం, అవగాహనపై కూడా ఆధారపడి ఉంటుంది. నిరంతర అప్రమత్తతే పై స్వేచ్ఛలకు మూలం అని జె.ఎస్.మిల్ అనే రాజనీతిజ్ఞుడు వ్యాఖ్యానించాడు.

ఇతర భాగాల్లో ఉన్న హక్కులు

మూడో భాగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులే కాకుండా రాజ్యాంగంలోని మరికొన్ని భాగాల్లో రాజ్యాంగ లేదా చట్టబద్ధమైన హక్కులున్నాయి. వీటినే ప్రాథమికేతర హక్కులు అంటారు.

ఉదాహరణలు:

- 12వ భాగంలోని ఆర్టికల్ 265 ప్రకారం చట్టపరమైన ఆధారం లేనిదే పన్నులు విధించరాదు.



- 12వ భాగంలో ప్రకరణ 300-ఎ ప్రకారం చట్టబద్ధంగా తప్ప మరే విధంగా వ్యక్తి ఆస్తికి భంగం కలిగించరాదు.
- 15వ భాగంలో ప్రకరణ 326 ప్రకారం వయోజన ఓటుహక్కును గుర్తించారు.

పై హక్కులకు కూడా న్యాయ సంరక్షణ ఉన్నప్పటికీ అవి ప్రాథమిక హక్కులతో సమానం కావు.

వీటి అమలు, రక్షణ కోసం ప్రకరణ-32 ప్రకారం సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదు. కానీ ప్రకరణ-226 ప్రకారం హైకోర్టు ద్వారా రక్షణ పొందవచ్చు.

రాజ్యాంగ సమీక్షా కమిషన్ సూచించిన ఇతర ప్రాథమిక హక్కులు

2000లో జస్టిస్ వెంకటాచలయ్య అధ్యక్షతన రాజ్యాంగ సమీక్ష కమిషన్‌ను నియమించారు. రాజ్యాంగంలోని మూడో భాగంలో ప్రాథమిక హక్కుల జాబితాలో కింద పేర్కొన్న హక్కులను కూడా పొందుపరచాలని ఈ కమిషన్ సిఫారసు చేసింది.

- పత్రికా స్వేచ్ఛ-సమాచార స్వేచ్ఛ
- క్రూరమైన శిక్షలకు వ్యతిరేకంగా రక్షణ
- పని హక్కు
- రహస్యాలను కాపాడుకునే హక్కు
- రక్షిత మంచినీరు
- పర్యావరణ హక్కు
- న్యాయం, న్యాయ సలహా పొందే హక్కు

ప్రాథమిక హక్కులు - ముఖ్య వివాదాలు సుప్రీంకోర్టు తీర్పులు

సజ్జన్ సింగ్ Vs రాజస్థాన్ -1964

ఈ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ సవరణ అధికారానికి సంబంధించిన వివాదాన్ని పరిశీలించింది. ఆస్తి హక్కుకు సంబంధించిన 17వ రాజ్యాంగ సవరణ రాజ్యాంగబద్ధమేనని ప్రకటించింది.

గోలక్‌నాథ్ Vs పంజాబ్ ప్రభుత్వం-1967

పంజాబ్ ప్రభుత్వం రూపొందించిన భూసంస్కరణ చట్టాన్ని ఈ కేసులో ప్రశ్నించారు. ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ప్రాథమిక హక్కులను సవరించాలంటే ప్రత్యేక రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ప్రకటించింది.

కేశవానంద భారతి Vs కేరళ ప్రభుత్వం-1973

ప్రాథమిక హక్కులను సవరించడానికి ఉద్దేశించిన 24, 25వ రాజ్యాంగ సవరణలను సుప్రీంకోర్టులో ప్రశ్నించారు. గోలక్‌నాథ్ కేసులో చెప్పిన తీర్పులకు విరుద్ధంగా ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. 'పార్లమెంటుకు ప్రాథమిక హక్కులను సవరించే అధికారం ఉంది. కానీ రాజ్యాంగ మౌలిక స్వరూపం మార్చరాదు' అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. మౌలిక స్వరూపం (Basic Structure) అనే పదాన్ని తొలిసారిగా ఈ సందర్భంలోనే సుప్రీంకోర్టు ప్రయోగించింది.

మినర్వా మిల్స్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా -1980

ఈ కేసులో 42వ రాజ్యాంగ సవరణను ప్రశ్నించారు. 'ప్రాథమిక హక్కులు రాజ్యాంగ స్వరూపంలో భాగం. వాటిని తగ్గించడం లేదా రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధం' అని సుప్రీంకోర్టు ప్రకటించింది. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని నిర్వచించింది.

ఇందిరా సహానీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా -1992

వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని ఈ కేసులో ప్రశ్నించారు.

ఉన్ని కృష్ణన్ Vs ఆంధ్రప్రదేశ్; మోహిని జైన్ Vs కర్ణాటక 1993

'ప్రాథమిక హక్కుల్లో విద్యాహక్కు లేకపోతే జీవించే హక్కుకు, వ్యక్తి గౌరవానికే అర్థం లేదు. ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించాలి' అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

- కింద పేర్కొన్న వాటిలో ఏ ప్రాతిపదికన సకారాత్మక వివక్షతను రాజ్యాంగం అనుమతించలేదు
  ఎ) విద్యాపరమైన వెనుకబాటు
  బి) సామాజిక వెనుకబాటు
  సి) ఆర్థిక వెనుకబాటు
  డి) ఏదీకాదు
  సమాధానం-సి
- 'న్యాయ సమీక్ష' ఏ ప్రభుత్వ లక్షణం?
  ఎ) ఏక కేంద్ర బి) సమాఖ్య
  సి) పార్లమెంటరీ డి) పైవన్నీ
  సమాధానం-బి
- కింది ఏ ప్రకరణను సుప్రీంకోర్టు ఉదారంగా వ్యాఖ్యానించి, దాని పరిధిని విస్తరించింది?
  ఎ) ప్రకరణ 32 బి) ప్రకరణ 13
  సి) ప్రకరణ 20 డి) ప్రకరణ 21
  సమాధానం-డి
- ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా రూపొందించిన చట్టాలను న్యాయస్థానాలు కొట్టివేస్తాయి. అయితే చట్టం అనే పదంలోకి రాని అంశం?
  ఎ) ఆర్డినెన్సులు బి) ఉపచట్టాలు
  సి) నోటిఫికేషన్లు డి) రాజ్యాంగ సవరణ
  సమాధానం-డి
- ప్రాథమిక హక్కులపై ఎలాంటి ప్రభావం చూపని అత్యవసర పరిస్థితి?
  ఎ) జాతీయ అత్యవసర పరిస్థితి
  బి) రాజ్యాంగ అత్యవసర పరిస్థితి
  సి) పై రెండూ డి) ఏదీకాదు
  సమాధానం-బి

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రాథమిక హక్కులు?
   ఎ) నిరపేక్షమైనవి
   బి) ప్రభుత్వ అధికారాలపై పరిమితులు
   సి) సవరణకు అతీతం
   డి) న్యాయ సమీక్షకు గురికావు
2. ప్రాథమిక హక్కులకు మరోపేరు?
   ఎ) న్యాయ సంరక్షణ ఉన్న హక్కులు
   బి) న్యాయ సంరక్షణ లేని హక్కులు
   సి) నైతిక హక్కులు డి) పౌర హక్కులు
3. కింద పేర్కొన్న ఏ కేసును ప్రాథమిక హక్కుల కేసుగా పరిగణిస్తారు?
   ఎ) గోలక్‌నాథ్ బి) కేశవానంద భారతి
   సి) మేనకా గాంధీ డి) మినర్వా మిల్స్
4. సుప్రీంకోర్టు ఏ కేసులో సహజీవన హక్కును ప్రస్తావించింది?
   ఎ) ఖుష్బూ బి) అరుణా రాయ్
   సి) అరుంధతీరాయ్ డి) విశాఖ
5. ఒక వ్యక్తి నిర్బంధం చట్టబద్ధమైందా? కాదా? అని విచారించడానికి ప్రభుత్వం అమలు చేసే న్యాయబద్ధమైన పరిహారం?
   ఎ) హెబియస్ కార్పస్ బి) సెర్షియోరరి
   సి) మాండమస్ డి) కోవారెంటో
6. ప్రాథమిక హక్కులను రద్దు చేసే అధికారం ఎవరికి ఉంది?
   ఎ) సుప్రీంకోర్టు బి) రాష్ట్రపతి
   సి) ప్రధాన మంత్రి డి) పార్లమెంటు
7. రాజ్యాంగంలోని ఏ నిబంధన ప్రకారం ఒక వ్యక్తి ప్రాథమిక హక్కుల ఉల్లంఘనపై సుప్రీంకోర్టుకు అప్పీల్ చేయవచ్చు?
   ఎ) ఆర్టికల్-13 బి) ఆర్టికల్-32
   సి) ఆర్టికల్-14 డి) ఆర్టికల్-34
8. ఏ ప్రాథమిక హక్కును రాజ్యాంగానికి ప్రాణం, ఆత్మ, హృదయం అని అంబేడ్కర్ వర్ణించారు?
   ఎ) సమానత్వ హక్కు బి) స్వాతంత్ర్య హక్కు
   సి) పీడనాన్ని నిరోధించే హక్కు
   డి) రాజ్యాంగ పరిహార హక్కు
9. అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించమని ఆదేశించే రిట్?
   ఎ) హెబియస్ కార్పస్ బి) మాండమస్
   సి) సెర్షియోరరి డి) కోవారెంటో
10. ప్రాథమిక హక్కుల్లో సాంస్కృతిక, విద్యా హక్కుల ఉద్దేశం?
   ఎ) నిరక్షరాస్యతను రూపుమాపడం
   బి) ఒకే సంస్కృతిని రూపొందించడం
   సి) అల్పసంఖ్యాక వర్గీయుల సంస్కృతిని సంరక్షించడానికి సహాయపడటం
   డి) భారతదేశ సంస్కృతిని సంరక్షించడానికి ఇది సహాయపడదు.
11. ఆర్థిక సమానత్వాన్ని కల్పించేవి?
   ఎ) ప్రాథమిక హక్కులు
   బి) అవతారిక సి) ఆదేశిక సూత్రాలు
   డి) ప్రాథమిక విధులు
12. వార్తా ప్రచురణ హక్కును కల్పించే ఆర్టికల్?
   ఎ) 14 బి) 21 సి) 32 డి) 19
13. చట్టాల సమాన రక్షణను ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు?
   ఎ) బ్రిటన్ బి) అమెరికా
   సి) ఐర్లాండ్ డి) ఆస్ట్రేలియా
14. ఏ ప్రకరణ ప్రకారం జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం చేశారు?
   ఎ) ప్రకరణ 21 జీవించే హక్కులో భాగంగా ఆరోగ్యకరమైన పర్యావరణ హక్కు
   బి) ప్రకరణ 48 ఆదేశిక నియమం
   సి) ప్రకరణ 275 షెడ్యూల్డ్ ప్రాంతాలకు ప్రత్యేక ప్రతిపత్తి
   డి) ఏదీకాదు
15. విద్యాహక్కు చట్టం ఏ స్థాయి విద్యార్థులకు ఉపయోగపడుతుంది?
   ఎ) అన్ని స్థాయిల విద్యార్థులకు
   బి) కళాశాల విద్యార్థులకు
   సి) సీనియర్ సెకండరీ స్థాయి విద్యార్థులకు
   డి) 14 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులకు
16. చట్టం వల్ల సమాన రక్షణ అంటే?
   ఎ) ప్రత్యేక రక్షణ
   బి) సమాన అవకాశాలు
   సి) అసమానతను తగ్గించడం
   డి) పైవన్నీ
17. ప్రాథమిక హక్కులు ఎవరికి వర్తించవు?
   ఎ) ప్రభుత్వ చర్యలకు
   బి) న్యాయస్థాన చర్యలకు
   సి) ప్రైవేట్ వ్యక్తుల చర్యలకు
   డి) పైవన్నీ
18. నేరారోపణ ఎదుర్కొనే వ్యక్తిని బలవంతంమీద నేరం ఒప్పించడాన్ని ఏమంటారు?
   ఎ) సెల్ఫ్ ఇన్‌క్రిమినేషన్ బి) డబల్ జపార్డీ
   సి) ఎక్స్ పోస్ట్ లా డి) పైవేవీ కాదు
19. ప్రాథమిక హక్కులను అమలుపరచడంలో పార్లమెంటు కొన్ని వర్గాలపై ప్రత్యేక పరిమితులు విధించవచ్చు. ఆ వర్గాలు?
   ఎ) రక్షణ దళాలు బి) నేరస్థులు
   సి) విదేశీయులు డి) నిందితులు
20. కింద పేర్కొన్న వాటిలో వ్యక్తిగత స్వేచ్ఛలపై పరిమితులు?
   ఎ) శాంతి భద్రతలు బి) దేశ రక్షణ
   సి) నైతిక ప్రవర్తన డి) పైవన్నీ
21. కింది ఏ వర్గానికి ప్రాథమిక హక్కుల్లో ప్రస్తావన లేదు?
   ఎ) వికలాంగులు బి) మహిళలు
   సి) ఆర్థికంగా వెనుకబడినవారు డి) ఎ, సి

సమాధానాలు

1) బి 2) ఎ 3) బి 4) ఎ 5) ఎ
6) బి 7) బి 8) డి 9) బి 10) సి
11) సి 12) డి 13) బి 14) ఎ 15) డి
16) డి 17) సి 18) ఎ 19) ఎ 20) డి
21) డి

కణాంతర జీర్ణక్రియలో ఎంజైములు ఉన్న భాగం?

జంతువుల్లో పోషణ

జంతువులు వాటి ఆహారాన్ని అవి తయారు చేసుకోలేవు. ఆహారం కోసం ఇతర జీవులపై ఆధారపడతాయి. అందువల్ల వీటిని పరపోషకాలు అంటారు. పరపోషకాలు రెండు రకాలు అవి.. పూతికాహారులు, జాంతవ భక్షకులు

- నీటిలో కరిగిన ఆహార పదార్థాలను శరీర ఉపరితలం ద్వారా పీల్చుకోవడాన్ని పూతికాహార విధానం అంటారు. **ఉదా:** కొన్ని రకాల ప్రోటోజోవన్‌లు, పరాన్నజీవులు.
- జంతువుల్లో ఎక్కువశాతం ఘన, ద్రవ, ఆహార పదార్థాలను ప్రత్యేక సేకరణ యంత్రాంగాల సహాయంతో తీసుకుని జీర్ణరసాల ద్వారా జీర్ణం చేసుకుంటాయి. దీన్ని జాంతవ భక్షణం అంటారు.
- అమీబా మిథ్యాపాదాలు, హైడ్రా స్పర్శకాల ద్వారా ఆహారాన్ని సేకరించి ముక్కలు చెయ్యకుండా ఒకేసారి మింగుతాయి.
- నత్త రాడ్యులా (నాలుక)తో ఆహారాన్ని చిన్న చిన్న రేణువుల రూపంలో మింగు తుంది.
- తేళ్లు, సాలీళ్లు భక్షకాన్ని చంపి దాని శరీరంలోకి జీర్ణరసాలను వదిలి జీర్ణమైన ద్రవరూప ఆహారాన్ని తీసుకుంటాయి.
- సీతాకోకచిలుకలు గొట్టం వంటి తొండంతో పుష్పాల మకరందాన్ని పీల్చుకుంటాయి.
- జలగ రక్తాన్ని ఆహారంగా తీసుకుంటుంది. రక్తం గడ్డకట్టకుండా ఉండేందుకు కొన్ని పదార్థాలను జీవి రక్తంలోకి విడుదల చేస్తుంది.
- కొన్ని జీవులు ఒకే రకమైన ఆహారాన్ని తీసుకుంటాయి. వీటిని ఏక రక భక్షక జీవులు అంటారు. ఉదా: పట్టుపురుగు (గొంగళిపురుగు దశలో) మల్బరీ ఆకులను మాత్రమే తింటుంది.
- కొన్ని జంతువుల్లో ఆడ, మగ జీవులు వేర్వేరు ఆహారాన్ని తీసుకుంటాయి. **ఉదా:** మగదోమ చెట్టు నుంచి రసాలను, ఆడదోమ మనిషి రక్తాన్ని ఆహారంగా తీసుకుంటాయి.
- ఆహారంలో ఉండే క్లిష్టమైన స్థూల ఆహార అణువులను సరళమైన అణువులుగా మార్చడాన్ని జీర్ణక్రియ అంటారు.
- జీర్ణవ్యవస్థ గోడల్లో ఉండే గ్రంథి కణాలు ఎంజైములను విడుదల చేస్తాయి. ఈ ఎంజైములు జీర్ణక్రియ రసాయనిక చర్య లను వేగవంతం చేస్తాయి. ఎంజైములు ఉత్ప్రేరకాల్లా పనిచేస్తాయి.
- ఉన్నతస్థాయి బహుకణ జీవుల్లో జీర్ణవ్య వస్థ అంతర్భాగాల్లోని కణాల బయట జీర్ణక్రియ జరుగుతుంది. దీన్ని కణబాహ్య జీర్ణక్రియ అంటారు.
- ప్రోటోజోవా వంటి ఏకకణ జీవుల్లో కణం లోపల ఆహార రిక్తికలోనికి విడుదలైన ఎంజైముల వల్ల జీర్ణక్రియ జరుగుతుంది. దీన్ని కణాంతర జీర్ణక్రియ అంటారు.
- బహుకణ జీవుల్లో కూడా కణాంతర జీర్ణక్రియ కొంతవరకు జరుగుతుంది. లైసోజోమ్‌లు ఈ జీర్ణక్రియలో ఎంజైము లను విడుదల చేస్తాయి.
- ఎంజైములు చైతన్యవంతంగా ఉండాలంటే సరైన పీహెచ్ (హైడ్రోజన్ గాఢత) ఉష్ణోగ్రత అవసరం.
- పెప్సిన్ చైతన్యరహిత రూపం పెప్సినోజన్. కైమోట్రిప్సిన్ చైతన్యరహిత రూపం కైమోట్రిప్సినోజన్.



నెమరువేసే జంతువుల్లో జీర్ణక్రియ

- ఆవు, ఎద్దు, గేదె, మేక వంటి పెంపుడు జంతువులు శాకాహారులు. ఇవి మొక్కలను తింటాయి. కాబట్టి వృక్షకణంలో తయారైన సెల్యులోజ్‌ను ఆహారంగా తీసు కుంటాయి. సెల్యులోజ్ అనేక గ్లూకోజ్ అణువులతో తయారైన పాలిసాకరైడ్.
- సెల్యులేస్ అనే ఎంజైము సెల్యులోజ్‌ను జీర్ణం చేస్తుంది.
- జంతువుల్లో కొన్ని కశాభజీవులు బ్యాక్టీరియా జీర్ణవ్యవస్థలో ఉండి సెల్యు లేస్‌ను ఉత్పత్తి చేస్తాయి. అంటే ఈ జంతు వుల్లో కశాభజీవులు, బ్యాక్టీరియా జీర్ణ వ్యవస్థలో ఉండి సహజీవనం చేస్తాయి.
- శాకాహారుల్లో కుంతకాలు (కత్తెర పళ్లు) బాగా అభివృద్ధి చెంది ఉంటాయి.
- నెమరువేసే జీవుల్లో జీర్ణాశయం పెద్దగా నాలుగు గదుల్లో ఉంటుంది. అవి ప్రథమ అమాశయం, జాలకం, తృతీయ, చతుర్థ అమాశయాలు.
- ప్రథమ అమాశయం అతి పెద్ద గది. ఇందులో అతి ఎక్కువ (వేల సంఖ్యలో) సెల్యులోజ్‌ను ఉత్పత్తి చేసే సూక్ష్మజీ వులుంటాయి. తృతీయ అమాశయంలో నీరు, బై కార్బొనేట్లు శోషణ చెందుతాయి.
- చతుర్థ అమాశయంలో ఆమ్లం విడుదలై సూక్ష్మ జీవులను చంపుతుంది. ప్రొటీన్ల నిర్మాణాన్ని విడగొడుతుంది. దీన్ని విస్వా భావకరణం అంటారు.
- పేగులో జీర్ణక్రియ పూర్తయిన తర్వాత జీర్ణమైన ఆహారపదార్థాలు శోషణ చెందుతాయి.
- గ్లూకోజ్ కిణ్వప్రక్రియ చెందడం వల్ల నెమరు వేసే జంతువుల్లో ప్రొపియోనిక్, బ్యూటిరిక్ వంటి కొవ్వు ఆమ్లాలు ఏర్పడతాయి.
  ఈ క్రియలో సూక్ష్మజీవుల శరీర నిర్మాణానికి, ఇతర కార్యకలాపాలకు కావలసిన శక్తి లభిస్తుంది.
- లాలాజలంలో ఉండే బై కార్బొనేట్ ఆమ్లా న్ని తటస్థీకరణం చేస్తుంది.
- నెమరువేసే జంతువుల్లో ఇతర జంతువుల రక్తంలో కంటే తక్కువ మొత్తంలో గ్లూకోజ్ కన్పిస్తుంది.
- కుందేళ్లు శాకాహారులు కానీ, నెమరువేసే జంతువులు కాదు. ఇవి రెండు రకాల మల పదార్థాన్ని విసర్జిస్తాయి. మెత్తగా బూడిద రంగులో ఉండే పాక్షికంగా జీర్ణమైన సెల్యులోజ్ కలిగిన మల పదార్థాన్ని కుందేలు తిరిగి తింటుంది. దీన్ని మల కబళనం అంటారు.
- కొన్ని శాకాహారుల్లో ఉండూకం(అపెండిక్స్) సెల్యులోజ్ జీర్ణక్రియకు ఉపయోగ పడుతుంది.
- కుందేలులో రెండు దవడలపైన, ద్వికో డాంట్, విషమదంతి, ద్వివారదంతి రకపు దంతాలుంటాయి. కుంతకాలుండవు. 3 రకాల దంతాలు మాత్రమే ఉంటాయి.

మాదిరి ప్రశ్నలు

1. తేలు, సాలీడు భక్షకానికి సంబంధించి సరైంది?
   1) పూతికాహార సేకరణ
   2) రాడ్యులాతో ఆహారాన్ని తినటం
   3) భక్షకాన్ని చంపి దాని శరీరంలోకి జీర్ణరసాలను వదలడం
   4) పొడవైన గొట్టంతో ఆహారాన్ని పీల్చడం
2. జీవుల రక్తాన్ని పీల్చేముందు రక్తం గడ్డకట్ట కుండా దానిలోకి పదార్థాలను విడుదల చేసే జీవి?
   1) తేలు 2) మగ ఈగ
   3) మగ ఎనాఫిలస్ దోమ 4) జలగ
3. ఏక రక భక్షక జీవులకు ఉదాహరణ?
   1) బొద్దింక
   2) పట్టుపురుగు(గొంగళిపురుగు దశలో)
   3) కప్ప టాడ్‌పోల్
   4) చిట్టెలుక
4. కణాంతర జీర్ణక్రియలో ఎంజైములు ఉన్న భాగం?
   1) రిక్తిక 2) కేంద్రకం
   3) లైసోజోమ్ 4) రైబోజోమ్
5. జీర్ణక్రియలోని ఎంజైములకు సంబంధించి సరికానిది?
   1) ఎంజైములు ఉత్ప్రేరకాలుగా పని చేస్తాయి
   2) ఎంజైములను హైడ్రోలేసులుగా పిలుస్తారు
   3) ఎంజైములు జీర్ణరసాల్లో ఉంటాయి
   4) ఎంజైములు జీర్ణక్రియలోని రసాయ నిక చర్యలో పాల్గొంటాయి
6. కిందివాటిలో ఎంజైమ్ చైతన్యరహిత రూపా న్ని తెలియజేసేది?
   1) ట్రిప్సిన్ 2) ట్రిప్సినోజన్
   3) పెప్సిన్ 4) కైమోట్రిప్సిన్
7. జీర్ణక్రియ ఎంజైములను హైడ్రోలేసులు అని కూడా అంటారు. ఎందుకు?
   1) జీర్ణక్రియ చర్యల్లో పాల్గొనకుండా చర్యావేగాన్ని పెంచుతాయి.
   2) సరళసమ్మేళనాలను సంక్లిష్ట అణువులుగా మారుస్తాయి
   3) క్లిష్టమైన అణువుల మధ్య ఉండే రసాయన బంధాలను నీటి అణువును చేర్చి విడగొడతాయి
   4) రసాయన చర్యలను ఆమ్ల మాధ్యమంలో ఉండే ఆహార పదార్థాల్లోనే జరుపుతాయి
8. ఎమైలేసస్ అనేవి చర్య జరపటానికి కావలసిన అధస్తరం?
   1) పిండి పదార్థాలు 2) కొవ్వులు
   3) మాంసకృత్తులు
   4) విటమిన్‌లు
9. శాకాహారుల్లో సెల్యులోజ్ జీర్ణక్రియకు సంబంధించి సరైన ప్రవచనం?
   1) నెమరువేయడం వల్ల సెల్యులోజ్ జీర్ణక్రియ జరుగుతుంది
   2) జీర్ణాశయం నాలుగు గదులుగా ఉండటం వల్ల సెల్యులోజ్ జీర్ణం అవుతుంది.
   3) సెల్యులోస్ జీర్ణక్రియకు కశాభజీవుల, బ్యాక్టీరియా సహాయాన్ని తీసుకుంటాయి
   4) సెల్యులోజ్ జీర్ణక్రియలో ఒక శాకాహారి మరొక శాకాహారికి ఉపయోగపడుతుంది
10. ఆవు ఏ జీర్ణాశయ గదిలో విస్వాభావ కరణం జరుగుతుంది?
   1) చతుర్థ అమాశయం
   2) తృతీయ అమాశయం
   3) ప్రథమ అమాశయం
   4) ద్వితీయ అమాశయం
11. ఆవు జీర్ణాశయంలోని తృతీయ అమా శయంలో జరిగే రెండు చర్యలు ఏవి?
   ఎ) ఎంజైముల వల్ల ప్రొటీన్ల జీర్ణక్రియ జరుగుతుంది
   బి) ఆహారం బాగా చిక్కగా అవుతుంది
   సి) నీరు, బైకార్బొనేట్లు శోషణచెందుతాయి
   డి) ఆహారంలో సెల్యులోజ్, ఇతర పదా ర్థాల మీద విశ్లేషక చర్యలు జరుగుతాయి
   1) ఎ,సి 2) బి, సి
   3) ఎ, డి 4) బి, డి
12. ఆవు జీర్ణాశయంలోని సూక్ష్మజీవులకు శరీర నిర్మాణం, ఇతర కార్యకలాపాలకు కావలసిన శక్తి ఏ ప్రక్రియల ద్వారా లభిస్తుంది?
   1) విస్వాభావకరణం 2) శోషణ ప్రక్రియ
   3) కిణ్వప్రక్రియ 4) మలకబళనం

సమాధానాలు

1) 3 2) 4 3) 2 4) 3 5) 4
6) 2 7) 3 8) 1 9) 3 10) 1
11) 2 12) 3

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆవు ప్రథమ అమాశయంలో సెల్యులోజ్ నుంచి ఏర్పడిన గ్లూకోజ్‌లో కలిగే మార్పు? (డీఎస్సీ 2008)
   1) ఇంధనంగా ఉపయోగపడుతుంది
   2) కిణ్వప్రక్రియ ద్వారా సారాయిగా మారుతుంది
   3) శోషణం చెందుతుంది
   4) కిణ్వప్రక్రియ ద్వారా కొవ్వు ఆమ్లాలుగా మారుతుంది.
2. కొన్ని జంతువుల్లో కనిపించే మల కబళనం అనే ప్రక్రియ? (డీఎస్సీ 2008)
   1) పాక్షికంగా జీర్ణమైన కొవ్వులను గ్రహించడానికి
   2) పాక్షికంగా జీర్ణమైన ఖనిజ లవణాలను గ్రహించడానికి
   3) పాక్షికంగా జీర్ణమైన సెల్యులోజ్‌ను గ్రహించడానికి
   4) పాక్షికంగా జీర్ణమైన మాంస కృత్తులను గ్రహించడానికి
3. ఆవు, గేదె వంటి నెమరువేసే జంతువుల జీర్ణశయంలో సెల్యులోజ్‌ను ఉత్పత్తి చేసే సూక్ష్మజీవులు ఎక్కువగా ఉండే భాగం? (డీఎస్సీ 2008)
   1) తృతీయ అమాశయం
   2) చతుర్థ అమాశయం
   3) ప్రథమ అమాశయం
   4) ద్వితీయ అమాశయం
4. లాలాజలం లక్షణం? (డీఎస్సీ 2001)
   1) క్షారం, ఆమ్లం 2) కొద్దిగా క్షారం
   3) పూర్తిగా నీరు కల్గి ఉంటుంది
   4) కొద్దిగా ఆమ్లం
5. సోడియం కొలేట్, సోడియం డీ ఆక్సీ కొలేట్ అనేవి? (డీఎస్సీ 2006)
   1) పైత్యరస లవణాలు
   2) పైత్యరస వర్ణకాలు
   3) క్లోమరస లవణాలు
   4) క్లోమరస వర్ణకాలు
6. మానవునిలో సంవరణీ కండరాలు వ్యాకోచించినప్పుడు? (డీఎస్సీ 2006)
   1) జీర్ణక్రియ వల్ల ఏర్పడ్డ అంత్య ఉత్పన్నకాలు పేగులో శోషణమవుతాయి
   2) కొవ్వులు జీర్ణమవుతాయి
   3) జీర్ణక్రియ అంత్య ఉత్పన్నకాలను చూషకాలు పీల్చుకుంటాయి
   4) మలం పాయువు ద్వారా విసర్జితమవుతుంది
7. కైమ్ ఏ స్థితిలో ఉంటుంది? (డీఎస్సీ 2004)
   1) క్షారంగా, ఆమ్లంగా 2) ఆమ్లస్థితి
   3) క్షారస్థితి 4) సమతౌల్యస్థితి
8. మ్యూసిన్ అనే శ్లేష్మ పదార్థాన్ని స్రవించేది? (డీఎస్సీ 2004)
   1) అధోజంబిక 2) అధోజిహ్వక
   3) జఠర గ్రంథులు
   4) పెరోటిడ్ గ్రంథులు
9. రెనిన్ అనే ఎంజైము? (డీఎస్సీ 2004)
   1) కొవ్వులను కొవ్వు ఆమ్లాలుగా మారుస్తుంది
   2) అమైనో ఆమ్లాలను ప్రొటీన్లుగా మారుస్తుంది
   3 పిండి పదార్థాన్ని మాల్టోజ్‌లుగా మారుస్తుంది
   4) పాలను పెరుగుగా మారుస్తుంది
10. పెరిస్టాల్టిక్ చలనాలు ఉన్న మానవుని జీర్ణ మండలంలోని భాగం? (డీఎస్సీ 2004)
   1) జీర్ణాశయం 2) ఆంత్రమూలం
   3) కాలేయం 4) ఆహార వాహిక

సమాధానాలు

1) 4 2) 3 3) 4 4)2 5) 3
6) 4 7) 2 8) 3 9) 4 10) 4

మహా జనపదాల్లోని ఏకైక దక్షిణ భారత రాజ్యం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

షోడశ మహాజనపదాలు

క్రీ.పూ. 6వ శతాబ్దానికి భారతదేశ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానముంది. ఈ కాలంనాటి రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితుల ప్రభావం భారతదేశ చరిత్రపై ఎక్కువగా ఉంది. ఈ కాలాన్ని మహా జనపదాల యుగం, బుద్ధ యుగం, రెండో నగరీకరణ యుగం, మౌర్యుల పూర్వ యుగమని పలుపేర్లతో పిలుస్తున్నారు. దీనికి కారణం..దేశ చరిత్రలోనే తొలిసారిగా వేద కాలపు తెగ ఆధారిత జనపదాలకు భిన్నంగా, ప్రాంతం ఆధారిత మహాజనపదాలు (ప్రాదేశిక రాజ్యాలు) ఏర్పడ్డాయి. ప్రపంచ మతంగా ఉన్న బౌద్ధమత స్థాపకుడు బుద్ధుడు జీవించిందీ, తన సిద్ధాంతాలను ప్రచారం చేసిందీ ఈ కాలంలోనే. సింధూ నాగరికత పట్టణాల తర్వాత మళ్లీ నగరాలు ఆవిర్భవించింది కూడా ఈ కాలంలోనే. ఈ యుగం అంతం కాగానే క్రీ.పూ. 325లో మౌర్య సామ్రాజ్యం ఏర్పడింది. అందువల్ల దీన్ని మౌర్యుల పూర్వయుగం అని అంటారు.

మహాజనపదాల ఆవిర్భావం

ప్రపంచంలోని అత్యంత సారవంతమైన మైదానాల్లో ఒకటైన గంగామైదానం సాగులోకి రావడంతో పాటు ఈ కాలంలో విస్తృత స్థాయిలో ఇనుమును ఉపయోగించారు. కొత్త కొత్త పనిముట్లు అందుబాటులోకి వచ్చి వ్యవసాయంలో మిగులు ఏర్పడింది. దీనివల్ల వ్యాపార వాణిజ్యాలు, నగరాలు అభివృద్ధి చెందాయి. పన్నుల వ్యవస్థకు అవకాశం కలిగింది. ఈ పరిణామాలన్నీ కలిసి ఈ యుగం లో 16 పెద్ద ప్రాదేశిక రాజ్యాల ఏర్పాటుకు దారి తీశాయి. బౌద్ధ గ్రంథం అంగుత్తర నికాయలో ఈ 16 రాజ్యాల ప్రస్తావన ఉంది. అవి..

- **అంగ:** రాజధాని చంపా. దీని రాజు బ్రహ్మదత్తుడిని అంతం చేసి బింబిసారుడు ఈ రాజ్యాన్ని ఆక్రమించాడు.
- **కాశీ:** రాజధాని వారణాశి. ఇది వరుణ, ఆసి నదుల సంగమ ప్రాంతం.
- **కోసల:** దీని తొలి రాజధాని అయోధ్య. మలి రాజధాని శ్రావస్తి. ఈ రాజులు కాశీని ఆక్రమించుకొన్నారు. ఈ రాజ్యం చివరికి మగధలో విలీనమైంది.
- **వజ్జి:** వైశాలి రాజధాని. ఇది 8 గణ రాజ్యాలతో కూడిన సమాఖ్య. వైశాలి రాజు చేతకుని కుమార్తె చెల్లనను బింబిసారుడు వివాహం చేసుకున్నాడు. ఈ రాజ్యాన్ని చివరికి అజాతశతృవు అంతం చేశాడు.
- **మల్ల:** దీని రాజధానులు కుసినార, పావ. కుశినారలో బుద్ధుడు నిర్యాణం చెందితే, పావలో మహావీరుడు మరణించాడు. ఈ గణరాజ్యం బుద్ధుడిని బాగా ఆదరించింది. బుద్ధుని శిష్యులు ఆనందుడు, ఉపాలి మొదలైన వారు ఈ రాజ్యానికి చెందినవారే. పావలో సాంతాగార అనే శాసనసభ ఉండేది.
- **చేది:** రాజధాని సుక్తిమతి, ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్‌లో ఉంది.
- **వత్స:** దీని రాజధాని కౌశాంబి. దీని రాజు ఉదయనుడు. బౌద్ధమతాన్ని ఆదరిం చాడు. హర్షుని ప్రియదర్శిక, రత్నావళితో పాటు అనేక కథల్లో ఇతడు నాయకుడు.
- **పాంచాల:** దీని రాజధానులు అహిచ్ఛత్ర, కంపిల్య.
- **సౌరసేన:** దీని రాజధాని మధుర, గ్రీకు రచనల్లో ఈ రాజ్యాన్ని సౌరసేనాయ్‌గా, రాజధాని మేథోరాగా ప్రస్తావించారు.
- **మత్స్య:** దీని రాజధాని విరాట నగరం. ఈ రాజ్యం మగధలో కలిసిపోయింది.
- **కురు:** రాజధాని ఇంద్రప్రస్థ. ఆధునిక ఢిల్లీ పరిసరాల్లోని నగరం ఇది. 2వ రాజధాని హస్తినాపుర్
- **అస్సక/అస్మక:** రాజధాని పొదన లేదా పొటన. దీన్ని నేటి బోధన్‌గా భావి స్తున్నారు. ఇది షోడష మహాజనపదాల్లోని ఏకైక దక్షిణాది రాజ్యం. ఇది ఆంధ్ర, మహారాష్ట్రలకు విస్తరించి ఉంది.
- **అవంతి:** రాజధానులు ఉజ్జయిని, మహిష్మతి. బుద్ధుని సమకాలికుడైన అవంతి రాజు ప్రద్యోత లేదా చండ ప్రద్యోత మహాసేన. దీని చివరిరాజు నంది వర్ధ నుడిని ఓడించి మగధరాజు శిశునాగుడు ఈ రాజ్యాన్ని ఆక్రమించాడు.
- **గాంధార:** రాజధాని తక్షశిల. దీనిరాజు పుక్కుసతి లేదా పుష్కర సరీన్. బింబి సారుని వద్దకు రాయబారిని పంపాడు. ఈ రాజ్యాన్ని పర్షియన్లు ఆక్రమించుకున్నారు.
- **కాంభోజ:** రాజధాని రాజాపుర.
- **మగధ:** రాజగృహ (గిరివ్రజ) పాటలీపుత్ర రాజధానులు.

బుద్ధుని కాలానికి పైన పేర్కొన్న 16 జనపదాల్లో కేవలం నాలుగు రాజ్యాలు మాత్రమే ఉండేవి. అవి వత్స, అవంతి, కోసల, మగధ. మిగిలిన రాజ్యాలన్నీ ఈ నాలుగు రాజ్యాల్లో విలీనం అయ్యాయి. ఐతే క్రీ.పూ. 4వ శతాబ్దంలో ఈ నాలుగు రాజ్యాలు విలీనమై మగధ సామ్రాజ్యం అవతరించింది.

మగధను పాలించిన రాజవంశాలు: క్రీ.పూ.6వ శతాబ్దం నుంచి క్రీ.పూ. 4వ శతాబ్దం వరకు అంటే.. మౌర్య సామ్రాజ్యం ఏర్పడే వరకు మగధను మూడు రాజవంశాలు పాలించాయి.



హర్యాంక వంశం (544-413)

బింబిసారుడు : ఇతనితో ప్రారంభమైన మగధ సామ్రాజ్యవాదం అశోకుని కళింగ యుద్ధం వరకూ కొనసాగింది. బింబిసారుడు అంగను జయించి, తన కుమారుడు అజాత శత్రువును రాజ ప్రతినిధిగా నియమించాడు. కోసలరాజు ప్రసేనజిత్ చెల్లెలు కోసలదేవిని వివాహమాడి కాశీని పొందాడు. వైశాలీ లిచ్ఛవీ రాజు చేతకుని కుమార్తె చెల్లనను, పంజాబ్‌ను పాలించే మాద్రా రాకుమార్తె ఖేమాను వివాహమాడి పశ్చిమ ఉత్తర దిశలో రాజ్య విస్తరణ మార్గాన్ని సుగమం చేసుకొన్నాడు. ప్రధాన శత్రువు అయిన చండ ప్రద్యోత మహాసేనుడి వద్దకు బింబిసారుడు తన ఆస్థాన వైద్యుడు జీవకుడిని పంపి కామెర్ల వ్యాధి నుంచి విముక్తున్ని చేసి మిత్రునిగా చేసుకొన్నాడు. గాంధారరాజు పుష్కర సరీన్ కూడా తన రాయబారిని పంపి బింబిసారునితో స్నేహం కుదుర్చుకున్నాడు. బింబిసారుడు బుద్ధుని సమకాలికుడైనప్పటికీ ఏ మతాన్ని ఆదరించాడనే దానిపై స్పష్టత లేదు. బౌద్ధ, జైన మతాలు రెండూ ఇతన్ని తమ మతం వాడిగానే పేర్కొన్నాయి.

అజాతశతృవు: తండ్రిని హత్యచేసి సింహాసనాన్ని ఆక్రమించుకొన్నాడు. తీవ్రమైన సామ్రాజ్యవాద విధానాన్ని అవలంబించాడు.

కోసలరాజు, తన మేనమామ ప్రసేనజిత్‌కు వ్యతిరేకంగా అజాతశతృవు యుద్ధం చేశాడు. విజయం సాధించి కోసల రా కుమార్తెను వివాహం చేసుకోవడంతో పాటు కాశీని తిరిగి పొందాడు. వైశాలీ లిచ్ఛవుల నాయకత్వంలోని 36 రాజ్యాల కూటమికి వ్యతిరేకంగా 16 ఏళ్లు యుద్ధం చేసి విజయం సాధించాడు. ఇతడు తొలుత జైనాన్ని, తర్వాత బౌద్ధాన్ని స్వీకరించినట్లు తెలుస్తోంది. బుద్ధున్ని కలిసి తన తండ్రిని చంపిన నేరాన్ని అంగీకరించాడు. వీరి సమావేశ దృశ్యం బార్హుత్ శిల్పాల్లో చెక్కారు. ఇతని కాలంలో మొదటి బౌద్ధసంగీతి జరిగింది. అజాత శతృవుకు కునిక అనే బిరుదు ఉంది.

ఉదయనుడు: ఇతడు పాటలీ గ్రామంలోని గంగ, సోన్ నది సంగమ స్థానంలో కోటను నిర్మించాడు. దాంతో ఉదయనుడిని పాట లీపుత్ర నగర నిర్మాతగా చరిత్రకారులు భావిస్తున్నారు.

శిశునాగ వంశం (413-364)

శిశునాగుడు : ఉదయనుడి తర్వాత పితృ హంతకులు రాజులుగా వచ్చారు. వీరితో విసిగిపోయిన ప్రజలు కాశీలో రాజ ప్రతినిధిగా ఉన్న శిశునాగున్ని రాజుగా చేసినట్లు కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఇతడు రాజధానిని వైశాలికి మార్చాడు. అవంతి రాజు ప్రద్యోతను ఓడించి అవంతి రాజ్యాన్ని మగధలో కలిపివేయడం శిశునాగుని గొప్ప విజయం. దీనితో ఈ రాజ్యాల మధ్య వంద ఏళ్లుగా సాగిన వైరం అంతమైంది.

కాలిశోకుడు: ఇతడు రాజధానిని పాటలీ పుత్రానికి తిరిగి మార్చాడు. ఇతని కాలంలో రెండో బౌద్ధ సంగీతి జరిగింది. కాలిశోకుడిని సేనాపతి మహాపద్మనందుడు హత్యచేసి నంద వంశ స్థాపన చేశాడు.

నందవంశం: (364-321)

ఈ కాలంలో మగధను పాలించిన అత్యంత బలమైన వంశం ఇది.

మహాపద్మనందుడు: ఇతడు శూద్ర మహిళకు జన్మించినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. అనేక క్షత్రియ రాజ కుటుంబాలను రూపుమాపి రెండో పరశురామునిగా పేరుగాంచాడు. ఖారవేలుని హాతిగుంఫా శిలాశాసనం ప్రకారం ఇతడు కళింగను జయించి విజయచిహ్నంగా జైనతీర్థంకరుని విగ్రహం తెచ్చినట్లు తెలు స్తోంది. ఏకరాట్ అనే బిరుదును మహా పద్మనందుడు ధరించాడు.

ధననందుడు: మహాపద్మనందుడి తర్వాత అతని ఎనిమిదిమంది కుమారులు పాలిం చారు. వారిలో చివరివాడు ధననందుడు. ఇతనికి 2 లక్షల పదాతిదళం, 20 వేల అశ్వికదళం, 3 వేల గజదళం. 2 వేల రథ బలముండేది. అలెగ్జాండర్ సేనలు బియాస్‌ను దాటి భారత్‌పై దండెత్తక పోవడానికి ధననం దుడి బలసంపత్తి కూడా ఒక కారణం. ఐతే ఇతనికి మితిమీరిన ధన కాంక్ష ఉండేది. ప్రజలను పీడించి వారి మద్దతు కోల్పోయాడు. ఈ పరిస్థితులను అనువుగా చేసుకొని చంద్ర గుప్త మౌర్యుడు ఇతన్ని అంతమొందించి మౌర్య వంశ స్థాపన చేశాడు.

బుద్ధయుగంలోని గణతంత్ర రాజ్యాలు

ఈ కాలంనాటి పాలి గ్రంథాల్లో నాడు మనుగడలో ఉన్న కొన్ని గణతంత్ర రాజ్యాల ప్రస్తావన ఉంది. ఈ రాజ్యాల్లో కొన్ని షోడష మహాజనపదాల్లోనూ కన్పిస్తాయి.

- నాటి గణరాజ్యాల్లో కపిల వస్తు, కుసినగర, పావ, వైశాలి ప్రధానమైనవి.
- కపిలవస్తును శాక్యవంశం పాలించేది. ఇది భారత్- నేపాల్ సరిహద్దు రాజ్యం. బుద్ధుడు ఈ వంశానికి చెందినవాడు. కోసలరాజు విరుధకుడు ఈ రాజ్యాన్ని అంతం చేసి శాక్యాలను ఊచకోత కోశాడు.
- కుశినగర, పావ రాజధానులుగా మల్ల వంశం పాలించేది. అజాతశత్రువు ఈ రాజ్యాన్ని అంతం చేశాడు.

వైశాలీ రాజధానిగా లిచ్ఛావీలు పరిపాలించారు. వీరు స్వేచ్ఛా పిపాసులు. యుద్ధ పిపాసులు. అందువల్ల అజాతశత్రువుకు ఈ రాజ్యాన్ని ఆక్రమించేందుకు 15 ఏళ్లు పట్టింది. అజాతశత్రువు ఈ యుద్ధంలో విజయం సాధించినా లిచ్ఛావీలు తీవ్ర నష్టాన్ని కలుగజేసారు. వీరి సమావేశ మం దిరం పేరు సంతాగార, ఇందులో 7707 మంది ప్రతినిధులు పాల్గొనేవారని తెలుస్తోంది.

మాదిరి ప్రశ్నలు

1. షోడష మహా జనపదాల్లోని ఏకైక దక్షిణ భారత రాజ్యం?
   ఎ) అవంతీ　బి) అస్మక
   సి) కాంభోజ　డి) శౌరసేన
2. భారత దేశంపై దండెత్తిన తొలి విదేశీ పాలకుడు?
   ఎ) సైరస్　బి) డేరియస్-1
   సి) జెక్టెస్　డి) డేరియస్-3
3. కింది వారిలో అజాతశత్రువుకు సమకాలీనులు కానివారు?
   ఎ) బుద్ధుడు　బి) మహావీరుడు
   సి) మస్కరి గోషల పుత్రుడు
   డి) నాగసేనుడు
4. కింది రాజ్యాలు వాటి రాజధానుల్లో సరైన సమాధానాన్ని గుర్తించండి?

A	B
1. అంగ	a) తక్షశిల
2. గాంధార	b) చంప
3. కురు	c) మధుర
4. శౌరసేన	d) ఇంద్రప్రస్థ

	1	2	3	4
ఎ)	B	A	D	C
బి)	C	D	A	B
సి)	D	C	B	A
డి)	A	B	C	D

సమాధానాలు

1) బి　2) ఎ　3) డి　4)ఎ

Which of the following will be third..



ALPHABET AND ALPHA-NUMERIC-SYMBOL SEQUENCE

Questions on alphabet are based on the position of the letters of English Alphabet.

There are 26 letters in English Alphabet with 'A' - taking 1st position. 'B' - 2nd position and so on 'Z' takes the 26th position.

Similarly 'Z' takes the 1st posi tion, 'Y'-2nd position and so on 'A' takes the 26th position. So the sum of the positions of any letter from the left end and from the right end is equal to 27.

A candidate is advised to reme mber positions of letters from the left end and if the position is to be found from right end subtract its position from left end from 27.

(E.g. 1-5): Answer these questions on the basis of the following alphabets.

A B C D E F G H I J K L M N O P Q R S T U V W X Y Z

E.g.1: Four of the following are alike in regard to their group. Which is the one that does not belong to the group?
1) FE　2) ML　3) JK
4) VX　5) RS

SOL: All the pairs of letters except 'VX' occupy consecutive position in English alphabet. So 'VX' does not belong to the group.

E.g. 2: Which letter is 9th to the left of 9th letter from the right end.
1) J　2) K　3) H　4) M
5) None of these

SOL: The letter will be 9+9=18th from right end.
⇒ The same will be 27–18=9th from left end. But 9th letter from left = 'I'.

BANK EXAMS
REASONING

E.g. 3: If the above alphabets, are divided in two equal halves from A to M and N to Z, which letter in the latter half would be corres ponding to letter J?
1) Q　2) V　3) X　4) W
5) None of these

SOL: If the alphabet is divided into two halves the difference bet ween any letter of first half and corresponding letter of second half is equal to 13.
⇒ (Letter from second half)-(J) = 13
⇒ Letter from second half = 13 + J = 13 + 10 = 23 = W

E.g. 4: If the above alphabets, are written in the reverse order whi ch letter will be 12th to the left of 16th from left?
1) X　2) W
3) D　4) V
5) None of these

SOL: 12th to the left of 16th from left = 16–12 = 4th from left since the alphabets are written in reverse order. Z becomes 1st from left, Y becomes 2nd and so on.
4th letter from left = W.

E.g. 5: What should come in place of question mark(?) in the follow ing letter series?
BD　CEF　DFGH　?

SOL: In each set letters are written starting from B,C,D respectively. Moreover the number of letters written are 2, 3 and 4 respe ctively. In continuation the next set should start with E and should have 5 letters i.e. EGHIJ.

PRACTICE QUESTIONS

1. Which of the following will come in place of question mark (?) in the following series based on English alphabetical order? ZA BY XC DW ?
   1) VF 2) EU 3) UE 4) EV 5) VE

Ans: 5
The two letters in each set are last and first alphabets, second and second last, third last and third, fourth and fourth last. So the next set will be fifth last and fifth, i.e. VE

2. Which of the following will come in the place of the question mark (?) in the following series based on the English alphabetical or der?
   ZXWY TRQS NLKM ?
   1) HGFE　2) IGFH
   3) HFEG　4) EFGH　5) IFGH

Ans: 3
The order of letters in the series are jumbled starting with the last letter of the alphabet. After 4 letters from the reversing alphabet, two letters are left and the series again continues.
The order of the letters first, fourth, second and third.
The next letters will be H, G, F, E. i.e. HFEG

3. If each vowel in the word POLITE is changed to the next letter in the English alphabetical series and each consonant is changed to the previous letter in the English alphabetical series, and then the alphabets so for-med are arranged in alphabetical order from left to right, which of the following will be third from the left?
   1) O 2) P 3) J 4) K 5) None

Ans: 4
The vowels in the given word 'POLITE' are O, I, E and conson ants are P, L, T.
Applying the changes the word will be 'OPKJSF'.
Arranging in alphabetical order, F J K O P S.
The third letter from left will be 'K'.

4. How many meaningful English words can be formed with the letters 'NSIK' (starting with S) using all the letters but each letter only once in each word?
   I) None　2) One
   3) Two　4) Three
   5) More than three

Ans: 3
The meaningful words starting with 'S' will be SKIN and SINK.
Only two words can be formed.

5. Which of the following is exactly in the middle of the twentieth element from the left and the ninteenth element from the right of the English alphabetical seri es?
   1) S　2) T　3) M
   4) N　5) None

Ans: 4
Left position = 20 (T)
Right position = 19
Þ Left position = 27–19 = 8
Exactly middle letter =
$\frac{8+20}{2} = 14$
14th letter from left will be 'N'.

6. How many such pairs of letters are there in the word 'BARG AINED', each of which has as many letters between them in the word (in both forward and back ward directions) as they have bet ween them in the English alphabetical series?
   1) Two　2) Three
   3) None　4) One
   5) More than three

Ans: 5
For questions like this, the number of letters between a set of letters in the word should be same as in the English alphabetical series.
For example, in the alphabe tical series, between G and I there is 1 letter.
BARGAINED

Directions (7-10): Study the following arrangement carefully and answer the questions given below :
6 C R % K B H # X D 2 @ G A 8 S 5 P E 3 F 4 L 7 M 9 $ Q U

7. What will come in place of the question mark (?) based on the above series?
   RK%　#H　2G@　5EP ?
   1) LM7　2) M$9
   3) 7M9　4) 79M　5) M9$

Ans: 4
The series continues with a set of three letters. After first set one element (letter/number /symbol) is left, after second set two elements are left, after third set three elements are left. So after the fourth set leave four elements.
The next set of letters will be 79M.

8. Which of the following is sixth to the left of the fifteenth from the right end of the above arrangement ?
   1) X 2) D 3) # 4) 2 5) H

Ans: 1
Sixth to the left of the fifteenth from the right end = 6 + 15 = 21st from right end
Total = 30
L + R = T + 1
\ 21st from right end = (30 + 1) - 21 = 10th from left end = X

9. How many such consonants are there in the above arrangement which are immediately preceded by a symbol and imme diately followed by a vowel?
   1) One　2) Two
   3) Three　4) More than three
   5) None

Ans: 2
Required = Symbol-Consonant-Vowel (SCV)
@GA, $QU

10. Four of the following five are similar in a certain way based on their positions in the above arrangement and hence form a group. Which of the following that does not belong to the group?
   1) R%K　2) 7M9
   3) 5PE　4) H#X
   5) FL7

Ans:
FL7 is different.
In the first four options, all the three elements are in a sequence. But in the 5th option between F and L, there is one element.

Directions (11-15): Study the following arrangement carefully and answer the questions given below:
B U B D C E D B D E U B A D C B E A C D A E B A U A C D B C A C

11. How many such pairs of alphabets are there in the series of alphabets given in BOLD (A to E) in the above arrangement, each of which has as many letters between them (in both forward and backward directions) as they have between them in the English alphabetical series?
   1) None　2) One　3) Two
   4) Three　5) More than three

Ans: 5
A D C B E
There are 6 pairs.

12. Which of the following is the eighth to the left of the twentieth from the left end of the above arrangement?
   1) C 2) E 3) U 4) B 5) A

Ans: 4
eighth to the left of the twentieth from the left end = 20 - 8 = 12
Twelfth from the left = B

13. How many meaningful Fwords can be formed with the alphabets which are first, second, fifth and sixth from the left end of the above arrangement?
   1) None　2) One　3) Two
   4) Three　5) More than three

Ans: 2
First letter = B, Second letter = U, Third letter = C, Fourth letter = E
Only one word can be formed with these letters i.e. CUBE

14. How many such consonants are there in the above arrangement, each of which is immediately preceded by a vowel and also immediately followed by a consonant ?
   1) One　2) Two　3) Three
   4) Four　5) More than Four

Ans: 5
Vowel-Consonant-Consonant (VCC) UBD, EDB, ADC, ACD, UAC
There are five such consonants.

15. If all As are dropped from the above arrangement, which of the following will be eleventh from the right end of the above arrangement?
   1) E 2) C 3) D 4) U
   5) None of these

Ans: 1
Leaving A's count the letters from the right end.